
'ఆర్థిక అసమానతలు తొలగకపోతే రాజకీయ స్వాతంత్ర్యానికి అర్థం లేదు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 8.00 | సంపుటి: 15 | సంచిక: 260

ఆదివారం 4-6-2023

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | DELHI | VIJAYAWADA | CHENNAI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'కవచ్' ఏర్పాటులో తీవ్ర జాప్యం

రైళ్లు ఢీకొనకుండా కవచ్ వ్యవస్థను రూపొందించడానికి ప్రయోగాల పేరుతో రైల్వే అధికారులు పదేళ్ల పాటు కాలయాపన చేశారు.



వార్‌జోన్‌లా ప్రమాద స్థలం..

అంబులెన్సుల సైరన్ మోతలు, పోలీసుల విజిల్స్ చప్పుడు.. బాధితుల హాహాకారాలతో ప్రమాద స్థలం వార్‌జోన్‌ను తలపించింది.





ఒడిశాలోని బహనగా బజార్ స్టేషన్ వద్ద జరిగిన మూడు రైళ్ల ప్రమాద తీవ్రతకు పట్టాలపై చెల్లాచెదురుగా పడిన బోగీలు. (ఇన్‌సెట్)లో చక్రాలు ఊడి నుజ్జునుజ్జు అయిన బోగీ



ఆస్పత్రిలో బాధితులతో మాట్లాడుతున్న ప్రధాని

కారకులపై కఠిన చర్యలు

- ఎవరినీ వదిలిపెట్టేది లేదు
- ఘటనాస్థలిని స్వయంగా పరిశీలించిన మోదీ
- ఆస్పత్రిలో బాధితులకు పరామర్శ

మాటలకందని విషాదం

దేశాన్ని కుదిపేసిన ఒడిశా రైళ్ల ప్రమాదం

288కి పెరిగిన మృతుల సంఖ్య

గాయపడ్డ వారు **1,100కు** పైగానే..

మాటలకందని పెను విషాదం. సిగ్నల్ లోపమో, మానవ తప్పిదమో, మరొకటో... కారణమేదైనా ఒడిశాలో జరిగిన మూడు రైళ్ల ప్రమాదం మాత్రం మహా ఘోరంగా పరిణమించింది. దేశ ప్రజల హృదయాలను మెలిపెట్టిన ఈ దుర్ఘటనలో మృతుల సంఖ్య ఇప్పటికే 288కి చేరింది. 1,100 మందికి పైగా గాయపడ్డారు. వారిలో పలువురి పరిస్థితి ఆందోళనకరంగా ఉందన్న వార్తల నేపథ్యంలో మృతుల సంఖ్య మరికాస్త పెరిగేలా కన్పిస్తోంది. భారత రైల్వే చరిత్రలోనే అతి పెద్ద దుర్ఘటనల్లో ఒకటైన ఈ ప్రమాదానికి సిగ్నలింగ్ వైఫల్యమే ప్రధాన కారణమని ప్రాథమిక విచారణ తేల్చింది. ఇక తేలాల్సిందల్లా అందుకు కారకులెవరనేదే! అందుకోసం ఉన్నత స్థాయి విచారణ కమిటీని రైల్వే శాఖ ఏర్పాటు చేసింది. వీలైనంత త్వరగా విచారణ పూర్తి చేసి నిందితులను కఠినంగా శిక్షిస్తామని ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. శనివారం ఆయన ఘటనా స్థలిని సందర్శించారు. చెల్లాచెదురైన, ఒకదాంట్లోకి ఒకటి చొచ్చుకుపోయిన బోగీలు, చిందరవందరగా పడిపోయిన లగేజీ, ఎటు చూసినా రక్తపు ఛాయలతో భీతావహంగా మారిన ఘటనా స్థలిని చూసి చలించిపోయారు. ఆస్పత్రిలో క్షతగాత్రులను పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం ఉన్నతాధికారులతో పరిస్థితిని సమీక్షించారు. ప్రమాదం జరిగిన తీరును వారు ప్రధానికి వివరించారు.

ప్రపంచ నేతల దిగ్భ్రాంతి

ఈ విషాద సమయంలో భారత్‌కు అండగా నిలుస్తామని భరోసానిస్తూ రష్యా అధ్యక్షుడు పుతిన్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మాక్రాన్, బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ తమ ప్రగాఢ సానుభూతి వ్యక్తపరిచారు.


వివిధ సంస్థలు.. బాధితులకు సేవలు

కోరమండల్‌కు కలిసిరాని శుక్రవారం

లూప్ లైనే యమపాశమైంది

ప్రాథమిక విచారణలో వెల్లడి

- మెయిన్ లైన్ నుంచి లూప్‌లైన్లోకి కోరమండల్
- ఆగున్న గూడ్స్‌ను 128 కి.మీ. వేగంతో ఢీకొంది



ప్రమాదం జరిగిందిలా...

సిగ్నల్ లోపం వల్లే..

- కోరమండల్ ట్రాక్‌పై రెడ్‌సిగ్నల్
- అందుకే ట్రాక్ మారి లూప్ లైన్లోకి

మృత్యు శకటాలు..



అత్యంత ఘోరమైన రైలు ప్రమాదాలివి

ఒక్కసారిగా భారీ శబ్దం..

ఆపై చీకటి!

రైలు ప్రమాద బాధితుల అనుభవాలు

రక్తదానానికి యువత **క్యూ**

కొడుకి శవాన్ని చేతుల్తో మోశా

మొబైల్ ఫ్లాష్ వెలుగులోనే...

రైలు స్పీడ్‌ని వీడియో తీస్తుండగా..

మందుల కోసం డబ్బులు పంపిస్తానని తిరిగిరాని లోకాలకు

పెద్దకర్మకు వచ్చి ప్రాణాలు కోల్పోయాడు

వివరాలు 5,6,10లో

నేడు జేఈఈ అడ్వాన్స్‌డ్..



- పరీక్షకు హాజరుకానున్న 1.9 లక్షల మంది అభ్యర్థులు
- 2021లో 1.6 లక్షలు, 2022లో 1.7 లక్షల మంది కాగా.. ఈసారి మరో 20వేల మంది అధికం
- ఏపీ, తెలంగాణల నుంచి అత్యధిక శాతం మంది అభ్యర్థులు
- ఏపీలో 25, తెలంగాణలో 13 పరీక్ష కేంద్రాల ఏర్పాటు
- ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్ల కింద పరీక్ష

14లో

మనం సైతం..

సీఎం ఆదేశాలతో ఒడిశా రైలు ప్రమాద ఘటనా స్థలానికి ప్రత్యేక బృందం

- మంత్రి అమర్‌నాథ్ నేతృత్వంలో ముగ్గురు ఐఏఎస్ అధికారులు
- ఘటనపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఉన్నత స్థాయి సమీక్ష
- జిల్లా కలెక్టర్ కార్యాలయాల్లో ఎంక్వైరీ, హెల్ప్ డెస్క్‌లు.. అవసరమైన పక్షంలో పంపించడానికి అంబులెన్స్‌లు సన్నద్ధం
- ఎమర్జెన్సీ సేవల కోసం విశాఖ, ఒడిశా సరిహద్దు జిల్లాల్లో ఆస్పత్రుల అలర్ట్
- ఆ రైళ్లల్లో ప్రయాణించిన ఏపీ ప్రయాణికుల వివరాలు సేకరణ



సాక్షి, అమరావతి: ఒడిశా రైలు ప్రమాద ఘటనలో చిక్కుకున్న రాష్ట్రానికి చెందిన వారి కోసం రాష్ట్ర ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన స్పందించింది. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. సీఎంఓ అధికారులతో కలిసి.. ఈ ప్రమాద ఘటనపై ఆయన అన్ని వివరాలు ఆరా తీశారు. చాలా మంది మృతి చెందారని, మృతుల సంఖ్య పెరుగుతూ ఉందని, క్షతగాత్రుల సంఖ్య కూడా భారీగా ఉందని అధికారులు తెలిపారు. సీఎం ఆదేశాల మేరకు ఇప్పటి వరకు తీసుకున్న చర్యలను వివరించారు. ప్రమాద ఘటన జరిగిన ప్రాంతం పరిధిలోని డీఆర్ఎం..

మిగతా 2వ పేజీలో ▶

● నేడు ఏరువాక పున్నమి

పుడమి పులకరింత



తొలకరి పిలుపుతో సాగుకు సన్నద్ధమవుతున్న రైతులు

నాగలి, కాడె, ఎడ్లకు సంప్రదాయబద్ధంగా పూజలు

ఇప్పటికే ఖరీఫ్ ప్రణాళికను సిద్ధం చేసిన అధికారులు



ఏరువాక పౌర్ణమి రోజు పశువుల దొడ్డిని శుభ్రం చేసి కాడెకు కుంకుమ బొట్టుడుతున్న దృశ్యం(ఫైల్‌ఫోటో)

తొలకరి పిలుపుతో పుడమి పులకరిస్తున్నాయి. రైతుల మోములో చిరునవ్వులు చిగురిస్తున్నాయి. వ్యవసాయ పనులు ప్రారంభంతో రైతుల జీవితంలో కీలకమైన సందర్భం ఏరువాక పున్నమి. ఖరీఫ్ ప్రారంభంలో వచ్చే జ్యేష్ఠ శుద్ధ పౌర్ణమినే ఏరువాక పౌర్ణమిగా పిలుస్తారు. ఏరువాక పౌర్ణమి అన్నదాతలకు ఇష్టమైన పండుగ. ఈ రోజు రైతన్నలు నాగలి పట్టి పొలాలు దున్ని మాగాణి భూముల్లో నాట్లు వేస్తారు. ఓషధులకి, సస్యానికి అధిపతి అయిన చంద్రుడు జేష్ఠా నక్షత్రానికి చేరువలో ఉన్న తరుణంలో ఏరువాక పూర్ణిమ శుభ ఫలితాలను అందిస్తాడు. అందుకనే జ్యేష్ఠ పూర్ణిమ నాడు మొదటిసారి పొలాన్ని దున్ని వ్యవసాయ పనులను సన్నద్ధం చేస్తారు. పూర్వ కాలం నుంచి జేష్ఠ పూర్ణిమను ఏరువాక పౌర్ణమిగా పిలుస్తున్నారు. - బుట్టాయగూడెం

దుక్కిటెడ్లకు అలంకరణలు, పూజలు

ఏరువాక పూర్ణమి రోజు వ్యవసాయ పనిముట్లను శుభ్రం చేసి పసుపు, కుంకుమలు పెట్టి పూజలు చేస్తారు. పొలాలు దున్నే దుక్కిటెడ్లను కడిగి వాటిని అలంకరిస్తారు. కొమ్ములకు రంగులు వేసి మెడలో కొత్త గంటలు, రంగుల పూసలు, పూలతో నిండిన దిష్టితాళ్లు కట్టి అలంకరిస్తారు. వాటి కాళ్లకు గజ్జెలు కడతారు. నాగలికి, కాడికి రంగులు వేసి పశువులను కట్టే స్థలాన్ని శుభ్రం చేసి పసుపు, కుంకుమలతో పూజలు చేస్తారు.

ఖరీఫ్ ప్రణాళిక సిద్ధం

ఏలూరు జిల్లాల్లో ఖరీఫ్ సాగుకు రంగం సిద్ధమైంది. పంటల సాగులో రైతులకు అన్ని విధాలా సహాయాన్ని అందిస్తూ సేద్యాన్ని మరింత పోత్సహించే విధంగా వ్యవసాయశాఖ అధికారులు సన్నద్ధమయ్యారు. సాగుకు సంబంధించి 2023 సంవత్సరానికి ఖరీఫ్ ప్రణాళికలను అధికారులు ఇప్పటికే సిద్ధం చేశారు. జిల్లాలో 2.50 లక్షల హెక్టార్లలో ప్రధాన పంట అయిన వరి పంట పండించేలా అధికారులు రైతులను సిద్ధం చేస్తున్నారు. గిరిజన ప్రాంతంలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 15,869 హెక్టార్లలో పంటలు పండించేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. వీటిలో సుమారు వరి 13,295 హెక్టార్లలో, మొక్కజొన్న 1,484 హెక్టార్లు, మినుము 382 హెక్టార్లు, పెసర 424 హెక్టార్లు, కంది 284 హెక్టార్లలో పండించేలా రైతులను సిద్ధం చేస్తున్నారు.

రైతులకు అండగా సీఎం జగన్



రైతులకు అండగా సీఎం వైఎస్ జగన్ నిలుస్తున్నారు. రైతు భరోసా కేంద్రాల్లో అన్ని కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు మా గ్రామం లోనే అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేశారు. చాలా సంతోషంగా ఉంది. నిజంగానే ఇది రైతుల ప్రభుత్వం.

– ధర్ముల బాబూరావు, గిరిజన రైతు, సీతప్పగూడెం, బుట్టాయగూడెం మండలం

అందుబాటులో సేవలు



రైతులకు అన్ని రకాల సేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నాం. వ్యవసాయంలో అధిక దిగుబడులు సాధించేలా సలహాలు, సూచనలు ఇస్తున్నాం. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అందుబాటులోనే ఉంటూ సేవలందిస్తున్నాం. ఆర్బీకే సేవలను సద్వినియోగం చేసుకోవాలి.

– పీజీ బుచ్చిబాబు, ఏడీఏ, కేఆర్ పురం, బుట్టాయగూడెం మండలం

పండగలా వ్యవసాయం




రైతు సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎనలేని కృషి చేస్తున్నారు. వ్యవసాయానికి పెద్దపీట వేసి రైతు కళ్లల్లో ఆనందం చూస్తున్నారు. నేడు వ్యవసాయాన్ని జగనన్న పండగలా మార్చారు. రైతులకు అన్ని సేవలు అందుబాటులోకి రావడంతో ఖరీఫ్ పనులకు రైతులు సిద్ధమవుతున్నారు.

– తెల్లం బాలరాజు, ఎమ్మెల్యే, పోలవరం

రైతులకు అండగా ప్రభుత్వం

రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం కృషి చేస్తోంది. వ్యవసాయ కమిషన్ ఏర్పాటు ద్వారా ఎన్నో సూచనలు స్వీకరించి రైతుల సంపూర్ణ అభివృద్ధి కోసం ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి, అన్ని రకాల సేవలను అందుబాటులోకి తీసుకువచ్చింది. వ్యవసాయానికి సంబంధించి అన్ని అవసరాలను గుర్తించి సాగుకు ఇబ్బందులు కలుగకుండా ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తోంది. ఈ ఏడాది ఐదో విడత రైతు భరోసా సొమ్ములను కూడా రైతుల బ్యాంక్ ఖాతాలకు ఇప్పటికే జమ చేసింది.



ఫ్యాక్ట్ చెక్

ఆక్వా రైతు బరువు కాదు.. బాధ్యత

ఆక్వా రైతులకు సబ్సిడీ ఇస్తానని మోసం చేసి, ఎన్నికలు సమీపించిన వేళ కొన్నిరోజులు మాత్రమే సబ్సిడీ ఇస్తున్నట్లు నటించి ఆ సొమ్మునూ డిస్కంలకు ఎగ్గొట్టిన గత టీడీపీ ప్రభుత్వ భాగోతాలను ఈనాడు పత్రిక నిస్సిగ్గుగా దాచిపెట్టింది. ''ఆక్వారైతు బరువయ్యాడా''.. అంటూ రాష్ట్ర ప్రభుత్వంపై ఇష్టారాజ్యంగా విషం కక్కింది.

- వివరాలు 2లో

రాష్ట్రంలో మరో రెండు బయో ఇథనాల్ ప్లాంట్లు



- విజయనగరం కొండవలస వద్ద రోచే గ్రీన్ ఆగ్రో 100 కేఎల్‌పీడీ యూనిట్
- కృష్ణాజిల్లా మల్లవల్లి వద్ద నితిన్‌సాయి కన్‌స్ట్రక్షన్ 150 కేఎల్‌పీడీ యూనిట్
- ఇప్పటికే ఈ రంగంలో రూ.2 వేల కోట్లకు పైగా పెట్టుబడులను ఆకర్షించిన రాష్ట్రం

- వివరాలు 2లో

అమిత్‌షాతో చంద్రబాబు భేటీ

- సమావేశానికి బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా హాజరు
- ఆంధ్రప్రదేశ్‌లో పొత్తుల విషయం ప్రస్తావించిన చంద్రబాబు

- వివరాలు 10లో



ఢిల్లీలో చంద్రబాబు

బాబు గారి ఢిల్లీ యాత్ర

జనతంత్రం

4లో


తూర్పుగోదావరి జిల్లా వెంకటాపురంలో నాగమణికి పింఛన్ ఇస్తున్న వలంటీర్ బుజ్జమ్మ


ఏలూరు జిల్లా కేంద్రంలో గంగవరపు లక్ష్మికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ మహేశ్వరి


విజయవాడ పున్నమ్మతోటలో లక్ష్మీకుమారికి డయాలసిస్ పెన్షన్ అందజేస్తున్న వలంటీర్ స్వప్న

96.89 శాతం మందికి పింఛన్ల పంపిణీ

సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా 61,18,041 మంది అవ్వాతాతలు, వితంతువులు, దివ్యాంగులు, వివిధ చేతివృత్తిదారులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు రూ.1,685.50 కోట్ల పింఛను డబ్బుల పంపిణీ పూర్తయింది. శనివారం సాయంత్రం వరకు 96.89 శాతం మందికి పింఛన్ల పంపిణీ పూర్తయిందని అధికారులు తెలిపారు. మిగిలిన వారికి ఆది, సోమవారాల్లో కూడా వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పింఛను డబ్బులు అందజేస్తారని వెల్లడించారు.


వేలూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిత్తూరు జిల్లా పలమనేరుకు చెందిన రమణకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ రామిరెడ్డి


కర్నూలులోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శేషయ్యకు వృద్ధాప్య పింఛన్ అందజేస్తున్న వలంటీర్ ఖాజాబీ


గుంటూరు జిల్లా ఎరుకలపూడిలోని ఆయుర్వేద వైద్యశాలలో చినరావూరుకు చెందిన నాగమ్మకు పింఛన్ అందిస్తున్న వెల్ఫేర్ సెక్రెటరీ తిరుపతిరావు

క్లుప్తంగా...

సీబీఐ విచారణకు హాజరైన ఎంపీ అవినాశ్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తులో భాగంగా ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి శనివారం హైదరాబాద్‌లోని సీబీఐ కార్యాలయంలో హాజరయ్యారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సీబీఐ అధికారులు ఆయనను ప్రశ్నించారు. ముందస్తు బెయిల్ జారీ సందర్భంగా హైకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు అవినాశ్‌రెడ్డి ఈ విచారణకు హాజరయ్యారు.

విశాఖలో రూ.400 కోట్లతో క్యాన్సర్ బ్లాక్


- హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రిలో ఏర్పాటు
- పీడియాట్రిక్, హెమటాలాజికల్ ఆంకాలజీ బ్లాక్

సాక్షి, విశాఖపట్నం : విశాఖపట్నంలో మరో అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. హోమీబాబా క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్ (హెచ్‌బీసీహెచ్ అండ్ ఆర్‌సీ) రూ. 400 కోట్లతో అత్యాధునిక పీడియాట్రిక్, హెమటాలాజికల్ ఆంకాలజీ బ్లాక్‌ని ఏర్పాటు చేయనున్నారు. హెచ్‌బీసీహెచ్ అండ్ ఆర్‌సీ, టాటా మెమోరియల్ సెంటర్, ఐసీఐసీఐ బ్యాంకు ఈమేరకు ఎంవోయూ చేసుకున్నట్లు ఆస్పత్రి డైరెక్టర్ డా.ఉమేష్ మహంశెట్టి వెల్లడించారు. ఇది క్యాన్సర్ రోగులకు ప్రపంచస్థాయి వైద్య, ఆరోగ్య సంరక్షణ సేవలు అందిస్తుందని తెలిపారు. ఈ బ్లాక్ ద్వారా పలు అత్యాధునిక ఇమ్యునోథెరపీలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు.

రాష్ట్రంలో మరో రెండు బయో ఇథనాల్ ప్లాంట్లు

సాక్షి, అమరావతి: పర్యావరణహిత బయో ఇథనాల్ తయారీ కేంద్రంగా ఆంధ్రప్రదేశ్ వేగంగా అడుగులు వేస్తోంది. బయో ఇథనాల్ రంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తుండటంతో పలు సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వస్తున్నాయి. తాజాగా రోచే గ్రీన్ ఆగ్రో, నితిన్‌సాయి కన్‌స్ట్రక్షన్ సంస్థలు రాష్ట్రంలో బయో ఇథనాల్ తయారీ యూనిట్లు పెట్టడానికి ఏర్పాట్లు చేస్తున్నాయి. విజయనగరం జిల్లా కొండవలస వద్ద 11.70 ఎకరాల్లో రోజుకు 100 కిలోలీటర్ల సామర్థ్యం (100 కేఎల్‌పీడీ)తో ఇథనాల్ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయనుంది. దీంతోపాటు 2.5 మెగా వాట్ల కో–జనరేషన్ విద్యుత్ ప్లాంట్ కూడా ఏర్పాటు చేస్తుంది. ఈ యూనిట్ ఏర్పాటు కోసం పర్యావరణ అనుమతులకు దరఖాస్తు చేసినట్లు అధికారులు తెలిపారు. నితిన్‌సాయి కన్‌స్ట్రక్షన్ సంస్థ కృష్ణాజిల్లా మల్లవల్లి వద్ద రోజుకు 150 కిలోలీటర్ల సామర్థ్యం (150 కేఎల్‌పీడీ)తో బయో ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటు చేయనుంది. సుమారు 20.38 ఎకరాల్లో ఏర్పాటు చేయనున్న ఈ యూనిట్‌తో పాటు 5 మెగావాట్ల విద్యుత్ యూనిట్ కూడా ఏర్పాటు చేస్తుంది. 2025–26 సంవత్సరానికి పెట్రోల్‌లో 20% ఇథనాల్‌ను కలిపి విక్రయించాలన్న లక్ష్యం చేరుకోవడానికి కేంద్ర ప్రభుత్వం ఆహారధాన్యాల నుంచి ఇథనాల్ తయారుచేయడానికి అనుమతించింది. ఈ అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందిపుచ్చుకోవడంతో క్రిభ్‌కో, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, అస్సాగో, ఈఐడీ ప్యారీ, దాల్మియా, ఎకో స్టీల్ వంటి పలు కంపెనీలు రాష్ట్రంలో ఇథనాల్ తయారీ రంగంలో రూ.2 వేల కోట్లకుపైగా పెట్టుబడులు పెట్టడానికి ముందుకొచ్చాయి.

రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు



ప్రధాన కేంద్రాల్లో శనివారం నమోదైన గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు (డిగ్రీల్లో)

కేంద్రం	గరిష్టం	కనిష్టం
రెంటచింతల	47.6	30.8
భీమవరం	44.0	29.0
అమలాపురం	43.5	27.0
నంద్యాల	43.0	30.0
ఒంగోలు	43.0	32.0
విజయవాడ	43.0	29.0
నెల్లూరు	41.8	31.5
విజయనగరం	40.0	29.0
కడప	39.6	29.7
ఇచ్ఛాపురం	39.0	28.0
అనకాపల్లి	38.8	28.0

ఆక్వా రైతు బరువు కాదు.. బాధ్యత

2014 నుంచి 2016 వరకూ యూనిట్‌కు రూ.4.63 నుంచి రూ.7 విద్యుత్ టారిఫ్

- 2016 మే నుంచి 2018 వరకూ యూనిట్ రేటు రూ.3.86 వసూలు
- ఎన్నికలకు కొద్దినెలల ముందు రూ.2 చొప్పున సరఫరా
- సబ్సిడీ భారం రూ.312.05 కోట్లను కూడా డిస్కంలకు చెల్లించని టీడీపీ ప్రభుత్వం
- అదే ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే జూలై 2019 నుంచి అన్ని ఆక్వా కనెక్షన్లకు రూ.1.50 పైసలకే సరఫరా
- తద్వారా ఇప్పటివరకు మొత్తం రూ.2,792.88 కోట్ల సబ్సిడీ భారం మోసిన సర్కార్
- వాస్తవాలను దాచిపెట్టి 'ఆక్వారైతు బరువయ్యాడా' అంటూ ఈనాడు తప్పుడు కథనం



సాక్షి, అమరావతి : కళ్ల ముందు వాస్తవాలు స్పష్టంగా కనిపిస్తున్నా అవేవీ తెలీనట్లు కళ్లున్న కబోదిలా వ్యవహరిస్తూ అబద్ధాలను అడ్డగోలుగా అచ్చేయడంలో ఈనాడు రామోజీకే చెల్లింది. పైపెచ్చు పచ్చ పార్టీని జాకీలు పెట్టి మరీ పైకి లేపేందుకు తెగ ప్రయాసపడుతోంది. ఇందులో భాగంగా తన ప్రతి కథనంలోనూ గత ప్రభుత్వాన్ని ఆహా ఓహో అంటూ కీర్తించేందుకు నానాపాట్లు పడుతోంది. పత్రికా విలువలు ఎలాగూ లేవు.. కనీసం ప్రజలు నవ్వుతారనే ఇంగిత జ్ఞానం కూడా లేదు. ఆక్వా రైతులకు సబ్సిడీ ఇస్తానని మోసంచేసి, ఎన్నికలు సమీపించిన వేళ కొన్నిరోజులు మాత్రమే సబ్సిడీ ఇస్తున్నట్లు నటించి ఆ సొమ్మునూ డిస్కంలకు ఎగ్గొట్టిన గత టీడీపీ ప్రభుత్వ భాగోతాలను ఆ పత్రిక నిస్సిగ్గుగా దాచిపెట్టింది. ''ఆక్వారైతు బరువయ్యాడా''.. అంటూ రాష్ట్ర ప్రభుత్వంపై ఇష్టారాజ్యంగా విషం కక్కింది. నిజానికి.. అధికారంలోకి వచ్చిన నాటి నుంచే సబ్సిడీ ఇచ్చి ఆక్వా రైతులను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆదుకుంది. ఆక్వా రైతేకాదు.. రాష్ట్రంలోని ఏ రైతూ తమకు బరువు కాదని, వారందరి సంక్షేమం తమ బాధ్యతని ప్రభుత్వం తన చేతల ద్వారా చాటిచెబుతోంది. పచ్చ పత్రిక రాయని వాస్తవాలను ఇంధన శాఖ శనివారం మీడియాకు వెల్లడించింది. ఆ వివరాలివీ..

ఆరోపణ: ఆక్వా విద్యుత్ సర్వీసులకు యూనిట్ ధరను రూ.7 నుంచి రూ.2కు తగ్గించిన గత ప్రభుత్వం..

వాస్తవం: గత ప్రభుత్వం 2014 నుంచి 2016 వరకు ఆక్వా సాగుకు స్లాబ్ల ఆధారంగా విద్యుత్ టారిఫ్‌ను యూనిట్‌కు రూ.4.63 నుంచి రూ.7.00 వరకూ వేసి అత్యధిక భారం మోపింది. 2016 నుంచి 2018 మే వరకూ యూనిట్ రేటు రూ.3.86 చొప్పున సరఫరా చేసింది. ఇక ఎన్నికలకు కొద్దినెలల ముందు యూనిట్‌కు రూ.2 చొప్పున ఇచ్చింది. అందుకోసం ఇవ్వాల్సిన సబ్సిడీ భారం రూ.312.05 కోట్లను విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లకు చెల్లించకుండా బాకీ పెట్టింది. దానిని ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం భరించాల్సి వచ్చింది. అంటే.. గత ప్రభుత్వం ఆక్వా రైతులకు రాయితీతో కూడిన విద్యుత్ సరఫరా చేయలేదనేది స్పష్టంగా తెలుస్తోంది. కానీ, ఈనాడు మాత్రం ఈ నిజాన్ని దాచేసి, గత ప్రభుత్వం సబ్సిడీ ఇచ్చిందని ఎడాపెడా రాసేసింది.

ఆరోపణ: అర్హుల గుర్తింపు పేరుతో రాయితీ నిలిపేశారు..

వాస్తవం: ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే జూలై 2019 నుండి అన్ని ఆక్వా కనెక్షన్లకు యూనిట్ రూ.1.50 పైసలకే విద్యుత్ సరఫరా చేస్తోంది. అప్పటి నుంచి మార్చి 2023 వరకూ ప్రతి యూనిట్‌పై రూ.2.36 పైసలు చొప్పున మొత్తం రూ.2,792.88 కోట్లు విద్యుత్ సబ్సిడీ భారం మోస్తూ ఆక్వా రైతులను ఆదుకుంటోంది. 2022 జూలై నుంచి ఆక్వా కల్చర్ డెవలప్‌మెంట్ జోన్లలో ఆక్వాసాగు చేస్తున్న రైతులకు యూనిట్‌ను రూ.1.50 పైసలకు విద్యుత్ సరఫరా చేయడానికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. నాన్-ఆక్వా జోన్లలోనూ అర్హత కలిగిన ఆక్వా జోన్లను గుర్తించి ఆయా చెరువులను ఆక్వా జోన్లుగా పరిగణిస్తూ జిల్లా గెజిట్లలో నోటిఫై చేసింది. తద్వారా మొత్తం ఈ సర్వే ద్వారా గుర్తించిన 4.66 లక్షల ఎకరాల ఆక్వా సాగులో 4.22 లక్షల ఎకరాలను ఆక్వా జోన్లలో చేరుస్తూ నోటిఫై చేసింది. వీటిలో మొత్తం 63,754 ఆక్వా కనెక్షన్లలో 46,445 ఆక్వా కనెక్షన్లను అర్హత కలిగినవిగా గుర్తించి ఆ కనెక్షన్లు కలిగిన ఆక్వా రైతులకు యూనిట్‌ను రూ.1.50 పైసలకు విద్యుత్ సరఫరా చేస్తోంది. యూనిట్ సర్వీస్ ధర రూ.6.89 పైసలకు పెరిగిన నేపథ్యంలో ఆక్వా, నాన్–ఆక్వా జోన్లలో ఉన్న 10 ఎకరాలపైన ఆక్వా చెరువులు కలిగి ఉన్న అధిక సాగు రైతులకు చెందిన 17,309 కనెక్షన్లకు యూనిట్‌ను రూ.3.85 పైసలకు విద్యుత్ సరఫరా చేస్తోంది. ఆక్వా రైతులకు రాయితీపై విద్యుత్ సరఫరా చేస్తున్నారనడానికి ఇంతకన్నా నిదర్శనం ఏం కావాలి. అసలు ఇవ్వడంలేదని ఎలా రాస్తారు రామోజీ?

ఆరోపణ: అధికారంలోకి వచ్చాక ఆక్వా రైతుల గోడు పట్టించుకోవడంలేదు..

వాస్తవం: ఆక్వా రైతులు తమ రొయ్య ఉత్పత్తులను అంతర్జాతీయ విపణిలో ఉన్న పరిస్థితుల దృష్ట్యా తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వచ్చేది. కానీ, ఆ అవసరంలేకుండా రాష్ట్ర ప్రభుత్వం సాధికార కమిటీ ద్వారా వివిధ కౌంట్ల రొయ్యలకు కనీస కొనుగోలు ధరలను నిర్ణయించింది. ఆ ధరలకు తగ్గకుండా కొనుగోలు చేసేట్లుగా చర్యలు తీసుకుని అమలుచేస్తోంది. రైతుభరోసా (ఆర్బీకే) కేంద్రాల్లో కొనుగోలు ధరల పట్టిక, కాల్ సెంటర్ నెంబర్‌ను అందుబాటులో ఉంచింది. ఏ రైతుకైనా రొయ్యల అమ్మకంలో ఇబ్బంది ఎదురైతే తమ సమస్యలను, ఫిర్యాదులను ప్రభుత్వానికి తెలియజేసేలా ఏర్పాటుచేసింది. రొయ్య మేత ధరలను కూడా మేత ఉత్పత్తిదారులు ఇష్టానుసారం పెంచకుండా, సంప్రదింపుల ద్వారా మాత్రమే పెంచడానికి అనుమతి తీసుకునేలా కట్టుబాటు విధించింది. ఆక్వాసాగు రైతుల ప్రయోజనం కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమాలన్నీ పట్టించుకోవడంలో భాగం కాదా రామోజీ? మీ కళ్లకు ఇవేమీ ఎందుకు కనిపించడం లేదు??

రూ.68.63 కోట్లతో అంబేడ్కర్ స్మృతివనం రెండో దశ పనులు

- టెండర్లు పిలిచిన రాష్ట్ర ప్రభుత్వం
- ఆన్‌లైన్‌లో బిడ్ దాఖలుకు 12 వరకు గడువు

సాక్షి, అమరావతి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయవాడలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అంబేడ్కర్ స్మృతివనం మొదటి దశ పనులు వేగంగా జరుగుతుండగానే రెండో దశ పనులకు శ్రీకారం చుట్టారు. ఇందుకోసం రూ.68,63,77,203 కేటాయించారు. రెండో దశ పనుల కోసం ప్రభుత్వం శనివారం టెండర్లు పిలిచింది. ఆన్‌లైన్‌లో బిడ్ దాఖలుకు ఈ నెల 12వ తేదీ వరకు గడువు ఇచ్చింది. విజయవాడ నగరం నడిబొడ్డున అత్యంత విలువైన 18.81 ఎకరాల్లో రూ.268 కోట్లతో అంబేడ్కర్ స్మృతివనం మొదటి దశ పనులు వేగంగా జరుగుతున్నాయి. సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ పరిశ్రమలు, మౌలిక వసతుల కల్పన సంస్థ(ఏపీఐఐసీ) పర్యవేక్షణలో ఈ పనులు జరుగుతున్న విషయం తెలిసినదే. ఇప్పటికే 81 అడుగుల ఎత్తు పెడస్టల్(పీఠం) నిర్మాణం పూర్తయింది. దానిపై 125 అడుగుల అంబేడ్కర్ కాంస్య విగ్రహ నిర్మాణం వేగంగా కొనసాగుతోంది. దీంతోపాటు మొదటి దశ పనుల్లోనే విగ్రహానికి అనుసంధానంగా కన్వెన్షన్ సెంటర్, లైబ్రరీ, అంబేడ్కర్ జీవిత చరిత్రలోని ప్రధాన ఘట్టాలకు అద్దంపట్టే చిత్రాల గ్యాలరీ, ఆయన జీవిత విశేషాలకు సంబంధించిన ప్రదర్శన వంటి అనేక సివిల్ వర్కులు చేస్తున్నారు. రెండోదశ పనులకు పిలిచిన టెండర్‌లో ఆరు ప్రధాన పనులతో పాటు స్మృతివనాన్ని అత్యంత ఆకర్షణీయంగా తీర్చిదిద్దేలా కార్యాచరణ సిద్ధం చేశారు. స్మృతివనంలో మ్యూజియం, రెస్టారెంట్, పార్కు, అన్ని రకాల వేడుకలకు ఉపయోగపడేలా వేదిక, ల్యాండ్ స్కేపింగ్, వాహనాల పార్కింగ్ పాయింట్, ప్రహరీలు, ఆర్చ్‌లు, ప్రవేశ ద్వారాలు ఏర్పాటు చేయనున్నారు.

మనం సైతం..

▶ మొదటి పేజీ తరువాయి

ఇతర అధికారుల ద్వారా సమాచారం తెప్పిస్తున్నామన్నారు. ఒడిశా ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులతో కూడా నిరంతరం టచ్‌లో ఉన్నామని తెలిపారు. సీఎం ఆదేశాల మేరకు పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ నేతృత్వంలో ముగ్గురు ఐఏఎస్ అధికారులతో ఒక బృందం ప్రమాదం జరిగిన బాలాసోర్ ప్రాంతానికి వెళ్లింది. మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌తోపాటు సివిల్ సప్లైస్ కమిషనర్ అరుణ్ కుమార్, విశాఖలో కమర్షియల్ ట్యాక్స్ జాయింట్ కమిషనర్ ఆనంద్, శ్రీకాకుళం జాయింట్ కలెక్టర్ నవీన్‌లతో కూడిన బృందం ప్రమాదం జరిగిన ప్రాంతానికి చేరుకుంది. ప్రతి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఎంక్వైరీ విభాగాలను ఏర్పాటు చేయాలన్న సీఎం ఆదేశాలతో జిల్లా కలెక్టర్లు ఆ మేరకు చర్యలు తీసుకున్నారు. రైల్వే అధికారుల నుంచి అందిన ప్రయాణికుల పరిస్థితులపై ఆరా తీయడానికి, ఎవరైనా ప్రయాణికుల బంధువులు, వారి సంబంధీకుల నుంచి సమాచారం వస్తే వెంటనే స్పందించేలా ఈ ఎంక్వైరీ విభాగాలు పని చేయాలని సీఎం ఆదేశించారు. ఒడిశా సరిహద్దులకు సమీపంగా ఉన్న శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం తదితర జిల్లాల్లో అవసరమైన పక్షంలో అంబులెన్స్‌లు పంపించడానికి సిద్ధంగా ఉంచాలని సూచించారు. క్షతగాత్రులకు అవసరమైన పక్షంలో ఉత్తమ వైద్యం అందించడానికి విశాఖ సహా ఒడిశా సరిహద్దుల్లోని ఆస్పత్రులను సన్నద్ధంగా ఉంచాలని అధికారులను ఆదేశించగా, వారు ఆ మేరకు చర్యలు తీసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించిన తాజా సమాచారాన్ని ఎప్పటికప్పుడు తనకు నివేదించాలని సీఎం ఆదేశించారు.

సీఎం జగన్ తీవ్ర దిగ్భ్రాంతి

ఒడిశాలోని బాలాసోర్ సమీపంలో జరిగిన కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రమాదంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటనలో ఎక్కువ మంది మృతి చెందడం, భారీ సంఖ్యలో క్షతగాత్రులు కావడం పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడ్డ వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మృతులు, క్షతగాత్రుల్లో రాష్ట్రానికి చెందిన వ్యక్తులు ఉన్నారా.. అన్నదానిపై దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. ఎలాంటి సహాయం కావాలన్నా అందించడానికి సిద్ధంగా ఉండాలని చెప్పారు.

వేగంగా వివరాల సేకరణ

ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయాల్లో హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేశారు. కోరమాండల్, యశ్వంతపూర్ రైళ్లల్లో ప్రయాణించిన రాష్ట్రానికి చెందిన ప్రయాణికుల వివరాలను అధికారులు సేకరించారు. ప్రమాదంలో మరణించిన వారి మృతదేహాలను ఉంచిన ఆస్పత్రుల నుంచి ఫొటోల సేకరణ చేపట్టారు. ఈ డేటా ఆధారంగా ప్రమాదంలో ఎవరైనా రాష్ట్రానికి చెందిన ప్రయాణికులు ఉన్నారా? అన్నదానిపై ముమ్మరంగా విచారిస్తున్నారు. అంబులెన్స్‌లు సిద్ధం చేయడంతోపాటు, క్షతగాత్రులకు వైద్యసేవలు అందించే అంశంపై అన్నిరకాల ఏర్పాట్లు చేశారు.

సీఎం ఆదేశాల మేరకు విశాఖ నుంచి మంత్రి బొత్స సమీక్ష

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆదేశాల మేరకు మంత్రి బొత్స సత్యనారాయణ విశాఖ నుంచి సమీక్ష నిర్వహించారు. ప్రమాదానికి గురైన రైళ్లలో ప్రయాణిస్తున్న వారి వివరాలు సేకరిస్తున్నారు. ఇప్పటికే రెండు రైళ్లల్లో ప్రయాణిస్తున్న రాష్ట్రానికి చెందిన వారి వివరాలను కొంత వరకు సేకరించి, వారి క్షేమ సమాచారాలను తెసుకునే ప్రయత్నాలు చేపట్టారు. గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించేందుకు ఆస్పత్రులను సన్నద్ధంగా ఉంచారు.

ప్రమాద బాధితులకు పూర్తి సహాయ సహకారాలు

అన్ని కలెక్టరేట్లలో కంట్రోల్ రూముల ఏర్పాటు

- విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ వెల్లడి
- కోరమండల్‌లో ఏపీ ప్రయాణికుల సంఖ్య 482
- చివరి క్షణంలో రైలు ఎక్కని వారు 82
- స్వల్ప గాయాలు, సురక్షితంగా బయటపడిన వారు 287
- ఇంకా ఆచూకీ తెలియాల్సిన వారు 113
- యశ్వంత్‌పూర్ రైలులో 89 మంది.. వీరి ఆచూకీ తెలియాల్సి ఉంది


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ, చిత్రంలో మంత్రులు కారుమూరి వెంకట నాగేశ్వరరావు, జోగి రమేశ్, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, సీపీ త్రివిక్రమ్ వర్మ

మహారాణిపేట (విశాఖ దక్షిణ) : ఒడిశాలో జరిగిన రైలు ప్రమాద బాధితులకు పూర్తి సహాయ, సహకారాలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో పని చేస్తోందని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు. ఈ ఘటనపై శనివారం ఆయన విశాఖ జిల్లా కలెక్టరేట్‌లో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరు వెంకట నాగేశ్వరరావు, రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేశ్, కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున, పోలీసు కమిషనర్ త్రివిక్రమ్ వర్మలతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సంఘటనలో రాష్ట్రానికి చెందిన క్షతగాత్రులు, చనిపోయిన వారు, ప్రమాదానికి గురైన వారిని తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టామన్నారు. గాయపడ్డ వారికి మెరుగైన వైద్యం అందించేందుకు, చనిపోయిన వారిని వారి బంధువులకు అప్పగించేందుకు పూర్తి చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారని తెలిపారు. సీఎం ఆదేశాల మేరకు ఇప్పటికే రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ముగ్గురు ఐఏఎస్ అధికారులు, ఐపీఎస్ అధికారుల బృందం ఒడిశాలోని ఘటనా స్థలికి చేరుకుందని తెలిపారు. మంత్రి బొత్స ఇంకా ఏం చెప్పారంటే..

482 మంది ఏపీ ప్రయాణికులు

- రైల్వే సమాచారం ప్రకారం ప్రమాదానికి గురైన కోరమండల్ రైలులో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారు 482 మంది ఉన్నారు. 309 మంది విశాఖలో దిగవలసి ఉండింది. అయితే వీరిలో 57 మంది ప్రయాణం చేయలేదు. మిగతా వారిలో 165 మంది సురక్షితంగా ఉన్నట్లు సమాచారం. 11 మంది గాయపడ్డారు. 76 మంది జాడ ఇంకా తెలియాల్సి ఉంది.
- రాజమండ్రిలో దిగవలసిన 31 మందిలో 22 మంది సురక్షితంగా ఉన్నారు. మిగతా తొమ్మిది మంది సమాచారం తెలియాల్సి ఉంది. విజయవాడలో 137 మంది దిగవలసి ఉండగా, 80 మంది సురక్షితంగా ఉన్నారు. ఏడుగురు గాయపడ్డారు. 22 మంది ప్రయాణం చేయలేదు. 28 మంది ఫోన్ స్విచ్ ఆఫ్ వస్తోంది. ఏలూరులో దిగాల్సిన ఐదుగురిలో ముగ్గురు ప్రయాణం చేయలేదు. మిగతా ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు.
- యశ్వంతపూర్ రైలులో 89 మంది ఆంధ్రప్రదేశ్‌లో దిగవలసిన వారు వున్నారు. ఆదివారం ఉదయానికి పూర్తి సమాచారం అందుతుంది. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, రాజమండ్రి, ఏలూరు, విజయవాడ జిల్లాల కలెక్టరేట్లలో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశాం. బాధితుల కుటుంబ సభ్యులకు ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తున్నాం. ఇచ్ఛాపురం నుంచి ఒంగోలు వరకు ఉన్న అన్ని ప్రభుత్వాసుపత్రులను అలర్ట్ చేశాం.
- ఆంధ్రప్రదేశ్ నుంచి ఒడిశా రైలు సంఘటన స్థలానికి 108 వాహనాలు 25, ప్రైవేట్ అంబులెన్స్‌లు, 15 మహాప్రస్థానం వాహనాలను పంపించాం. నేవీ, ఎయిర్ ఫోర్స్, ఇతర శాఖల అధికారుల సహాయం కూడా తీసుకుంటున్నాం. ఇప్పటి వరకు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారెవరూ చనిపోయినట్లు సమాచారం లేదు.
- కటక్, భువనేశ్వర్‌లో రెండు చోట్ల రెండు మెడికల్ టీములను ఏర్పాటు చేశాం. సంఘటన స్థలం నుంచి దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన వారికి ప్రత్యేక ప్రయాణ ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రయాణికుల బంధువులు వాట్సాప్ ద్వారా ప్రయాణికుల ఫొటోలు, వివరాలు ఆయా కలెక్టరేట్లలోని కంట్రోల్ రూమ్‌లకు తెలియజేయాలి.

యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు

- ఎక్కడికక్కడ తక్షణ వైద్యానికి ఏర్పాట్లు
- సమన్వయం కోసం ప్రత్యేక అధికారులు
- అన్ని జిల్లా కేంద్రాల్లో కంట్రోల్ రూమ్‌లు

సాక్షి, అమరావతి /విశాఖపట్నం/కొరాపుట్ / సాక్షి నెట్‌వర్క్: ఒడిశా రాష్ట్రంలో సంభవించిన ఘోర రైలు ప్రమాద ఘటనలో సహాయక చర్యల్లో ఏపీ ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన పాలుపంచుకుంటోంది. సీఎం జగన్ ఆదేశాల మేరకు వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తం అయ్యారు. ఒడిశా సరిహద్దుల్లో ఉండే మన రాష్ట్రంలోని ఆస్పత్రులను అప్రమత్తం చేశారు. 108 అంబులెన్స్‌లు 20, ఇతర అంబులెన్స్‌లు 25, మహాప్రస్థానం వాహనాలు 15 కలిపి 60 వాహనాలు ఘటన స్థలానికి తరలించారు. పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమించారు. రైలులో ప్రయాణించిన మన రాష్ట్ర ప్రయాణికుల వివరాల ఆధారంగా కో ఆర్డినేట్ చేసుకుని క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని జిల్లాల డీఎంహెచ్‌ఓలను ఆదేశించారు.

అవసరమైతే హెలికాప్టర్ సేవలు: మంత్రి అమర్‌నాథ్

రైలు ప్రమాద బాధితులకు అత్యవసర సాయం అవసరమైతే హెలికాప్టర్ సేవలు వినియోగించుకోవాలని సీఎం ఆదేశించారని ఐటీ, పరిశ్రమల శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్ వెల్లడించారు.


ఒడిశాలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళను పరామర్శిస్తున్న మంత్రి అమర్‌నాథ్

పలువురు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులతో కలిసి శనివారం ఆయన ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి జిల్లాలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశామని తెలిపారు. ఎవరైనా రైలులో ప్రయాణించి, ఫోన్‌కి స్పందించకపోతే వారిని గుర్తించేందుకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఖరగ్‌పూర్ నుంచి చాలా మంది తెలుగు వారు ఇదే రైలులో ప్రయాణించినట్లు తెలిసిందన్నారు. ఒక క్షతగాత్రుడి అభ్యర్థన మేరకు విశాఖలోని సెవెన్‌హిల్స్ ఆస్పత్రికి తరలించామన్నారు. కటక్ రైల్వేస్టేషన్‌లో ప్రత్యేక అధికారుల బృందం, ప్రభావిత ప్రాంతంలోని ప్రతి ఆస్పత్రిలో ఆంధ్రా అధికారులు సేవల్లో ఉంటారని తెలియజేశారు.

సహాయక చర్యలు ముమ్మరం: మంత్రి రజిని

సీఎం వైఎస్ జగన్ ఆదేశాలతో రైలు ప్రమాద ఘటనలో సహాయక చర్యలు ముమ్మరం చేశామని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. శనివారం ఆమె మీడియాతో మాట్లాడారు. సీఎం ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రయాణికుల కోసం ప్రత్యేకంగా హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేశామన్నారు. కలెక్టర్లు నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు. రాష్ట్రం నుంచి 20 అడ్వాన్స్‌డ్ లైఫ్ సేవింగ్ అంబులెన్సులు, 21 మహాప్రస్థానం వాహనాలను పంపామన్నారు. ఈ వాహనాలను సమన్వయం చేసుకునేందుకు వైద్యం, రవాణా, పోలీసుశాఖల నుంచి ముగ్గురు అధికారులను నియమించామని చెప్పారు. శ్రీకాకుళం రిమ్స్, విశాఖపట్నం కేజీహెచ్, విజయనగరం జిల్లా ఆస్పత్రుల సూపరింటెండెంట్లను అప్రమత్తం చేశామన్నారు. అవసరమైతే ఒడిశాలోని ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారికి కూడా వైద్య సేవలు అందించాలని చెప్పామని తెలిపారు. కాగా, రైలు ప్రమాదంపై డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ, మంత్రులు తానేటి వనిత, కారుమూరి వెంకట నాగేశ్వరరావు, ఆదిమూలపు సురేష్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

విశాఖ కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ నంబర్లు
0891-2590100, 0891 2590102,
9154405292 (వాట్సాప్ నంబర్)
తాడేపల్లిలోని రాష్ట్ర అత్యవసర ఆపరేషన్ సెంటర్‌లో కంట్రోల్ రూమ్ నంబర్లు
1070, 112, 18004250101,
8333905022 (వాట్సప్)

క్లుప్తంగా...

రాష్ట్రాన్ని నిలువు దోపిడీ చేసిన చంద్రబాబు

979వ రోజుకు రిలే నిరాహార దీక్షల్లో బహుజన పరిరక్షణ సమితి నాయకులు



రిలే నిరాహార దీక్షలో బహుజన నాయకులు

తాడికొండ: తన భూముల ధరలకు రెక్కలు తెచ్చుకుని రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకునేందుకు గ్రాఫిక్స్ బొమ్మలు సృష్టించిన చంద్రబాబు రాజధానితోపాటు రాష్ట్రాన్ని నిలువు దోపిడీ చేశాడని బహుజన పరిరక్షణ సమితి నాయకులు మండిపడ్డారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు శనివారానికి 979వ రోజుకు చేరాయి. ఈ దీక్షల శిబిరాన్ని పలువురు సందర్శించి మద్దతు తెలిపి ప్రసంగించారు. రాజధాని అభివృద్ధికి బాబు ఆయన అనుయాయులు, కులవాదులే అడ్డుగా మారారని, ఐదేళ్లలో ప్రభుత్వం తీసుకున్న ప్రతి నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ కోర్టుల్లో తప్పుడు కేసులు వేసినందునే ఈ ప్రాంతంలో అభివృద్ధి కుంటుపడిందని చెప్పారు. వార్డు కౌన్సిలర్‌గా గెలవలేని లోకేశ్‌కు ఎల్లో మీడియా తారస్థాయి ప్రచారం చేస్తుండటం సిగ్గుచేటన్నారు. తన సీటే గెలవలేని పవన్‌కళ్యాణ్ కేవలం బాబును గద్దెనెక్కించేందుకే ఆరాటపడుతున్నాడనటంలో సందేహం లేదని పేర్కొన్నారు. ఈ దీక్షల్లో సమితి నాయకులు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, పులి దాసు, బేతపూడి సాంబయ్య, ఈపూరి ఆదాం, పలువురు దళిత నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

రైల్వే ప్రయాణికుల భద్రతపై కేంద్రం దృష్టి సారించాలి

జనసేన అధినేత పవన్‌కళ్యాణ్

సాక్షి, అమరావతి: ఒడిశాలోని బాలాసోర్ సమీపంలో శుక్రవారం జరిగిన ఘోర రైలు ప్రమాదాన్ని దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం రైల్వే ప్రయాణికుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలు బాధిత ప్రయాణికులు, వారి కుటుంబాలకు సహాయం అందించాలని కోరారు.

ఊహించని విషాద ఘటన: సోము వీర్రాజు
ఒడిశాలో జరిగిన రైలు ప్రమాదం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు పేర్కొన్నారు. ట్విట్టర్ ద్వారా ఆయన స్పందిస్తూ.. 'రైలు ప్రమాదం ఊహించని విషాద ఘటన. మృతుల కుటుంబాలకు తీవ్ర సంతాపం తెలియజేస్తూ క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను' అని పేర్కొన్నారు.

రైతు బాంధవుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

జాతీయ కాపు సమాఖ్య అధ్యక్షుడు నరహరిశెట్టి శ్రీహరి

వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలోనే నిజమైన రైతు బాంధవుడిగా నిలిచిపోతారని జాతీయ కాపు సమాఖ్య జాతీయ అధ్యక్షుడు నరహరిశెట్టి శ్రీహరి చెప్పారు. దేశంలో స్వామినాథన్ కమిషన్ వ్యవసాయ రంగ అభ్యున్నతికి అనేక సూచనలు చేసిందని, వాటిని తుచ తప్పకుండా అమలు చేస్తూ రైతాంగం అభివృద్ధికి అండగా ఉంటున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. రాష్ట్రంలోని రైతులకు ఒకే రోజు 3,800 ట్రాక్టర్లు, 391 కంబైన్డ్ హార్వెస్టర్లు, 22,580 ఇతర యంత్ర పరికరాలను పంపిణీ చేయటం చాలా గొప్ప విషయమని తెలిపారు.

హనీ బ్యాడ్జర్..నో ఫియర్

దాదాపు 30 కిలోమీటర్ల మేర వినిపించేంత భీకరంగా అరిచే అరుదైన జీవి తేనె కుక్క. హనీ బ్యాడ్జర్‌గా పిలిచే ఈ వన్య జీవులు పాపికొండలు అభయారణ్యంలో సందడి చేస్తున్నాయి. చిన్నపాటి ఎలుగు బంటిని పోలినట్టుండే తేనె కుక్కలు సుమారు రెండేళ్ల క్రితం కర్ణాటకలోని కావేరి వన్య ధామంలో కనిపించాయి. ఇటీవల పాపికొండలు అభయారణ్యంలో సైతం వీటి జాడలు ట్రాప్ కెమెరాలకు భారీగానే చిక్కాయి.



ప్రపంచంలోనే భయం లేని జంతువు హనీ బ్యాడ్జర్

పులినైనా ఎదురించగల వన్యప్రాణి

- ఇతర జంతువులకూ హనీ బ్యాడ్జర్ అంటే హడల్
- వాసన పసిగట్టి ఆహారం సేకరించడంలోనూ స్నిపర్ డాగ్‌ను మించిన నైపుణ్యం
- పాపికొండల అభయారణ్యంలో 1,200కు పైగా సంచరిస్తున్నట్టు గుర్తింపు



ట్రాప్ కెమెరాకు చిక్కిన హనీ బ్యాడ్జర్

బుట్టాయగూడెం: తేనె కుక్కలుగా పిలిచే అరుదైన వన్యప్రాణి హనీ బ్యాడ్జర్ (రాటిల్) పాపికొండలు అభయారణ్యంలో కనువిందు చేస్తున్నాయి. 25 ఏళ్ల క్రితం దక్షిణాఫ్రికా అడవుల్లో మాత్రమే గుర్తించిన ఈ జీవులు పోలవరం ప్రాజెక్ట్ ప్రాంతంలోనూ ట్రాప్ కెమెరాలకు చిక్కాయి. వీటి ఎత్తు కేవలం 12 అంగుళాలు. తల నుంచి తెలుపు, తెలుపు గీతలతో కూడిన మందపాటి.. దట్టమైన నల్లని బొచ్చును కలిగి ఉండటం వీటి ప్రత్యేకత. తేనె కుక్కల పంజా గోళ్లు మూడు అంగుళాల వరకు పొడవు ఉన్నాయి. చూసేందుకు చిన్నపాటి ఎలుగుబంటి.. పెద్దగా ఉండే ముంగిసలా కనిపిస్తుంది. నడకలో మాత్రం కుక్కను పోలి ఉంటుంది. వీపుపై తెల్లని ఛాయలుండే నల్లని ఈ జీవి చూసేందుకు భీతి గొలుపుతుంది. ఈ జీవులకు పౌరుషంలో మరో వన్యప్రాణి సాటిరాదు. వీటికి అడవిలో లభించే తేనె తుట్టెల్లోని తేనెటీగ లార్వాలంటే ఎంతో ఇష్టం. అందుకే వీటికి హనీ బ్యాడ్జర్ అని పేరొచ్చింది. ఇతర కీటకాలు, కుందేళ్లను కూడా తింటాయి. వీటి ఆహారంలో 25 శాతం పాములే. కలుగుల్లో ఉండే కొండ ఎలుకల్ని సైతం ఇవి ఇష్టంగా తింటాయి.

వీటి సంతతి పెరుగుతోంది



అరుదైన హనీ బ్యాడ్జర్లు పాపికొండలు అభయారణ్యంలో ఉన్నాయి. ప్రపంచంలోనే అత్యంత ధైర్యమైన జంతువుగా దీనికి పేరుంది. తేనెటీగల లార్వాను చాలా ఇష్టంగా తింటాయి. పులి, చిరుతతో పాటు ఎటువంటి జంతువుతోనైనా ఎదిరించి పోరాడగలవు. వీటి సంతతి 1,200కు పైగా ఉన్నట్టు అంచనా వేశాం.

– దావీదు రాజునాయుడు,
ఫారెస్ట్ రేంజ్ అధికారి, ఏలూరు జిల్లా

వీటిని చూస్తే జంతువులకు హడల్

తేనె కుక్కలను చూడగానే నక్కలు, తోడేళ్లు, ఎలుగుబంట్లు, ఏనుగులు హడలిపోతాయి. ఇవి కనిపిస్తే వాటికి దారిచ్చి తప్పుకుని వెళ్లిపోతాయి. ఇవి చాలా ధైర్యం గల ప్రాణులు. వీటి చర్మం ఎలాస్టిక్ మాదిరిగా సాగే గుణాన్ని కలిగి ఉంటుంది. పదునైన పళ్లు ఉంటాయి. అడవిలో ఎంత పెద్ద క్రూర జంతువుతోనైనా ధైర్యంగా పోరాడగల జంతువు ఇది. పులి, చిరుత, కొండచిలువతోనైనా పోరాడుతుంది. పాము విషం కూడా వీటిని ఏమీ చేయలేదు. ప్రపంచంలోనే భయం లేని జంతువు హనీ బ్యాడ్జర్ ఒక్కటే అని అటవీ అధికారులు స్పష్టం చేస్తున్నారు. వీటి జీవిత కాలం ఏడేళ్లు మాత్రమే. వాసనను పసిగట్టి ఆహారాన్ని సేకరించడంలో స్నిపర్ డాగ్‌ను మించిన నైపుణ్యం వీటి సొంతం. అరుదైన హనీ బ్యాడ్జర్ల సంచారం పాపికొండల అటవీప్రాంతంలో ఎక్కువగా ఉన్నట్టు అటవీ శాఖ అధికారులు చెబుతున్నారు. సుమారు 1,200 పైగా హనీ బ్యాడ్జర్లు ఇక్కడ ఉన్నట్టు ఇక్కడి ట్రాప్ కెమెరాలలో చిక్కిన జాడలను బట్టి తెలుస్తోందన్నారు.

దారి తప్పిన తల్లి ఘాతుకం

- బాలికతో వ్యభిచారం చేయించేందుకు యత్నం
- యుక్తవయసు అమ్మాయిలా కనిపించేలా ఇంజెక్షన్లు, ట్యాబ్లెట్ల వాడకం
- బాలిక ఫిర్యాదుతో రంగంలోకి దిగిన బాలల హక్కుల కమిషన్

విజయనగరం (క్రైమ్): ఆ బాలిక తల్లి దారి తప్పింది. పెళ్లయిన కొన్నేళ్లకే మొదటి భర్తకు విడాకులిచ్చింది. ఆ తరువాత సబ్ ఇంజనీర్‌ను వివాహం చేసుకుంది. కొంతకాలానికి అతనితోనూ తెగతెంపులు చేసుకుని వ్యభిచారం ప్రారంభించింది. చివరకు తన 15 ఏళ్ల కుమార్తెను కూడా వ్యభిచార కూపంలోకి దింపాలని, అనంతరం సినీ, టీవీ రంగంలోకి పంపించాలని భావించింది. ఆ బాలిక శరీర భాగాలు విపరీతంగా పెరిగేలా.. యుక్తవయసు అమ్మాయిలా కనిపించేలా చేసేందుకు హార్మోన్ ఇంజెక్షన్లు, ట్యాబ్లెట్లను వాడించడం మొదలుపెట్టింది. తల్లి చేష్టలను భరించలేక బాధిత బాలిక 1098 నంబర్‌కు ఫోన్‌చేసి చైల్డ్ లైన్‌ను ఆశ్రయించింది. వివరాల్లోకి వెళితే.. నవోదయ పాఠశాలలో చదువుతున్న ఓ బాలిక ఇటీవల పదో తరగతి పరీక్షలు రాసి అత్యుత్తమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించింది. ఆ బాలిక విజయనగరంలో ఉంటున్న తల్లి దగ్గరకు ఇటీవల వచ్చింది. తెలియని వ్యక్తులు తరచూ ఇంటికి రావడం.. తల్లి తనముందే వారితో వ్యభిచరించడాన్ని భరించలేక.. తల్లితో విభేదించింది. బాలికను కూడా తన మాదిరిగానే ఇంటికి వచ్చే వ్యక్తులతో చనువుగా ఉండాలని తల్లి ఒత్తిడి చేయడాన్ని తట్టుకోలేకపోయింది. శరీర భాగాలు పెరిగేందుకు ఇచ్చే ఇంజెక్షన్లు, టాబ్లెట్ల వల్ల అనారోగ్యానికి గురయింది. ఈ పరిస్థితుల్లో తల్లి ఒత్తిడిని తట్టుకోలేక గురువారం రాత్రి చైల్డ్‌లైన్ 1098కి కాల్ చేసి రక్షణ కోరింది. రంగంలోకి దిగిన చైల్డ్‌లైన్ సభ్యులు, దిశ పోలీసులు ఆ బాలికను దిశ స్టేషన్‌కు తీసుకువచ్చి విచారణ జరిపారు. బాలిక నుంచి ఫిర్యాదు తీసుకున్నాక అదేరోజు రాత్రి స్వధార్ హోమ్‌కు తరలించారు. అనంతరం విశాఖలోని ప్రభుత్వ బాలికల పునరావాస కేంద్రంలో చేర్పించారు. బాలిక సంక్షేమం చూడాలంటూ పునరావాస కేంద్రం సూపరింటెండెంట్‌కు రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు సూచించారు. ఈ విషయాన్ని విజయనగరం ఎస్పీ ఎం.దీపిక దృష్టికి తీసుకువెళ్లారు. బాలిక తల్లిని అదుపులోకి తీసుకుని చిల్డ్రన్స్ కోర్టులో విచారణ జరిపారు.

పథకాలపై ప్రచారానికి వైఎస్సార్‌సీపీ మిషన్ ఐటీ ఆర్మీ



ఐటీ వింగ్ సదస్సులో మిషన్ ఐటీ ఆర్మీ పోస్టర్‌ను విడుదల చేస్తున్న నాయకులు, కార్యకర్తలు

హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ జగన్ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి రావడమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ఐటీ ఆర్మీ అడుగులు ముందుకు వేస్తోంది. సంక్షేమాభివృద్ధి పథకాల గురించి గ్రామ స్థాయిలో ప్రజలకు వివరించేలా ప్రణాళికలు సిద్ధం చేసింది. ఇందులో భాగంగా శనివారం హైదరాబాద్ మాదాపూర్‌లోని బుట్ట కన్వెన్షన్‌లో 'వైఎస్సార్‌సీపీ ఐటీ వింగ్' సదస్సు నిర్వహించారు. ఈ విభాగం అధ్యక్షుడు సునీల్ పోసింరెడ్డి మాట్లాడుతూ ఐటీ ఉద్యోగుల కనెక్టివిటీ కోసం ఇప్పటికే బెంగళూర్ మీట్ ఏర్పాటు చేశామన్నారు. త్వరలో చెన్నై, పుణెలోను ఐటీ ఉద్యోగులతో సమావేశం ఏర్పాటు చేస్తామని చెప్పారు. సోషల్ మీడియా వింగ్... ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాం, ట్విట్టర్లలో పెట్టే పోస్టులను ఐటీ వింగ్.. ఐటీ ప్రొఫెషనల్స్, విద్యార్థులతో కనెక్ట్ చేస్తుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 5 లక్షల మంది ఐటీ ఉద్యోగులు ఉన్నారని, 50 శాతం మంది ఉద్యోగులను వైఎస్సార్‌సీపీ మిషన్ ఐటీ ఆర్మీలో ఎన్‌రోల్ చేయించాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ 50 మందిని చేర్పిస్తే ఐటీ వింగ్ మరింత బలోపేతమవుతుందని చెప్పారు. డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లో కమ్యూనికేషన్, కమిటీలు, ప్రోగ్రామ్ మేనేజ్‌మెంట్, మొబైల్ యాప్స్, గ్రీవెన్స్ ద్వారా ముందుకు సాగాలన్నారు. ఐటీ వింగ్, సోషల్ మీడియా పరస్పరం సహకారంతో మెలగాలని సూచించారు. అనంతరం ఆయన ఐటీ ఆర్మీ పోస్టర్ రిలీజ్ చేశారు. వందలాది మంది ఐటీ ఉద్యోగులు పాల్గొన్నారు.

బాబు ఓ మెంటల్ కేసు.. లోకేశ్‌కు పుట్టుకతో మానసిక వైకల్యం

- అందుకే తండ్రీకొడుకులిద్దరూ రౌడీల్లా బూతులతో వీధుల్లో వీరంగం
- 2014లో ప్రజలిచ్చిన చివరి అవకాశాన్ని కాలదన్నుకున్న బాబు
- ఇప్పుడేదో మేనిఫెస్టోను చంద్రబాబు చూపితే ప్రజలు నమ్మరు
- టీడీపీని బతికించుకునేందుకు బీజేపీతో పొత్తులకు బాబు వెంపర్లాట
- వేరే రాష్ట్రంలో ఉంటూ ఇక్కడ గెస్ట్ ఆర్టిస్టుల్లా పవన్, బాబు రాజకీయాలు
- కులం పేరుతో పవన్ రాజకీయాలు చేస్తే ఫలితం ఉండదు
- వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి



సాక్షి, అమరావతి: టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ఓ మెంటల్ కేసు.. పుట్టుకతోనే లోకేశ్‌కు మానసిక వైకల్యం.. అందుకే తండ్రీకొడుకులిద్దరూ వీధిరౌడీల్లా పోటీపడి వీధుల్లో వీరంగం చేస్తూ.. బూతులు మాట్లాడుతున్నారంటూ వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. విజయవాడలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో 2014లో తనకు ప్రజలు ఇచ్చిన చివరి అవకాశాన్ని చంద్రబాబు చీకటి పాలన ద్వారా కాలదన్నుకున్నారని చెప్పారు. అందుకే 2019 ఎన్నికల్లో చంద్రబాబును ప్రజలు తిరస్కరించారని గుర్తుచేశారు. వైఎస్ జగన్ సీఎంగా బాధ్యతలు చేపట్టాక.. గత నాలుగేళ్లుగా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల ద్వారా తమ జీవితాల్లో వచ్చిన వెలుగులను ప్రజలు కళ్లారా చూస్తున్నారని చెప్పారు. ఇప్పుడు ఏదో మేనిఫెస్టో పట్టుకుని చంద్రబాబు మాట్లాడుతున్న మాటలను ప్రజలు నమ్మరన్నారు.

చౌకబారు పిల్ల చేష్టలు మానుకో..

రాష్ట్రంలో 2014 ఎన్నికల్లో ఏం హామీలు ఇచ్చావు? అందులో ఎన్ని అమలుచేశావు? అంటూ చంద్రబాబును సజ్జల నిలదీశారు. కర్ణాటకలో కాంగ్రెస్, బీజేపీలు ఇచ్చిన హామీలు.. ప్రస్తుతం సీఎం వైఎస్ జగన్ పథకాలను కాపీకొట్టి మేనిఫెస్టోను ప్రకటిస్తే ప్రజలు నమ్ముతారా? అని ప్రశ్నించారు. రాజ్యసభ సీట్లను అమ్ముకున్న చరిత్ర చంద్రబాబుదేనన్నారు. వర్ల రామయ్యకు రాజ్యసభ సీటు ఇస్తానని చెప్పి దాన్ని టీజీ వెంకటేష్‌కు అమ్ముకున్నదెవరు?.. పుష్పరాజ్‌కు రాజ్యసభ సీటు ఇస్తానని నమ్మబలికి దాన్ని అమ్ముకున్న చరిత్ర ఎవరిదన్నారు.

పవన్‌ను తిరగొద్దని ఎవరన్నారు?

పవన్‌కళ్యాణ్‌లా వైఎస్ జగన్ సినీస్టార్ కాదని.. మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి హఠాన్మరణం తర్వాత ఆయన ఆశయ సాధన కోసం జగన్ పార్టీని స్థాపించారని.. నిత్యం ప్రజలతో మమేకమవుతూ.. అధికారంలోకి వచ్చారని సజ్జల గుర్తుచేశారు. పవన్, చంద్రబాబులు వేరే రాష్ట్రంలో ఉంటూ రాష్ట్రానికి గెస్ట్ ఆర్టిస్టుల్లా వచ్చి రాజకీయాలు చేస్తున్నారంటూ విమర్శించారు. రాష్ట్రంలో తిరగొద్దని ఎవరన్నారంటూ పవన్‌ను ఆయన ప్రశ్నించారు. అసలు.. వారాహితో అప్పుడెప్పుడో రాష్ట్రంలో పర్యటించడానికి సిద్ధమైన పవన్ లోకేశ్ పాదయాత్రకు అడ్డొస్తుందని తన యాత్రను ఆపేశారని, ఇప్పుడైనా చేస్తారో.. వాయిదా వేసుకుంటారోనని సజ్జల అనుమానం వ్యక్తంచేశారు. కులం పేరుతో ఆయన రాజకీయాలు చేస్తే ఫలితం ఉండదని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

పొత్తుల కోసం చంద్రబాబు వెంపర్లాట..

ఇక కేంద్ర ప్రభుత్వంతో రాష్ట్రానికి సంబంధించిన అంశాలపై చర్చించడానికి సీఎం జగన్ ఢిల్లీ వెళ్తే.. ఎల్లో మీడియా దానిని రకరకాలుగా చిత్రీకరిస్తూ దుష్ప్రచారం చేస్తోందని సజ్జల మండిపడ్డారు. నిజానికి.. టీడీపీని బతికించుకునేందుకే బీజేపీతో పొత్తు కోసం చంద్రబాబు వెంపర్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. బీజేపీలో బాబు ప్రయోజనాల కోసం పనిచేస్తున్న సుజనాచౌదరి వంటి నేతల ప్రకటనలు చూస్తుంటే.. పొత్తులపై బీజేపీ నేతలతో చర్చించడానికే చంద్రబాబు ఢిల్లీ వెళ్లారేమో నన్నారు.

ఉద్యోగికి విధించిన శిక్షను క్రమశిక్షణాధికారే మార్చగలరు

- ఆ శిక్షను ట్రిబ్యునల్ మార్చడానికి వీల్లేదు
- శిక్షను సవరించాలనుకుంటే ఆదేశాలివ్వాలి
- ట్రిబ్యునల్ స్వయంగా శిక్షను మార్చడం చట్టవిరుద్ధం
- హైకోర్టు ధర్మాసనం తీర్పు



సాక్షి, అమరావతి: విధి నిర్వహణలో తప్పు చేసిన ఉద్యోగికి విధించిన శిక్షను క్రమశిక్షణాధికారే మార్చగలరని హైకోర్టు స్పష్టం చేసింది. క్రమశిక్షణాధికారి విధించిన శిక్షను ట్రిబ్యునల్ స్వయంగా మార్చడానికి వీల్లేదని తేల్చిచెప్పింది. ఉద్యోగికి విధించిన శిక్ష తీవ్రమైనదని ట్రిబ్యునల్ భావిస్తే శిక్షను తగ్గించాలని క్రమశిక్షణాధికారిని ఆదేశించాలని, ఆ పనిని ట్రిబ్యునల్ నేరుగా చేయడానికి వీల్లేదని కుండబద్దలు కొట్టింది. ఒక కానిస్టేబుల్‌కు క్రమశిక్షణాధికారి విధించిన శిక్షను స్వయంగా మారుస్తూ ట్రిబ్యునల్ జారీ చేసిన ఉత్తర్వులను హైకోర్టు రద్దు చేసింది. ఆ కానిస్టేబుల్‌కు క్రమశిక్షణాధికారి విధించిన శిక్షను హైకోర్టు పునరుద్ధరించింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్ రాయ్, జస్టిస్ వెణుతురుమిల్లి గోపాలకృష్ణారావు ధర్మాసనం ఇటీవల తీర్పు వెలువరించింది.

సబ్ ఇన్‌స్పెక్టర్‌గా చెప్పుకొంటూ లంచాల డిమాండ్

విశాఖపట్నానికి చెందిన మురహరిరావు 1984లో పోలీసు కానిస్టేబుల్‌గా నియమితులయ్యారు. విధి నిర్వహణలో ఆయనపై పలు ఆరోపణలొచ్చాయి. తనను తాను సబ్ ఇన్‌స్పెక్టర్‌గా చెప్పుకొంటూ భూపాల్‌చంద్ అనే వ్యక్తి నుంచి రూ.10 వేలు లంచం డిమాండ్ చేసి రూ.5 వేలు వసూలు చేశారు. పలువురి ఇళ్లల్లో అక్రమంగా తనిఖీలు నిర్వహించారు. రూ.10 వేలు లంచం ఇవ్వకపోతే ఎక్సైజ్ కేసుల్లో ఇరికిస్తానని బెదిరించారు. అంతేకాకుండా అధికారుల అనుమతి లేకుండా బుల్లెట్ వాహనం కొనుగోలు చేశారు. ఈ ఆరోపణలపై మురహరిరావును సస్పెండ్ చేసిన ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. ఆయనపై వచ్చిన మొదటి మూడు ఆరోపణలు రుజువు కాలేదని, నాలుగో ఆరోపణలో వాస్తవముందని విచారణాధికారి నివేదిక ఇచ్చారు. అయితే క్రమశిక్షణాధికారి మాత్రం ఆ నివేదికతో ఏకీభవించలేదు. ఆరోపణలపై మురహరిరావు వివరణ కోరి.. ఆరోపణలన్నీ వాస్తవమేనని తేల్చారు. అనంతరం ఆయన టైం స్కేల్‌లో నిరవధిక కోత విధిస్తూ 1999లో ఉత్తర్వులిచ్చారు. సస్పెన్షన్ కాలాన్ని విధుల్లో ఉన్నట్లు పరిగణించడం లేదని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. క్రమశిక్షణాధికారి ఇచ్చిన ఈ ఉత్తర్వులపై మురహరిరావు పునర్విచరణాధికారి ముందు అప్పీలుకు వెళ్లారు. ఆయన క్రమశిక్షణాధికారి ఉత్తర్వులను సమర్థిస్తూ మురహరిరావు అప్పీల్‌ను తోసిపుచ్చారు. దీంతో ఆయన 2002లో ఏపీ పరిపాలన ట్రిబ్యునల్ (ఏపీఏటీ)ను ఆశ్రయించారు. విచారించిన ట్రిబ్యునల్ క్రమశిక్షణాధికారి ఉత్తర్వులను సమర్థించింది. అయితే టైం స్కేల్‌లో కోతను కొంతమేర తగ్గించడంతోపాటు సీనియారిటీ, పెన్షన్ తదితర ప్రయోజనాల నిమిత్తం సస్పెన్షన్ కాలాన్ని డ్యూటీలో ఉన్నట్లు పరిగణిస్తూ 2009లో ఉత్తర్వులు ఇచ్చింది. ట్రిబ్యునల్ ఉత్తర్వులను సవాల్ చేస్తూ మురహరిరావు 2010లో దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టేసింది. మరోవైపు ఆయనకు విధించిన శిక్షను ట్రిబ్యునల్ స్వయంగా మార్చడాన్ని సవాల్ చేస్తూ హోంశాఖ ముఖ్య కార్యదర్శి, విశాఖ పోలీస్ కమిషనర్, అదనపు డీజీ (అడ్మిన్) 2011లో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్ ధర్మాసనం ఇటీవల తుది విచారణ జరిపింది. ధర్మాసనం తీర్పు వెలువరిస్తూ.. ఉద్యోగి దుష్ప్రవర్తన తీవ్రతకు మించి అతడికి విధించిన శిక్ష ఉందని భావించినప్పుడే ట్రిబ్యునల్ లేదా కోర్టులు జోక్యం చేసుకుంటాయంది. ఆ ఉద్యోగి దుష్ప్రవర్తన తీవ్రతకు మించి అతడికి శిక్ష విధించారని భావించినప్పుడు కూడా ట్రిబ్యునల్ నేరుగా ఆ శిక్షను సవరించడం, తగ్గించడం చేయడానికి వీల్లేదంది. శిక్షను సవరించాలనిగానీ, తగ్గించాలనిగానీ క్రమశిక్షణాధికారికి ఆదేశాలు మాత్రమే జారీచేయగలదని స్పష్టం చేసింది.

అన్నీ మంచి శకునములే..!

- దేశంలో ఉద్యోగార్థులకు ఆశాజనక పరిస్థితులు
- హైరింగ్, రీప్లేస్‌మెంట్లపై 77% భారతీయ కంపెనీల ఆసక్తి
- దక్షిణ, పశ్చిమ ప్రాంతాల్లో అత్యధికంగా హైరింగ్ అవకాశాలు
- జీనియస్ కన్సల్టెంట్స్ సర్వేలో వెల్లడి

సాక్షి, హైదరాబాద్: ఈ ఆర్థిక సంవత్సరంలో ఉద్యోగార్థులతో పాటు ఉద్యోగ మార్పులు, కొత్త బాధ్యతలు కోరుకునే వారికి ఆశాజనకమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో దాదాపు 77 శాతం భారత కంపెనీలు కొత్తగా ఉద్యోగుల్ని తీసుకునేందుకు (హైరింగ్), ఖాళీల భర్తీ చేపట్టేందుకు, కొత్త బాధ్యతలు అప్పగించేందుకు మొగ్గు చూపుతున్నాయి. ఈ మేరకు ప్రణాళికలు కూడా సిద్ధం చేసుకుంటున్నాయి. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాలతో పాటు దేశంలోని పశ్చిమ ప్రాంతాల్లో ఈ విధంగా మరింత మెరుగైన పరిస్థితులున్నట్టుగా తెలుస్తోంది. బ్యాంకింగ్, ఆర్థిక, నిర్మాణ, ఆతిథ్యం, ఐటీ, విద్యుత్, ఫార్మా తదితర రంగాలకు చెందిన ఎగ్జిక్యూటివ్‌లు, హెచ్‌ఆర్ నిపుణులు..మొత్తం 2,100 మంది నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా.. కోల్‌కతాకు చెందిన హెచ్‌ఆర్ సొల్యూషన్స్ ప్రొవైడర్ జీనియస్ కన్సల్టెంట్స్ రూపొందించిన నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి.

ఇతర ముఖ్యాంశాలు..

- దేశంలోని దక్షిణ, పశ్చిమ ప్రాంతాలు అత్యధిక హైరింగ్ రేషియోతో ముందంజలో ఉన్నట్టు సర్వేలో పాల్గొన్న 33.30 శాతం మంది వెల్లడించారు.
- 4 నుంచి 7 ఏళ్ల సగటు వృత్తి అనుభవమనేది హైరింగ్‌లో కీలకాంశంగా నిలుస్తుందని 36.06 శాతం మంది చెప్పారు.
- 13 ఏళ్లు అంతకు పైబడిన వర్క్ ఎక్స్‌పీరియన్స్ ఉన్న వారికి అత్యధిక ప్రాధాన్యత లభిస్తుందని పేర్కొన్న వారు 9 శాతం ఉన్నారు.
- జాబ్ పోర్టళ్లతో పాటు, ఏఐ టెక్నాలజీ ఆధారిత యాప్స్, వెబ్‌సైట్లు, క్యాంపస్ హైరింగ్, కన్సల్టెంట్ల ద్వారా ఉద్యోగాలు లభిస్తాయని అధిక శాతం చెప్పారు.
- ఇక తమ సంస్థల్లో ముఖ్యమైన స్థానాల్లో చేరే ఉద్యోగుల బ్యాక్ గ్రౌండ్ చెక్ అనేది అత్యంత కీలకమైన అంశమని 63.6 శాతం మంది చెప్పారు. మిగతా 36.4 శాతం మంది మాత్రం దీనిని ఓ మోస్తరు ప్రాధాన్యత కలిగిన అంశంగానే పేర్కొన్నారు.
- ఇంక్రిమెంట్ల విషయంలో మధ్యస్థాయి ఉద్యోగులు అధికంగా ప్రయోజనం పొందే అవకాశం ఉందని 57.8 శాతం మంది అభిప్రాయపడ్డారు. సీనియర్, జూనియర్ స్థాయి ఉద్యోగులకు కూడా తగిన విధంగా ఇంక్రిమెంట్లు లభిస్తాయని 21.1 శాతం మంది చెప్పారు.

తెలంగాణ

పోలవరంలో నీటి నిల్వ వద్దు

పోలవరం అథారిటీని లేఖలో కోరిన తెలంగాణ ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ భూభాగంలో ముంపు సమస్యను పరిష్కరించనందున ప్రస్తుత నీటి సంవత్సరంలో పోలవరం ప్రాజెక్టులో నీళ్లను నిల్వ చేయకుండా చర్యలు తీసుకోవాలని పోలవలరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ)ని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. పోలవరం ప్రాజెక్టు 48 గేట్లతోపాటు రివర్ స్లూయిస్‌లను సైతం నిరంతరం తెరిచి ఉంచాలని, ప్రాజెక్టు వద్ద నీటి ప్రవాహానికి అడ్డంకుల్లేకుండా చూడాలని సూచించింది. 2021 సెప్టెంబర్ 6న సుప్రీంకోర్టు జారీ చేసిన ఆదేశాల మేరకు తెలంగాణ పరిధిలో ముంపు సమస్యను పరిష్కరించేందుకు ఉమ్మడి సర్వే నిర్వహించడంతోపాటు గోదావరి ట్రిబ్యునల్ అవార్డు ప్రకారం ముంపు నివారణ చర్యలు చేపట్టాలని తెలిపింది. ఈ మేరకు రాష్ట్ర నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ సి.మురళీధర్ పీపీఏకు తాజాగా లేఖ రాశారు. తమ భూభాగంలో ముంపు సమస్యను పరిష్కరించకుండా పోవలరం ప్రాజెక్టు విషయంలో ముందుకు వెళ్లే అధికారం కేంద్రానికి, ఏపీకి లేదని 2019లో సుప్రీంకోర్టులో కేసు వేసిన విషయాన్ని గుర్తుచేశారు.

బ్యాక్‌వాటర్‌తోనే గతేడాది వరదలు...

పోలవరం బ్యాక్‌వాటర్ ప్రభావంతో 2022 జూలైలో భద్రాచలం, పరిసర ప్రాంతాల్లో గోదావరి వరద పోటెత్తి భారీ ఉత్పాతం చోటుచేసుకుందని తెలంగాణ ఆరోపించింది. ఆ సమయంలో పోవలరం ప్రాజెక్టులో నీటి నిల్వలు లేవంటూ నాటి వరదలకు, పోలవరంతో ఉన్న సంబంధాన్ని ఏపీ ప్రభుత్వం తోసిపుచ్చడాన్ని తప్పుబట్టింది. 2022 జూలై తొలివారంలో పోలవరం వద్ద నీటి నిల్వలున్న ఫొటోలను ఈ లేఖతో జత చేసింది. పోలవరం వద్ద వరద ప్రవాహానికి అడ్డంకులు ఉండటంతోనే తెలంగాణలో బ్యాక్‌వాటర్ ప్రభావం భారీగా కనిపించిందని, 103 గ్రామాలు, 40,446 ఎకరాలు ముంపునకు గురయ్యాయని, 28 వేల మంది నిర్వాసితులుగా మారినట్లు తెలిపింది.

బ్యాక్‌వాటర్ ప్రభావంపై అధ్యయనం జరపాలి...

పోలవరం ప్రాజెక్టులో 150 అడుగుల గరిష్ట నీటిమట్టం (ఎఫ్‌ఆర్‌ఎల్) మేరకు నీళ్లను నిల్వచేస్తే తెలంగాణలో 899 ఎకరాలు ముంపునకు గురికానున్నాయని చాలా కాలంగా చెబుతున్నామని తెలంగాణ గుర్తుచేసింది. రాష్ట్రంలో 954 ఎకరాలు ముంపునకు గురవుతున్నాయని స్వయంగా ఏపీ అందించిన సమాచారం ధ్రువీకరిస్తోందని స్పష్టం చేసింది. బ్యాక్‌వాటర్‌తో 31 వాగులు, ఉపనదులు స్తంభించిపోనున్నాయని, మొత్తం 50 వేల ఎకరాలపై ప్రభావం ఉండనుందని పేర్కొంది. గోదావరిలో పూడిక, ఇతర మార్పుల దృష్ట్యా బ్యాక్‌వాటర్ ప్రభావంపై తాజా అధ్యయనం జరపాలని కోరింది.

సార్వత్రిక టీకాల నమోదుకు యూ–విన్

- దేశంలో యూనివర్సల్ ఇమ్యునైజేషన్ ప్రోగ్రామ్
- గర్భిణులు, నవజాత శిశువులకు ఈ పోర్టల్ ద్వారా టీకా సేవలు
- ప్రకాశం, ఎన్టీఆర్ జిల్లాల్లో ప్రయోగాత్మకంగా అమలు
- త్వరలో అన్ని జిల్లాలకు విస్తరణ

సాక్షి, అమరావతి: 'కో–విన్'.. దేశ ప్రజలకు పెద్దగా పరిచయం అక్కర్లేని పేరిది. కరోనా టీకా ప్రక్రియలో డిజిటల్ సేవలను ప్రభుత్వం అందించింది ఈ పోర్టల్ ద్వారానే. ఇదే తరహాలో గర్భిణులు, చిన్నారులకు వేసే సాధారణ టీకా సేవలను కూడా ప్రభుత్వం డిజిటలైజేషన్ చేస్తోంది. యూ–విన్ పోర్టల్ ద్వారానే దేశంలో యూనివర్సల్ ఇమ్యునైజేషన్ ప్రోగ్రామ్‌కు కేంద్ర ఆరోగ్య శాఖ శ్రీకారం చుట్టింది. యూ–విన్ పోర్టల్‌లో ప్రతి గర్భిణి, శిశువు వివరాలను నమోదు చేసి, వారికి అందాల్సిన వ్యాధి నిరోధక టీకాలు సక్రమంగా అందేలా ట్రాక్ చేస్తారు. గర్భిణి, చిన్నారి ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ (అభా)ను ఈ పోర్టల్‌కు అనుసంధానిస్తారు. వీరికి వేసిన టీకాలు ఎప్పటికప్పుడు ఎలక్ట్రానిక్ రిజిస్టర్ అవుతాయి. టీకా స్థితిని అప్‌డేట్ చేయడం, తదుపరి డోస్ ఎప్పుడు వేసుకోవాలో అలర్ట్ చేయడం వంటి సేవలు యూ–విన్ ద్వారా పొందవచ్చు. కరోనా వ్యాక్సిన్ వేసుకున్న వారు పొందినట్లే వ్యాక్సినేషన్ సర్టిఫికెట్‌ను పోర్టల్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

ఇప్పటికే పైలట్ ప్రాజెక్ట్‌గా..

జనవరి నుంచి దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో యూ–విన్ కార్యక్రమం పైలట్ ప్రాజెక్ట్‌గా చేపట్టారు. మన రాష్ట్రంలో ప్రకాశం, ఎన్టీఆర్ జిల్లాల్లో ఈ కార్యక్రమం కొనసాగుతోంది. త్వరలో అన్ని జిల్లాల్లో పూర్తి స్థాయిలో అమలుకు కేంద్ర ఆరోగ్య శాఖ చర్యలు చేపడుతోంది. రాష్ట్రాల్లోని సార్వత్రిక రోగ నిరోధక టీకాల పంపిణీ కేంద్రాలు, ఇతర వివరాలను పోర్టల్‌లో నమోదు చేస్తున్నారు.

పిల్లలకు వేసే టీకాలు

- పుట్టిన సమయంలో బీసీజీ (క్షయ) ఓపీవీ వ్యాక్సిన్ జీరో మోతాదు, హెపటైటిస్ బీ టీకా
- 6 వారాల వయసులో ఓపీవీ–1 (పోలియో రాకుండా), రోటా–1 (విరేచనాలు రాకుండా) చుక్కల మందుతో పాటు ఎఫ్ ఐపీవీ–1 ఇంజక్షన్ (పోలియో రాకుండా), పెంటావాలెంట్ (డిఫ్తీరియా, కంఠసర్పి, ధనుర్వాతం, కామెర్లు, మెదడు వాపు రాకుండా)
- పది వారాల వయసులో ఓపీవీ, పెంటావాలెంట్, రోటా టీకాలు రెండో డోసు
- 14 వారాలకు ఓపీవీ, పెంటావాలెంట్, రోటా మూడో డోసుతో పాటు ఎఫ్ ఐపీవీ రెండో డోసు
- 9 నెలలకు తట్టు, రుబెల్లా రాకుండా ఎంఆర్ వ్యాక్సిన్ తో పాటు విటమిన్ ఏ ద్రావణం
- 16 నుంచి 24 నెలలకు డీపీటీ మొదటి బూస్టర్, ఓపీవీ బూస్టర్‌తో పాటు ఎంఆర్ రెండో డోసు
- 5, 6 సంవత్సరాలకు డీపీటీ రెండో బూస్టర్
- 10 – 16 సంవత్సరాలకు టీడీ వ్యాక్సిన్



“నా కుమారుడా, నీ రాబడి అంతటిలో ప్రథమ ఫలమును నీ ఆస్తిలో భాగమును ఇచ్చి యెహోవాను ఘన పరచుము. అప్పుడు నీ కొట్లలో ధాన్యము సమృద్ధిగా నుండును, నీ గానుగులలో నుండి క్రొత్త ద్రాక్షారసము పైకి పొరలి పారును.

– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, **తిథి:** పౌర్ణమి ఉ.9.08 వరకు, తదుపరి బహుళ పాడ్యమి, **నక్షత్రం:** జ్యేష్ఠ తె.4.39 వరకు (తెల్లవారితే సోమవారం), తదుపరి మూల, **వర్జ్యం:** ఉ.10.46 నుండి 12.21 వరకు, **దుర్ముహూర్తం:** సా.4.47 నుండి 5.40 వరకు, **అమృతఘడియలు:** రా.7.55 నుండి 9.23 వరకు, ఏరువాక పౌర్ణమి.

సూర్యోదయం : 5.28
సూర్యాస్తమయం : 6.27
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

అరవింద్ కేజ్రీవాల్ (ఢిల్లీ సీఎం)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

యూఎస్‌లో రాహుల్ సరిగ్గా ఏ అక్షాంశ రేఖాంశాల మధ్య ఉన్నారో ఎక్కడా లొకేట్ అవడం లేదు! ఆయన వెళ్లి వారం కావస్తోంది. ఫోన్ కనెక్ట్ కావడం లేదు. తొలిరోజు కనెక్ట్ అయింది కానీ, మాట్లాడింది రాహుల్ కాదు.

“రాహుల్ జస్ట్ ఇప్పుడే శాన్‌ఫ్రాన్సిస్కోలో ల్యాండ్ అయ్యారు..” అన్నారు ఆ వైపున నా కాల్‌ని లిఫ్ట్ చేసిన వ్యక్తి. ఇప్పుడే ల్యాండ్ అయ్యారంటే.. ఇప్పట్లో కనెక్ట్ అవరని!

“వెల్, ప్రస్తుతం నేను మాట్లాడుతున్నది ఏ గౌరవనీయుడితోనో తెలుసుకోవచ్చా?” అని ఆ వ్యక్తిని అడిగాను.

“తప్పకుండా తెలుసుకోవచ్చు. అయితే నేనెవరో మీరు తెలుసుకున్నందు వల్ల, లేదా మీరెవరో నేను తెలుసుకోవడం వల్ల రాహుల్ టైట్ షెడ్యూల్‌లో ఇప్పటికిప్పుడు మీకోసం జరగబోయే మార్పులు ఏమీ ఉండబోవని నేనైతే కచ్చితంగా చెప్పగలను. బై–ద–వే.. నా పేరు శామ్ పిట్రోడా..” అన్నారాయన!

“ఓ.. వావ్! శామ్ పిట్రోడా!!” అన్నాను. “నా పేరు అరవింద్ కేజ్రీవాల్..” అని చెప్పాను. అందుకు ఆయనేమీ ‘ఓ.. వావ్! కేజ్రీవాల్!!’



అనలేదు.

“మిస్టర్ పిట్రోడా! ఇండియాకు మీరు టెలికాం విప్లవాన్ని తెచ్చారు. రాహుల్‌కి మాత్రం నన్ను కనెక్ట్ చేయలేకపోతున్నారు..” అని నవ్వాను. ఆయనా నవ్వారు.

“మిస్టర్ కేజ్రీవాల్! యూఎస్‌లో రాహుల్ టూర్ మొత్తం నేనే ప్లాన్ చేశాను. ఆ ప్లాన్‌ని బ్రేక్ చేసి, ఆ బ్రేక్‌లో మీకొంత సమయం ఇప్పించడానికి ఈ వారం రోజుల్లో సాధ్యం అవుతుందేమో చూస్తాను..” అన్నారు పిట్రోడా.

ఆ తర్వాత పిట్రోడా కూడా నాకు కనెక్ట్ అవలేదు!

రాహుల్ శాన్‌ఫ్రాన్సిస్కోలో ఉన్నప్పుడు ఫోన్ చేస్తే.. ఇప్పుడే స్టాన్‌ఫోర్డ్‌లో స్పీచ్ ఇచ్చి వాషింగ్టన్ డీసీ ఫ్లయిట్ ఎక్కేశారు అనేవాళ్లు! వాషింగ్టన్ డీసీకి ఫోన్ చేస్తే.. ఇంత క్రితమే సెనెటర్‌లతో మీటింగ్ ముగించుకుని న్యూయార్క్ వెళ్లిపోయారు అనేవాళ్లు! న్యూయార్క్‌కి ఫోన్ చేస్తే.. జావిట్ కన్వెన్షన్ సెంటర్‌కి ఇంకా రీచ్ అవలేదు అనేవాళ్లు!

పిట్రోడా మళ్లొకసారి నా కాల్‌కి కనెక్ట్ అయితే బాగుండనిపించింది. కోరుకున్న వాళ్లు దొరక్కపోతే ఎవరో ఒకర్ని కోరుకుంటుందేమో ఈ పిచ్చి మనసు.. అర్థంపర్థం లేకుండా!

రాహుల్ యూఎస్ వెళ్లడానికి ముందే.. సపోర్ట్ కోసం ఢిల్లీలో నేను ఆయన దగ్గరికి వెళుతుంటే, పాస్‌పోర్ట్ కోసం ఆయన ఢిల్లీ కోర్టుకు వెళుతూ కనిపించారు.

“రాహుల్‌జీ! రాజ్యసభలో మీ సపోర్ట్ కావాలి. ఐఏఎస్‌ల మీద ఢిల్లీ సీఎంకి అధికారం లేకుండా మోదీ ఆర్డినెన్స్ తెచ్చారు. ఆ ఆర్డినెన్స్‌కి వ్యతిరేకంగా మీరు మాకు సపోర్ట్ ఇవ్వాలి” అన్నాను.

ఆయన అవుననీ, కాదనీ అనలేదు. “ఖర్గేజీతో మాట్లాడండి. ఆయనే కదా మా పార్టీ అధ్యక్షులు..” అనేసి, యూఎస్ వెళ్లిపోయారు.

నితీశ్, దీదీ, థాక్రే, శరద్‌జీ, కేసీఆర్, ఏచూరి, స్టాలిన్, సొరేన్.. అంతా సపోర్ట్ చేస్తామని నాకు మాటిచ్చారు. వాళ్లతో కాంగ్రెస్ కూడా కలిస్తే.. ఢిల్లీ ఆర్డినెన్స్ చెత్తబుట్టలో పడుతుంది. ఆర్డినెన్స్ తెచ్చినవాళ్లు 2024లో చెత్తబుట్టలో పడిపోతారు. ఆ మాట చెప్పడానికే రాహుల్ ఫోన్‌కి ట్రై చేస్తున్నాను.

చివరికి ఎందుకైందో కనెక్ట్ అయింది!

అవతల ఉన్నది రాహులా? పిట్రోడానా? రాహులే!!

“రాహుల్‌జీ! అంతా మీ మీదే డిపెండ్ అయి ఉన్నాం. కర్ణాటకలో షాక్ ఇచ్చినట్లే, రాజ్యసభలో కూడా మీరు మోదీకి షాక్ ఇస్తే..” అంటూ ఆగాను.

“ఎవరి కోసం ఎవరికి షాక్ ఇస్తున్నామో చూసుకోవాలి కదా అరవింద్‌జీ! షాక్ ఇస్తున్నప్పుడు షాక్ తగలకుండా కూడా చూసుకోవాలి..” అన్నారు రాహుల్!!

ఆ మాటకు నేనేమీ షాక్ తినలేదు.

అంతా కలిశాక, కాంగ్రెస్ కలిసిరాక.. మళ్లొక ఐదేళ్లు ఈ దేశంలో ఫెడరలిజం రాష్ట్రానికో రకంగా షాక్‌కి గురి కాబోతోందా?

బాబుగారి ఢిల్లీ యాత్ర!

జనతంత్రం



వర్ధెల్లి మురళి



‘‘ఏ తీరుగ నను దయజూచెదవో ఇన వంశోత్తమ రామా!.... క్రూర కర్మములు నేరకజేసితి నేరములెంచకు రామా...’’ ఈ భక్త రామదాసు కీర్తన తెలుగు వారందరికీ తెలిసినదే! తెలియక చేసిన నా తప్పుల్ని మన్నించి నా మీద దయ చూపమని శ్రీరామచంద్రుని చరణారవిందాల ఎదుట రామదాసు ప్రార్థిస్తాడు. సరిగ్గా ఇదే భావాన్ని ప్రధాని నరేంద్ర మోదీ ఎదుట ప్రకటించాలని మన చంద్రబాబు ఆరాటపడుతున్నారు. అధికారం కోల్పోయిన దగ్గరి నుంచి మోదీ దర్శన భాగ్యం కోసం, రామదాసు సన్నివేశం కోసం ఆయన చేయని ప్రయత్నం లేదు. అప్పుడొకసారి స్వాతంత్య్ర అమృతోత్సవాల సందర్భంగా జరిగిన సమావేశంలో మోదీకి చంద్రబాబు ఎదురుపడ్డారు. పూజకు వీలు చిక్కలేదు కానీ, హారతి కళ్లకద్దుకునేంత ఘడియ సమయం మాత్రం దొరికింది. అప్పుడాయన ప్రధాని వెళ్లే మార్గం పక్కన తొంభై డిగ్రీల లంబకోణంలో నిలబడి ఉన్నారు. వరుసగా అందర్నీ పలకరించినట్టే సీనియర్ నాయకులైన బాబును కూడా ప్రధాని పలకరించారు. వెంటనే తన మనసులోని మాటను చంద్రబాబు బయటపెట్టారు. ‘మీరు ఏకాంత సమయమిస్తే చాలా విషయాలు మనవి చేసుకుంటాన’ని సిగ్గుపడకుండా అడిగేశారు. సరే చూద్దామంటూ ప్రధాని వెళ్లిపోయారు.

అప్పటినుంచి ప్రధాని ఏకాంత సేవకు ఎప్పుడు సమయం దొరుకుతుందా అని బాబు ఎదురు చూడని క్షణం లేదు. ఈమధ్య బాహాటంగానే ప్రధాని గుణగణాలను ప్రస్తుతించిన విషయం అందరికీ గుర్తుండే ఉంటుంది. మామూలుగా పొగడలేదు. శ్రీ రఘువీర గద్యానికి ఇంచుమించు సరిసాటిగా భజించారు. అదేమిటి... ఎన్నికలకు ముందు ప్రధానమంత్రిని అన్ని బూతులు తిట్టిన నోటితోనే ఎలా పొగుడుతున్నారనే అనుమానం ఎవరికైనా వస్తే వారు అమాయకుల కిందే లెక్క! చంద్రబాబులో ఉన్న చతుష్షష్టి కళల గురించి అవగాహన లేనివారికిందే లెక్క! రంగు మార్చుకొని ఊసరవెల్లి కావడం తొండకు మాత్రమే తెలుసా? ఆయనక్కూడా తెలుసు. గోడ మీద కూర్చొని ఎటు కుదిరితే అటు దూకడం పిల్లి మాత్రమే నేర్చిన విద్యా? ఆయన కూడా నేర్చారు. అందువల్ల ఆయన ఏం చేసినా ఆశ్చర్యపడకూడదు. నేతి బీరకాయలో నెయ్యి కోసం వెతకడం, బాబు రాజకీయంలో నీతి కోసం వెతకడం – రెండూ అవివేకమైన పనులే.

ఇన్నినాళ్లు వేచిన బాబు హృదయం శనివారం నాడు ఎగసిఎగసి పడిందట. అదే ఊపులో ఢిల్లీకి ఆయన ఎగిరివెళ్లారు. ప్రధానమంత్రి మోదీతో, అమిత్ షాతో చంద్రబాబు సమావేశాలను ఏర్పాటు చేయడం కోసం ఆయన లాబీయిస్టులు రెండు మూడేళ్లుగా చేయని ప్రయత్నం లేదు. అయినా ఖరారు కాని అపాయింట్‌మెంట్ కొన్ని ‘అదృశ్యశక్తుల’ ఎంట్రీతో ఎట్టకేలకు ఖరారైందట! ఈ మేరకు శనివారం రాత్రి అమిత్ షాను చంద్రబాబు కలిశారు. మోదీ టైమ్ కోసం ఇంకా ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఒడిషాలో జరిగిన ఘోరమైన రైలు ప్రమాదం నేపథ్యంలో ఈ అపాయింట్‌మెంట్ విషయం ఏమవుతుందో చివరిదాకా చెప్పలేము. కానీ, ఇన్నాళ్లు బాబుకు టైమివ్వని బీజేపీ నాయకత్వం ఇప్పుడెందుకు ఇచ్చినట్టు? చక్రం తిప్పిన అదృశ్యశక్తులెవరు? ఇప్పుడు ఢిల్లీ తెలుగు సర్కిల్స్‌లో ఇదే చర్చనీయాంశం. బీజేపీ కేంద్ర నాయకత్వంతో బాబు చర్చించాలనుకున్న రాజకీయ ఎజెండాకు తోడు ఇప్పుడొక అత్యవసర కర్తవ్యం వచ్చి పడింది. తనకూ, తన పార్టీకీ, యెల్లో కూటమికీ సారథిగా, సచివునిగా భావించే రామోజీరావు యథేచ్ఛగా చట్టాన్ని ఉల్లంఘిస్తూ చిక్కుల్లో పడ్డారు. ఇప్పుడాయన్ను చిక్కుల్లోంచి బయట పడేయడానికి ప్రయత్నించడం బాబుకు తక్షణావసరం. ఈ కర్తవ్య నిర్వహణ కోసమే ‘అదృశ్య శక్తులు’ కూడా సహకరించాయని సమాచారం.

కేంద్ర చిట్‌ఫండ్స్ చట్టం – 1982ను ఉల్లంఘిస్తూ మార్గదర్శి చిట్స్ వ్యాపారం చేస్తున్నది. చట్టం ప్రకారం ఏ బ్రాంచి పరిధిలోని చందాదారుల సొమ్ము ఆ బ్రాంచి పరిధిలోని జాతీయ బ్యాంకులోనే డిపాజిట్ చేయాలి. అలా చేసినట్లయితే జనం సొమ్ముతో సొంత వ్యాపారం చేసుకోవడం

ఇన్నినాళ్లు వేచిన చంద్రబాబు హృదయం శనివారం నాడు ఎగసిఎగసి పడిందట. అదే ఊపులో ఢిల్లీకి ఆయన ఎగిరివెళ్లారు. ప్రధానమంత్రి మోదీతో, అమిత్ షాతో చంద్రబాబు సమావేశాలను ఏర్పాటు చేయడం కోసం ఆయన లాబీయిస్టులు రెండు మూడేళ్లుగా చేయని ప్రయత్నం లేదు. అయినా ఖరారు కాని అపాయింట్‌మెంట్ కొన్ని ‘అదృశ్యశక్తుల’ ఎంట్రీతో ఎట్టకేలకు ఖరారైందట! ఈ మేరకు శనివారం రాత్రి అమిత్ షాను చంద్రబాబు కలిశారు. మోదీ టైమ్ కోసం ఇంకా ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఒడిషాలో జరిగిన ఘోరమైన రైలు ప్రమాదం నేపథ్యంలో ఈ అపాయింట్‌మెంట్ విషయం ఏమవుతుందో చివరిదాకా చెప్ప లేము. కానీ, ఇన్నాళ్లు బాబుకు టైమివ్వని బీజేపీ నాయకత్వం ఇప్పుడెందుకు ఇచ్చినట్టు? చక్రం తిప్పిన అదృశ్య శక్తులెవరు? ఇప్పుడు ఢిల్లీ తెలుగు సర్కిల్స్‌లో ఇదే చర్చనీయాంశం. బీజేపీ కేంద్ర నాయకత్వంతో బాబు చర్చించాలనుకున్న రాజకీయ ఎజెండాకు తోడు ఇప్పుడొక అత్యవసర కర్తవ్యం వచ్చి పడింది. తనకూ, తన పార్టీకీ, యెల్లో కూటమికీ సారథిగా, సచివునిగా భావించే రామోజీరావు యథేచ్ఛగా చట్టాన్ని ఉల్లంఘిస్తూ చిక్కుల్లో పడ్డారు. ఇప్పుడాయన్ను చిక్కుల్లోంచి బయట పడేయడానికి ప్రయత్నించడం బాబుకు తక్షణావసరం. ఈ కర్తవ్య నిర్వహణ కోసమే ‘అదృశ్య శక్తులు’ కూడా సహకరించాయని సమాచారం.

కుదరదు గనుక మార్గదర్శి సంస్థ ఆ చట్ట నిబంధనల్ని పాటించడం లేదు. ఆ నిబంధనల్ని పాటించాల్సిందేనని ఏపీ చిట్స్ రిజిస్ట్రార్ స్పష్టం చేయడంతో గత డిసెంబర్ నుంచి కొత్త చిట్స్‌ను సంస్థ నిలిపివేసింది. దాంతో మనీ రొటేషన్ లేక చిట్ పాడుకున్న వారికి డబ్బులు చెల్లించలేకపోతున్నది. ఇప్పటికే పలువురు చందాదారులు సీఐడీకి ఈ విషయంపై ఫిర్యాదులు చేశారు. చందాదారుల హక్కుల పరిరక్షణ కోసం మార్గదర్శి చరాస్తులను అటాచ్ చేయడానికి ఏపీ ప్రభుత్వం అనుమతిని సీఐడీ కోరింది. ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. చిట్‌ఫండ్స్ ఖాతాల్లో ఉన్న నగదు నిల్వలు, మ్యూచువల్ ఫండ్స్‌లో దాని పెట్టుబడులు కలిపి 739 కోట్లను అటాచ్ చేయడానికి ప్రభుత్వం అనుమతించింది. ఈ విషయాన్ని న్యాయస్థానానికి నివేదించి తదుపరి చర్యలను చేపట్టడానికి సీఐడీ సన్నాహాలు చేసుకుంటున్నది.

మరోపక్క సీఐడీ నోటీసులకు స్పందించకుండా, దానికి సమాచారం ఇవ్వకుండా మార్గదర్శి ఎమ్‌డీ శైలజా కిరణ్ అమెరికా పర్యటనకు వెళ్లారు. ఎట్టి పరిస్థితుల్లో ఆరో తేదీన విచారణకు హాజరు కావలసిందేనని సీఐడీ మరో నోటీసు ఇచ్చింది. ఇప్పటికే మార్గదర్శి ఫైనాన్షియర్స్ వ్యవహారంలో చట్టాన్ని అతిక్రమించి తలబొప్పి కట్టించుకున్న రామోజీ, చిట్‌ఫండ్స్ రచ్చతో తాను తీసుకున్న గొయ్యిలో తానే పడ్డట్టయింది. దాంతో చివరి ప్రయత్నంగా మంచమెక్కి ఆపసోపాలు పడుతూ తన పరిస్థితి కాలమహిమో, జగన్ మహిమో తెలియట్లేదని చెబుతూ వీడియోలను విడుదల చేయించుకున్నారు. ఆయన ఆశించినట్టుగా ఎక్కడా ఇసుమంత సానుభూతైనా వ్యక్తం కాలేదు. అయినా మోసానికి బలైన వాడిని చూస్తే అంతో ఇంతో సానుభూతి వ్యక్తమవుతుంది గానీ మోసం చేసినవాడిని చూస్తే సానుభూతి ఎందుకు వస్తుంది? ఇంత చిన్న లాజిక్ ఎలా మిస్సయ్యాడో రామోజీ! ఇప్పుడాయనకు గజేంద్ర మోక్షం లాంటి వరం కావాలి. ఎలా? తన దగ్గరికి శ్రీహరి రాడు. తాను వైకుంఠానికి వెళ్లలేడు. అందుకని తన దూతగా శిష్యుడు చంద్రబాబును పంపించాలని నిర్ణయించారట! బాబు మొఖం చూడటం ఇష్టంలేని నాయక ద్వయాన్ని ఒప్పించడానికి తన యాభయ్యేళ్ల నెట్‌వర్క్‌లను వాడి ఉంటారు. స్వామి కార్యంతో పాటు స్వకార్యం అనుకుంటూ రెండు దస్త్రాలను వెంటబెట్టుకుని బాబు బయల్దేరారు. చట్టాన్ని ఉల్లంఘించిన విషయంలో కేంద్రం చేయగలిగే సాయం ఏమీ ఉండదన్న సంగతి రామోజీకి తెలియంది కాదు. ‘కానూన్ కే హాథ్ లంబే హోతే హై’ అన్న మాట కూడా ఆయన వినలేదని అనుకోలేము. అయినా ఏదో ఆశ! మిణుకు మిణుకుమంటున్నది. అమిత్ షా భేటీలో పనిలో పనిగా తన ముందస్తు ‘వేడుకోలు’ ప్రార్థన కూడా చంద్రబాబు చేసినట్టు భోగట్టా. ఫైబర్ నెట్, స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణాల్లో ఇప్పటికే దొరికిపోవడం, రాజధాని భూ కుంభకోణంలో దొరికిపోయే పరిస్థితులు ఉండటంతో ఆయన తీవ్ర ఆందోళన పడుతున్నారని తెలుస్తున్నది.

ఇక రెండో దస్త్రం సంగతి. వచ్చే ఎన్నికల్లో జగన్ మోహన్‌రెడ్డిని ఎదుర్కోవడానికి జనసేనతోపాటు బీజేపీ కూడా తన వెంట ఉండాలని బాబు వాంఛ. ప్రతిష్ఠాత్మక సంస్థలతో ఆయన వరసగా చేయించుకుంటున్న సర్వేల్లో జగన్‌మోహన్‌రెడ్డి ప్రజామోదం ఎప్పుడూ 53 శాతానికి తగ్గడం లేదు. టీడీపీ, జనసేనలకు కలిపి చూసినా ఇంకా పదమూడు శాతం మైనస్‌లో ఉంటున్నారు. ఈ గణాంకాల్ని బట్టి చూస్తే వీరికి బీజేపీ తోడైనా కూడా ఫలితాల్లో పెద్ద మార్పేమీ రాదు. కానీ కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ తమ వెంట ఉంటే ఇప్పటికే తాము ప్రారంభించిన విషప్రచారాలను ఇంకా ఉద్ధృతం చేయవచ్చు. 2014 లాగా ఒక సానుకూల వాతావరణాన్ని సృష్టించుకోవచ్చని టీడీపీ ఆరాటపడుతున్నది. ఇది మబ్బుల్లో నీళ్లను చూసి విత్తనాలు వేసుకోవడమే! అయినా అంతకు మించిన తరుణోపాయం టీడీపీ దగ్గర లేదు.

కర్ణాటక ఎన్నికల తర్వాత బీజేపీ మీద దక్షిణాది ఒత్తిడి పెరిగింది. తెలంగాణలో గెలిస్తేనే కర్ణాటక గాయం మానుతుందని భావిస్తున్నది. కానీ ఇందుకు విరుద్ధంగా తెలంగాణ పరిణామాలు మారుతున్నాయి. బీజేపీలోకి చేరికలు దాదాపుగా ఆగిపోయాయి. కాంగ్రెస్‌లో కొంత కదలిక వచ్చింది. ఈ నేపథ్యంలో బీజేపీ ముందు ఉంచేందుకు బాబు తెలంగాణ ప్రతిపాదన ఒకటి సిద్ధం చేశారు. తెలుగుదేశంతో అలయెన్స్ కుదిరితే హైదరాబాద్ సిటీ, ఖమ్మం, నిజామాబాద్ జిల్లాల్లో బీజేపీ పరిస్థితి మెరుగవుతుందని కొన్ని కాకిలెక్కలు తయారు చేసినట్టు సమాచారం. అలయెన్స్ కారణంగా బీజేపీలో చేరికలు కూడా పెరిగి ఒక ఊపు వస్తుందని నమ్మించేందుకు చంద్రబాబు ప్రయత్నించారు. అంతే కాకుండా ఎన్నికల తర్వాత అవసరమైతే కాంగ్రెస్‌లోని ఒక వర్గాన్ని బీజేపీకి అనుకూలంగా గోడ దూకించేందుకు కూడా సహకరించగలనని చంద్రబాబు హామీ ఇచ్చినట్టు తెలిసింది.

బీజేపీ ఆలోచనలు భిన్నంగా సాగుతున్నాయని తెలుస్తున్నది. ప్రతిపక్షాలన్నీ ఏకమై పోటీ చేసినా ఈసారి ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని ఓడించడం సాధ్యం కాదన్న అంచనాకు బీజేపీ వచ్చింది. మరోపక్క టీడీపీ సంస్థాగతంగా బాగా బలహీనపడింది. నాయకత్వ ప్రతిష్ఠ అట్టడుగు స్థాయికి చేరుకున్నది. వచ్చే ఎన్నికల్లో కూడా ఓడిపోతే ఆ పార్టీ బతికి బట్టకట్టడం సాధ్యం కాదు. ఈ పరిస్థితినే బీజేపీ కోరుకుంటున్నది. టీడీపీ పతనమైతేనే ప్రతిపక్షంగా తాము ఎదుగుతామని అది ఆలోచిస్తున్నది. జనసేన కూడా తమతో ఉంటే ఉమ్మడిగా 29 ఎన్నికల నాటికి వైసీపీకి బలమైన ప్రత్యామ్నాయంగా నిలవొచ్చని భావిస్తున్నది. ఒకవేళ జనసేన బాబుతోనే వెళితే ఎన్నికల తర్వాత ఇద్దరూ కోలుకునే పరిస్థితి ఉండదు. అప్పుడు ఒంటరిగానైనా సరే ఎన్నికల తర్వాత ప్రతిపక్షంగా తామే నిలబడగలుగుతామని బీజేపీ నాయకత్వం ఆలోచనగా చెబుతారు. అయితే రాష్ట్ర బీజేపీలో చంద్రబాబు అనుకూల సెక్షన్ కొంత ఉన్నది. వీరికి కేంద్రం నుంచి ఆశీస్సులు అందజేస్తున్న నాయకులు కొందరున్నారు. వీరందరూ టీడీపీ లాబీయిస్టులకు సహకరిస్తున్నారు.

కర్ణాటక ఎన్నికల తర్వాత బీజేపీ మీద దక్షిణాది ఒత్తిడి పెరిగింది. తెలంగాణలో గెలిస్తేనే కర్ణాటక గాయం మానుతుందని భావిస్తున్నది. కానీ ఇందుకు విరుద్ధంగా తెలంగాణ పరిణామాలు మారుతున్నాయి. బీజేపీలోకి చేరికలు దాదాపుగా ఆగిపోయాయి. కాంగ్రెస్‌లో కొంత కదలిక వచ్చింది. ఈ నేపథ్యంలో అమిత్ షా ముందు బాబు ఒక ప్రతిపాదన ఉంచారు. తెలుగుదేశంతో అలయెన్స్ కుదిరితే హైదరాబాద్ సిటీ, ఖమ్మం, నిజామాబాద్ జిల్లాల్లో బీజేపీ పరిస్థితి మెరుగవుతుందని కొన్ని కాకిలెక్కలు తయారు చేసినట్టు సమాచారం. అలయెన్స్ కారణంగా బీజేపీలో చేరికలు కూడా పెరిగి ఒక ఊపు వస్తుందనీ, ఎల్లో మీడియా సంపూర్ణ సహకారం కూడా బీజేపీకి లభిస్తుందనీ చంద్రబాబు, అమిత్ షాతో చెప్పినట్టు తెలిసింది. అంతేకాకుండా ఎన్నికల తర్వాత అవసరమైతే కాంగ్రెస్‌లోని ఒక వర్గాన్ని బీజేపీకి అనుకూలంగా గోడ దూకించేందుకు కూడా సహకరించగలనని చంద్రబాబు హామీ ఇచ్చినట్టు తెలిసింది. టీడీపీ అలయెన్స్ ప్రతిపాదనను గతంలోనే రాష్ట్ర బీజేపీ నాయకులు తిరస్కరించినట్టు వార్తలు వచ్చాయి. కర్ణాటక ఎన్నికల తర్వాత వచ్చిన వాతావరణ మార్పును తనకు అనుకూలంగా మార్చుకునేందుకు బాబు ఎత్తులు వేస్తున్నారు. అంతిమంగా ఆంధ్రప్రదేశ్‌లో సింహాన్ని ఎదుర్కోవడానికి కలిసివచ్చే తోడేళ్ల కోసం ఆయన అన్వేషణ సాగుతూనే ఉన్నది.

vardhelli1959@gmail.com

‘మణి’తో చెదురు మధుర మెమొరీస్

సందర్భం



డా॥ వై. దివాకర రావు

మా చిన్ననాటి నెల్లూరు స్నేహితులు ఏ పేరుతో పలకరిస్తే తను పులకరిస్తాడో ఆ ముద్దుపేరే ‘మణి’. సినిమా వాళ్ళు పిల్చుకున్న పేరు బాలూ. వెరసి యస్పీ ‘బాలు’ సుబ్ర‘మణి’యం అయ్యాడు.


తనతో నాకా రోజుల్నుంచే పరిచయం ఏర్పడి అది స్నేహంగా మారి, బంధమవడానికి మూల కారకుడు – కారణజన్ముడు మహమ్మద్ రఫీ. ఇక మేం వయసులో ఎదిగే కొద్దీ మా దారులూ, రహదారులూ, రహసందులూ వేరయ్యాయి. నేనేమో డాక్టరీ చదివి చెవి, ముక్కు, గొంతు స్పెషలిస్టునయ్యాను. తనేమో ఆ మూడు అంగాల్లో గొంతును ఎన్నుకొని దాన్ని ఎన్ని మెలికలు తిప్పాలో తిప్పి, డాక్టరేట్లూ, పాటలకి మంచి రేట్లూ సంపాదించుకుంటు, చివరికి ‘పద్మభూషణ్’ దగ్గర ఆగాడు. నేనేమో నా పేషెంట్ల గూబల్ని గుయ్యిమనిపిస్తూ వైద్యం చేసుకుంటుంటే తనేమో శ్రోతల చెవుల్లోని కర్ణభేరులకు తన శ్రావ్యమైన గొంతుతో సాంత్వన కలిగించేవాడు.

సింగర్‌గా తొలిరోజుల్లో తను పాడిన సినిమా పాటలు నాలుగైదు మట్టి రికార్డులుగా హెచ్.ఎం.వి. వారు మార్కెట్లోకి వదలగానే వాటిని చూసుకొని మురిసిపోయి, సన్నగా రివటలా ఉన్న మనిషి కాస్తా శారీరకంగా ఉబ్బి, మానసికంగా తబ్బిబ్బైపోయాడు. బాడీ షేమింగ్ చెయ్యడానికి రౌడీమూక రెడీ అవుతుందని ముందే పసిగట్టి, వాళ్ళ కంటే ముందు తన మీద తనే జోకులేసుకోవడం మొదలెట్టాడు. వేదిక మీద ప్రోగ్రామ్స్ చేస్తున్నప్పుడు ‘ఈ భారీకాయాన్ని దొర్లించుకుంటూ రావడంలో మీ కంటే వెనుకబడిపోయాను’ లాంటి జోకులు వేసుకుంటే ఇక అవతల వాళ్ళకేం మిగిలిందని! అందుకనే నేను అతనికి పెట్టిన పేరు ‘జోకులపతి ఫన్‌డితారాధ్యుల శుభ్రహాస్య గోలసుబ్రమణ్యం’.

ఓసారి నాకు ఫోన్ చేసి ‘ఫలానా మన కామన్ ఫ్రెండ్‌కి మీ మున్సిపాలిటీలో ఏదో సర్టిఫికేట్ కావాలట. ఆ ప్రూఫ్‌లేవో పంపుతాడు. నువ్ కాస్త ఫాలోఅప్ చెయ్. మొన్న నేను కచ్చేరీకి వచ్చినప్పుడు ఎవరో వచ్చి కలిశారు. మేయరట. ఆ నంబర్ తెలుసుకుని నాకు పంపించు. నేనూ ఫోన్ చేసి రిక్వెస్ట్ చేస్తాను’ అన్నాడు.

‘మేయరా? నేన్నమ్మను గాక నమ్మను’ అన్నాను. ‘ఏం? నా ఫ్యానై ఉండకూడదా? ఇందులో నమ్మకపోవడానికేముంది?’ అన్నాడు. ‘నా పర్సనల్ అనుభవంతో చెప్తున్నాను, అక్కడ మెజారిటీ వాళ్ళు మేస్తారు మేస్తారు మేస్తారు’.

మణి, నేనూ కలిసి ఎన్నోసార్లు వేదికలెక్కి నాటిక ప్రదర్శనల్లో పాల్గొన్నాం. ఓ సంవత్సరం ఫిల్మ్‌ఫేర్ అవార్డ్స్‌కి మైమ్ ప్రదర్శన. నటి రేవతి యాంకరింగ్. ప్రేక్షకుల్లో టాలీ, కోలీ, బాలీవుడ్ సెలబ్రిటీస్ ఎందరో! కల్పనా అయ్యర్ డాన్స్ మొదలైంది. తర్వాత మా ‘వైద్యోనారాయణో హరీ’ మ్యూజిమైమ్. సైడ్‌వింగ్‌లో మేకప్పులతో రెడీగావున్నాం. అప్పుడు చూసుకుంటే బాలు తెల్లకోటు (ఆప్రన్) మర్చిపోయి వచ్చాడు. అందులో మేమిద్దరం డాక్టర్లం. ఏదో కామెడీగా ఆపరేషన్ చేసే సీను. ఒక్కసారి నాకైతే గుండెల్లో గుదిబండ పడ్డట్టయింది. ‘ఏం వర్రీకాకు. నువ్వు డాక్టర్ పాత్ర కంటిన్యూ చెయ్. నేన్నీ పక్కన కంపౌడర్‌గా మారిపోతాన’ని అప్పటికప్పుడు ప్యాంటు మోకాలు వరకూ మడిచి, చొక్కా పై



బటన్స్ రెండు విప్పేసి రెడీ అయిపోయాడు. ప్రదర్శన బ్రహ్మాండంగా వచ్చింది. అలా మేం తెరవేయగానే వేదిక వెనక్కి వచ్చిన దర్శకుడు బాలచందర్, మణితో ‘నీకొక కథ రెడీ చేసుకోబోతున్నాను. అందులో హీరో నువ్వే. నేను చెప్పినప్పుడు డేట్స్ యివ్వు’ అనేసి వెళ్ళిపోయారు. తర్వాత అది నిజంగానే కార్యరూపం దాల్చి తమిళంలో వసంత్ అనే తన అసిస్టెంట్‌తో దర్శకత్వం చేయించారు బాలచందర్ ‘కేలడి కన్మణి’ (ఇందులోనూ మణి ఉంది గమనించారా). పెద్ద హిట్టయింది.

ఓ ఉదయం తిరుపతి నుంచి మెడ్రాస్ కార్లో వెళ్తూ బోర్ కొట్టి ‘వీడు అర్ధరాత్రీ అపరాత్రీ ఫోన్‌లు చేసి డోకులొచ్చే జోకులేసి విసిగించేస్తుంటాడు కదా ఇప్పుడెతై ఓ.పి.లో పేషెంట్లతో మాంచి బిజీగా ఉంటాడు కదా? దయల్ చేసి యివ్వు కాలెత్తాడంటే అయిపోయాడే’ అని తన పి.ఎ. విఠల్‌తో అన్నాడట. తర్వాతెప్పుడో నాకు చెప్పారు. సరే, ఇక్కడ నా ఫోన్ మోగింది.

‘ఏం చేస్తున్నావ్’ అట్నుంచి మణి గొంతు.

‘ప్రాక్టీస్ చేస్తున్నాను. ఇంకేం చేస్తాను గురూ’ అన్నాను.

‘అదే. ఎన్నో ఏళ్ళ నుండి నిన్నెప్పుడడిగినా ప్రాక్టీస్ అనే అంటావు. మరి పర్‌ఫెక్ట్ అయ్యేదెప్పుడు?

ప్రాక్టీస్ మేక్స్ ఎ మాన్ పర్‌ఫెక్ట్ అంటారు గదా. అంటే నువ్ ప్రాక్టీస్ సరిగ్గా చెయ్యడం లేదన్నమాటేగా. ఇప్పుడు నేను స్నానానుకో పాట ప్రాక్టీస్ చేస్తాను. పర్‌ఫెక్ట్ అయ్యాకే రికార్డింగ్ చేస్తారు. అలా నువ్వూ పెర్‌ఫెక్ట్ అవ్వాలని నా ఆశ’... ఇలా సాగిపోయింది వరుస.

కాసేపు కామెడీ పక్కన బెట్టే మీతో పంచుకోవలసిన మరో గొప్ప విషయాన్ని నా బీరువా అరల్లోంచి బైటికి తీస్తాను. కాకినాడలో నేను ఫైనలియర్ యమ్‌బీబీయస్ చదువుతున్న రోజుల్లో కొవ్వూరు నుంచి ఇక్కడికి వలసొచ్చిన ఓ భారీ నంబరు మెంబర్లున్న ఫ్యామిలీతో పరిచయమైంది. ప్రతి రాత్రీ వాళ్ళొచ్చి నా బేచిలర్ రూమ్‌లో సంగీత సాహిత్య సమలంకృత సద్గోష్ఠి జరుపుతుండేవారు. ఆ అన్నదమ్ముల్లో ఒకాయన కొడుకు వయొలిన్ అద్భుతంగా వాయించేవాడు. అతనికప్పుడు ఇంకా నిక్కర్ల వయసే! అతన్ని సినిమాల్లోకి పంపించాలనే ఉద్దేశంతో ముందొసారి బాలూకి పరిచయం చెయ్యమని నన్నడిగారు. నేనా కుర్రాడ్ని మద్రాస్లో మణి యింటికి తీసుకెళ్తే ఆ రాత్రి రెండు కీర్తనలు వింటే చాలనుకున్న బాలూకి ఇరవై రెండయినా తన్మయత్వం విడలేదు. అతిశయోక్తి కాదనుకుంటే ఆ రాత్రి అదే ఐ మీన్ తెల్లవారు జాము వరకూ రెండొందల రెండయినా అయ్యుంటాయి. చివర్న చేతుల్నిండుగా చప్పట్లుకొట్టి ‘వెరీగ్రేట్. ఎలాంటి చైల్డ్ ప్రాడిజీని తీసుకొచ్చావ్! సంగీత ప్రపంచంలో ఇతనే హైట్స్‌కి వెళ్ళిపోతాడో నేనూహించలేను. గాడ్ బ్లెస్ యు’ అన్నాడు. ఆ కుర్రాడి పేరు – కీరవాణి.

కీరవాణికి ఆస్కారకుడూ, ఆస్కారణ భూతుడైన రాజమౌళి కప్పుడు బహుశా రెండో, మూడో, ఏడో ఏడు.

చాలాసార్లు వేదికల మీద కీరవాణి ప్రసక్తి వచ్చినప్పుడు మణి ‘నా ఫ్రెండ్ దివాకర్ నాకు మొట్టమొదట పరిచయం చేశాడు’ అంటుండేవాడు నేను గర్వపడేలాగ. తీరా ఇవ్వాళ కీరవాణి ఆస్కార్ పట్టుకొచ్చిన వేళకు, ముందే కూసిన కోయిలలా, కంగ్రాట్స్ చెప్పకుండానే, కంగారుపడి, కాయం చాలించి, కాలం చేసి, కీర్తిశేషుడయ్యాడు బాలూ! నాకెంతో ఆప్తుడు, మనందరికీ ఇష్టుడైన మణి / బాలూకి ఈ డెబ్బయ్ ఏడవ జన్మదినాన ఈ భూగోళం ఉన్నంత కాలం బిలియన్స్ అండ్ ట్రిలియన్స్ ఆఫ్ మెమొరబుల్ రిటర్న్స్ ఆఫ్ ది డే.

వ్యాసకర్త ప్రముఖ ఈఎన్‌టీ స్పెషలిస్టు, కాకినాడ
మొబైల్: 94403 40484

(నేడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జయంతి)

అవగాహన పెరగాలి

మానవ రక్తంలోనికి సైతం చేరుకునే స్థాయికి నేడు ప్లాస్టిక్ చేరింది. సముద్రాలు, నదులు, పట్టణాలను ప్లాస్టిక్ కాలుష్యం ముంచెత్తుతోంది. ప్రపంచ పర్యావరణ దినోత్సవం ప్రారంభించి 50 ఏళ్లవుతోంది. ఈ తరుణంలో ఐక్యరాజ్యసమితి ‘ప్లాస్టిక్ కాలుష్యానికి పరిష్కారం’ అనే నినాదంతో ఈ సంవత్సరం పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. 2040 నాటికి 80 శాతానికి ప్లాస్టిక్ కాలుష్య నియంత్రణ లక్ష్యంగా ఏర్పరచుకుంది.

ప్రపంచవ్యాప్తంగా ప్రతీ సంవత్సరం 400 మిలియన్ టన్నుల వరకు ప్లాస్టిక్ ఉత్పత్తి అవుతోందని అంచనా. దీనిలో సగానికిపైగా కేవలం ఒకసారి వినియోగించడానికి మాత్రమే ఉద్దేశించినవి (సింగిల్ యూజ్). దీనిలో కేవలం 10 శాతం మాత్రమే రీసైకిల్ అవుతోంది. మిగిలిన 90 శాతం సింగిల్ యూజ్ ప్లాస్టిక్ రీసైకిల్ చేయని కారణంగా పర్యావరణంలో వ్యర్థంగా మిగిలిపోతోంది.

ప్రతీ సంవత్సరం దాదాపుగా 11 మిలియన్ టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు సముద్రాలలోనికి చేరిపోతున్నాయి. దీని ఫలితంగా 800కిపైగా సముద్ర జీవులు ప్రమాదపుటంచులకు చేరుకుంటాయి. ప్రస్తుతం వినియోగిస్తున్న ప్లాస్టిక్‌లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ప్రమాదకరంగా మారింది. ముందుగా దీనిని నియంత్రించడం, రీసైకిల్ చేయడంపై ప్రభుత్వాలు దృష్టి సారించాలి. ప్లాస్టిక్‌కి ప్రత్యామ్నాయంగా తయారవుతున్న బయో డీగ్రేడబుల్ ప్లాస్టిక్ సంచులను ప్రోత్సహించడం, తయారీ, వినియోగం పెంచడం ఎంతో అవసరం. వీటిని ఉత్పత్తి చేసే సంస్థలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు కల్పించాలి.

ప్లాస్టిక్ కాలుష్యాన్ని నియంత్రించడంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోంది. ఇప్పటికే అనేక పెద్ద పట్టణాలలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ని నిషేధించింది. ముందుగా ప్రజల్లో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించే దిశగా చైతన్య కార్యక్రమాలు చేపట్టాలి. ప్లాస్టిక్‌కి ప్రత్యామ్నాయాలుగా నిలిచే మెటీరియల్ వినియోగం పెంచాలి. వినియోగించిన ప్లాస్టిక్ సంచులు, బాటిళ్లు సరైన విధానంలో రీసైకిల్ చేసే ప్రత్యేక యంత్రాలను విరివిగా అందుబాటులో ఉంచాలి. వీటిని ఏర్పాటు చేయడానికి స్వచ్ఛంద సంస్థలు, పరిశ్రమల సీఎస్ఆర్ నిధులను వెచ్చించే వెసులుబాటు కల్పించాలి. తద్వారా పర్యావరణ అవగాహన పెంచడం, ప్లాస్టిక్ వినియోగం తగ్గించడం ఏకకాలంలో సాధ్యపడతాయి.

– కె. గాయత్రి, పరిశోధకురాలు
పర్యావరణ శాస్త్ర విభాగం, ఆంధ్ర విశ్వవిద్యాలయం

(జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం)

కొడుకు శవాన్ని చేతుల్తో మోశా

ఒడిశా మూడు రైళ్ల ప్రమాదంలో ఎన్నో కన్నీటి కథలు మనసుని పట్టి కుదిపేస్తున్నాయి. ఎప్పటికైనా తనకి తలకొరివి పెడతాడని అనుకున్న కొడుకు శవాన్నే చేతులతో మోయాల్సి రావడం ఆ తండ్రి కన్నీరు మున్నీరవుతున్నాడు. బీహార్‌లో మధువనికి చెందిన లాల్జీ సాగై చెన్నైలో గార్డుగా పని చేస్తున్నాడు. తన ఇద్దరు కుమారులు సుందర్, ఇందర్‌లను కూడా చెన్నైకి తీసుకువెళితే కుటుంబం హాయిగా బతికేయవచ్చునని అనుకున్న ఆ తండ్రి వారిని తీసుకు వెళ్లడానికి సొంతూరుకి వచ్చాడు. అక్కడ్నుంచి కోల్‌కతాకి వచ్చి కోరమండల్ ఎక్స్‌ప్రెస్ ఎక్కారు. రైలు ప్రమాదంలో తండ్రి లాల్జీ , చిన్న కుమారుడు ఇందర్ ప్రాణాలతో మిగిలితే కొడుకు సుందర్, బావమరిది దిలీప్ మృత్యు ఒడికి చేరుకున్నారు. ''కళ్ల ముందే నా కొడుకు గాయాలతో పడిపోయాడు. నా చేతుల్తో మోసుకుంటూ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కి తెచ్చాను. అప్పటికే ప్రాణం పోయిందని డాక్టర్లు చెప్పారు. విధి మా కుటుంబం మీద పగ పట్టింది'' అంటూ పుత్ర శోకంతో కన్నీరుమున్నరవుతున్నాడు.

మొబైల్ ఫ్లాష్ వెలుగులోనే...

కోరమండల్ ఎక్స్‌ప్రెస్ ప్రమాదం గురించి తెలుసుకున్న వెంటనే చుట్టుపక్కలున్న స్థానికులు అందరికంటే ముందుగా ప్రమాద స్థలికి చేరుకున్నారు. చిమ్మ చీకట్లో బోగిల్లోకి వెళ్లడానికి వారు తమ మొబైల్ ఫోన్లలో ఫ్లాష్ లైట్లలోనే సహాయ కార్యక్రమాలు సాగించారు. తమ చేతులతోనే బోగీ అద్దాలు పగులగొట్టి లోపలకి వెళ్లి క్షతగాత్రుల్ని బయటకి తీసినట్టు పూర్ణ చంద్ర మాలిక్ అనే రైతు చెప్పాడు. ''బాధితుల రోదనలు వింటూ ఉంటే మనసు కదిలిపోయింది. వారిని కాపాడడం కోసం నా చేతుల్తో బోగీ అద్దాలు పగుల గొట్టా. లోపల భయంకరమైన దృశ్యం కనిపించింది. కొంతమందికి కాళ్లు, చేతులు తెగిపడి ఉన్నాయి. మరికొందరు రక్తపు మడుగులో పడి ఉన్నారు. కాసేపు అందరం షాక్‌కి లోనయ్యాం. వెంటనే తేరుకొని మాకు చేతనైన సాయం చేశాం. 30 మందిని బయటకు తీసి ఆస్పత్రికి తరలించాం'' పూర్ణ చంద్ర మాలిక్ వివరించారు.

రైలు స్పీడ్‌ను వీడియో తీస్తుండగా...

కోల్‌కతా నుంచి కటక్ వెళ్లడానికి కోరమండల్ ఎక్స్‌ప్రెస్ ఎక్కిన మాణికల్ తివారీ అనే ఒక వ్యాపారి రైల్లో వీడియో తీస్తుండగా ప్రమాదం జరిగింది. అదృష్టవశాత్తూ అతను ప్రాణాలతో బయటపడ్డాడు. రైలు ఎంత స్పీడ్‌గా వెళుతోందో తన కుటుంబ సభ్యులకు చూపించాలన్న ఉత్సాహంతో అతను కిటికీ దగ్గర కూర్చొని వీడియో తియ్యడం మొదలు పెట్టాడు. హఠాత్తుగా బోగి చిమ్మచీకటిగా మారిపోయి పొగతో నిండిపోయింది. ఆయన చేతులు రక్తమోడడం మొదలైంది. ఒక్క క్షణం అతనికి ఏమీ అర్థం కాలేదు. బోగి అంతా పొగతో నిండిపోవడంతో అతను ఎలాగో బయటకి వెళ్లాడు. పట్టాలపై శవాల్ని చూసిన తర్వాత కానీ అతనికి ఎంత ఘోరమైన ప్రమాదం జరిగిందో అర్థం కాలేదు. ''అంతా సెకండ్లలో జరిగిపోయింది. అదృష్టం బాగుండి నేను బతికి బయటపడ్డాను. నా ఎదురుగా యువజంటలో భర్త మరణించాడు. భార్య మిగిలి ఉంది. ఈ రోజు ఒక బ్లాక్ ఫ్రైడే'' అని తివారీ చెప్పారు.

మందుల కోసం డబ్బులు పంపిస్తానని తిరిగిరాని లోకాలకు

అనారోగ్యంతో ఉన్న తండ్రికి మందుల ఖర్చులకి డబ్బులు పంపిస్తానని చెప్పి బయల్దేరిన ఆ యువకుడు తిరిగి రాని లోకాలకు వెళ్లిపోయాడు. బీహార్‌కు చెందిన రాజా పటేల్ (26) అనే యువకుడు ఇతర వలస కూలీలతో కలిసి కేరళ వెళ్లడానికి కోరమండల్ ఎక్స్‌ప్రెస్ ఎక్కి ప్రమాదంలో ప్రాణాలు పోగొట్టుకున్నాడు. రైలు ప్రమాదంలో కొడుకు మరణించాడని తెలిసిన తండ్రి భోలన్ కుప్పకూలిపోయాడు. ఆ కుటుంబానికి పటేల్ సంపాదనే జీవనాధారం. వెన్నుముకకి సంబంధించిన సమస్యతో బాధపడుతున్న తండ్రి భోలన్ ఇంటికే పరిమితమయ్యాడు. దీంతో నెల తిరిగేసరికల్లా కొడుకు పంపే డబ్బుల కోసమే వారు ఎదురు చూస్తుంటారని పొరుగింట్లో ఉన్న అవినాశ్ పాండే చెప్పాడు.

నిద్రలోనే మృత్యుఒడిలోకి..

బాలాసోర్: పెను ప్రమాదం పలు సెకన్లలోనే ముగిసిందని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. అధికారులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం సాయంత్రం 6.50 గంటల నుంచి 7.10 మధ్యకాలంలోనే ఈ ప్రమాదం సంభవించింది. అంటే కొద్దిసేపట్లోనే అంతా ముగిసిందని, ఆ సమయంలో ప్రయాణికులు నిద్రలో ఉన్నట్లు తెలుస్తోంది. ఎక్కువ మంది ప్రయాణికులు నిద్ర మత్తులో ఉంటడంతో అసలేం జరుగుతుందో తెల్సుకునేలోపే అంతా జరిగిపోయిందని, తప్పించుకునే అవధికూడా లేదని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. పట్టాల మధ్య చిక్కుకున్న వారిని కాపాడేందుకు విపత్తు స్పందన దళ సభ్యులు శతథా శ్రమిస్తున్నారు. వీరికి స్థానికులు అండగా నిలిచి తమ వంతు సాయం చేస్తున్నారు. ఇప్పటికే మానవత్వంతో ఎంతో మంది స్థానికులు వయోబేధంతో సంబంధం లేకుండా ఆస్పత్రులకు తరలివచ్చి రక్తదానానికి సిద్ధపడ్డారు. వీరికి నెటిజన్లు సలామ్ కొడుతున్నారు. క్షతగాత్రులు, వారి బంధువులతో ఆస్పత్రులు కిక్కిరిసిపోయాయి.

వేగంపై తప్ప భద్రతపై దృష్టి లేదు

'రైల్వే వ్యవస్థ విస్తరించే కొద్దీ అవసరమైన సంఖ్యలో ఉద్యోగాల భర్తీ జరగాలి. కానీ ప్రస్తుతం రైల్వేలో దాదాపు రెండున్నర లక్షల ఖాళీలున్నాయి. రైళ్లను వేగంగా నడిపేలా విదేశాలతో పోటీ పడుతున్న రైల్వే, అక్కడి వ్యవస్థ తరహాలో ఇక్కడ ఏర్పాటు చేయటంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. గంటకు 130 కి.మీ. వేగంతో రైళ్లు పరుగెత్తాలన్నప్పుడు దిగువ సిమెంటు కాంక్రీట్ ట్రాక్ ఉండాలి, కానీ మన వద్ద నేరుగా నేలపైనే కంకర పరిచి ఏర్పాటు చేస్తున్నారు. అంత వేగాన్ని ఇది తట్టుకోలేదు. వేగం కంటే భద్రత ముఖ్యమన్న విషయాన్ని గుర్తించాలి'

– శంకరరావు, సీనియర్ రైల్వే కార్మిక నేత

ఊహాగానాలొద్దు...

''రైలు ప్రమాదాలు చోటు చేసుకున్నప్పుడు అవి ఎలా జరిగాయనే ఊహాగానాల జోలికి వెళ్లొద్దు. ప్రమాదానికి అసలు కారణాన్ని రైల్వే సేఫ్టీ కమిషనర్ తేలుస్తారు. అందుకు తగ్గ అర్హతలున్న వారే ఆ పోస్టులో ఉంటారు. ప్రమాదాలకు అసలు కారణాలు తేలాకగాని కారణాలను విశ్లేషించలేం. ఆ ప్రమాదం నేపథ్యంలో ఆ అధికారి బృందం కొన్ని సిఫారసులు చేస్తుంది. వాటికి తగ్గ చర్యలు తీసుకోవాలి'' – స్టాన్లీబాబు, మాజీ జీఎం

రక్తదానానికి యువత క్యూ

ఒడిశాలో కనీవినీ ఎరుగని రీతిలో రైలు ప్రమాదం జరిగిన సమయంలో నేటి తరం యువత తమలో మానవత్వం ఉందని నిరూపించారు. క్షతగాత్రులతో కిక్కిరిసిపోయిన బాలసోర్ ప్రభుత్వ ఆస్పత్రికి యువతీ యువకులు క్యూ కట్టారు. బాధితులకి అవసరమైన రక్తం తాము ఇస్తామంటూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. ఒక జిల్లా ఆస్పత్రికి ఒకేసారి 250 మందికి పైగా క్షతగాత్రులు రావడంతో వారికి చికిత్స ఎలా అందించాలో తెలీక సిబ్బంది తీవ్ర గందరగోళానికి గురయ్యారు. అప్పటికే రైలు ప్రమాదం గురించి తెలుసుకున్న స్థానిక యువత ఆస్పత్రికి వచ్చి తమ వంతు ఏదైనా చేస్తామన్నారు. ఈ విషయాన్ని జిల్లా అదనపు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మృత్యుంజయ్ మిశ్రా చెప్పారు. ''నేను గత కొన్ని దశాబ్దాలుగా ఈ వృత్తిలో ఉన్నాను. ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ ఎదుర్కోలేదు. ఒకేసారి వందల మంది క్షతగాత్రులకి చికిత్స అందించడం చాలా కష్టంగా మారింది. అదే సమయంలో పెద్ద సంఖ్యలో ఆస్పత్రికి రక్తదానం చేయడానికి రావడం సంభ్రమాశ్చర్యాల్ని కలిగించింది. రాత్రంతా 500 యూనిట్ల రక్తాన్ని సేకరించాం. రక్తం ఇచ్చిన యువతకి ధన్యవాదాలు '' అని డాక్టర్ వివరించారు.





ప్రమాదస్థలిలో సహాయక బృందంతో మాట్లాడుతున్న ప్రధాని మోదీ



బాలాసోర్ ఆస్పత్రిలో పరామర్శిస్తున్న పట్నాయక్



ఘటనాస్థలిలో మమతా బెనర్జీ

కారకులపై కఠిన చర్యలు

- ఎవరినీ వదిలిపెట్టేది లేదు: మోదీ
- ఘటనాస్థలిని స్వయంగా పరిశీలించిన ప్రధాని
- ఆస్పత్రిలో బాధితులకు పరామర్శ

బాలాసోర్: దారుణ రైలు ఘటనకు కారకులుగా ఎవరైనా తేలితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రధాని మోదీ ప్రకటించారు. రైలు ప్రమాదం విషయం తెల్సి శనివారం మోదీ వెంటనే ఘటనాస్థలికి పయనమయ్యారు. రైల్వే మంత్రి అశ్వనీ వైష్ణవ్, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మోదీ వెంట వచ్చారు. భారత వాయుసేన హెలికాప్టర్‌లో మొదట ఘటనాస్థలికి చేరుకున్న మోదీ స్వయంగా అక్కడి సహాయక చర్యలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. ' ఈ అంశాన్ని ప్రభుత్వం చాలా సీరియస్‌గా తీసుకుంటుంది. ఘటనపై వేగవంతమైన, సమగ్ర దర్యాప్తునకు ఆదేశించాను. దుర్ఘటనకు కారకులుగా ఎవరైనా తేలితే వారిపై కఠినాతికఠిన చర్యలుంటాయి. ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదు. క్షతగాత్రులకు అత్యుత్తమమైన చికిత్స, వైద్య సదుపాయాలు సమకూరుస్తాం. రాత్రి చిమ్మచీకట్లోనూ అలుపెరగకుండా ప్రమాద బాధితులను కాపాడుతూ వారికి సాయపడుతున్న స్థానికులకు నిజంగా నా కృతజ్ఞతలు. వేగంగా సహాయక చర్యల్లో నిమగ్నమైన ఒడిశా రాష్ట్ర సర్కార్ పనితీరు భేష్. మాటలకందని మహా విషాదమిది. ఈ ఘోరంపై ఎలా స్పందించాలో మాటలు రావట్లేదు. ఇంతటి విషాదం నుంచి తేరుకునేలా బాధితులకు స్థైర్యం ప్రసాదించాలని ఆ భగవంతుడిని వేడుకుంటున్నా' అని ఆవేదనతో మాట్లాడారు.

అత్యుత్తమ వైద్యం.. సత్వర సాయం


ఘటనాస్థలం నుంచే మోదీ కేబినెట్ కార్యదర్శి రాజీవ్ గౌబా, కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయలతో మొబైల్‌లో మాట్లాడారు. క్షతగాత్రులకు సత్వర సాయం అందించాలని సంబంధిత అధికారులకు మౌఖిక ఆదేశాలు ఇచ్చారు. తర్వాత ఆయన బాలాసోర్ జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెల్సుకున్నారు. మీకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ' ప్రమాదంలో కోల్పోయిన వారిని మళ్లీ వెనక్కి తీసుకురాలేం. కానీ బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తుంది. మృతులు, గాయపడిన కుటుంబాలకు ఎలాంటి అసౌకర్యం కల్గకుండా తగిన ఏర్పాట్లు చేయండి' అధికారులకు సూచించారు. 'ఇలాంటి దుర్ఘటనలు దేశానికి గుణపాఠం. ప్రయాణికుల భద్రతకు మరింత మెరుగైన చర్యలు చేపడతాం' అని అన్నారు. పట్టాలు చెల్లాచెదురుగా పడటంతో రైలుమార్గంలో తూర్పు ఇండియాను దక్షిణ భారతాన్ని కలిపే హౌరా–చెన్నై మెయిన్ లైన్ దెబ్బతింది. దీంతో ఈ మార్గంలో పలు రైళ్ల రాకపోకలు రద్దయ్యాయి. ఈ నేపథ్యంలో పట్టాల పునరుద్ధరణ తదితర పనుల గురించీ ప్రధాని ఆరాతీశారు. ఢిల్లీలో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో మోదీ పాల్గొన్నారు. రైల్వే శాఖ అధికారులు ప్రమాదం తీరు, ప్రమాదానికి కారణాలుగా భావిస్తున్న అంశాలను వివరిస్తూ ఒక పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌ను మోదీకి చూపించారు.

శతాబ్దంలోనే అతిపెద్ద ప్రమాదం: మమతా బెనర్జీ


కోల్‌కతా: ఒడిశా రైలు ప్రమాద ఘటన ఈ శతాబ్దంలో జరిగిన అతిపెద్ద ప్రమాదాల్లో ఒకటని పశ్చిమ బెంగాల్ సీఎం మమత అన్నారు. '1985లో బిహార్‌లో పెద్ద ప్రమాదం చోటుచేసుకుంది. ఆ ఘటనకు మావోయిస్టులే కారణం. ఆ ప్రమాదంపై దర్యాప్తు బాధ్యతలను సీఐడీకి అప్పగించారు. దురదృష్టవశాత్తూ నివేదిక ఇప్పటికీ బయటకురాలేదు'అని చెప్పారు. శనివారం ఆమె కోల్‌కతాలో మీడియాతో మాట్లాడారు. 'ఒడిశా ప్రమాద ఘటనకు ఏదో ఒక కారణం ఉండే ఉంటుంది. అదేమిటో వెల్లడి కావాలి'అని ఆమె డిమాండ్ చేశారు. ప్రమాదంలో మరణించిన తమ రాష్ట్రానికి చెందిన మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున సాయం అందజేస్తామన్నారు. ప్రమాద బాధితులకు సాయం అందించేందుకు 40 అంబులెన్సులను, 40 మంది వైద్యులు, నర్సులను బాలాసోర్‌కు పంపించామన్నారు. ప్రమాద ప్రాంతాన్ని మమత సందర్శించారు. అక్కడ ఉన్న రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్, సీనియర్ అధికారులతో ఆమె మాట్లాడారు.


ఒడిశా ఘటన భయానకం

- ప్రమాదంపై ప్రధానిని, రైల్వే మంత్రిని చాలా ప్రశ్నలు అడగాలి
- సహాయక చర్యలు పూర్తయ్యే వరకు వేచి చూస్తాం: కాంగ్రెస్ చీఫ్ ఖర్గే



న్యూఢిల్లీ: ఒడిశా రైలు ప్రమాదాన్ని భయానకమైందిగా కాంగ్రెస్ పార్టీ అభివర్ణించింది. ప్రయాణికుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలనే విషయం ఈ ఘటనతో మరోసారి రుజువైందని ఆ పార్టీ చీఫ్ ఖర్గే పేర్కొన్నారు. ఒడిశా ఘటనకు సంబంధించి ప్రధాని మోదీని, రైల్వే మంత్రిని చాలా ప్రశ్నలు అడగాల్సి ఉందన్న ఆయన.. బాధితుల తక్షణ రక్షణ, సహాయక చర్యలు పూర్తయ్యేదాకా వేచి చూస్తామని చెప్పారు. లోక్‌సభలో పార్టీ నేత అధిర్ రంజన్ చౌధురి, ఏఐసీసీ ఒడిశా ఇన్‌ఛార్జి ఎ.చెల్లా కుమార్‌ను హుటాహుటిన సంఘటన స్థలిని సందర్శించి, పరిస్థితులను సమీక్షించాలని పురమాయించారు. పార్టీకి చెందిన వివిధ విభాగాలు చేపట్టే సహాయక కార్యక్రమాలను పర్యవేక్షించాలన్నారని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) కేసీ వేణుగోపాల్ చెప్పారు. 'ఈ ఘటనకు బాధ్యత ఎవరిది? అని ప్రధానిని, రైల్వే మంత్రిని ప్రశ్నిస్తున్నా. భద్రత గురించి ఎప్పుడూ మనం మాట్లాడుకుంటూనే ఉంటాం. అయినప్పటికీ, రైల్వే శాఖ చరిత్రలోనే ఎన్నడూ జరగనంతటి ఘోరం చోటుచేసుకుంది'అని ఖర్గే ఆవేదన వ్యక్తం చేశారు. ఒడిశా రైలు ఘటన అత్యంత బాధాకరమని కాంగ్రెస్ మాజీ చీఫ్ సోనియా గాంధీ పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాంరమేశ్ ఘటనపై ఆవేదన వ్యక్తం చేశారు. ఒడిశాకు చెందిన కాంగ్రెస్ ఎంపీ సప్తగిరి ఉలక తదితర నేతలు రైల్వే మంత్రి వైష్ణవ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధ్యక్షుడి కార్యాలయం సమన్వయకర్త గుర్దీప్ సప్పాల్ మాట్లాడుతూ..''ఇలాంటి సమయాల్లో సంబంధిత మంత్రి రాజీనామా చేయడం నైతికత మాత్రమే కాదు, అధికారంలో ఉన్నవారు, ప్రమాదానికి బాధ్యతవహించే స్థానంలో ఉన్న ప్రభావం 'ఉన్నత స్థాయి విచారణ'పై చూపకుండా ఉండటానికి కూడా ఒక సాధనం'అని పేర్కొన్నారు.





స్వల్ప పేలుడు సంభవించిందా?

ట్రాక్‌లో చీలికలు, ధ్వంసం కావడంపై సందేహాలు

సాక్షి, విశాఖపట్నం: సిగ్నలింగ్ వ్యవస్థలో లోపం వల్లనే ఘోర ప్రమాదం సంభవించిందని రైల్వే జాయింట్ యాక్షన్ బృందం ప్రాథమిక నిర్ధారణకు వచ్చింది. ఇతర కోణాల్లోనూ అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. ప్రమాదం జరిగిన ప్రాంతంలో రైల్వే ట్రాక్ పూర్తిగా ధ్వంసమైంది. ట్రాక్ తునాతునకలైంది. మరి కొంత ప్రాంతంలో ఉక్కు ట్రాక్‌లో చీలికలు వచ్చాయి. వీటిని పరిశీలించిన అధికారులు ప్రమాదం జరిగిన వెంటనే ఏదైనా స్వల్ప పేలుడు సంభవించిందా అనే కోణంలోనూ విచారణ చేపట్టారు. ఏదైనా పేలుడు జరిగినప్పుడు మాత్రమే ట్రాక్ ఇలా ధ్వంసమై చీలికలుగా మారుతుందని అనుమానాలు వ్యక్తమవుతుండగా అందుకు సంబంధించిన ఆధారాలను సేకరిస్తున్నారు. అయితే, 128 కిలోమీటర్ల వేగంతో దూసుకొస్తున్న సమయంలో ప్రమాదం జరిగినప్పుడు ట్రాక్‌కు, వ్యాగన్ వీల్స్‌కు రాపిడి జరిగి.. అత్యధిక ఉష్ణోగ్రత వెలువడుతుందని, దీనివల్లే వీల్స్ ట్రాక్‌ని చీల్చేస్తాయని రైల్వే నిపుణులు చెబుతున్నారు. ఈ కారణంగానే పట్టాలు ధ్వంసమై ఉండొచ్చని భావిస్తున్నారు. ఏదిఏమైనప్పటికీ ప్రమాదంపై పూర్తిస్థాయిలో అన్ని కోణాల్లో విచారణ జరిపి వీలైనంత త్వరలో నివేదిక అందించాలని అధికారులకు రైల్వే శాఖ ఆదేశాలు జారీ చేసింది.

మార్చురీగా మారిన పాఠశాల భవనం

భావి భారత పౌరుల్ని తీర్చిదిద్దే ఒక పాఠశాల శవాగారంగా మారింది. రైలు ప్రమాదం జరిగిన ప్రాంతానికి కూత వేటు దూరంలో ఉన్న ఒక హైస్కూలుని అధికారులు తాత్కాలిక మార్చురీగా మార్చారు. రైలు పట్టాల కింద నుంచి గుట్టలు గుట్టలుగా మృతదేహాలు బయట పడుతూ ఉండడంతో వాటిని అక్కడికి 300 మీటర్ల దూరంలో ఉన్న ఒక స్కూలుకి తరలించారు. విద్యార్థులకి వేసవి సెలవులు కావడంతో పాఠశాలలో తరగతి గదులు, హాలులో బంధువులు గుర్తించడానికి వీలుగా మృతదేహాలను భద్రపరిచారు. ఆ స్కూలుకి ఏసీ సౌకర్యం లేకపోవడంతో తాత్కాలికంగానే అక్కడికి తరలించామని రైల్వే అధికారులు వెల్లడించారు.

ప్రపంచ నేతల దిగ్భ్రాంతి

లండన్/మాస్కో: దుర్ఘటనకు పలు ప్రపంచదేశాల నేతలు ప్రగాఢ సానుభూతి వ్యక్తంచేశారు. ఈ విషాద సమయంలో భారత్‌కు అండగా నిలుస్తామని భరోసానిస్తూ సంతాప సందేశాలు పంపారు. రష్యా అధ్యక్షుడు పుతిన్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయెల్ మాక్రాన్, బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ తదితరులు తమ ప్రగాఢ సానుభూతి వ్యక్తపరిచారు. 'మృతుల కుటుంబాల బాధను మేమూ పంచుకుంటాం. గాయాలపాలైన ప్రయాణికులు త్వరగా కోలుకోవాలని మేం కోరుకుంటున్నాం' అని టెలిగ్రామ్ ద్వారా ప్రధాని మోదీకి రష్యా అధ్యక్షుడు పుతిన్ ఒక సందేశం పంపారు. 'విషాదంలో మునిగిన వారు, ప్రధాని మోదీ తరఫున మేం ప్రార్థనలు చేస్తున్నాం' అంటూ రిషి సునాక్ ఒక ట్వీట్‌చేశారు. 'ఒడిశా ప్రమాద ఘటనలో భారత్‌కు సంఘీభావంగా నిలుస్తున్నాం' అని మాక్రాన్ ట్వీట్‌చేశారు. ప్రమాదంలో ఇంతటి ప్రాణనష్టం జరగడంపై చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. జపాన్ ప్రధాని కిషిదా, కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో, నేపాల్ ప్రధాని పుష్ప కమల్ దహాల్ (ప్రచండ) , పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, శ్రీలంక విదేశాంగ మంత్రి, భూటాన్ ప్రధాని షెరింగ్, ఇటలీ ప్రభుత్వం, ఐక్యరాజ్యసమితి సర్వసభ్యసభ అధ్యక్షుడు కసాబా కొరోసో, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తమ సానుభూతి సందేశాలు పంపించారు.

మృత్యు శకటాలు..

ఒడిశా రైలు ప్రమాదం దేశాన్ని దిగ్భ్రాంతికి గురి చేసింది. కోరమాండల్, హౌరా రైళ్ల ప్రమాద దృశ్యాలు భారతీయుల హృదయాలను కలచివేస్తున్నాయి. మన దేశంలో 1981లో బిహార్‌లో భాగమతి నదిలో పడిపోయిన రైలు ప్రమాదం ఇప్పటి వరకు అతి పెద్దది. ఈ ప్రమాదంలో 800 మందికిపైగా మరణించారు. అత్యంత ఘోరమైన రైలు ప్రమాదాలు ఇప్పటికీ మనల్ని భయపెడుతూనే ఉన్నాయి.

మన దేశ చరిత్రలో...

1. పాసింజర్ రైలు

రాష్ట్రం : బీహార్
తేదీ : జూన్ 6, 1981
మృతుల సంఖ్య : 800

దేశంలో అతి పెద్దదే కాకుండా ప్రపంచంలో రెండో అతి పెద్ద రైలు ప్రమాదం ఇది. 1981 సంవత్సరం జూన్ 6న బీహార్‌లోని మన్సి నుంచి సహార్సకు వెళుతున్న పాసింజర్ రైలు భాగమతి నది వంతెనపై నుంచి వెళుతుండగా పట్టాలు తప్పి నదిలో పడిపోయింది. ఈ ప్రమాదంలో 800 మందికి పైగా మరణించారు. భయానకమైన తుఫాన్ బీహార్‌ను వణికిస్తున్న సమయంలో రైలులో పరిమితికి మించి ప్రయాణికులు ఎక్కడంతో ప్రమాదం జరిగినట్టు తేలింది. నదిలో శవాలు కొట్టుకుపోవడంతో మృతుల సంఖ్యపై భిన్నకథనాలు వెలువడ్డాయి. మృతుల సంఖ్య 2 వేల వరకు ఉండవచ్చునని కూడా వార్తలు వచ్చాయి. నాలుగు పెళ్లి బృందాలు రైల్లో ఎక్కితే ఒక్కరి ప్రాణం కూడా మిగల్లేదు.

2 కాళింది–పురుషోత్తం ఎక్స్‌ప్రెస్

రాష్ట్రం : ఉత్తరప్రదేశ్
తేదీ : ఆగస్టు 20, 1995
మృతుల సంఖ్య : 350కి పైగా

ఉత్తరప్రదేశ్‌లోని ఫిరోజాబాద్‌లో రెండు రైళ్లు ఢీకొన్న దుర్ఘటనలో 350 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. 1995 సంవత్సరం ఆగస్టు 20 తెల్లవారుజామును 3 గంటల ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగింది. కాన్పూర్ నుంచి లక్నోకి వెళుతున్న ఈ రైలు నీల్‌గాయ్ సమీపంలో బ్రేకులు ఫెయిల్ కావడంతో నిలిచింది. పూరీ నుంచి వస్తున్న పురుషోత్తమ్ ఎక్స్‌ప్రెస్ ఆగి ఉన్న కాళిందిని ఢీకొనడంతో ప్రమాదం సంభవించింది.

3. అవధ్ ఎక్స్‌ప్రెస్–బ్రహ్మపుత్ర మెయిల్

రాష్ట్రం : పశ్చిమ బెంగాల్
తేదీ : ఆగస్టు 2, 1999
మృతుల సంఖ్య : 300

పశ్చిమ బెంగాల్‌లోని మారుమూల ఉండే గైసాల్ స్టేషన్‌లో ఈ ప్రమాదం జరిగింది. న్యూఢిల్లీ నుంచి వస్తున్న అస్సాం అవధ్ ఎక్స్‌ప్రెస్, గైసాల్ రైల్వే స్టేషన్‌లో ఉన్న బ్రహ్మపుత్ర మెయిల్‌ని ఢీకొట్టడంతో 300 మంది వరకు ప్రాణాలు కోల్పోయారు. సిగ్నలింగ్ వ్యవస్థలో లోపాలతో ఒకే లైన్‌లోకి రెండు రైళ్లు రావడంతో ప్రమాదం జరిగింది

4. ఇండోర్–పట్నా ఎక్స్‌ప్రెస్

రాష్ట్రం : ఉత్తరప్రదేశ్
తేదీ : నవంబర్ 20, 2017
మృతుల సంఖ్య : 150

మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ నుంచి బీహార్‌లో పట్నా వరకు వెళుతున్న ఇండోర్ పాట్నా ఎక్స్‌ప్రెస్ కాన్పూర్ వద్ద పట్టాలు తప్పింది. ఈ ఘటనలో 150 మందికిపైగా మరణించారు.

5. డెల్టా ప్యాసింజర్

రాష్ట్రం : ఆంధ్రప్రదేశ్
తేదీ : అక్టోబర్ 29, 2005
మృతుల సంఖ్య : 120

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని నల్లగొండ జిల్లా వలిగొండ వద్ద సంభవించిన భారీ వరదలకు పట్టాలు కొట్టుకుపోవడంతో డెల్టా పాసింజర్ పట్టాలు తప్పింది. రైలులో 15 బోగీలు నీట మునిగాయి. ఈ ప్రమాదంలో 120 మంది వరకు జలసమాధి అయ్యారు.

ప్రపంచ చరిత్రలో..

మాటలకందని మహా విషాదాలన్నో ప్రపంచ రైల్వే చరిత్రలో కన్నీటిని మిగిల్చాయి. 2004లో వచ్చిన సునామీ రాకాసి అలలు ఒక రైలునే ఏకంగా సముద్రంలో కలిపేయడం అత్యంత ఘోరమైన ప్రమాదంగా నిలిచిపోయింది. ఈ ప్రమాదంలో 1700 మంది జలసమాధి అయ్యారు.

క్వీన్ ఆఫ్ ది సీ : శ్రీలంక

ఏడాది: 2004
మృతులు: 1700

ప్రపంచ రైల్వే చరిత్రలోనే అత్యంత ఘోరమైన రైలు ప్రమాదం 2004లో సునామీ వచ్చినప్పుడు శ్రీలంకలో జరిగింది. ది క్వీన్ ఆఫ్ సీ రైలు శ్రీలంక టెల్వాట్ట మీదుగా ప్రయాణిస్తున్న సమయంలో సముద్రం అలలు ముంచేసి రైలు బోగీలను సముద్రంలోకి ఈడ్చుకెళ్లాయి. ఈ ప్రమాదంలో ఏకంగా 1700 మంది ప్రాణాలు కోల్పోయారు.

సెయింట్ మిషెల్: ఫ్రాన్స్

ఏడాది : 1917
మృతులు: 700

ఫ్రాన్స్ రైల్వే చరిత్రలో అత్యంత ఘోరమైన ప్రమాదం 1917లో జరిగింది. సెయింట్ మిషెల్–డి–మారిెనె ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పడంతో 700 మంది ప్రాణాలు కోల్పోయారు. బ్రేక్‌లు ఫెయిల్ కావడంతో ఫ్రాన్స్‌లోని ఈ రైలు సెయింట్ మిషెల్ దగ్గర పట్టాలు తప్పింది.

సియారా : రుమేనియా

ఏడాది : 1917
మృతులు : 600

ఒకే ఏడాది ఫ్రాన్స్, రుమేనియాలో ఒకే విధంగా రైలు ప్రమాదాలు జరగడం అప్పట్లో సంచలనం సృష్టించింది. అతి వేగంగా వస్తున్న రుమేనియాలో రైలు సియారా రైల్వే స్టేషన్ సమీపంలో బ్రేక్ ఫెయిల్ కావడంతో పట్టాలు తప్పింది. అప్పుడు రైల్లో ఎక్కువగా సైనికులు, జర్మనీ శరణార్థులు ఉన్నారు. 800 మంది ప్రాణాలు కోల్పోయారు.

గౌదలాజర ట్రైన్ : మెక్సికో

ఏడాది : 1915
మృతులు : 600

మెక్సికోలో 2015 జనవరిలో గౌడలాజర రైలు మితిమీరిన వేగంతో వెళుతుండగా పట్టాలు తప్పింది. కొలిమా నుంచి గౌడలాజర వెళుతుండగా రైలు బ్రేకులు ఫెయిల్ కావడంతో పట్టాలు తప్పిన రైలు పక్కనే ఉన్న లోయలో పడిపోవడంతో 600 మంది మరణించారు.

ఉఫా : రష్యా

ఏడాది : 1989
మృతులు : 575

రష్యాలోని ఉఫా నుంచి ఆషా మధ్య రెండు పాసింజర్ రైళ్లు పక్క పక్క నుంచి వెళుతుండగా గ్యాస్ పైప్‌లైన్ పగిలిపోయి మంటలు చెలరేగాయి. క్షణాల్లో బోగీలకు అంటుకోవడంతో 575 మంది ప్రాణాలు కోల్పోయారు.

వార్‌జోన్‌ను తలపించిన ప్రమాద స్థలం..

ఎవరో కోపంతో బలంగా విసిరినట్టు ఒకదాని మీద ఒకటి పడ్డ రైలు బోగీలు..
గ్యాస్‌కట్టర్లతో అడ్డువచ్చిన చువ్వలను కట్ చేస్తున్న సహాయక సిబ్బంది..
స్ట్రెచర్స్ పట్టుకుని వైద్య సిబ్బంది ఉరుకులు, పరుగులు..
బాధితుల హాహాకారాలు.. ఆత్మీయులు, బంధువులు కనబడక ప్రయాణికుల అరుపులు కేకలు..
అంబులెన్సుల సైరన్ మోతలు, పోలీసుల విజిల్స్ చప్పుళ్లు..
రైలు ప్రమాదం జరిగిన చోట కనిపించిన విషాద దృశ్యమిది...

బాలాసోర్/హౌరా: మూడు రైలు ప్రమాదాల బాధితుల సహాయార్థం 200 అంబులెన్సులు, పదుల సంఖ్యలో రాష్ట్ర ప్రభుత్వ బస్సులు, వివిధ జిల్లాల నుంచి వచ్చిన మొబైల్ హెల్త్ యూనిట్స్ మోహరించారు. 1,200 మంది అగ్నిమాపక, విపత్తుల నిర్వహణ సిబ్బంది అలుపు లేకుండా విధులు నిర్వహిస్తున్నారు. ఒకబోగీపై మరో బోగీ పడటంతో భూమిలోకి కూరుకుపోయిన బోగీలను తీసేందుకు క్రేన్స్, బుల్డోజర్స్ ఏర్పాటు చేశారు. కానీ ఆ భారీ కోచ్‌లను తొలగించడానికి అవి పనికి రాలేదు. కోల్‌కతా నుంచి ప్రత్యేక క్రేన్లు తెప్పిస్తే తప్ప.. పైన పడ్డ బోగీలను తీయలేమని, అప్పుడే కింది వాగన్లను తొలగించడానికి వీలవుతుందని సిబ్బంది తెలిపారు. 'బోగీలు నేలకు అతుక్కుపోయాయి. ఒకదానితో ఒకటి పెనవేసుకుపోయి గుర్తించలేనంత వికృతంగా శవాలు మారిపోయాయి. వర్ణించలేనంత భయంకరంగా అక్కడి దృశ్యాలున్నాయి' అని ప్రయాణికుల్లో ఒకరు మీడియాతో పంచుకున్నారు.

కంపార్ట్‌మెంట్ నుంచి విసిరేసినట్టుగా..

'రైల్వే ట్రాక్స్ పూర్తిగా ధ్వంసమయ్యాయి. నుజ్జునుజ్జయిన బోగీలు చెల్లా చెదురుగా పడిపోయాయి. కొన్ని ఒకదాని మీదకు ఒకటి ఎక్కాయి. కొన్నయితే.. తాబేలు తరహాలో నేలకు అతుక్కుపోయాయి' అని పశ్చిమబెంగాల్ రాష్ట్రంలోని ముర్షీదాబాద్ జిల్లాకు చెందిన బ్రెహంపూర్ వాసి పీయూష్ పోద్దార్ వివరించారు. ఆయన ఉద్యోగం కోసం కోరమండల్ ఎక్స్‌ప్రెస్‌లో తమిళనాడు వెళ్తుండగా ప్రమాదం జరిగింది. 'ఉన్నట్టుండి రైలు పట్టాలు తప్పడంతో బోగీ ఒకవైపు పడిపోయింది. చాలా మందిమి కంపార్టుమెంట్ బయట విసిరేసినట్టుగా పడ్డాం. ప్రమాదం నుంచి ఎలాగోలా పాక్కుంటూ బయటికి వచ్చేసరికే ఎక్కడ చూసినా శవాలే కనిపించాయి' అని పోద్దార్ తెలిపారు. అదృష్టవశాత్తూ పోద్దార్ ఫోన్ సురక్షితంగా ఉండటంతో బంధువులకు ఫోన్ చేశాడు. చిన్న చిన్న గాయాలతో బయట పడ్డ ఆయన.. ముందు ఇంటికి చేరుకుని, ఆ తరువాతే చికిత్స చేయించుకుంటానంటున్నాడు.

స్థానికుల సహాయం..

''పెద్దపెద్దగా అరుపులు వినిపించడంతో ఘటన జరిగిన స్థలానికి చేరుకున్నాం. రైలు పట్టాలు తప్పి, బోగీలు పక్కకు పడి కనిపించాయి. బోగీలు నుజ్జయిపోయి ఇనుము కుప్పగా కనబడింది'' అని ఆ పక్కనే నిర్మాణ పనుల్లో ఉన్న కార్మికులు తెలిపారు. వెంటనే.. బాధితులను బయటికి లాగడం, మంచి నీటిని అందించడం, రక్తం కారుతున్నవారికి బ్యాండేజ్ కట్టడం వంటి సాయం చేశామని కన్‌స్ట్రక్షన్ సైట్‌లో పనిచేస్తున్న 45 ఏళ్ల ఫోర్‌మెన్ దీపక్ బేరా తెలిపారు.

యుద్ధ వాతావరణం..

క్షతగాత్రులను బాలాసోర్, సోరో, భద్రక్, జాజ్‌పూర్, కటక్‌లోని ఎస్‌సీబీ మెడికల్‌కాలేజీ ఆస్పత్రులకు తరలించారు. ప్రమాద జరిగిన చోట సహాయక చర్యల్లో పాల్గొనేందుకు భువనేశ్వర్ ఎయిమ్స్ డాక్టర్ల బృందాలను బాలాసోర్, కటక్ ఆస్పత్రులకు పంపించామని కేంద్ర ఆరోగ్య మంత్రి మన్సుఖ్ మాండవీయ తెలిపారు. బాధితుల విలువైన ప్రాణాలను కాపాడేందుకు వైద్య సిబ్బంది కృషి చేస్తున్నారని, అందుకు అవసరమైన సహాయ సహకారాలను తాము అందిస్తున్నామని ఆయన వెల్లడించారు. బెడ్లు, స్ట్రెచర్లు, ఆస్పత్రి కారిడార్లు.. ఎక్కడ చూసినా గాయాలతో రక్తమోడుతున్న బాధితులతో బాలాసోర్ జిల్లా ఆస్పత్రి మొత్తం వార్‌జోన్‌ను తలపించింది. ఈ ఒక్క ఆస్పత్రిలోనే 526 మందిని చేర్చారు. బాధితులంతా పలు రాష్ట్రాలకు చెందినవారు కావడంతో భాషాపరమైన సమస్యలతో ఇబ్బంది పడుతూనే వైద్య సిబ్బంది చికిత్స అందించారు.

శవాల గుట్టలతో...

ప్రమాదం కారణంగా అనేక రైళ్లు రద్దవ్వడం, కొన్ని రైళ్లు దారి మళ్లించడంతో బాధితుల బంధువులు ఘటనా స్థలానికి చేరుకోవడానికి ఆలస్యమవుతోంది. దీంతో మృతదేహాల గుర్తింపు ఇంకా పూర్తి కాలేదు. తెల్లటి వస్త్రాలు చుట్టిన శవాల గుట్టలతో ఆస్పత్రి ఆవరణ నిండిపోయింది.



భీతావహంగా కనిపిస్తున్న ప్రమాద స్థలి

మృతులు 300కు చేరువలో...

దేశాన్ని కుదిపేసిన ఒడిశా మూడు రైళ్ల ప్రమాదం

- 1,175 దాటిన క్షతగాత్రులు
- ఘటనా స్థలికి మోదీ, మమత, నవీన్

న్యూఢిల్లీ/భువనేశ్వర్: ఒడిశా మూడు రైళ్ల ప్రమాదం దేశమంతటినీ తీవ్ర విషాదంలో ముంచేసింది. శుక్రవారం షాలిమార్ నుంచి చెన్నై వెళ్తున్న కోరమండల్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రాత్రి ఏడింటి ప్రాంతంలో బహనగా రైల్వేస్టేషన్ సమీపంలో మెయిన్ ట్రాక్ నుంచి లూప్ లైన్లోకి వెళ్లడం, దానిపై ఆగి ఉన్న గూడ్స్‌ను గంటకు 128 కి.మీ. వేగంతో ఢీకొనడం తెలిసిందే. దాని బోగీలు పక్క ట్రాక్‌పై పడటం, అదే సమయంలో దానిపై బెంగళూరు నుంచి హౌరా వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ వాటిని ఢీకొని పట్టాలు తప్పడం తెలిసిందే. ఈ ఘోర ప్రమాదంలో 70 మందికి పైగా మరణించినట్టు తొలుత భావించినా మృతుల సంఖ్య భారీగా పెరిగింది. చిక్కుకుపోయిన బోగీలను విడదీస్తూ గాలింపు కొనసాగిన కొద్దీ శవాలు భారీగా బయట పడుతూ వచ్చాయి. 288 మంది మరణించినట్టు ఇప్పటిదాకా తేలింది. 1,175 మందికి పైగా గాయపడ్డారు. వారందరినీ సమీపంలోని పలు ఆస్పత్రుల్లో చేర్చారు. వీరిలో 700 మందికి పైగా డిశ్చార్జి కాగా మిగతా వారు ఇంకా చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో మృతుల సంఖ్య మరికాస్త పెరిగేలా కన్పిస్తోంది. ప్రమాద సమయంలో రెండు రైళ్లలో కలిపి రిజర్వ్‌డ్ ప్రయాణికులే 2,400 మంది దాకా ఉన్నారు. వీరు గాక జనరల్ బోగీల్లో భారీ సంఖ్యలో ప్రయాణిస్తున్నారు. అంతా కలిపి 3,000 మందికి పైగా ఉంటారని చెబుతున్నారు. ప్రమాదానికి సిగ్నల్ వైఫల్యమే ప్రధాన కారణమని రైల్వే శాఖ ప్రాథమిక విచారణలో తేలింది. సమగ్ర దర్యాప్తు కోసం ఉన్నత స్థాయి బృందాన్ని ఏర్పాటు చేశారు. ఘటనా స్థలిని ప్రధాని నరేంద్ర మోదీ శనివారం సందర్శించారు. ఆస్పత్రిలో క్షతగాత్రులను పరామర్శించారు. ఘటనకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. మృతుల కుటుంబాలకు మరో రూ.2 లక్షలు, క్షతగాత్రులకు రూ.50 వేల చొప్పున అదనపు పరిహారాన్ని ఈ సందర్భంగా ఆయన ప్రకటించారు. రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఆయన వెంట ఉన్నారు. ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌తో పాటు పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ కూడా ప్రమాద స్థలాన్ని సందర్శించారు. అంతకుముందు ఈ ఉదంతంపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా, రైల్వేతో సహా పలు శాఖ ఉన్నతాధికారులతో మోదీ ఢిల్లీలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ప్రమాదం జరిగిన తీరును అధికారులు ఆయనకు వివరించారు. ప్రమాద స్థలి నుంచి బాధితుల తరలింపు దాదాపుగా పూర్తయింది. సహాయక చర్యల్లో ఎన్డీఆర్ఎఫ్‌తో పాటు వేలాది మంది సిబ్బంది శ్రమిస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించి మోదీ, రైల్వే మంత్రి బదులివ్వాల్సిన ప్రశ్నలెన్నో ఉన్నాయని విపక్ష కాంగ్రెస్ మండిపడింది. పెను విషాద సమయం గనుక సహాయక చర్యలు పూర్తవడానికే ప్రస్తుతానికి ప్రాధాన్యమిస్తున్నామని పార్టీ చీఫ్ మల్లికార్జున ఖర్గే అన్నారు.



కేంద్ర ఆరోగ్య మంత్రి మన్‌సుఖ్ మాండవీయతో మాట్లాడుతున్న మోదీ

కోరమండల్‌కు కలిసిరాని శుక్రవారం

కోరమండల్ ఎక్స్‌ప్రెస్‌కు శుక్రవారం కలిసిరావడం లేదు. గత 20 ఏళ్లలో ఈ రైలు మూడు సార్లు ప్రమాదానికి గురైంది. అవన్నీ శుక్రవారమే జరిగాయి. పైగా వాటిలో రెండు ప్రమాదాలు ఒడిశాలోనే చోటుచేసుకున్నాయి. హౌరా–చెన్నై మధ్య నడిచే కోరమండల్ మూడుసార్లూ చెన్నై వెళ్తూనే ప్రమాదానికి గురైంది! 2009లో ఒడిశాలోని జైపూర్ వద్ద తొలిసారి ప్రమాదం జరిగింది. అప్పుడు 16 మంది చనిపోయారు. తర్వాత 2022 మార్చిలో నెల్లూరు వద్ద జరిగిన రెండో ప్రమాదంలో చాలామంది గాయపడ్డారు. తాజా ప్రమాదం మూడోది.

లోకో పైలట్‌లకు గాయాలు

భువనేశ్వర్: కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ దుర్ఘటనలో లోకోపైలట్ జీఎస్ మహంతి, సహాయ లోకో పైలట్ హజారీ బెహరా తీవ్రంగా గాయపడ్డారు. అదృష్టవశాత్తూ ఇరువురూ ప్రాణాలతో బతికి బయటపడ్డారు. వీరిని ఆస్పత్రిలో చేర్పించి, ఉన్నత స్థాయి చికిత్స అందిస్తున్నారు. జీఎస్ మహంతికి పక్కటెముక విరిగింది. దుర్ఘటనలో ఊపిరితిత్తులు తీవ్ర ఒత్తిడికి గురికావడంతో అంతర్గత రక్తస్రావమైనట్లు వైద్యులు తెలిపారు. హజారీ బెహరా ఎడమకాలి ఎముక విరగడంతో శస్త్రచికిత్స నిమిత్తం ఆస్పత్రిలో చేరారు.

ఒక్కసారిగా భారీ శబ్దం.. ఆపై చీకటి!

రైలు ప్రమాద బాధితుల అనుభవాలు

కోల్‌కతా: మరికొద్ది సేపట్లో తమ రైలు బాలాసోర్‌కు చేరుకుంటుందనగా రాత్రి 7 గంటల ప్రాంతంలో ఒక్కసారిగా భారీ శబ్దం వినిపించిందనీ, బెర్త్‌లపై నుంచి తాము కిందపడిపోవడం, బోగీలో అంధకారం అలుముకుందని బెంగళూరు–హౌరా సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలుప్రయాణికులు కొందరు తాము ఎదుర్కొన్న భయానక అనుభవాలను వివరించారు. ఒడిశాలో ప్రమాద ఘటనలో బెంగళూరు–హౌరా సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు కూడా చిక్కుకున్న విషయం తెలిసిందే. అయితే, పట్టాలు తప్పని 17 బోగీలతో 635 ప్రయాణికులతో ఈ రైలు శనివారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో హౌరాకు చేరుకుంది. అందులో క్షతగాత్రులైన సుమారు 50 మంది ప్రయాణికులకు సహాయక సిబ్బంది వైద్య చికిత్సలు అందించారు. క్షతగాత్రుల్లో అయిదుగురిని ఆస్పత్రికి తరలించారు. రైల్వే అధికారులు అందరికీ ఆహారం అందించారు. ఈ సందర్భంగా కొందరు ప్రయాణికులు పీటీఐతో తమ అనుభవాలను పంచుకున్నారు. షెడ్యూల్‌కు మూడుగంటలు ఆలస్యంగా బెంగళూరు–హౌరా సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు బయలుదేరినట్లు మిజాన్ ఉల్ హక్ చెప్పారు. 'బాలాసోర్‌కు 20 కిలోమీటర్ల దూరంలో ఉందనగా రైలు వేగంగా వెళ్తున్న సమయంలో ఒక్కసారిగా భారీ శబ్దం వినిపించింది. బోగీ అటూఇటూ కదలడం మొదలైంది. అప్పర్ బెర్త్ నుంచి కిందపడిపోయా. కంపార్ట్‌మెంట్‌లో లైట్లన్నీ ఆరిపోయాయి. చీకట్లు అలుముకున్నాయి' అని హక్ చెప్పారు. బర్ధమాన్‌కు చెందిన హక్ కర్ణాటకలో జీవనోపాధి నిమిత్తం వెళ్లారు. దెబ్బతిన్న కోచ్ నుంచి అతికష్టమ్మీద బయటపడ గలిగినట్లు హక్ చెప్పారు. అప్పటికే చాలా మంది తీవ్ర గాయాలతో ప్రయాణికులు ధ్వంసమైన బోగీల్లో పడి ఉన్నారని చెప్పారు. బెంగళూరుకు చెందిన రేఖ కోల్‌కతా సందర్శనకు ఇదే రైలులో వస్తున్నారు. 'ప్రమాదం కారణంగా అంతటా గందరగోళంగా మారింది. మా బోగీ నుంచి దిగి బయటకు వచ్చాము. ఆ చీకట్లోనే పక్కనే ఉన్న పొలాల్లో కూర్చున్నాం. హౌరా ఎక్స్‌ప్రెస్ ఉదయం తిరిగి బయలుదేరే వరకు అక్కడే ఉండిపోయాం' అని రేఖ చెప్పారు. బర్ధమాన్‌కు చెందిన మరో ప్రయాణికుడు కూడా బెంగళూరు నుంచి వస్తున్నారు. ఈయనకు చాతీ, కాలు, తల భాగాలకు గాయాలయ్యాయి. కంపార్టుమెంట్ అద్దాలు పగులగొట్టుకుని బయటకు దూకామని ఆయన అన్నారు.



సహాయక చర్యల్లో ఎన్డీఆర్ఎఫ్ బృందాలు

వివిధ సంస్థలు.. బాధితులకు సేవలు

కొరాపుట్/భువనేశ్వర్: రైలు దుర్ఘటన జరిగిన విషయం సామాజిక మాధ్యమాల్లో ప్రసారమైన వెంటనే బాలేశ్వర్, బద్రక్ జిల్లాల యువత స్పందించారు. ఎటువంటి పిలుపు లేకుండానే తమకు తాముగా సాయం అందించేందుకు ముందుకు కదిలారు. బద్రక్, బాలేశ్వర్ జిల్లా కేంద్రాల ఆస్పత్రుల వద్దకు చేరుకొని, అవసరమైన క్షతగ్రాతులకు రక్తదానం చేసేందుకు సిద్ధమయ్యారు. రాత్రి నుంచి ఉదయం వరకు క్యూలోనే ఉండి రక్తదానం చేశారు. సుమారు వేయి మంది యువత రక్తదానం చేసి, ప్రాణదాతలుగా నిలిచారు.

సత్యసాయి భక్తుల సేవలు

రైల్వే దుర్ఘటన జరిగిన వెంటనే సత్యసాయి భక్తుల సేవలు మొదలయ్యాయి. ఘటన జరిగిన వెంటనే సత్యసాయి సేవా సమితి అఖిల భారత సమన్వయకర్త నిమిష్ పాండ్యా, జాతీయ సేవా సమన్వయకర్త కోటేశ్వరరావు వ్యక్తిగతంగా రంగంలోకి దిగారు. వారి సూచనతో సుమారు 70 మంది సత్యసాయి సేవాదళ్ కార్యకర్తలు ఘటనా స్థలానికి చేరుకున్నారు. తాము తెచ్చిన ట్రాక్టర్ల మీద క్షతగాత్రులు, మృతదేహాలను ఆస్పత్రులకు తరలించారు. వైద్య సిబ్బంది తగినంతమంది లేకపోవడంతో బాధితులకు తామే సపర్యలు చేసి, ప్రాథమిక చికిత్స అందజేశారు. అలాగే బాధితులకు ఆహారం, తాగునీరు అందించి, అందరి మన్ననలు పొందారు.

300 మందిని రక్షించిన ఎన్డీఆర్ఎఫ్

రైలు దుర్ఘటన జరిగిన వెంటనే ఎన్డీఆర్ఎఫ్ దళాలు అత్యంత వేగంగా అప్రమత్తం కావడంతో సుమారు 300 ప్రాణాలు నిలిచాయి. ఘటన జరిగిన నిమిషాల వ్యవధిలో 9 బృందాలు రంగంలోకి దిగాయి. అత్యంత వేగంగా ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్న 300 మందిని ఆస్పత్రులకు తరలించడంతో ప్రాణాపాయం తప్పింది. ఎన్డీఆర్ఎఫ్ బృందాలకు పోలీసు జాగిలాలు తోడ్పాటునందించాయి.

సిగ్నల్ లోపం వల్లే...!

- కోరమండల్ ట్రాక్‌పై రెడ్‌సిగ్నల్
- అందుకే ట్రాక్ మారి లూప్ లైన్లోకి

సిగ్నల్ సమస్యే ప్రమాదానికి ప్రధాన కారణమని రైల్వే శాఖ సంయుక్త తనిఖీ కమిటీ తేల్చింది. ''కోరమండల్ మొదటి మెయిన్ లైన్లోంచి లూప్ లైన్లోకి మారి దానిపై గూడ్సును ఢీకొట్టి పట్టాలు తప్పింది. దాని బోగీలు చెల్లాచెదురయ్యాయి. కొన్ని వెళ్లి రెండు మెయిన్ లైన్లపై పడ్డాయి. అదే సమయంలో రెండో మెయిన్ లైన్‌పై బెంగళూరు నుంచి హౌరా వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ ఆ బోగీలను ఢీకొని పట్టాలు తప్పింది. రెండు బోగీలు పట్టాలు తప్పి తలకిందులయ్యాయి'' అని ప్రాథమిక నివేదికలో స్పష్టం చేసింది. అందులో ఇంకా ఏముందంటే...

- సాయంత్రం 6.52 గంటల సమయంలో కోరమండల్ ఎక్స్‌ప్రెస్ బహనగా స్టేషన్‌ను దాటుతుండగా ప్రమాదం జరిగింది.
- ఈ స్టేషన్ వద్ద రెండు మెయిన్ లైన్లతో పాటు వాటికిరువైపులా రెండు లూప్ లైన్లున్నాయి.
- పాసింజర్ హాల్ట్ స్టేషన్ గనుక ఎక్స్‌ప్రెస్‌లు, సూపర్‌ఫాస్ట్ రైళ్లు వచ్చినప్పుడు గూడ్స్‌లను లూప్ లైన్లకు తరలిస్తారు.
- శుక్రవారం సాయంత్రం ఒక గూడ్స్ ముందుగా స్టేషన్ సమీపానికి చేరుకుంది. వెనకే కోరమండల్ వస్తుండటంతో గూడ్స్‌ను లూప్‌లైన్‌కు మళ్లించారు.
- కోరమండల్ వెళ్లాల్సిన మెయిన్ లైన్‌పై అప్పటికి రెడ్ సిగ్నల్ ఉంది. స్టేషన్ సిబ్బంది 17ఏ స్విచ్ నొక్కి దాన్ని గ్రీన్‌గా మార్చాలి. కానీ ఆ స్విచ్‌ను నొక్కినా పని చేయలేదు (సిగ్నల్ ఇచ్చి, మళ్లీ వెనక్కు తీసుకున్నారని కూడా చెబుతున్నారు). రెడ్ సిగ్నలే కొనసాగడంతో కోరమండల్ లూప్‌లైన్‌లోకి మళ్లి గూడ్స్‌ను ఢీకొట్టింది.
- గూడ్స్‌ని బలంగా ఢీకొట్టిన తర్వాత కోరమండల్ కోచ్‌లు ఎగిరిపడి.. పక్కన ఉన్న మరో మెయిన్‌లైన్‌పైకి వెళ్లాయి.
- అదే సమయంలో ఆ లైన్‌లో 130 కి.మీ. వేగంతో (116 కి.మీ. అని కూడా చెప్తున్నారు) వెళ్తున్న హౌరా ఎక్స్‌ప్రెస్ చివరి బోగీలపై కోరమండల్ బోగీలు పడ్డాయి. దాంతో ప్రమాద తీవ్రత పెరిగింది.
- హౌరా 3 నుంచి 5 సెకన్ల ముందుగా వచ్చుంటే ప్రమాదం తప్పేది.
- సూపర్ ఫాస్ట్ రైళ్ల గరిష్ట వేగం 130 కి.మీ.
- ప్రమాదంపై దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు.

లూప్ లైనే యమపాశమైంది

ప్రాథమిక విచారణలో వెల్లడి

- మెయిన్ లైన్ నుంచి లూప్‌లైన్లోకి కోరమండల్
- ఆగున్న గూడ్స్‌ను 128 కి.మీ. వేగంతో ఢీకొంది
- చెల్లాచెదురై పక్క ట్రాక్‌పై పడ్డ 21 బోగీలు
- వాటిని ఢీకొని పట్టాలు తప్పిన హౌరా
- సమగ్ర విచారణకు ఉన్నతస్థాయి కమిటీ

న్యూఢిల్లీ/సాక్షి, విశాఖపట్నం: అనుమానమే నిజమైంది. లూప్‌లైనే మృత్యుపాశంగా మారింది. మెయిన్ లైన్లో వెళ్లాల్సిన కోరమండల్ ఎక్స్‌ప్రెస్ లూప్‌లైన్లోకి మళ్లడమే దేశమంతటినీ కుదిపేసిన మహా విషాదానికి దారితీసింది. లూప్ లైన్లో ఆగి ఉన్న గూడ్స్ రైలును మహా వేగంతో ఢీకొట్టేందుకు, వందలాది మంది దుర్మరణం పాలయ్యేందుకు కారణమైంది. శుక్రవారం ఒడిశాలో మూడు రైళ్ల ఘోర ప్రమాదానికి గురైన పెను విపత్తుపై రైల్వే శాఖ జరిపిన ప్రాథమిక విచారణ ఈ మేరకు తేల్చింది. గూడ్సును ఢీకొన్న వేగానికి ఏకంగా 21 కోరమాండల్ రైలు బోగీలు పట్టాలు తప్పాయి. చెల్లాచెదురై పక్క ట్రాక్‌పై పడిపోయాయి. దానిపై వస్తున్న బెంగళూరు–హౌరా సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ఆ బోగీలను ఢీకొన్ని పట్టాలు తప్పింది. ప్రమాద సమయంలో కోరడమండల్ గంటలకు 128 కిలోమీటర్లు, హౌరా 130 కిలోమీటర్ల వేగంతో వెళ్తున్నాయి! దాంతో జంట ప్రమాదాల తీవ్రత ధాటికి పలు బోగీలు తలకిందులయ్యాయి. ఒక ఇంజన్‌తో పాటు బోగీలకు బోగీలే గూడ్స్‌పైకి దూసుకెళ్లాయి. బహనగా బజార్ స్టేషన్ సమీపంలో జరిగిన ఈ ప్రమాదంపై ప్రాథమిక నివేదికను అధికారులు ఇప్పటికే రైల్వే బోర్డుకు సమర్పించారు. రైల్వే శాఖ ప్రమాద కారణాన్ని అధికారికంగా వెల్లడించలేదు. విద్రోహ కోణానికీ ఆధారలేవీ ఇప్పటిదాకా లేవని రైల్వే వర్గాలంటున్నాయి. మొత్తం ఉదంతంపై పూర్తి స్థాయి విచారణకు సౌత్ ఈస్టర్న్ సర్కిల్ రైల్వే సేఫ్టీ కమిషనర్ ఎ.ఎం.చౌదరి సారథ్యంలో ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటైంది. పౌర విమానయాన సంస్థ ఆధ్వర్యంలో పని చేసే రైల్వే సేఫ్టీ కమిషనర్ ఇలాంటి ప్రమాద ఘటనలను దర్యాప్తు చేస్తారు.

లూప్‌లైన్ అంటే...?

సులువుగా చెప్పాలంటే ఇవి రైల్వే స్టేషన్లలో ఉండే అదనపు రైల్వే లైన్లు. ఒకటికి మించిన ఇంజన్లతో కూడిన భారీ గూడ్సులకు కూడా సరిపోయేలా ఈ లూప్ లైన్లు సాధారణంగా కనీసం 750 మీటర్ల పొడవుంటాయి.



తాత్కాలిక మార్చురీగా మారిన స్కూలు

కారణంపై తలో మాట...

- ప్రమాద కారణంపై తలో మాట వినిపిస్తున్నారు...
- ఇది కచ్చితంగా సిగ్నలింగ్ వైఫల్యమేనని కొందరంటున్నారు.
- రైల్వే శాఖ వర్గాలు మాత్రం కోరమండల్ నేరుగా లూప్‌లైన్లోకి వెళ్లి ఆగి ఉన్న గూడ్సును ఢీకొందా, లేక పట్టాలు తప్పి, ఆ క్రమంలో కొన్ని బోగీలు తలకిందులై, మిగతా రైలు లూప్‌లోన్లోకి మళ్లి గూడ్సును గుద్దిందా అన్నదానిపై ఇంకా స్పష్టత రావాల్సి ఉందని చెబుతున్నారు.

డ్రైవర్ల తప్పిదం కాదు

ప్రమాదం జరిగిన తీరును పరిశీలిస్తే డ్రైవర్ల తప్పిదం ఏమీ లేనట్టే కనిపిస్తోందని చెన్నై ఇంటిగ్రెల్ కోచ్ ఫ్యాక్టరీ మాజీ జనరల్ మేనేజర్, తొలి వందేభారత్ రైలును రూపొందించిన బృందానికి సారథ్యం వహించిన సుధాన్షు మణి స్పష్టం చేశారు. ''కేవలం ప్రయాణికుల రైలు పట్టాలు తప్పడం మాత్రమే జరిగి ఉంటే దానివన్నీ అత్యాధునిక లింక్ హాఫ్‌మన్ బుష్ (ఎల్‌హెచ్‌బీ) కోచ్‌లే. అవి ఇలా తిరగబడిపోవడం జరగదు. ఇంతమంది దుర్మరణం పాలయ్యే అవకాశమే ఉండదు'' అని వివరించారు. ''ప్రమాద సమయంలో కోరమండల్‌కు అది వెళ్లిన లైన్‌పై గ్రీన్ సిగ్నల్ ఉన్నట్టు డేటా లాగర్‌లో స్పష్టంగా ఉంది. అంటే డ్రైవర్ సిగ్నళ్లను ఉల్లంఘించడం వంటిదేమీ జరగలేదన్నది స్పష్టం'' అని ఆయనన్నారు. అంతటి వేగంలో ప్రమాదాన్ని నివారించేందుకు రెండో రైలు (హౌరా) డ్రైవర్ చేయగలిగిందేమీ ఉండదని రైల్వే బోర్డు మాజీ సభ్యుడు (ట్రాఫిక్) శ్రీప్రకాశ్ అభిప్రాయపడ్డారు. ప్రయాణికుల రైళ్లు వాటంతట అవి పట్టాలు తప్పడం చాలా అరుదని వివరించారు.

ప్రమాద సమయంలో...

కోరమండల్ ఎక్స్‌ప్రెస్ వేగం	గంటకు 128 కి.మీ.
బెంగళూరు–హౌరా సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ వేగం	గంటలకు 116 కి.మీ.
గూడ్స్	లూప్ లైన్లో ఆగి ఉంది
ప్రమాద సమయంలో రెండు రైళ్లలో ప్రయాణికులు	2,700 పై చిలుకు (కోరమాండల్‌లో 1257, హౌరాలో 1039 మంది రిజర్వ్‌డ్ ప్రయాణికులున్నారు. రెండింటి జనరల్ బోగీల్లో వందలాది మంది ఉంటారని రైల్వే వర్గాలు అధికారికంగానే వెల్లడించాయి)
ప్రమాద ప్రాంత విస్తీర్ణం	దాదాపు ఒక కిలోమీటర్

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
ఆదివారం । 4 । జూన్ । 2023


ప్రపంచ సైకిల్ దినోత్సవం సందర్భంగా శనివారం విధానసౌధ ముందు సాగిన సైకిల్ ర్యాలీ

మనవాళ్లు సురక్షితం


ఒడిశాలో ఘోర రైలు ప్రమాద దృశ్యం


శనివారం ధార్వాడలో ఓ స్కూలులో ఒడిశా ప్రమాద మృతులకు నివాళి

- ఒడిశా రైలు ప్రమాదంలో రాష్ట్రవాసులు భద్రం
- అదనపు డీజీపీ శశికుమార్ వెల్లడి
- సమాచారం కోసం సహాయవాణి ప్రారంభం

బనశంకరి: ఒడిశాలోని బాలసోర్ జిల్లా బహనాగ వద్ద శుక్రవారం రాత్రి సంభవించిన ఘోర రైళ్ల ప్రమాదంలో కర్ణాటకకు చెందిన 110 మంది ప్రయాణికులు సురక్షితంగా ఉన్నారు. ఈ ప్రమాదంలో కర్ణాటక నుంచి వెళ్లిన రైలు సైతం దెబ్బతినగా అందులో కన్నడిగులు ఎవరూ చనిపోలేదని అదనపు డీజీపీ ఎస్.శశికుమార్ తెలిపారు. రాష్ట్రం నుంచి వెళ్లిన 23 బోగీలు కలిగిన రైల్లో మూడుబోగీలు మాత్రమే దెబ్బతినగా, ఇందులో కర్ణాటకకు చెందినవారు లేరని సమాచారం. శనివారం ఆయన బెంగళూరులో మీడియాతో మాట్లాడారు. రైల్వే అధికారులను సంప్రదిస్తున్నామని, నాలుగుచోట్ల హెల్ప్ లైన్లను ప్రారంభించామని, రాష్ట్ర ప్రయాణికులు మృతి చెందినట్లు, గాయపడినట్లు సమాచారం లేదన్నారు. కర్ణాటకకు చెందిన ప్రయాణికులు ఉన్న బోగీలకు ఎలాంటి ఇబ్బందిలేదని తెలిపారు. ఘటనాస్థలానికి రాష్ట్రం నుంచి పోలీసు అధికారులను పంపించామని తెలిపారు. నాలుగు హెల్ప్ లైన్లను ప్రారంభించగా ఎలాంటి ఫిర్యాదు అందలేదు. మరణాల గురించి అవాస్తవాలను ప్రచారం చేయరాదని కోరారు. మృతుల్లో ఎక్కువ మంది ఈశాన్య భారతానికి చెందిరవారున్నట్లు తెలిసిందన్నారు. ప్రమాదానికి గురైన హౌరా రైలు బెంగళూరులోని బైయప్పనహళ్లి రైల్వేస్టేషన్ నుంచి బయలుదేరింది. ప్రమాదస్థలిలో అప్పుడే పడిపోయిన కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ బోగీలను ఢీకొట్టింది. శుక్రవారం రాత్రి నుంచి ఒడిశాకు వెళ్లే రైళ్లను నిలిపివేశామని శశికుమార్ తెలిపారు.

ఇద్దరు మృతి?

ఇప్పటివరకు రైలు దుర్ఘటనలో బెంగళూరు నగరానికి చెందిన ఇద్దరు మృతిచెందారని తెలిసింది. వీరు ఏ రైలులో ఉన్నారు, ఎక్కడికి వెళుతున్నారు అనేది ఇంకా తెలియరాలేదు. చిక్కమగళూరుకు చెందిన 110 మంది ప్రయాణికులు హౌరా రైలులో ఇద్దరు ఉన్నట్లు సమాచారం. వీరు జార్ఖండ్ పర్యటనకు వెళుతున్నారు, అదృష్టవశాత్తు ఎవరికీ ఏమీ కాలేదని తెలిసింది.

హెల్ప్‌లైన్లు ప్రారంభం



ఒడిశా ఘోర రైలు ప్రమాదంలో బాధితుల బంధువులకు సమాచారం అందించడానికి రైల్వేశాఖ సహాయవాణి ప్రారంభించింది. బెంగళూరు-080-22356409, 09606005129, 8861203980 బంగారుపేట-081 53255253, కుప్పం- 843 1403419, నంబర్లకు ఫోన్ చేసి సమాచారం పొందవచ్చు. బాధితులు సహాయం కోసం ఈ నంబర్లకు కాల్ చేయవచ్చని తెలిపారు. కాగా బెంగళూరు నుంచి ఒడిశా మీదుగా వెళ్లాల్సిన మూడు రైళ్లను రద్దుచేశారు. 12551 నంబరు ఎస్‌వీఎంబీ-కేవైక్యూ, 12864 నంబరు ఎస్‌వీఎంబీ- హెచ్ డబ్ల్యూహెచ్ నంబరు 12253 ఎస్‌వీఎంబీ-బీజీపి రైలు సర్వీసులు బంద్ అయ్యాయి.

ఒడిశా సర్కారుతో మాట్లాడాం: సీఎం

శివాజీనగర: తాము ఒడిశా ప్రభుత్వంతో సంప్రదింపుల్లో ఉన్నామని, కర్ణాటక ప్రయాణికుల గురించి సమాచారం కోరామని సీఎం సిద్దరామయ్య తెలిపారు. శనివారం విలేకరులతో మాట్లాడిన సీఎం, ఇంత పెద్దస్థాయిలో ప్రమాదం ఏనాడు జరగలేదు. కర్ణాటక వారి గురించి ఇప్పటికీ సమాచారం అందలేదు. ఇక్కడి నుంచి ఎంతమంది వెళ్లారు, వారు ఎలా ఉన్నారనేది తెలియడం లేదు కేంద్ర రైల్వే శాఖ, ఒడిశా ప్రభుత్వంతో మాట్లాడుతున్నాం. యశ్వంతపుర రైల్వే స్టేషన్‌లో హెల్ప్ డెస్క్ ఏర్పాటైంది. కర్ణాటక వారికి ఏ విధమైన హాని జరిగిందనే విషయంపై సమాచారం తెలియదు అని చెప్పారు. రైలు ప్రమాద స్థలంలో కన్నడిగుల సహాయ కార్యక్రమాల కోసం మంత్రి సంతోష్ లాడ్‌ను అక్కడకు పంపించినట్లు తెలిపారు.

ఏనుగుల దాడిలో మృతి చెందిన రైతులకు పరిహారం



దొడ్డబళ్లాపురం: అడవి ఏనుగుల దాడిలో మృతి చెందిన ఇద్దరు రైతులకు తలా రూ.15 లక్షలు పరిహారం ప్రకటించారు. రైతుల మృతికి తీవ్ర సంతాపం తెలిపిన అటవీశాఖ మంత్రి ఈశ్వర్ ఖండ్రె ప్రభుత్వం నుంచి పరిహారం ప్రకటించారు. చెన్నపట్టణ తాలూకా నిరుపసంద్ర గ్రామంలో మామిడి తోటలో కాపలాగా ఉన్న వీరభద్ర అనే వ్యక్తిని శనివారం తెల్లవారుజామున ఏనుగు దాడి చేసి చంపింది. రెండు రోజుల క్రితం బండీపుర మళెయూరు అటవీ ప్రదేశంలో రైతు రవి (40)ని అడవి ఏనుగు దాడి చేసి చంపింది. ఏనుగులను అడవిలోకి తరమాలని అధికారులకు మంత్రి ఆదేశాలిచ్చారు. అడవిలో నుంచి ఏనుగులు గ్రామాల్లోకి రాకుండా రైల్వే కంబీలతో బ్యారికేడ్‌లు నిర్మించేలా చర్యలు తీసుకుంటామని, అందుకు నిధులు విడుదల చేయాలని ముఖ్యమంత్రిని కోరుతానని మంత్రి తెలిపారు.

సినీ కార్మికుల బంద్ యోచన

యశవంతపుర: సినీ పరిశ్రమలో వేతనాలను పెంచాలని డిమాండ్ చేస్తూ శాండల్‌వుడ్ కార్మికులు 5వ తేదీ సోమవారం నుంచి దీర్ఘకాలిక బంద్ చేయాలని నిర్ణయించారు. ఔట్‌డోర్ చిత్రీకరణ కార్మిక సంఘం బంద్‌కు పిలుపునిచ్చింది. కర్ణాటక చలనచిత్ర వాణిజ్య మండలి, నిర్మాత సంఘానికి కార్మికుల సంఘం సమాచారానిచ్చింది. బంద్ జరిగితే సినిమా షూటింగ్‌లు నిలిచిపోయే అవకాశం ఉంది.

కలబురిగి జిల్లాలో ఆర్టీసీ బస్సు బోల్తా

బనశంకరి: కేఎస్ఆర్‌టీసీ బస్ అదుపు తప్పి బోల్తా పడి పలువురు ప్రయాణికులు గాయపడ్డారు. ఈ ఘటన కలబురిగి జిల్లా గురువార తాలూకా హోసళ్లి హెచ్ క్రాస్ వద్ద చోటుచేసుకుంది. శనివారం మధ్యాహ్నం చించోళి నుంచి బెంగళూరుకు 40 మంది ప్రయాణికులతో బయలుదేరిన ఆర్‌టీసీ బస్ గురువార తాలూకా హోసళ్లి హెచ్‌క్రాస్ వద్ద బస్ బోల్తాపడింది. ప్రయాణికుల్లో ఒకరికి కళ్లు, మరొకరికి కాలికి తీవ్రగాయం గాయం కాగా పలువురు స్వల్పంగా గాయపడ్డారు. ప్రయాణికులు కిటికీల అద్దాలు బద్దలు కొట్టి బయటికి వచ్చారు. గాయపడినవారిని వివిధ ఆసుపత్రులకు తరలించారు. డ్రైవర్ అజాగ్రత్తగా నడపడమే దుర్ఘటనకు కారణమని వారు తెలిపారు.

పెరుగుతోన్న గుండెజబ్బు ముప్పు

మైసూరు: గుండెపోటు వచ్చి మృతి చెందేవారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది తప్ప తగ్గడం లేదు, 35 శాతం మరణాలకు గుండెజబ్బులే కారణమని, వీటి నివారణకు తాము ఎంతో సమర్థంగా వైద్యసేవలు అందిస్తున్నా జరగడం బాధాకరంగా ఉందని ప్రముఖ గుండె వైద్య నిపుణుడు పద్మశ్రీ డాక్టర్.సి.ఎన్.మంజునాథ్ అన్నారు. శనివారం మైసూరులోని జయదేవ ఆస్పత్రిని ఆయన సందర్శించారు. రోగులకు నాణ్యతతో కూడిన చికిత్స, వసతులను కల్పించాలని వైద్య సిబ్బందికి సూచించారు. నాణ్యమైన వైద్యం అందిస్తున్నప్పటికీ కూడా గుండెపోటు వచ్చి మరణించే వారి సంఖ్య పెరుగుతోందని ఆయన విచారం వ్యక్తం చేశారు.

న్యూస్‌రీల్

కేరళ స్టోరీ సినిమా వీక్షణం



మైసూరు: మత మార్పిడి కుట్రలు, ఉగ్రవాదంలోకి చేరడం తదితర అంశాలతో రూపొందిన ది కేరళ స్టోరీ సినిమాను మైసూరు నగరంలో 200 మంది యువతులు వీక్షించారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో మాల్ ఆఫ్ మైసూరులో ఈ సినిమాను ప్రదర్శించారు. యువతులకు ఉచితంగా ప్రవేశం కల్పించారు.

జంతు దాడుల్ని అరికట్టాలి

శివాజీనగర: చెన్నపట్టణ నియోజకవర్గంతో పాటు రామనగర జిల్లాలో అటవీ జంతువుల దాడులు అరికట్టేందుకు శాశ్వత పరిష్కారం చూపాలని మాజీ ముఖ్యమంత్రి కుమారస్వామి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చెన్నపట్టణ నియోజకవర్గం విరుపసంద్ర గ్రామంలో మామిడి తోటలో కాపలాగా ఉన్న వీరభద్రయ్యపై ఏనుగు దాడి చేయడంతో అతను మృతి చెందిన విషయంపై ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. అటవీ జంతువులు గ్రామాల్లోకి రాకుండా చర్యలు తీసుకోవాలని శాస్త్రీయంగా కంచె నిర్మించాలని డిమాండ్ చేశారు. అటవీ సంరక్షణతో పాటు అక్కడ వ్యవసాయం చేసే రైతుల హితదృష్టి కూడా ముఖ్యం. రైతులపై అటవీ జంతువులు దాడి జరగకుండా శాశ్వతంగా అరికట్టే అత్యవసర చర్యలను చేపట్టాలని కుమారస్వామి డిమాండ్ చేశారు.

ఆర్‌బీఐ కార్యాలయానికి బాంబు బూచి

- యువకుడి అరెస్ట్

శివాజీనగర: నగరంలోని భారతీయ రిజర్వు బ్యాంకు కార్యాలయంలో బాంబు పెట్టారని బెదిరించిన యువకుడిని విధానసౌధ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడిని రాజరాజేశ్వరి నగరకు చెందిన వైభవ్ భగవాన్‌గా గుర్తించారు. వివరాలు... బీకాం చదువుతున్న వైభవ్, తల్లిదండ్రులతో కలిసి ఉంటున్నాడు. కొన్ని సంవత్సరాలుగా ఇతను మానసిక అస్వస్థతతో బాధపడుతున్నాడు. గురువారం తెల్లవారుజామున పోలీస్ కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేసి బెంగళూరు రిజర్వు బ్యాంకు కార్యాలయంలో బాంబు బ్లాస్ట్ జరుగుతుందని చెప్పాడు, దీంతో కంట్రోల్ సిబ్బంది సెంట్రల్ విభాగం పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు నృపతుంగ రోడ్డులో ఉన్న ఆర్‌బీఐ కార్యాలయానికి హుటాహుటిన వచ్చి అణువణువు గాలించారు. ఉత్తుత్తి బాంబు అని తేలింది. నిందితుడిని అరెస్ట్ చేశారు.

సుత్తూరు మఠంలో ఆస్ట్రేలియా పార్లమెంటరీ సభ్యులు



మైసూరు: భారత దేశంలోని వివిధ క్షేత్రాల్లో అధ్యయనం చేయడానికి మైసూరు నగరానికి వచ్చిన ఆస్ట్రేలియా పార్లమెంటరీ కమిషన్ సభ్యులు శనివారం సుత్తూరు శాఖ మఠంలో పీఠాధిపతి శివరాత్రి దేశికేంద్ర స్వామీజీని కలిశారు. ఆస్ట్రేలియా అసెంబ్లీ సభాధ్యక్షుడు మిచెల్ రాబర్ట్స్ ఆధ్వర్యంలో ప్రతిపక్ష నాయకుడు డాక్టర్ డేవిడ్ హనీ డేవిడ్ స్లేఫ్, ఎమ్మెల్యేలు డాక్టర్ జగదీశ్ కృష్ణన్, క్యాసెంద్రరో బృందం సభ్యులు స్వామీజీని కలిసి అక్కడి విద్యా సంస్థల గురించి అడిగి తెలుసుకున్నారు.

ఎస్ఐ భార్య అనుమానాస్పద మృతి

- హత్య చేసి ఆత్మహత్య నాటకమని తల్లిదండ్రుల ఫిర్యాదు
- బెంగళూరులోని బేగూరులో ఘటన



బొమ్మనహళ్లి: సబ్ ఇన్స్‌పెక్టర్ భార్య అనుమానస్పద స్థితిలో ఉరి వేసుకొని శవమైన సంఘటన బెంగళూరు దక్షిణ నియోజకవర్గం బేగూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న పటేల్ లేఔట్‌లో జరిగింది. మృతురాలు ఎస్ఐ రమేష్ భార్య శిల్ప (33). వివరాలు.. కాలేజీలో చదివే రోజుల్లో రమేష్, శిల్పా ఇద్దరూ ఐదేళ్ల పాటు ప్రేమలో ఉన్నారు. తరువాత రమేష్‌కు ఎస్ఐ ఉద్యోగం వచ్చింది, కొన్నాళ్లకు ఇద్దరూ పెళ్ళి చేసుకున్నారు. కానీ కొద్దిరోజులకే కాపురంలో కలతలు వచ్చాయి. శిల్పను కులం పేరుతో వేధించినట్లు, రోజూ గొడవపడేవారని ఆరోపణలు వచ్చాయి. దాంతో శిల్ప భర్త రమేష్ పైన ఎస్సీ ఎస్టీ అట్రాసిటి కేసు పెట్టడంతో పోలీసులు పెద్దల సమక్షంలో ఇద్దరికీ రాజీ పంచాయతీ చేసి పంపించారు.

అక్క కూతురిని పెళ్లి చేసుకోవాలని

ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి ఇంట్లో శిల్ప ఉరికి వేలాడింది. శిల్పను ఎలాగైనా వదిలించుకోవాలని హత్య చేసి ఇది ఆత్మహత్యగా చెబుతున్నారని ఆమె కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఇద్దరూ ప్రేమించుకుని సహజీవనం చేశారని, పెళ్లి చేసుకోమంటే రమేష్ ఒప్పుకోలేదని తెలిపారు. కానీ ఆమె ఫిర్యాదు చేస్తే ఉద్యోగం పోతుందనే భయంతో రిజిస్టర్ పెళ్లి చేసుకుని, వేధింపులకు దిగాడని చెప్పారు. ఆమెకు ఖర్చులకు, ఇంటి ఖర్చులకు డబ్బులు ఇచ్చేవాడు కాదని, తామే పుట్టింటి నుంచి పంపేవారమని తల్లిదండ్రులు పోలీసులకు తెలిపారు. రమేష్ ఆస్తి కోసం అక్క కుమార్తెను పెళ్ళి చేసుకోవాలనుకున్నాడని, అందుకే శిల్పను అంతమొందించాడని విలపించారు. బేగూరు పోలీసులు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేపట్టగా రమేష్ పరారీలో ఉన్నాడు.


పున్నమి పూజ కారు పున్నమి సందర్భంగా శనివారం బెళగావిలో మారుతి ఆలయంలో మర్రిచెట్టుకు పూజలు చేస్తున్న మహిళలు

కేబినెట్‌పై కేసుల నీడ

- 24 మంది మంత్రులపై క్రిమినల్ కేసులు
- ఏడీఆర్, ఎలెక్షన్ వాచ్ వెల్లడి




సీఎం, డిప్యూటీ సీఎంతో సహా అనేక మంది మంత్రులపై కేసులు ఉన్నట్లు నివేదిక

సాక్షి, బెంగళూరు: కర్ణాటక నూతన ప్రభుత్వంలో 24 మంది మంత్రులపై క్రిమినల్ కేసులు ఉన్నాయి. అలాగే 31 మంది కోటీశ్వరులు ఉన్నారని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్), కర్ణాటక ఎలెక్షన్ వాచ్ సంస్థలు సంయుక్తంగా ఒక నివేదికను విడుదల చేశాయి. ఇటీవలి ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిచిన తర్వాత కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. సీఎం, డిప్యూటీ సీఎం, 32 మంది మంత్రులతో సర్కారు ఏర్పడడం తెలిసిందే. మంత్రులు నామినేషన్ల అఫిడవిట్‌ను విశ్లేషించిన ఈ సంస్థలు ఇందులో 75 శాతం మందికి క్రిమినల్ కేసులు ఉన్నట్లు తెలిపాయి. బళ్లారి రూరల్ ఎమ్మెల్యే, మంత్రి బి.నాగేంద్రపై అందరికంటే అత్యధికంగా మొత్తం 42 క్రిమినల్ కేసులు ఉన్నాయి. ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌పై 19 కేసులు ఉన్నాయి. సీఎం సిద్దరామయ్యపై కూడా 13 కేసులతో మూడో స్థానంలో ఉన్నారు.

ఒక్కో మంత్రి సగటు ఆస్తి రూ.119 కోట్లు

మంత్రుల్లో చాలా మంది కోటీశ్వరులుగా ఉన్నారు. 32 మందిలో 97 శాతం మంది ఒక్క కోటి రూపాయల కంటే ఎక్కువ ఆస్తులు కలిగి ఉన్నారు. ఒక్కో మంత్రి సగటు ఆస్తి రూ. 119 కోట్లుగా విశ్లేషణలో తేలింది. డీకే శివకుమార్‌కు అత్యధికంగా రూ.1,413 కోట్ల ఆస్తులు ఉన్నాయి. అబ్కారీ శాఖ ఆర్‌బీ తిమ్మాపుర అత్యల్పంగా అంటే రూ. 58.56 లక్షల ఆస్తి కలిగి ఉన్నారు. మంత్రులందరిలో 75 శాతం మంది గ్రాడ్యుయేట్లు, మిగిలిన వారు పీజీ చదివిన వారు ఉన్నారు. ఇద్దరు డిప్లొమా చదివారు. మరో ఆరు మంది మంత్రుల విద్యార్హతను 8వ తరగతి నుంచి 12వ తరగతి మధ్యలో ఉంది.

ప్రైవేటు బస్సులకు కుదుపు

- మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం..
- తమ వ్యాపారం క్షీణిస్తుందని దిగులు


ప్రైవేటు బస్సుల యజమానుల్లో ఆందోళన



బనశంకరి: ఒకరికి మోదం, మరొకరికి ఖేదం అన్నట్లు రాష్ట్ర ప్రభుత్వ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ గ్యారంటీ ప్రకటించగా, ప్రైవేటు బస్సుల యజమానుల ఆదాయానికి గండి పడుతుందనే భయం యజమానుల్లో నెలకొంది. మంత్రివర్గ తీర్మానం ప్రకారం ఈ నెల 11 నుంచి ఏసీ బస్సులు మినహా మిగిలిన ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం లభిస్తుంది. దీంతో ప్రైవేటు బస్సు యజమానుల్లో గుబులు నెలకొంది.

ఇప్పటికే అంతంతమాత్రం

ఇంధన ధరలు పెరగడం, పన్నుల భారంతో ప్రైవేటు బస్సులు అంతంతమాత్రంగా ఉన్నట్లు చెబుతున్నారు. రాష్ట్రంలో సుమారు 9 వేల ప్రైవేటు బస్సులు ఉన్నాయి. బస్సుల యజమానులు, డ్రైవర్లు, క్లీనర్లు, ట్రావెల్స్ ఏజెంట్లుతో కలిసి 75 వేలమందికి పైగా ఆధారపడి ఉన్నారు. కోవిడ్, లాక్‌డౌన్‌తో చాలా నష్టాలు అనుభవించిన ప్రైవేటు బస్సుల రంగం గత ఏడాది కాలంగా కొద్దిగా గాడిలో పడింది. ప్రస్తుతం ఉచిత ప్రయాణ అవకాశం కల్పించడంతో మహిళలు, సహజంగా ప్రభుత్వ బస్సులను ఎక్కువగా ఆశ్రయిస్తారు. నిరుపేదలు, మధ్యతరగతి మహిళలు ప్రైవేటు బస్సుల వైపు చూడరు. మరోపక్క ప్రైవేటు బస్సుల్లో ప్రయాణిస్తున్న కార్మికవర్గానికి చెందిన మహిళలు సైతం ప్రభుత్వ బస్సుల్లోనే ప్రయాణిస్తారు. దీని వల్ల తమ బస్సులకు గిరాకీ పడిపోతే నడపడం ఎలా అని ప్రైవేటు బస్సు యజమానుల్లో, అలాగే సిబ్బందిలో కలవరం నెలకొంది.

రవాణా మంత్రిని కోరతాం

సర్కారు పథకం వల్ల ప్రైవేటు బస్సులు రంగానికి నెలకు సుమారు రూ.66 కోట్ల నష్టం వస్తుందని ఆ బస్సుల సంఘం ప్రముఖులు తెలిపారు. తమకు న్యాయం చేయాలని త్వరలో రవాణామంత్రిని కలిసి వినతిపత్రం ఇస్తామని, ప్రైవేటు బస్సుల్లో కూడా ఉచిత ప్రయాణ వసతిని కల్పించి ఆ చార్జీలను తమకు చెల్లించాలని కోరతామన్నారు. ఇంకా పలు రకాల పన్నుల మినహాయింపులు, ప్రోత్సాహకాలను కోరతామని కర్ణాటక రాష్ట్ర ప్రైవేటు బస్సుల యజమానుల సంఘం అధ్యక్షుడు నటరాజ్ శర్మ తెలిపారు. ప్రభుత్వం దీనికి సమ్మతించకపోతే న్యాయ పోరాటం చేస్తామని చెప్పారు.

అన్న ప్రేమకు తమ్ముడు బలి

- పోలీసుల వేధింపులతో ఆత్మహత్య


సురేశ్ నాయక్ (ఫైల్)

యశవంతపుర: హవేరి జిల్లా హనగల్‌లో విచిత్రమైన సంఘటన జరిగింది. అన్న చేసిన పనికి తమ్ముడు బలయ్యాడు. శివమొగ్గ జిల్లా శికారిపుర తాలూకా చిక్కమాగడి తండాకు చెందిన ఓ యువకుడు సురేశ్ నాయక్ ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు... చిక్కమాగడి తండాకు చెందిన మంజు ఎనిమిదేళ్లుగా హనగల్ తాలూకా బాళూరు తండాకు చెందిన యువతిని ప్రేమిస్తున్నాడు. చివరకు ఆ యువతికి ఆమె కుటుంబీకులు నాలుగు రోజుల క్రితం మరో యువకుడితో వివాహం జరిగింది. కానీ యువతికి ఫోన్ చేస్తున్నాడని ఆమె వైపు వారు మంజుపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంజు ఆచూకీ లభించని కారణంగా తమ్ముడు సురేశ్ నాయక్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని వేధించారు. సురేశ్ బెంగళూరులో కారు డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. పోలీసుల వేధింపులు తట్టుకోలేక సురేశ్ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. జీవనాధారమైన తన కారును పోలీసులు తీసుకోవటంతోనే మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిసింది. మృతుడి డెత్‌నోటును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తాను చేసిన అప్పులు తన మరణానికి కారణమైన వారు తీర్చాలని డెత్‌నోట్‌లో రాసినట్లు సమాచారం.

శివమొగ్గ జైలులో తనిఖీలు

శివమొగ్గ: శివమొగ్గ నగరానికి సమీపంలో ఉన్న సోగానేలోని శివమొగ్గ సెంట్రల్ జైలులో మహిళా ఖైదీల విభాగంలో శనివారం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఐపీఎస్ అధికారిణి బిందుమణి నేతృత్వంలో పెద్ద సంఖ్యలో పోలీసులు జైలు వద్దకు చేరుకొని సోదాలు చేశారు. మహిళా పోలీసులు ప్రతి బ్యారక్‌లోకి వెళ్లి అనుమానాస్పద వస్తువులు ఏమైనా ఉన్నాయా? అని గాలించారు. ఏమీ లభించక పోవడంతో అటు పోలీసులు, ఇటు జైలు సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.




అవి అరుదైన పెయింటెడ్ బుష్ క్విల్స్ అనే కౌజులు. శనివారం మైసూరు జిల్లాలో కబిని నది తీరంలో ఈ పక్షులు కెమెరాకు చిక్కాయి

క్లుప్తంగా

కారు-బొలేరో ఢీ: నలుగురికి తీవ్ర గాయాలు



ప్రమాదంలో ధ్వంసమైన కారు

రాయచూరు రూరల్ : జిల్లాలోని సింధనూరు తాలూకా గొరేబాళ వద్ద శనివారం కారు-బొలేరో ఢీకొన్న ఘటనలో నలుగురికి తీవ్ర గాయాలు కాగా మరో 15 మంది గాయపడ్డారు. సింధనూరు తాలూకా కణ్ణూరు నుంచి 15 మందికి పైగా బొలేరోలో అంజనాద్రి కొండకు బయల్దేరారు. అదే సమయంలో క్రిటా కారులో భార్యభర్తలు, ముగ్గురు పిల్లలు హొసపేటె నుంచి హైదరాబాద్‌కు వెళుతుండగా మార్గమధ్యంలో మధ్యాహ్నం 12 గంటలకు ఈ ప్రమాదం జరిగింది. తీవ్రంగా గాయపడిన వారిని బళ్లారి విమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై సింధనూరు గ్రామీణ పోలీస్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

రైలు ప్రమాద బాధిత కుటుంబాలను ఆదుకోండి

రాయచూరు రూరల్ : ఒడిశాలో శుక్రవారం జరిగిన కోరమండల్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రమాదంలో గాయపడ్డ బాధితులకు, మృతుల కుటుంబాలకు పరిహారం అందించాలని దక్షిణ మధ్య రైల్వే బోర్డు సభ్యుడు బాబూరావు, బీదర్ మాజీ ఎమ్మెల్యే బండెప్ప కాశంపూర్, ప్రవాసాంధ్రుడు నాగేశ్వరరావులు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌కు విన్నవించారు. క్షతగాత్రులకు ఉన్నత శ్రేణి ఆస్పత్రుల్లో మెరుగైన చికిత్స అందించాలని ఒత్తిడి చేశారు.

మంత్రాలయంలో మంత్రికి సన్మానం



మంత్రి బోసురాజును సన్మానిస్తున్న సుబుదేంద్ర తీర్థ స్వామీజీ

రాయచూరు రూరల్: రాష్ట్ర చిన్న నీటిపారుదల, విజ్ఞాన సాంకేతిక శాఖా మంత్రి బోసురాజు శనివారం మంత్రాలయంలో రాఘవేంద్ర స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మంత్రిని మఠాధిపతి సుబుదేంద్ర తీర్థ స్వామీజీ సన్మానించారు. ఆయన వెంట మాన్వి ఎమ్మెల్యే హంపయ్య నాయక్, రుద్రప్ప, శాంతప్ప, అమరేశప్ప పాల్గొన్నారు.

నగరంలో మంత్రికి ఘన స్వాగతం: మంత్రి బోసురాజు శనివారం మొదటి సారిగా జిల్లా కేంద్రానికి రావడంతో అభిమానులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. నవోదయ వైద్య కళాశాల వద్ద నుంచి వివిధ ప్రధాన వీధుల గుండా ఓపెన్‌టాప్ వాహనంలో ఊరేగించారు.

అంధ వృద్ధురాలిపై అకృత్యం



లోకేష్‌నాయక్(ఫైల్)

హొసపేటె: ఓ అంధవృద్ధురాలిపై కామాంధుడు అత్యాచారానికి పాల్పడడంతో ఆమె బలవన్మరణానికి పాల్పడిన ఘటన విజయనగర జిల్లా హగరిబొమ్మనహళ్లి తాలూకా వ్యాసాపురతాండాలో జరిగింది. వివరాలు..లోకేష్‌నాయక్ అనే వ్యక్తికి భార్య, పిల్లలు ఉన్నా సుమారు 58 ఏళ్ల వయస్సు గల తల్లి సమాన వయస్సు ఉన్న అంధురాలిపై కన్నేశాడు. ఆమె ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయాన్ని గమనించి కనీస కనికరం లేకుండా గత నెల 30వ తేదీన అత్యాచారానికి పాల్పడ్డాడు. దీంతో తీవ్ర అనారోగ్యానికి గురైన ఆమెను బంధువులు ఆస్పత్రిలో చేర్పించగా కోలుకుని ఇంటికి వచ్చిన తర్వాత తనకు జరిగిన అన్యాయాన్ని భరించలేక తీవ్ర మనస్తాపంతో శనివారం పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటన గ్రామంలో చర్చనీయం కావడంతో గ్రామస్తులు తీవ్ర ఆక్రోశానికి లోనై లోకేష్‌నాయక్‌ను ముట్టడించి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని అతనిని బంధించారు. గ్రామస్తులు అతడికి ఉరి శిక్ష విధించాలని పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు.

హనుమాన్‌కు విశేష పూజలు



ప్రత్యేక పూజలందుకున్న నేమకల్లు ఆంజనేయస్వామి

బొమ్మనహాళ్: తెలుగు, కర్ణాటక రాష్ట్రాల్లో ప్రసిద్ధి చెందిన నేమకల్లు ఆంజనేయస్వామికి శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి మూలవిరాట్‌ను పట్టువస్త్రాలతో, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. అర్చకులు వేకువజాము నుంచే స్వామివారికి కుంకుమార్చన, పంచామృతాభిషేకం, ఆకుపూజ, విశేష వెండి తమలపాకు అలంకరణలు చేశారు. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

గ్రామీణ సంస్కృతికి ప్రతీకగా ఎద్దుల పోటీలు



ఉత్సవాల్లో భాగంగా మైదానంలో ఎద్దుల పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం



పోటీల్లో రాతిదూలాన్ని లాగుతున్న ఎద్దుల జత

- నగర ఎమ్మెల్యే శివరాజ్ పాటిల్
- ముంగారు ఉత్సవాలకు శ్రీకారం

రాయచూరు రూరల్: గ్రామీణ సంస్కృతిని మరపించేలా నగరంలో ముంగారు ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయమని నగర ఎమ్మెల్యే శివరాజ్ పాటిల్, రైతు సంఘం అధ్యక్షుడు చామరస మాలిపాటిల్ పేర్కొన్నారు. శనివారం నగరంలోని ఏపీఎంసీ ఆవరణలో మున్నూరు కాపు సమాజం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉత్సవాల్లో భాగంగా కర్ణాటక ఎద్దులకు ఒకటిన్నర టన్నుల బరువుగల రాతి దూలం లాగే పోటీలను వారు ప్రారంభించి మాట్లాడారు. ఏరువాక పున్నమి సందర్భంగా ప్రజలకు కనువిందు చేసేలా జరిగే పోటీలు రాష్ట్రానికి గర్వకారణం అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, మున్నూరు కాపు సమాజం అధ్యక్షుడు ఏ.పాపారెడ్డి, నరసా రెడ్డి, బసవరాజరెడ్డి, తిమ్మారెడ్డి, శేఖర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, ఆంజనేయ, హరీష్ నాడగౌడలున్నారు.

విజేత వృషభాలకు బహుమతులు

నగరంలో కర్ణాటక ఎద్దులకు జరిగిన 1.5 టన్నుల రాతిదూలం లాగే పోటీల్లో విజేత ఎద్దులకు బహుమతి అందజేశారు. రాయచూరు తాలూకా పలకనదొడ్డి ఖాజా హుసేన్ ఎద్దుల(3,154 అడుగులు)కు ప్రథమ బహుమతిగా రూ.65 వేలు, దేవదుర్గ తాలూకా మారప్పళ్లి రవిగౌడ ఎద్దుల(3,083 అడుగులు)కు ద్వితీయ బహుమతిగా రూ.55 వేలు, భూమనగుండా దేవరాజ నాయక్ ఎద్దుల(2,449 అడుగులు)కు తృతీయ బహుమతిగా రూ.45 వేలు, విజయపుర జిల్లా ముద్దేబిహాళ్ తాలూకా రోడిగి బసవేశ్వర ఎద్దుల(2,319 అడుగులు)కు నాలుగో బహుమతి లభించింది.

జిల్లాలో ఇక అభివృద్ధి పర్వం ప్రారంభం

- విద్యాభ్యాసం నుంచి ఏ ఒక్క విద్యార్థి దూరం కాకుండా చూస్తాం: మంత్రి



చేళ్లగుర్కి ఎర్రితాత ఆలయం వద్ద మాట్లాడుతున్న మంత్రి నాగేంద్ర తదితరులు

సాక్షి,బళ్లారి: ఇక నుంచి బళ్లారి జిల్లాలో అభివృద్ధి పర్వం ప్రారంభం కానుందని రాష్ట్ర క్రీడా, యువజన, ఎస్టీ వర్గాల అభివృద్ధి శాఖా మంత్రి బీ.నాగేంద్ర పేర్కొన్నారు. ఆయన మంత్రి అయిన తర్వాత మొదటి సారిగా శనివారం జిల్లాకు విచ్చేసిన సందర్భంగా ఘనస్వాగతం లభించింది. బెంగళూరు నుంచి అనంతపురం, ఉరవకొండ మీదుగా చేళ్లగుర్కి ఎర్రితాత ఆలయానికి చేరుకుని మఠంలో ప్రత్యేక పూజలు చేశారు. దారిపొడవునా ఆయనకు అభిమానులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తన ఇష్టదైవమైన చేళ్లగుర్కి ఎర్రితాత ఆలయంలో పూజలు చేసి తాత ఆశీస్సులతో తనకు జిల్లా సంపూర్ణ అభివృద్ధి చేసే శక్తి సామర్థ్యాలు ఇవ్వాలని కోరినట్లు తెలిపారు.

ఉమ్మడి జిల్లా సర్వతోముఖాభివృద్ధికి కృషి

సీఎం సిద్ధరామయ్య, డీసీఎం శివకుమార్ సహకారంతో ఉమ్మడి బళ్లారి జిల్లా సర్వతోముఖాభివృద్ధికి శక్తివంచన లేకుండా శ్రమిస్తానన్నారు. తనకు కేటాయించిన శాఖల పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతం చేస్తామన్నారు. ఏ ఒక్క విద్యార్థి విద్యకు దూరం కాకుండా ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. విద్యతోనే దేశాభివృద్ధి సాధ్యం అన్నారు. కేఎంఆర్‌సీఈ, డీఎంఎఫ్ నిధులతో బళ్లారిని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. బళ్లారి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా బాధ్యతలు అప్పగించే విషయంపై సీఎం నిర్ణయం తీసుకుంటారన్నారు. ఒడిశాలో రైలు ప్రమాదంపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రాష్ట్ర మంత్రి సంతోష్‌లాడ్ సహాయ చర్యల్లో పాల్గొనేందుకు వెళ్లారన్నారు. ఈసందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటమితో అనుచిత వ్యాఖ్యలు తగదు

- మాజీ ఎమ్మెల్యేపై కేఆర్‌పీపీ నేతల ధ్వజం



మాట్లాడుతున్న పార్టీ నాయకులు రాజశేఖరగౌడ, అలీఖాన్, సంజయ్ బెటగేరి

సాక్షి,బళ్లారి: ఎన్నికల్లో గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాల్సింది పోయి రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖరరెడ్డి ఒకసారి ఓటమి చెందిన మాత్రాన నైరాశ్యంతో కేఆర్‌పీపీ సంస్థాపక అధ్యక్షుడు, గంగావతి ఎమ్మెల్యే గాలి జనార్దనరెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని కేఆర్‌పీపీ జిల్లాధ్యక్షుడు రాజశేఖరగౌడ, ఆ పార్టీ రాష్ట్ర నాయకులు మెహఫూజ్ అలీఖాన్, సంజయ్‌బేటగేరి హితవు పలికారు. వారు శనివారం నగరంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. తాము అభ్యర్థులను నిలబెట్టని బళ్లారి గ్రామీణ, కంప్లి నియోజకవర్గాల్లో బీజేపీ ఎందుకు గెలవలేదని ప్రశ్నించారు. ఆగస్టు నెలలో వరమమహాలక్ష్మీ పండుగ రోజున నగరంలో కేఆర్‌పీపీ ఆధ్వర్యంలో ఉచిత సామూహిక వివాహాలు జరపతలపెట్టినట్లు వెల్లడించారు. తమ పార్టీ అధినేత సూచనల మేరకు సామాజిక సేవా కార్యక్రమాలను చేపడతామన్నారు. ఈసారి ఎన్నికల్లో నగరం నుంచి కేఆర్‌పీపీ తరఫున గాలి లక్ష్మీఅరుణ తిరిగి పోటీ చేస్తారన్నారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు హంపీ రమణ, శివారెడ్డి, మరిదేవయ్య, బీకేబీఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

కోతి మృతితో గ్రామంలో విషాదం

- రాత్రంతా జాగారం చేసి అంత్యక్రియలు

సాక్షి,బళ్లారి: కొన్ని సందర్భాల్లో అనాథలు, బంధువులు మృతి చెందినప్పుడు కూడా వారి అంత్యక్రియల నిర్వహణకు చాలా మంది దూరంగా ఉంటారు. అయితే విజయపుర జిల్లా బసవన బాగేవాడి తాలూకా కణకాల గ్రామంలో విద్యుత్ షాక్‌తో శుక్రవారం రాత్రి ఓ కోతి మృతి చెందడంతో ఆ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. రాత్రంతా గ్రామస్తులు కోతి మృతదేహం వద్ద కూర్చొని జాగరణ చేసి, ప్రార్థనలు చేయడంతో పాటు శనివారం సంప్రదాయబద్ధంగా కోతి కళేబరాన్ని గ్రామంలో ఊరేగించి అంత్యక్రియలు పూర్తి చేయడం విశేషం.

యువకుడిపై ఎలుగుబంటి దాడి

గంగావతి: ఓ యువకుడిపై ఎలుగుబంటి దాడి చేసిన గాయపరచిన ఘటన కొప్పళ తాలూకాలోని గంగానాళలో జరిగింది. గ్రామానికి చెందిన ముక్కణ్ణప్ప తన గొర్రెల మందకు రాత్రంతా కాపలా ఉండి ఉదయాన్నే ఇంటికి వెళుతుండగా ఉన్న ఫళంగా ఎలుగుబంటి దాడి చేసి గాయపరిచింది. ఈ ప్రాంతంలో ఎలుగుబంటి ఒకే వారంలో ముగ్గురిపై దాడి చేసిందని అటవీ శాఖ అధికారులకు తెలియజేసినా ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు ఎలుగుబంటిని బంధించని పక్షంలో పోరాటం తప్పదన్నారు.

చెత్త బుట్టలను ఇస్తామని మోసం

హుబ్లీ: చెత్త బుట్టలను ఇస్తామంటూ ముగ్గురు వ్యక్తులు ఒకరికి రూ.3.14 కోట్ల మేర మోసగించిన ఘటన నగరంలో శనివారం చోటు చేసుకుంది. హుబ్లీ నివాసి రవీంద్ర నరగుంద అనే వ్యక్తి బాధితుడు. టీవీ ఎంటర్ ప్రైజస్ సంస్థ యజమాని రవీంద్రకు వంచకులు రఘు ప్రసాద్, వైశాలి, దావల్ సాబ్ అనే ముగ్గురు చెత్త బుట్టలు ఇస్తామని నమ్మించి పైన పేర్కొన్న మొత్తం వారి ఖాతాల్లోకి బదలాయించుకొని చెత్త బుట్టలను ఇవ్వకుండా వంచించినట్లు బాధితుడు ఉపనగర పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నగరసభ ఉపాధ్యక్ష పదవికి రాజీనామా



రాజీనామాను అధికారిణికి అందజేస్తున్న దృశ్యం

హొసపేటె: నగరసభ ఎన్నికల్లో 15వ వార్డు నుంచి బీజేపీ తరఫున గెలుపొందిన ఉపాధ్యక్షుడు ఎల్‌ఎస్ ఆనంద్ శనివారం తన పదవికి రాజీనామా చేశారు. నగరసభ అధ్యక్షురాలు సుంకమ్మ, ఉపాధ్యక్షుడు ఎల్‌ఎస్ ఆనంద్ బీజేపీ నుంచి గెలుపొందారు. ప్రస్తుతం నగరసభ అధికారం బీజేపీ చేతిలో ఉన్నందున ఎలాగైనా దక్కించుకునేందుకు కాంగ్రెస్ పావులు కదుపుతోంది. ఇటీవల ఎమ్మెల్యేగా కాంగ్రెస్ నుంచి హెచ్‌ఆర్ గవియప్ప గెలుపొందారు. 35 వార్డుల్లో కాంగ్రెస్ సభ్యులదే పైచేయిగా ఉన్నందున త్వరలో నగరసభ అధ్యక్ష, ఉపాధ్యక్ష స్థానాలను కాంగ్రెస్ దక్కించుకోనున్న నేపథ్యంలో ముందుగా ఉపాధ్యక్షుడు ఎల్‌ఎస్.ఆనంద్ తన రాజీనామా లేఖను అదనపు జిల్లాధికారిణి అనురాధకు అందజేశారు. ఈ సందర్భంగా వార్డు సభ్యులు పాల్గొన్నారు.

సైకిల్ తొక్కితే ఆరోగ్యానికి మేలు



జాతాను ప్రారంభిస్తున్న అధికారులు

హొసపేటె: సైకిల్ తొక్కడం వల్ల పర్యావరణ కాలుష్యాన్ని అరికట్టడంతో పాటు మానవ ఆరోగ్యానికి కూడా ఉపకరిస్తుందని జిల్లా సర్వేయర్ డాక్టర్ షణ్ముఖ్‌నాయక్ తెలిపారు. శనివారం జిల్లా ఆస్పత్రిలో ప్రపంచ సైకిల్ దినోత్సవంలో భాగంగా ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సైకిల్ జాతాను ఆయన ప్రారంభించి మాట్లాడారు. రోజువారీ కార్యకలాపాల్లో కనీసం 5-10 కిలో మీటర్ల మేర సైకిల్ తొక్కడం వల్ల ఎలాంటి వ్యాధి వచ్చినా తొలి దశలోనే నివారణ చేపట్టవచ్చని తెలిపారు. అనంతరం సైకిల్ జాతాను నగరంలోని ప్రముఖ వీధుల్లో చేపట్టారు. ఈసందర్భంగా తాలూకా వైద్యాధికారి బసవరాజు, ఆర్‌సీహెచ్ అధికారి జంబయ్య, ఆరోగ్య విద్యాశాఖాధికారి దొడ్డమని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కూలీ కార్మికుల సమస్యలు తీర్చరూ

కంప్లి: గ్రామీణ కూలీ కార్మికుల సమస్యలు తీర్చాలని ఒత్తిడి చేస్తూ నరేగా కూలి కార్మికులు టీపీ ఈఓకు వినతిపత్రం అందించారు. అనంతరం సంఘం తాలూకా సంచాలకురాలు వీ.పవిత్ర మాట్లాడుతూ ప్రతి కూలీ కార్మికునికి వంద రోజుల పని అందించి రూ.316 కూలి ప్రకటించాలన్నారు. తమకు ఇంతవరకు ఎలాంటి సౌకర్యాలు అందడం లేదన్నారు. కూలీ పనుల కోసం అర్జీలు అందించినా కూలీ పనులు ఇవ్వడం లేదన్నారు. ఒక వేళ పనులు నిర్వహించినా నిర్ణయించిన కూలీ సొమ్ము కంటే తక్కువ కూలీ ఇస్తున్నారని ఆరోపించారు. కూలీ పనులు చేస్తున్న స్థలంలోనే మృతి చెందిన ఎమ్మిగనూరు గ్రామ ముద్దాపుర సణ్ణ జడెప్ప కుటుంబానికి పరిహార ధనం అందించాలని ఒత్తిడి చేశారు. ఈ సందర్భంగా తాలూకా సమన్వయ సంచాయకురాలు వాణి, హరపనహళ్లి తాలూకా సంచాలకురాలు భాగ్య, బళ్లారి జిల్లా సంచాలకురాలు అక్కమ్మ, నరేగ కూలి కార్మికులు పాల్గొన్నారు.

దేవదాసీలకు సౌకర్యాలేవీ?

కంప్లి: మాజీ దేవదాసీలకు పునర్వసతి కల్పించి నెలవారి వేతనం రూ.5 వేలు అందించాలని దేవదాసీ విమోచన సంఘం రాష్ట్ర కార్యదర్శి బీ.మాళమ్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమె విలేకరులతో మాట్లాడుతూ బళ్లారి, విజయనగర జిల్లాల్లో ప్రైవేట్ సంస్థలు నిర్వహించిన సర్వే వల్ల తమకు ఎలాంటి సౌకర్యం కలగలేదన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహించి న్యాయం చేయాలని కోరారు.

నిలిచిఉన్న లారీని ఢీకొన్న ఐచర్

- తుమకూరు వాసి మృతి



గుత్తి ఆసుపత్రిలో డ్రైవర్‌కు వైద్యుల చికిత్స

గుత్తి రూరల్: అనంతపురం జిల్లా గుత్తి మండలంలోని ఊబిచెర్ల గ్రామ శివారులో జిల్లా సరిహద్దు పాదొడ్డి వద్ద శుక్రవారం అర్ధరాత్రి ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఐచర్ ఢీకొన్న ప్రమాదంలో డ్రైవర్ హేమంత్ (38) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రం తుమకూరు పట్టణానికి చెందిన హేమంత్ ఐచర్ డ్రైవర్ పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఈ క్రమంలో హైదరాబాదు నుంచి లోడు తీసుకొని బెంగళూరుకు వెళ్తుండగా మార్గమధ్యలో పాదొడ్డి ఎదురుగా ఆగి ఉన్న లారీని అదుపుతప్పి వేగంగా వెళ్లి ఢీకొన్నాడు. ప్రమాదంలో ఐచర్ వాహనం అద్దాలలో నుంచి ఎగిరి బయట పడి హేమంత్ తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న హైవే అంబులెన్స్ సిబ్బంది రోడ్డుపై పడి ఉన్న హేమంత్‌ను వెంటనే చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అతడి పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్సలకు అనంతపురం సర్వజనాసుపత్రికి తరలించారు. అయితే అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక శనివారం ఉదయం మృతి చెందాడు. పోలీసులు మృతుని కుటుంబసభ్యులకు సమాచారం అందించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

అధిక మొత్తానికి పెద్ద నోట్ల మార్పిడి యత్నం

- బెళగావిలో ముగ్గురు అరెస్ట్



అరెస్ట్ అయిన నిందితులు, పట్టుబడిన నగదు

రాయచూరు రూరల్: కేంద్ర ప్రభుత్వం రూ.2 వేల నోట్ల చలామణికి గడువు విధించడంతో వాటి మార్పిడికి ప్రజలు పలు రకాల ఇబ్బందులు పడుతున్నారు. దీనినే ఆసరాగా చేసుకొని ప్రజలను నమ్మించి అధిక మొత్తం ఇస్తామంటూ ఘరానా మోసానికి యత్నించిన ఘటన బెళగావిలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలు.. రూ.500 నోట్లు రూ.5 లక్షలు చెల్లిస్తే రూ.2 వేల నోట్లను రూ.6 లక్షలు ఇస్తామని మీరజ్ సమీర్ మోస్లే చేసిన ప్రయత్నంపై పోలీసులు విచారణ చేపట్టారు. అస్లాం, జాధవ్‌లతో ఉన్న పరిచయంతో అథణి తాలూకా మంగసూళి ఆలయం వద్దకు రూ.5 లక్షలు తీసుకొని వచ్చిన వారిని పోలీసులు వచ్చారని బెదిరించడంతో పరారయ్యారు. పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ మీరజ్ సమీర్ మోస్లేతో పాటు మరో ఇద్దరిని కాగవాడ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఉదంతంలో ప్రధాన ముద్దాయి ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తున్నారు.

బళ్లారిని గ్రీన్ సిటీగా మారుస్తాం

సాక్షి, బళ్లారి: బళ్లారిలో విపరీతమైన ఎండల వల్ల వేసవి కాలంలో జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఈ నేపథ్యంలో నగరంలోని 12 లక్షలు మొక్కలు నాటి పచ్చదనం పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు నగర ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి సోదరుడు, కాంగ్రెస్ పార్టీ నాయకుడు నారా శరత్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన అటవీశాఖ అధికారులు సందీప్,రాఘవేంద్ర తదితరులతో సమావేశం కావడంతో పాటు నగరంలోని చెట్లు పెంపకం సంబంధించి స్థలాలను పరిశీలించారు. నగరంలో ఈ నెల 5వ తేదీన ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా పెద్దసంఖ్యలో మొక్కలు నాటనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పోలీసులు వేధిస్తే కాల్ చేయండి

బళ్లారిటౌన్: పోలీసుల నుంచి ఏవైనా వేధింపులు ఎదురైతే వెంటనే కాల్ సెంటర్-9480803083 నంబరుకు ఫిర్యాదు చేయవచ్చని ఎస్పీ రంజిత్ కుమార్ తెలిపారు. శనివారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు నమోదు విషయంలో పోలీసులు సక్రమంగా స్పందించడం లేదని ఆరోపణలు వస్తున్నందున ప్రత్యేక సహాయవాణిని ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు నిర్భయంగా కాల్ సెంటర్‌కు ఫిర్యాదు చేయవచ్చన్నారు. అనవసరంగా జరిమానా విధించరాదన్నారు. గతంలో ఇన్ని కేసులు నమోదు కావాలనే లక్ష్యం ఉండేదని, ప్రస్తుతం అలా లేదన్నారు. ట్రాఫిక్‌లో దాఖలాల వెరిఫికేషన్ పేరుతో వేధిస్తే కూడా ఫిర్యాదు చేయవచ్చని, సహాయవాణి-112 కూడా పని చేస్తుందని ఆయన తెలిపారు.

కానిస్టేబుల్ అదృశ్యం



చంద్రశేఖర్(ఫైల్)

హొసపేటె: చిత్తవాడిగి పోలీసు స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న వై.చంద్రశేఖర్ గత కొద్ది రోజుల నుంచి కనబడటం లేదని పట్టణ పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఆర్.పద్మావతి తెలిపారు. ఈ విషయంపై శనివారం పట్టణ పోలీసు స్టేషన్‌లో కానిస్టేబుల్ బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కానిస్టేబుల్ 5.6 అడుగుల ఎత్తు, గోధుమ రంగు శరీరఛాయ, గుండ్రని ముఖం కలిగి, కన్నడ, హిందీ భాషల్లో మాట్లాడగలడని, ఆచూకీ తెలిపిన వారు పట్టణ పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

సొంతదారుకు మొబైల్ అందజేత

కంప్లి: రూ.40 వేల విలువ చేసే మొబైల్ ఫోన్‌ను పోగొట్టుకొన్న వ్యక్తికి తిరిగి ఫోన్‌ను అందించిన ఘటన హంపీలో శనివారం జరిగింది. చారిత్రక ప్రేక్షణీయ స్థలం హంపీని సందర్శించేందుకు వచ్చిన కేరళ వ్యక్తి విజయవిఠల దేవస్థానం వద్ద మొబైల్‌ను పోగొట్టుకున్నాడు. అదే ప్రాంతంలో విధుల్లో ఉన్న పోలీసులు రామానాయక్, జయప్రకాష్‌లకు మొబైల్ కోల్పోయిన వ్యక్తి సమాచారం అందించగా, వారు మొబైల్‌ను కనుగొని పదిలంగా పోగొట్టుకున్న వ్యక్తికి అందించారు.

కోలారు వార్తలు...

జూలై 8న జాతీయ లోక్‌అదాలత్

శ్రీనివాసపురం: రాష్ట్ర, జిల్లా న్యాయ సేవల ప్రాధికార ఆదేశాల మేరకు జూలై 8న జాతీయ లోక్‌అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు సీనియర్ సివిల్ న్యాయమూర్తి ఈశ్వర్ తెలిపారు. ఆయన న్యాయాలయ ప్రాంగణంలో జాతీయ లోక్‌అదాలత్ నిర్వహణపై అధికారులతో పూర్వసిద్ధతా సమావేశంలో పాల్గొని మాట్లాడారు. లోక్‌అదాలత్‌లో చెక్‌బౌన్స్, విద్యుత్, వాటర్ బిల్లులు, రాజీ చేసుకోదగిన కేసులు, కుటుంబ సంబంధిత, వివాహ విచ్ఛేదన, రియల్ ఎస్టేట్ వ్యవహారాలు, వినియోగదారుల వేదిక కేసులను పరిష్కరిస్తారని తెలిపారు. లోక్‌అదాలత్ ప్రయోజనాన్ని ప్రతి ఒక్కరూ పొందాలని, తద్వారా తమ కేసులను పరిష్కరించుకొని డబ్బు, సమయం ఆదా చేసుకోవాలని తెలిపారు. సమావేశంలో తాలూకా న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు పీఎం సదాశివ, సీఐ లక్ష్మీకాంత్, సురేష్, రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రసన్న లక్ష్మీ వేంకటరమణుని హుండీ లెక్కింపు



హుండీలోని కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

కేజీఎఫ్: కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం నగరంలోని శ్రీ ప్రసన్న లక్ష్మీ వేంకటరమణస్వామి ఆలయ హుండీ కానుకలను లెక్కించారు. హుండీలో రూ.8,28,875 లక్షలు సేకరణ అయింది. ఉదయం 8 గంటలకు హుండీ లెక్కింపును ప్రారంభించి సాయంత్రం వరకు కొనసాగించారు. కలెక్టరేట్ దేవదాయ శాఖ గుమాస్తా పద్మమ్మ, ఫస్ట్‌గ్రేడ్ అసిస్టెంట్ నవీన్, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, ఆలయ కార్యనిర్వాహక అధికారి, అర్చకులు, గ్రామ సహాయకుల సమక్షంలో హుండీని లెక్కించారు. ఈ సందర్భంగా శిరస్తేదార్ జనార్దన సింగ్, ఆర్‌ఐ రఘురాం సింగ్, గ్రామ లెక్కాధికారి చంద్రు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు నిర్వహించాలని ధర్నా

కేజీఎఫ్: బెమెల్ ఫ్యాక్టరీ ఎస్సీ, ఎస్టీ క్షేమాభివృద్ధి సంఘానికి ఎన్నికలు నిర్వహించాలని ఒత్తిడి చేస్తూ శనివారం సంఘం కార్యాలయం ఎదుట కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు మాట్లాడుతూ ప్రస్తుత సంఘం అధ్యక్షుడి అవధి ముగిసి రెండేళ్లు గడిచినా సంఘానికి ఎన్నికలు నిర్వహించలేదని ఆరోపించారు. కాలయాపన చేయడం మాని సంఘానికి వెంటనే ఎన్నికల నిర్వహణకు తేదీని నిర్ణయించాలని కార్మికులు డిమాండ్ చేశారు.

ఘనంగా పాదరాజుల ఆరాధనోత్సవం



పాదరాజుల వారి బృందావనానికి అభిషేకం నిర్వహించి పూజిస్తున్న అర్చకులు

శ్రీనివాసపురం: ముళబాగిలులోని నరసింహ తీర్థంలో వెలిసిన పాదరాజుల మఠంలో రాయల వారి ఆరాధన మహోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమాలు ఆదివారం వరకు కొనసాగుతాయి. శనివారం మధ్యారాధన కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కూడలి అక్షోభ్య తీర్థమఠం రఘువిజయతీర్థ శ్రీపాదంగళ్ మాట్లాడుతూ పాదరాజుల మఠం ఆధ్యాత్మికంగా ప్రవర్ధమానమైందన్నారు. సుసంస్కృత సమాజ నిర్మాణానికి తనదైన సేవలను రాయరు అందించారన్నారు. పాదరాజుల వారు భోగభాగ్యాలను, ధార్మికంగా దైవస్మరణ ద్వారా భగవంతుడిని చూశారన్నారు. మఠంలో ఉదయం సంస్థాన పూజ, సంచామృత అభిషేకం, యోగా నరసింహ దేవుడికి విశేష పంచామృత అభిషేకం, తీర్థ ప్రసాద వినియోగం, సాయంత్రం ప్రాకారోత్సవం, మహా మంగళారతి నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

పథకాలు చివరి వ్యక్తికీ అందించాలి



ప్రజల ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే వెంకటశివారెడ్డి

శ్రీనివాసపురం: ప్రభుత్వ పథకాలను చివరి వ్యక్తికి కూడా అందించే ప్రయత్నం చేయాలని ఎమ్మెల్యే జీకే వెంకటశివారెడ్డి అధికారులకు సూచించారు. శనివారం పట్టణంలోని పురసభ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ప్రచారంలో పట్టణంలోని అన్ని వార్డుల్లో తిరిగి ప్రజలకు ఇచ్చిన హామీలను అన్నింటిని నెరవేర్చే ప్రయత్నం చేస్తామన్నారు. తాగు నీరు, వీధి దీపాలు, స్వచ్ఛత తదితరాలకు ప్రాధాన్యతనిస్తామన్నారు. వార్డుల్లో నాసిరకం వీధి దీపాలను తొలగించి నాణ్యమైన దీపాలను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఈ-ఖాతాల కోసం వచ్చే నగర ప్రజలను వేధించకుండా వారి పనులను సత్వరమే చేసివ్వాలన్నారు. పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరికీ సౌలభ్యాలను అందించాలన్నారు. ఈ సందర్భంగా పురసభ పాలనాధికారి శరీన్‌తాజ్, ముఖ్యాధికారి వైఎస్ సత్యనారాయణ, కార్యాలయ మేనేజర్ నవీన్‌చంద్ర, రెవిన్యూ అధికారులు వి.నాగరాజ్, ఎస్.శంకర్ పాల్గొన్నారు.

ఎన్నికల్లో మద్దతివ్వండి

కోలారు: న్యాయవాదుల సంఘానికి ఆదివారం జరుగుతున్న ఎన్నికల్లో తమకు ఓటు వేసి గెలిపించాలని జిల్లా న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు వి వెంకటాచల మనవి చేశారు. నగరంలో పాత్రికేయులతో ఆయన విలేకరులతో మాట్లాడారు. సుమారు 28 ఏళ్లుగా న్యాయవాదిగా ఉన్న తనకు న్యాయవాదుల సమస్యలు తెలుసన్నారు. కోర్టు ప్రాంగణంలో పార్కింగ్ సౌలభ్యం, కోచింగ్ సెంటర్ల ద్వారా యువ న్యాయవాదులకు ప్రోత్సాహం, అవగాహన కార్యక్రమాలు, మహిళా న్యాయవాదులకు విశేష సౌలభ్యాలను కలిప్తానన్నారు. ఈసందర్భంగా సంఘం మాజీ కార్యదర్శి ఎస్.సతీష్ ఉన్నారు.

ఇంటి తాళాలు పగులగొట్టి చోరీ

హుబ్లీ: హుబ్లీ కుసుగల్ రోడ్డు బెలవణికె కాలనీలో ఓంప్రకాష్ అనే వ్యక్తికి చెందిన ఇంట్లో విలువైన ఆభరణాలను దుండగులు చోరీ చేశారు. పని మీద ఓంప్రకాష్ విజయపుర, కలఘటిగిలకు వెళ్లిన విషయాన్ని పసిగట్టిన దొంగలు ఇంటి తాళాలు పగలకొట్టి అల్మారాల్లోని సుమారు రూ.2 లక్షల విలువ చేసే 5 గ్రాముల బంగారు, 60 గ్రాముల వెండి సామాన్లతో పాటు రూ.80 నగదును చోరీ చేసి పరారయ్యారు. ఈమేరకు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేశ్వాపుర పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది.

రూ.1.92 లక్షల మేరకు వంచన

స్థానిక రాజీవ్‌నగర పోలీస్ క్వార్టర్స్ నివాసి శ్వేత గణపతికి గుర్తు తెలియని వ్యక్తి బ్యాంక్ అధికారినంటూ ఫోన్ చేసి బ్యాంక్ ఖాతా వివరాలు తెలుసుకొని రూ.1.92 లక్షల మేరకు వంచించినట్లు బాధితురాలు సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

క్లుప్తంగా

దొడ్డమ్మ దేవి ఆలయ వార్షికోత్సవం



బొమ్మనహళ్లి: నగరంలోని హెచ్‌ఎస్‌ఆర్ లేఔట్ పరిధి అగర సమీపంలో ఉన్న ఇబ్బలూరు గ్రామ దేవత శ్రీ దొడ్డమ్మ దేవి 33వ ఆలయ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. వేద పండితులు వివిధ హోమాలు, పూజలు చేశారు. అమ్మవారి మూల విరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అంతకు ముందు అమ్మవారిని గ్రామంలో ఊరేగించారు.

డ్రమ్మిస్ట్ రమేష్ ఆదర్శం



మాట్లాడుతున్న లింబావళి

కృష్ణరాజపురం: యువ కళాకారులు డ్రమ్మిస్ట్ సునీల రమేష్‌ను ఆదర్శంగా తీసుకోవాలని మాజీ మంత్రి అరవింద లింబావళి అన్నారు. అరవింద లింబావళి వివాహ వార్షికోత్సవం సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డ్రమ్మిస్టు రమేశ్ ఎంతో మందికి శిక్షణ ఇస్తున్నాడని, ఇందులో గిన్నిస్‌బుక్ రికార్డును కూడా సాధించాడని అన్నారు.

చాముండి కొండకు పాదయాత్ర

మైసూరు: జిల్లాలోని కాళిసిద్దనహుండి గ్రామానికి చెందిన మహిళలు గ్రామం నుంచి చాముండికొండకు పాదయాత్ర చేశారు. కొండపైన అమ్మవారి ఆలయం ముందు 1001 కొబ్బరి కాయలను కొట్టారు. సిద్దరామయ్య మళ్లీ సీఎం కావడంతో మొక్కు తీర్చుకోవడానికి పాదయాత్ర నిర్వహించినట్లు తెలిపారు. సుమారు 25 కిలోమీటర్ల దూరం వరకు నడిచి వచ్చినట్లు తెలిపారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

- మంత్రి రామలింగారెడ్డి



పనులను పరిశీలిస్తున్న మంత్రి

బొమ్మనహళ్లి: మరి కొన్ని రోజుల్లో వర్షాకాలం రానుందని, దీంతో నగరంలో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని రవాణా శాఖ మంత్రి రామలింగారెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన నగరంలోని బీటీఎం లేఔట్ మడివాళ వార్డు పరిధి తావరెకెర మెయిన్ రోడ్డులో జరుగుతున్న డ్రైనేజీ అభివృద్ధి పనులను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. రానున్నది వర్షాకాలం కావడంతో వర్షపు నీరు సులువు వెళ్లడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు తన దృష్టికి వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ మేయర్ మంజునాథ రెడ్డి, నాయకుడు ఎస్టీడీ మంజునాథ్ తదితరులు మంత్రి వెంట ఉన్నారు.

లారీ ఢీకొని బైకిస్టు మృతి

- హైవేపై బంధువుల ధర్నా

క్రిష్ణగిరి: టిప్పర్ లారీ ఢీకొనడంతో బైక్‌పై వెళుతున్న రైతు ఘటనా స్థలంలోనే మృతి చెందిన ఘటన కురుబరపల్లి వద్ద జరిగింది. వివరాల మేరకు వేపనపల్లి సమీపంలోని పురం గ్రామానికి చెందిన రైతు శివాజీరావ్ (70), వ్యవసాయ ఉపకరణాలు కొనేందుకు ద్విచక్రవాహనంలో సమీపంలోని కురుబరపల్లికెళ్లాడు. ఆ సమయంలో హైవేపై వెళుతున్న టిప్పర్ లారీ డ్రైవర్ గస్తీ తిరుగుతున్న పోలీసులను చూసి వేగంగా నడుపుకొంటూ వెళ్లి ద్విచక్రవాహనాన్ని ఢీకొన్నాడు. ఈ ఘటనలో తీవ్ర గాయాలేర్పడిన శివాజీరావ్ ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. విషయం తెలుసుకొన్న బంధువులు ఘటనా స్థలానికి చేరుకొని పోలీసులు గస్తీ తిరుతుండడంతో మామూలు వసూలు చేస్తారనే భయంతో లారీ డ్రైవర్ వేగంగా నడుపుకొంటూ వెళ్లి బైక్‌ను ఢీకొందని ఆరోపిస్తూ జాతీయ రహదారిపై ఆందోళన చేపట్టారు. కురుబరపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఆందోళనకారులతో చర్చించి లారీ డ్రైవర్‌పై చర్యలు చేపడతామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

డాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

చింతామణి: పట్టణంలోని చిన్న పిల్లల ఆస్పత్రిలో ప్రసవానికి వచ్చిన మహిళ వద్ద లంచం తీసుకున్న డాక్టర్ జయరాంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జయ కర్ణాటక సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం తాలూకా ఆరోగ్య అధికారి డాక్టర్ సంతోశ్‌కు వినతిపత్రం అందజేశారు. పట్టణంలోని 31 వార్డుకు చెందిన ఐశ్వర్య అనే మహిళ ప్రసవానికి వచ్చిన సమయంలో డాక్టర్ జయరాం, నర్సు రూ. 5 వేలు డిమాండ్ చేశారని, మూడు వేలు తీసుకున్నట్లు తమ వద్ద సాక్ష్యం ఉందని వారు చెప్పారు. ఈ సందర్భంగా సత్యనారాయణ సింగ్, శ్రీనివాస, నరసింహప్ప పాల్గొన్నారు.

తండ్రీ కూతురు కలిసి మర్డర్ ప్లాన్

- టైల్స్ వ్యాపారి హత్య కేసులో నలుగురు అరెస్టు





నిందితులు రబాని, కుబ్రాన్, జుకీ, వికాస్

తుమకూరు: టైల్స్ షాపు యజమానిపైన దాడి చేసి హత్య చేసిన కేసులో తుమకూరు గ్రామీణ పోలీసులు నలుగురు నిందితులను అరెస్టు చేశారు. మే నెల 20వ తేదీన రాత్రి సుమారు 9 గంటల సమయంలో చిక్కమగళూరు చెందిన జాకీర్ అనే వ్యాపారిని కొందరు వేట కొడవళ్ళతో దాడి చేసి హతమార్చారు. పోలీసులు విచారణ జరిపి కుబ్రాన్, రబాని, వికాస్, మరో యువతిని అరెస్టు చేశారు. హతుడు, నిందితులు అందరూ చిక్కమగళూరుకు చెందినవారే. జాకీర్‌కు– కుబ్రాన్ కుమార్తె అయిన రబానికి మధ్య గతంలో గొడవ జరిగింది. ఈ కక్షతో కుబ్రాన్, రబాని, రబాని ప్రియుడు వికాస్, మరో అమ్మాయి జుకీ కలిసి జాకీర్ హత్యకు పథకం వేశారు.

అక్రమ సంబంధం రగడ

ఈ హత్య జరగడానికి మూల కారణం జాకీర్‌కు, రబానీకి మధ్య అక్రమ సంబంధం ఉందని, ఈ కారణంతో కుబ్రాన్ అతనితో అనేకసార్లు ఘర్షణ పడ్డాడని తెలిసింది. జాకీర్ చిక్క మగళూరు ఇక్కడికి వచ్చి తుమకూరులో టైల్స్ వ్యాపారం చేయడానికి షాపును ఏర్పాటు చేశాడు. ఇంతలో కుబ్రాన్ ముఠా వచ్చి అతన్ని హత్య చేసిందని పోలీసులు తెలిపారు. నిందితులను అరెస్టు చేసి మారణాయుధాలను స్వాధీనం చేసుకున్నారు.

పెట్రోల్ బంక్‌లో కల్తీ



పెట్రోల్ బంక్ వద్ద ఆందోళన నిర్వహిస్తున్న వాహనదారులు



కల్తీ పెట్రోల్‌ను చూపిస్తున్న దృశ్యం

- వాహనదారుల ఆందోళన

క్రిష్ణగిరి: హోసూరు–క్రిష్ణగిరి జాతీయ రహదారిపై నిర్వహిస్తున్న పెట్రోల్ బంక్‌లో నీరు కల్తీ చేసి వాహనాలకు వేస్తున్నారని ఆరోపిస్తూ వందకు పైగా వాహనదారులు శుక్రవారం సాయంత్రం ఆందోళనకు దిగారు. తాలూకా కేంద్రం సూళగిరిలో జాతీయ రహదారి పక్కన నిర్వహిస్తున్న హెచ్‌పీ పెట్రోల్ బంక్‌ను నిర్వహిస్తున్నారు. ఈ పెట్రోల్ బంక్‌లో రోజూ వేల సంఖ్యలో ద్విచక్ర వాహనాలు, కార్లు పెట్రోల్, డీజిల్ వేయించుకుంటారు. కొద్ది రోజులుగా నీరు కలిపిన కల్తీ పెట్రోల్, డీజిల్‌ను విక్రయించడంతో వాహనాలు మార్గం మధ్యలోనే మరమ్మతులకు గురవుతున్నాయి. శుక్రవారం సాయంత్రం ఆవేశానికి గురైన వాహనదారులు హోసూరు–క్రిష్ణగిరి జాతీయ రహదారిపై ఆందోళన చేపట్టారు. సమాచారం అందుకున్న సూళగిరి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఆందోళనకారులతో మాట్లాడారు. బంక్‌లో విక్రయిస్తున్న పెట్రోల్, డీజిల్‌ను పరిశీలించగా కల్తీ ఉన్నట్లు తేలింది. బంక్ నిర్వాహకులపై చర్యలు చేపడతామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

దేవుడిచ్చిన బాధ్యతలను నమ్మకంతో చేయాలి



సమావేశంలో వివిధ తెలుగు చర్చీల పాస్టర్లు, పెద్దలు

శివాజీనగర: క్రైస్తవ సంఘాల్లో సేవకులకు దేవుడిచ్చిన బాధ్యతలను నమ్మకంగా కొనసాగించాలని దైవజనుడు పాస్టర్ డేవిడ్‌సన్ తెలిపారు. శనివారం నగరంలోని మత్తికెర ఏ టు జే తెలుగు చర్చిలో ఏర్పాటు చేసిన బెంగళూరు తెలుగు పాస్టర్స్ ఫెలోషిప్ నెలవారి సమావేశంలో పాల్గొని, పరిశుద్ధ బైబిల్ గ్రంథం ప్రకారం పాస్టర్స్ నడచుకోవాల్సిన విధానాలను ఆయన విశదీకరించారు. దేవుని పని నిమిత్తం ఎంపిక చేసుకున్న దైవ సేవకులు నిర్దోశ మార్గమందు నడచుకోవాలని, అప్పుడే ఆ భగవంతుడికి పరిచారకులవుతారని తెలిపారు. బెంగళూరు తెలుగు పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు డాక్టర్ పీ.డీ.ఇమ్మానియేల్ మాట్లాడుతూ... ప్రతి నెల మొదటి శనివారం బీటీపీఎఫ్ సమావేశం నగరంలో వివిధ చర్చీల్లో జరుపుతూ వస్తున్నామని తెలిపారు. ఈ సమావేశాల ద్వారా పాస్టర్లు, సంఘ పెద్దలు ప్రార్థన, సహవాసం, ఐక్యతగా ఉండాలనే సదుద్దేశ్యంతోనే నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. బీటీపీఎఫ్ సభ్యులంతా ప్రతి నెల మొదటి వారం తమ చర్చీల్లో కానుకలను బెంగళూరు బాప్టిస్ట్ ఆసుపత్రిలో డిపాజిట్ చేయాలని తెలియజేశారు. ఈ సందర్భంగా ఆధ్యాత్మిక, సమాజ సేవలు చేస్తున్న రెవరెండ్ వై.ప్రభుదాస్‌కు జాతీయ అవార్డును బహూకరించి సత్కరించారు. బెంగళూరు నగరంలో దేవుడి సేవలు చేస్తున్న పాస్టర్ వై.ప్రభుదాస్ పేదలకు దుస్తులు, ఆహారం పంపిణీ చేయటంతో పాటుగా వారికి దైవ వర్తమానాన్ని అందించటాన్ని సంస్థ గుర్తించిందని, దీంతో ఆయన సేవలకు జాతీయ అవార్డును ప్రదానం చేస్తున్నట్లు రెవరెండ్ డాక్టర్ ఎం.దానియేల్ తెలిపారు. సమావేశంలో బెంగళూరు తెలుగు పాస్టర్స్ ఫెలోషిప్ సలహాదారులు, అమానా తెలుగు చర్చి పాస్టర్ రెవరెండ్ డాక్టర్ రాజశేఖర్, రెవరెండ్ ఎలీషా, ఏ టు జే తెలుగు చర్చి పాస్టర్ రాజేంద్ర బాబు, వివిధ చర్చీలు పాస్టర్లు రెవరెండ్ పీ.ఎస్.కుమార్, విజయకుమార్, రెవరెండ్ దానియేల్ మంచాల, దాస్, తిమోతి తదితరులు పాల్గొన్నారు.

సిలిండర్ల లారీ బోల్తా



ప్రమాదానికి గురైన క్యాంటర్

సోమందేపల్లి: పుట్టపర్తి జిల్లా పెనుకొండ నియోజకవర్గంలో పేటకుంట సమీపంలో అదుపుతప్పి గ్యాస్ సిలిండర్ల లోడుతో వెళుతున్న వాహనం బోల్తా పడిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. కర్నూలు నుంచి బెంగళూరుకు వెళుతున్న సిలిండర్ల క్యాంటర్ పేటకుంట పారిశ్రామిక పార్క్ వద్దకు రాగానే అదుపుతప్పి రోడ్డుపక్కన పడిపోయింది. డ్రైవర్ నిద్ర మత్తులో ఉండడమే కారణమని పోలీసులు తెలిపారు. ఒక సిలెండర్ నుంచి గ్యాస్ లీక్ అవుతుండడంతో ఫైర్ స్టేషన్ సిబ్బందిను రప్పించి అగ్ని ప్రమాదం జరుగకుండా చర్యలు చేపట్టారు. డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉత్సాహంగా ఐటీ ఉద్యోగుల సైక్లోథాన్



సైక్లోథాన్‌లో ఐటీ ఉద్యోగులు

బనశంకరి: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలనే నినాదంతో క్యానరిస్ ఆటోమేషన్స్ సాఫ్ట్‌వేర్ సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ సైకిల్ దినోత్సవం, ప్రపంచ పరిసర దినోత్సవం సందర్భంగా సైకిల్ ర్యాలీ నిర్వహించారు. శనివారం బనశంకరి మూడోస్టేజ్ దేవెగౌడ పెట్రోల్‌బంక్ నుంచి తురహళ్లి వరకు పది కిలోమీటర్ల మేర నిర్వహించిన గ్రీన్ వీల్ సైక్లోథాన్‌ను క్యానరీస్ ఆటోమేషన్స్ సంస్థ వ్యవస్థాపక డైరెక్టర్ రామన్‌సుబ్బారావ్, శేషాద్రి శ్రీనివాస్, రఘుచంద్రశేఖరయ్య, అరుణ్ డీకే, పుష్పరాజ్‌శెట్టి తదితరులు ప్రారంభించారు. సైక్లోథాన్‌లో పరిసరాల సంరక్షణపై ప్రజలను జాగృతం చేశారు. రామన్ సుబ్బారావ్ మాట్లాడుతూ...అభివృద్ధి పేరుతో చెట్లు తొలగించి పరిసరాలను నాశనం చేస్తున్నారని, దీంతో మనుషుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. అభివృద్ధితో పాటు పరిసరాలు కాపాడే పథకాలను రూపొందించినప్పుడే ఉత్తమ వాతావరణంలో జీవనం సాగించవచ్చునని తెలిపారు.

ట్రక్‌ను ఢీకొన్న లారీ

- డ్రైవర్‌కు తీవ్ర గాయాలు



నుజ్జునుజ్జయిన లారీ

దొడ్డబళ్లాపురం: ట్రక్‌ను లారీ వెనుక నుంచి ఢీకొన్న ప్రమాదంలో లారీ డ్రైవర్ తీవ్ర గాయాలపాలైన సంఘటన దొడ్డ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. శనివారం తెల్లవారుజామున బెంగళూరు–హిందూపురం రహదారి మార్గంలోని డీక్రాస్ సర్కిల్లో హిందూపురం దిశగా ముందు వెళ్తున్న ట్రక్‌ను వెనుక నుండి వచ్చిన లారీ వేగంగా ఢీకొంది. ప్రమాదంలో లారీ ముందు భాగం నుజ్జునుజ్జవగా డ్రైవర్ తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు సమాచారం ఇవ్వడంతో అంబులెన్స్ సిబ్బంది వచ్చి గాయపడ్డ డ్రైవర్‌ను బెంగళూరు తరలించారు. దొడ్డ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. అయితే లారీ ఓవర్ లోడ్‌తో ఉండడంతో దాన్ని తొలగించడం సాధ్యం కాలేదు. దీంతో సాయంత్రం వరకూ ఈ రోడ్డులో ట్రాఫిక్ జామ్‌తో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

భార్యను హత్య చేసి హైడ్రామా

యశవంతపుర: భార్యను హత్య చేసిన ఓ వ్యక్తి ఏమీ ఎరుగనట్లు ఆస్పత్రికి తీసుకువచ్చారు. తన భార్య అచేతనంగా పడిపోయిందని రోదించాడు. దీంతో వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు తేల్చారు. ఈ ఘటన యశ్వంతపురలో జరిగింది. సమాచారం అందుకున్న పోలీసులు అనుమానాస్పద కేసుగా నమోదు చేశారు. నిందితుడు శరత్‌ను విచారణ చేయగా అసలు కథ బయటపడింది. వివరాలు... శరత్‌కు మొదటి భార్య ఉండగా రెండో భార్యగా ప్రియను ప్రేమించి పెళ్లి చేసుకున్నట్లు సమాచారం. ప్రియను వదలించుకోవాలని తరచూ ఆమెతో గొడవపడేవాడు. ఇదిలా ఉంటే రెండు రోజుల క్రిందట ప్రియతో గొడవపడి గొంతు నులిమి హత్య చేశాడు. అనంతరం ఏమి తెలియనట్లు ఆస్పత్రికి తీసుకువచ్చి రోదించాడు. అతని హైడ్రామాపై అనుమానించిన పోలీసులు పరిశీలించగా హత్య చేసినట్లు తేలింది. పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు.

బనశంకరి సన్నిధిలో మహా రుద్రయాగం



మహారుద్రయాగంలో చైర్మన్ బసవరాజ్, ఈఓ పద్మ, అర్చకులు తదితరులు



అమ్మవారి దర్శనానికి కుటుంబ సమేతంగా విచ్చేసిన మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

బనశంకరి: బనశంకరీదేవి ఆలయంలో కుంభాభిషేక మహోత్సవాలు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. శనివారం జేష్ఠ శుద్ధ చతుర్దశి సందర్భంగా ఉదయం 9 గంటలకు ఆలయం వద్ద అర్చకుల బృందంతో మహారుద్రయాగం నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ అర్చకులు సత్యనారాయణశాస్త్రి, చంద్రమోహన్, ఆలయ సమితి అధ్యక్షుడు బసవరాజ్, ఆలయ ఈఓ పద్మ పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొని భక్తులకు ప్రసాదం వితరణ చేశారు. సాయంత్రం ఆలయంపై కలశాలను అమర్చారు. సభ్యులు హెచ్.హనుమంతరాయప్ప, ఎల్.శోభా అంజనప్ప, సుగుణాబాలకృష్ణ, వీ.వెంకటేశ్, బీ.చంద్రు, ఏ.విజయ్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

బనశంకరి సన్నిధిలో మంత్రాలయం ఎమ్మెల్యే

బనశంకరీదేవి ఆలయ కుంభాభిషేక ఉత్సవాల్లో మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి పాల్గొన్నారు. శనివారం కుటుంబ సమేతంగా వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం మహారుద్ర యాగంలో పాల్గొన్నారు. కుంభాభిషేక ఉత్సవాల్లో పాల్గొనడం సంతోషంగా ఉందని బాలనాగిరెడ్డి అన్నారు.

హోసూరు వార్తలు..

ఇసుక లారీల స్వాధీనం

హోసూరు: హోసూరు ప్రాంతంలో అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ఆరు లారీలను పట్టణ పోలీసులు సీజ్ చేశారు. శుక్రవారం రాత్రి పట్టణ పోలీసులు రాయకోట రోడ్డు, ఒన్నలవాడి ప్రాంతాల్లో గస్తీ నిర్వహించారు. ఈ సమయంలో ఆ మార్గంలో రోడ్డుపక్కన అనుమానాస్పద స్థితిలో నిలిచి ఉన్న ఆరు లారీలను తనిఖీ చేయగా వాటిలో ఇసుక తరలిస్తున్నట్లు తెలిసింది. పోలీసులను గమనించిన డ్రైవర్‌లు పరారైనట్లు తెలిసింది. లారీలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పరారీలో ఉన్న డ్రైవర్‌ల కోసం గాలిస్తున్నారు.

వేర్వేరు చోట్ల ఇద్దరు ఆత్మహత్య

హోసూరు: హోసూరు సమీపంలోని బేరికె ప్రాంతంలో వేర్వేరు కారణాలతో ఇద్దరు వ్యక్తులు ఆత్మహత్య చేసుకున్నారు. వివరాలు... బేరికె సమీపంలోని బి.కురుబరపల్లి గ్రామానికి చెందిన ప్రకాష్ (38) డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇతను అవివాహితుడు. జీవితంపై విరక్తితో మద్యానికి బానిసైన ఇతను శుక్రవారం సాయంత్రం అదే ప్రాంతంలో చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. బేరికె పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నారు. అదే విధంగా సూళగిరి సమీపంలోని గొరగురికి గ్రామానికి చెందిన కార్మికుడు రామస్వామి (40). ఇతనికి తాగుడు అలవాటుండడంతో కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఉన్నాడు. శుక్రవారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. బేరికె పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నారు.

భార్య మరో పెళ్లి చేసుకుందని...

హోసూరు: భార్య మరో వ్యక్తిని పెళ్లి చేసుకుందని జీవితంపై విరక్తి చెందిన భర్త ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొన్న ఘటన రాయకోట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. వివరాలు...క్రిష్ణగిరి జిల్లా ఆలపాడి సమీపంలోని మురుకల్‌నత్తం గ్రామానికి చెందిన మాదయ్యన్ (38) రాయకోట సమీపంలోని బోడంబట్టిలోని బంధువుల ఇంట్లో ఉంటూ కూలి పనులు చేసి జీవనం సాగించేవాడు. ఈ నేపథ్యంలో మురుకల్‌నత్తంలో ఉంటున్న భార్య మరో పెళ్లి చేసుకున్నట్లు తెలిసింది. దీంతో మాదయ్యన్ ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొన్నాడు. రాయకోట పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నారు.

సైకిల్ తొక్కడం ఆరోగ్యం

చిక్కబళ్లాపురం: ప్రతి రోజు సైకిల్ తొక్కడం ఎంతో ఆరోగ్యమని, పర్యావరణాన్ని కూడా కాపాడుకోవచ్చని జిల్లా ఆరోగ్య, కుటుంబ కళ్యాణాధికారి డాక్టర్ మహేశ్‌కుమార్ తెలిపారు. శనివారం నగరంలో సైకిల్ జాతాను ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి రోజు 15 నిమిషాల పాటు సైకిల్ తొక్కడం ఎంతో ఆరోగ్యానికి ఎంతో ఉపయోగమని, రోగాలు దరిచేరవన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆస్పత్రి డాక్టర్ రమేశ్, జిల్లా ఆరోగ్య శిక్షణాధికారి హరీశ్, తాలూకా ఆరోగ్య అధికారి డాక్టర్ మంజుల తదితరులు పాల్గొన్నారు. జాతా జూనియర్ కళాశాల వరకు సాగింది.

పార్ట్‌టైం ఉపాధ్యాయులుగా నియామకం



ఉత్తర్వులు అందుకున్న దృశ్యం

హోసూరు: విద్యాభివృద్ధిలో అత్యంత వెనుకబడిన గిరిజన పిల్లలను మెరుగుపరిచే ఉద్దేశంతో హోసూరులోని అన్బుసైవోం స్వచ్ఛంద సంస్థ ద్వారా 15 గ్రామాల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించేందుకు పార్ట్‌టైం ఉపాధ్యాయులను నియమిస్తూ వారిని నియామక ఉత్తర్వులను అందజేశారు. హోసూరు కేంద్రంగా ఏర్పాటు చేసుకొని క్రిష్ణగిరి జిల్లా వ్యాప్తంగా గిరిజన పిల్లల విద్యాభివృద్ధికి, బాల్యవివాహాల నిర్మూలనకు కృషి చేస్తున్న అన్బుసైవోం సంస్థ విద్యలో వెనుకబడిన వేపనపల్లి, సూళగిరి యూనియన్‌లలోని 15 గిరిజన గ్రామాలను గుర్తించి ఆ గ్రామాల్లో పిల్లలకు ప్రత్యేక తరగతులు నిర్వహించేందుకు పార్ట్‌టైం ఉపాధ్యాయులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా వారికి నియామక ఉత్తర్వులను జిల్లా కేంద్రం క్రిష్ణగిరిలో అందజేశారు. సంస్థ నిర్వాహకులు గౌరీగురునాథన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నివృత ఉపాధ్యాయుడు మురుగన్ ముఖ్య అతిథిగా పాల్గొని ఉత్తర్వులు అందజేశారు.


కరుణానిధి శత జయంత్యుత్సవాలు



స్వీట్లు పంచుతున్న హోసూరు ఎమ్మెల్యే వై. ప్రకాష్

హోసూరు, కెలమంగలం: తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి, దివంగత కరుణానిధి శతజయంత్యుత్సవాలను క్రిష్ణగిరి జిల్లా వ్యాప్తంగా డీఎంకే నాయకులు శనివారం ఘనంగా జరుపుకొన్నారు. క్రిష్ణగిరి పశ్చిమ జిల్లా కార్యదర్శి, హోసూరు ఎమ్మెల్యే వై. ప్రకాష్, హోసూరు మేయర్ ఎస్.ఏ.సత్యల నేతృత్వంలో పట్టణంలోని 45 వార్డులలో నాయకులు, కార్యకర్తలు కేక్ కత్తిరించి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా సంక్షేమ ఫలాలను అందజేశారు. తళి నియోజకవర్గంలోని మదగొండపల్లిలో చైర్మన్ శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన శతజయంత్యుత్సవాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హోసూరు ఎమ్మెల్యే వై. ప్రకాష్ పాల్గొని కేక్ కత్తిరించి అందరికీ పంచిపెట్టారు. డీఎంకే నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మద్య విముక్తి పేరుతో మత్తు దందా



నిందితుడు, సీజ్ చేసిన మత్తు పదార్థాలు

యశవంతపుర: మద్య వ్యసన విముక్తి కేంద్రాన్ని నడుపుతున్న వ్యక్తి మత్తు పదార్థాలను అమ్ముతుండగా పోలీసులు పట్టుకున్నారు. ఈ ఘటన బెంగళూరు గిరినగర పరిధిలోని కెంగేరి పూర్ణప్రజ్ఞ ఫౌండేషన్ వద్ద జరిగింది. సూరజ్‌గౌడ అనే వ్యక్తి ఈ ఫౌండేషన్‌ను నడుపుతున్నాడు. మద్య, మత్తు పదార్థాల అలవాట్ల నుంచి విముక్తి కల్పిస్తానని బాధితులను చేర్చుకునేవాడు. కానీ అతడే రూ. 1.25 లక్షల విలువైన మత్తు పదార్థాలను అమ్ముతుండగా పట్టుకున్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ట

పావగడ: కురుబల ఆరాధ్య దైవమైన అలుకుందరాయ స్వామి పునః విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు శనివారం వైభవంగా జరిగాయి. పట్టణంలోని బళ్లారి రోడ్డులో నిర్మించిన అలుకుందస్వామి దేవాలయంలో స్వామి వారి విగ్రహం, గోపుర, కలశ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.

గో మాంసం తరలిస్తున్న కారు పట్టివేత

మైసూరు: గో మాంసం తరలిస్తున్న కారును పోలీసులు శుక్రవారం రాత్రి మడికెరి తాలూకా నాపోక్లు పోలీస్ స్టేషన్ పరిధిలో పట్టుకున్నారు. కేరళకు చెందిన ఓ కారులో గో మాంసం తరలిస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు కాపుగాచి దాదాపు ఐదు కిలోమీటర్ల దూరం వెంబడించారు. చివరకు గో మాంసం తరలిస్తున్న వారు కారు అక్కడే వదిలేసి పారిపోయారు. పోలీసులు పరారీలో ఉన్న కోసం గాలిస్తున్నారు.

కాంగ్రెస్ కార్యకర్తల సంబరాలు

మైసూరు: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఐదు గ్యారెంటీ హామీలను అమలు చేయడానికి ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఆధ్వర్యంలో నిర్ణయం తీసుకోవడంతో ఆ పార్టీ కార్యకర్తలు నగరంలోని సిటీ బస్టాండ్‌లో స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు చేసుకున్నారు. ప్రభుత్వం మాట నిలబెట్టుకుందని కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

రాజకీయాల నుంచి తప్పుకోను

గౌరిబిదనూరు: తాను ప్రత్యక్ష రాజకీయాల నుంచి తప్పుకోనని, ప్రజలకు తనవంతు సేవలు అందిస్తూనే ఉంటానని మాజీ ఎమ్మెల్యే శివశంకర్ రెడ్డి తెలిపారు. శనివారం ఆయన రైల్వే వంతెన నిర్మాణ పనులను పరిశీలించి మాట్లాడారు. వంతెన పూర్తి కానుందని, దీంతో నగరం పడమటి వైపున గుండాపురం వరకు విస్తరించే అవకాశాలు ఉన్నాయని, కొన్ని కారణాల వల్ల వంతెన నిర్మాణం కొంత ఆలస్యమైందన్నారు. పాతికేళ్లుగా అనేక సంస్థలు, పరిశ్రమలు తీసుకువచ్చానని, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నందున అభివృద్ధికి అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. డబ్బులతో ఓట్లు కొనుగోలు చేశారని, దీంతో తాను ఓటమి చెందానని ఆరోపించారు. ఎమ్మెల్యే వెంట నగరసభ సభ్యులు గోపి, కలీం, రమేశ్, మంజుల, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

స్థల వివాదంలో ఘర్షణ, గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

చింతామణి: ఓ స్థలానికి సంబంధించి రెండు గుంపుల మధ్య జరిగిన దాడిలో నలుగురు గాయపడిన ఘటన తాలూకాలోని మడబహళ్లి గ్రామంలో శనివారం చోటుచేసుకొంది. వివరాలు...సదరి గ్రామానికి చెందిన నారాయణస్వామి తాతకు చెందిన సర్వేనెం. 50/103లో స్థలం ఉంది. ఇటీవల నారాయణస్వామి తన పేరుమీద ఖాతా చేయాలని పంచాయతీ కార్యాలయానికి అర్జీ పెట్టుకొన్నాడు. అయితే అదే గ్రామానికి చెందిన సీనప్ప, ఆనంద, చలపతి ఈ స్థలం తమ తాతదని తనపైన, తన భార్య రత్నమ్మ, నవీన్‌పై దాడి చేసి గాయపరిచారని నారాయణస్వామి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మంత్రి రామలింగా రెడ్డికి సన్మానం



రామలింగారెడ్డితో సంఘం నేతలు

తుమకూరు: మంత్రి రామలింగారెడ్డిని జిల్లా రెడ్డి జన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తుమకూరు జిల్లా రెడ్డి జన సంఘం అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, జాయింట్ కార్యదర్శి కేజే రాజగోపాల్‌రెడ్డి, కోశాధికారి ఎంఏ శివారెడ్డి, డైరెక్టర్లు కోటిరెడ్డి, బీపీ సోమారెడ్డి, జీఎం జయచంద్రారెడ్డి, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్ని హామీలు నెరవేరుస్తాం

- హోం మంత్రి పరమేశ్వర్

తుమకూరు: ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అన్ని హామీలను గ్యారెంటీగా అమలు చేస్తామని, ఇందులో ఎటువంటి అనుమానం లేదని హోం మంత్రి పరమేశ్వర్ అన్నారు. శనివారం ఆయన తుమకూరు నగరంలో మీడియాతో మాట్లాడుతూ... ఐదు గ్యారెంటీలపై ఇప్పటికే ఆయా శాఖ అధికారులతో సమావేశాలు నిర్వహించి పూర్తి చేశామని, అన్నింటిని అమలు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

క్లుప్తంగా...

అనారోగ్యంతో ఉన్న భార్యను చూసేందుకు.. బెయిల్‌పై ఇంటికి సిసోడియా

న్యూఢిల్లీ: ఢిల్లీ మాజీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా శనివారం ఉదయం తిహార్ జైలు నుంచి ఢిల్లీలోని తన సొంతింటికి చేరుకున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న భార్య సీమా సిసోడియాను చూసేందుకు కోర్టు శుక్రవారం ఆయనకు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు భార్య వద్ద గడిపేందుకు అవకాశం కల్పించింది. ఈ మేరకు అధికారులు శనివారం ఉదయం ఉదయంజ జైలు వ్యానులో కట్టుదిట్టమైన భద్రత మధ్య సిసోడియాను మధుర రోడ్డులోని ఆయన నివాసానికి తీసుకువచ్చారు. అయితే, మల్టిపుల్ స్క్లిరోసిస్‌తో బాధపడుతున్న సీమా సిసోడియా పరిస్థితి విషమించడంతో కుటుంబసభ్యులు అప్పటికే ఎల్ఎన్‌జేపీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. దీంతో, సిసోడియా భార్యను కలుసుకోలేకపోయారు. ఆయన్నుతిరిగి అధికారులు తిహార్ జైలుకు తీసుకెళ్లారు. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న సిసోడియాను సీబీఐ అరెస్ట్ చేసింది. ఢిల్లీ హైకోర్టు శనివారం సీమా సిసోడియా ఆరోగ్య పరిస్థితిపై నివేదిక అందించాలని ఎల్ఎన్‌జేపీ ఆస్పత్రిని ఆదేశించడం గమనార్హం.

పాక్ జైళ్ల నుంచి మరో 200 మంది భారత జాలర్ల విడుదల

ఇస్లామాబాద్: పాకిస్తాన్ జైళ్లలో మగ్గిపోతున్న 200 మంది భారత జాలర్లకు విముక్తి లభించింది. అట్టారి–వాఘా ఉమ్మడి సరిహద్దుల వద్ద వీరిని పాక్ అధికారులు శనివారం బీఎస్ఎఫ్ జవాన్లను అప్పగించారు. పాక్ ప్రభుత్వం గత నెలలో 198 మంది భారత జాలర్లను విడుదల చేసింది.

ధరల కట్టడికి పప్పు నిల్వలపై కేంద్రం ఆంక్షలు

సాక్షి, న్యూఢిల్లీ: పెరుగుతున్న పప్పుల ధరలను నియంత్రించేందుకు కేంద్రం నడుం బిగించింది. పప్పుల నిల్వలపై పరిమితులు విధిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ప్రతి పప్పు రకానికి నిల్వ పరిమితిని హోల్‌సేల్ వ్యాపారులకైతే 200 టన్నులు, రిటైల్ వ్యాపారులకైతే 5 టన్నులుగా నిర్ణయించింది. సూపర్ మార్కెట్లు, పెద్ద హోల్‌సేల్ వ్యాపారులు 200 టన్నుల కంటే ఎక్కువ నిల్వ చేయరాదని ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. మిల్లర్లు గత 3 నెలల ఉత్పత్తికి సమానమైన పరిమాణాన్ని లేక వార్షిక స్థాపిత సామర్థ్యంలో 25శాతం మాత్రమే నిల్వలు ఉంచుకోవాలని తెలిపింది. వినియోగదారుల ద్రవ్యోల్బణం డేటా ప్రకారం, ఏప్రిల్‌లో పప్పుల రిటైల్ ధరలు 5.28%, అంతకు ముందు నెలలో 4.33% పెరుగుదల నమోదైంది.

‘కవచ్’ ఏర్పాటులో తీవ్ర జాప్యం

అమలు చేసింది 1,450 కి.మీ. మాత్రమే

- కి.మీ.కు రూ.50 లక్షల ఖర్చు రావటమే కారణమా?
- ప్రయోగాలకు వేదికైన దక్షిణ మధ్య రైల్వే పరిధిలోనే ఏర్పాటు
- గతేడాదే ఢిల్లీ–హౌరా, ఢిల్లీ–ముంబై మధ్య ఏర్పాటుకు హామీ
- అమలుకు నోచుకోని ఏటా 5 వేల కి.మీ.కు ఏర్పాటు ప్రకటన
- హౌరా మార్గంలో ఏర్పాటైతే ఈ దుర్ఘటన తప్పేది

సాక్షి, హైదరాబాద్: అత్యంత వేగంగా వందే భారత్ రైళ్లను తయారు చేసి, సర్వీసులను పట్టాలెక్కిస్తున్న భారతీయ రైల్వే, ప్రయాణికుల భద్రతలో అత్యంత తీవ్ర నిర్లక్ష్యాన్ని అవలంబిస్తోంది. పరస్పరం రైళ్ల ఢీకొనకుండా కాపాడే వ్యవస్థ విషయంలో నిర్లక్ష్యంతో అమాయక ప్రయాణికుల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. రైళ్లపై భరోసాతో వాటిలో ప్రయాణిస్తున్నవారు ప్రమాదాల్లో చిక్కుకొని ప్రాణాలు వదులుతున్నారు.

పదేళ్ల జాప్యం..

రైళ్లు పరస్పరం ఢీకొనకుండా వ్యవస్థను రూపొందించడానికి ప్రయోగాల పేరుతో ఏకంగా పదేళ్ల విలువైన కాలాన్ని రైల్వే అధికారులు హరించారు. కానీ ఇప్పటివరకు ఆ పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తేలేకపోయారు. ప్రయోగాలకు వేదికైన దక్షిణ మధ్య రైల్వే పరిధిలో కొంత ఏర్పాటు చేసి మిగతా చోట్ల చేతులెత్తేశారు. శుక్రవారం రాత్రి ప్రమాదం జరిగిన హౌరా–చెన్నై మార్గం దేశంలోనే కీలక రైల్వే లైన్. ఆ మార్గంలో కూడా రైల్వే కవచ్ ఏర్పాటు చేయలేకపోయింది.

ఎందుకీ దుస్థితి..

రైల్వే నెట్‌వర్క్ తక్కువగా ఉండి, ఎక్కువ సంఖ్యలో రైళ్లు తిప్పే మన దేశంలో.. ఎదురెదురుగా వచ్చి రైళ్లు ఢీకొనే పరిస్థితి తరచూ ఉండేది. సిగ్నలింగ్ వైఫల్యమో, మానవ తప్పిదమో.. తరచూ ఒకే ట్రాక్ మీద ఎదురెదురుగా రైళ్లు వచ్చేవి. ప్రమాదాలు నివారించేందుకు విదేశాల నుంచి పరిజ్ఞానాన్ని దిగుమతి చేసుకోవాలనుకున్నా, ఖరీదు ఎక్కువ కావటంతో సొంతంగానే రూపొందించాలని రైల్వే నిర్ణయించింది. అనుబంధ పరిశోధన సంస్థ రీసెర్చ్ డిజైన్ అండ్ స్టాండర్డ్ ఆర్గనైజేషన్ (ఆర్‌డీఎస్ఓ)కు బాధ్యతను అప్పగించింది. అది కొంతకాలం ప్రయోగాలు చేసి 2013లో తొలుత రైల్ కొలిజన్ అవాయిడెన్స్ సిస్టం(టీకాస్)ను సిద్ధం చేసింది. ప్రయోగాల కోసం వికారాబాద్–వాడీ–సనత్‌నగర్ సెక్షన్లను ఎంపిక చేశారు. 260 కి.మీటర్లలో ఆ వ్యవస్థను ఏర్పాటు చేసి పరిశీలించారు.

కవచ్‌గా మార్చి..


ఐదేళ్ల క్రితం దానిని ‘కవచ్’గా మార్చి పరిజ్ఞానాన్ని మరింత అప్‌గ్రేడ్ చేశారు. 2022 ఫిబ్రవరి నాటికి జోన్ పరిధిలో 615 కి.మీ. మేర ఆ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ప్రయోగాలు విజయవంతమయ్యాయని, వ్యవస్థను అంబాటులోకి తెస్తామని అధికారులు ఎప్పటికప్పుడు ప్రకటిస్తూ వస్తున్నారు. ఆ వ్యవస్థను దేశవ్యాప్తంగా ఏర్పాటు చేసేందుకు రైల్వే బోర్డు అనుమతించినా.. పనులు మాత్రం ముందుకు సాగటం లేదు. గతేడాది చివరలో ప్రస్తుత రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ స్వయంగా రైలు లోకో ఇంజిన్‌లో కూర్చుని ప్రయోగాలను పరిశీలించారు. ప్రతి సంవత్సరం 5 వేల కి.మీ. మేర దాన్ని ఏర్పాటు చేసి, దేశమంతటా విస్తరిస్తామని పేర్కొన్నారు. గత సంవత్సరమే ఢిల్లీ–ముంబై, ఢిల్లీ–హౌరా మార్గాల్లోని 2 వేల కి.మీ.నిడివిలో ఏర్పాటు చేయనున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది.

కిలోమీటర్‌కు రూ.50 లక్షలు..

కవచ్ పరిజ్ఞానాన్ని ఏర్పాటు చేయాలంటే కిలోమీటరుకు రూ.50 లక్షల వరకు ఖర్చవుతుందని అధికారులు తేల్చారు. ఇది రైల్వేకు పెద్ద భారంగా మారింది. పనులు వేగంగా పూర్తి చేయాలంటే బడ్జెట్ నిధుల్లో సింహభాగం దానికే ఖర్చు చేయాలి. దీంతో దక్షిణ మధ్య రైల్వే పరిధిలో 1450 కి.మీ.మేర ఏర్పాటు చేయటం మినహా ఎక్కడా ఏర్పాటు చేయలేదు.

ఏమిటీ కవచ్?

కవచ్ పరిజ్ఞానం రైలు ఇంజన్లతోపాటు ట్రాక్ వెంట కొనసాగుతుంది. మధ్య మధ్య ఫ్రీక్వెన్సీ టవర్లు ఏర్పాటు చేస్తారు. రైల్వే స్టేషన్లలో, రైళ్లలో ప్రత్యేక కవచ్ యంత్రాలను అమరుస్తారు. ట్రాక్‌పై ప్రతి కిలోమీటర్‌కు ఒకటి చొప్పున ఆర్ఎఫ్ఐడీ ట్యాగ్‌లను ఏర్పాటు చేస్తారు. రేడియో ఫ్రీక్వెన్సీ సిగ్నళ్ల కోసం నిర్ధారిత ప్రాంతాల్లో 40 మీటర్ల ఎత్తున్న టవర్లను ఏర్పాటు చేస్తారు. కమ్యూనికేషన్ టవర్, జీపీఎస్, రేడియో ఇంటర్‌ఫేజెస్‌లతో అనుసంధానిస్తారు.



ఎలా పనిచేస్తుంది?

- రైళ్ల కదలికలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలనే సూత్రంపై ఇది పనిచేస్తుంది.
- దేశంలో రైలు ప్రమాదాలకు ప్రధాన కారణమవుతున్న సిగ్నల్ జంప్‌ను ఇది అప్రమత్తం చేస్తుంది. నిర్ణీత పరిధిలోపు అదే లైన్‌లో ఇంకొక రైలు ఉందని గుర్తిస్తే ఆటోమేటిక్‌గా రైలును ఆపేస్తుంది.
- సిగ్నల్ దాటేసి వెళ్లడం, వేగంగా ప్రయాణించడం వంటి సందర్భాల్లోనేకాదు దట్టంగా మంచు కమ్ముకున్న అననుకూల వాతావరణంలోనూ పలుమార్లు లైన్–సైడ్ సిగ్నల్స్‌ను ఇస్తూ పైలట్‌కు సాయపడుతుంది.
- లెవల్–క్రాసింగ్ వద్ద తనంతట తానుగా విజిల్స్ వేస్తుంది. రైలు నియంత్రణ కోల్పోయిన సందర్భాల్లో ప్రమాదం ఉందంటూ సంబంధిత వ్యవస్థకు తక్షణం హెచ్చరికల ద్వారా సమాచారాన్ని చేరవేస్తుంది.
- రైలు బ్రేకు ఫెయిలైనప్పుడు కూడా ఈ వ్యవస్థ సమర్థవంతంగా పనిచేసి రైలును నిలిపివేయగలదు. హారన్ కొట్టాల్సిన చోట కొట్టకున్నా.. ఈ వ్యవస్థ తనంతట తానుగా ఆ పని చేస్తుంది.

కొసమెరుపు: దేశీయంగా ఈ వ్యవస్థను ఏర్పాటు చేయలేక చేతులెత్తేస్తున్న రైల్వే శాఖ, ఆ పరిజ్ఞానాన్ని విదేశాలకు విక్రయించేందుకు మాత్రం సిద్ధమని ప్రకటించింది.

పెద్దకర్మకు వచ్చి ప్రాణాలు కోల్పోయాడు

బాలాసోర్ దుర్ఘటనలో మరో విషాదం

బాలాసోర్: ఒడిశా రైలుప్రమాద ఘటనలో పలు హృదయవిదారక దృశ్యాలు ఒక్కొక్కటిగా వెలుగుచూస్తున్నాయి. సంబంధిత కథనాలు జాతీయ మీడియాలో కనిపించాయి. అందులో ఒడిశాకు చెందిన రమేశ్ జెన అనే వ్యక్తి విషాదగాథ కూడా ఉంది. బాలేశ్వర్‌కు చెందిన ఒకావిడకు రమేశ్, సురేష్ అనే ఇద్దరు కుమారులున్నారు. వారిలో పెద్దవాడైన రమేశ్ చాలా సంవత్సరాల క్రితమే చెన్నైకి వెళ్లి స్థిరపడ్డారు. ఇటీవల రమేశ్ తల్లి కాలంచేశారు. దీంతో గత నాలుగు రోజుల క్రితం ఆయన సొంతూరు బాలేశ్వర్‌కు వచ్చారు. పెద్దకర్మ తదితర కార్యక్రమాలు చూసుకుని తిరిగి చెన్నైకి బయల్దేరారు. శుక్రవారం రాత్రి ప్రమాదానికి గురైన కోరమాండల్ ఎక్స్‌ప్రెస్‌లోనే రమేశ్ ప్రయాణించారు. ఘటనలో ప్రాణాలు కోల్పోయాడు. అన్న మృతిపై తమ్ముడు సురేశ్ మాట్లాడారు. ‘తల్లిమరణంతో దాదాపు 14 సంవత్సాల తర్వాత అన్నయ్య ఇంటికొచ్చారు. కార్యక్రమాలు అన్నీ చూసుకున్నాక స్వయంగా నేనే అన్నను రైల్వేస్టేషన్‌లో దిగబెట్టారు. రైలు ఎక్కుతా నువ్వు వెళ్లిపో అని చెబితే సరేనన్నా. అన్నయ్యను చూడటం అదే చివరిసారి అవుతుందని కలలో కూడా అనుకోలేదు. రాత్రిపూట రైలు ప్రమాదం వార్త తెల్సి వెంటనే అన్నకు ఫోన్‌చేశా. ఫోన్ లిఫ్ట్‌చేయలేదు. కొద్దిసేపయ్యాక ఎవరో ఆ మొబైల్ నుంచి ఫోన్‌చేసి ప్రమాదంలో మీ అన్నయ్య చనిపోయాడని చెప్పారు. మరణవార్త విని హుతాశుడినయ్యా. పరుగున ఘటనాస్థలికి వెళ్లా. మొత్తం వెతికినా లాభంలేకుండా పోయింది. చివరకు బాలేశ్వర్ జిల్లా ఆస్పత్రిలో విగతజీవిలా పడి ఉన్న అన్నయ్యను చూసి తట్టుకోలేకపోయా’ అని తమ్ముడు వాపోయాడు.

ముగ్గురు సోదరులు మృత్యువాత

బారుయిపూర్: బాలాసోర్ ప్రమాద ఘటన పశ్చిమబెంగాల్‌లోని దక్షిణ 24 పరగణాల జిల్లాకు చెందిన ముగ్గురు సోదరుల కుటుంబాల్లో విషాదం నింపింది. ఈ ముగ్గురూ బతుకుదెరువు కోసం తమిళనాడుకు వెళ్తూ మృత్యువాతపడ్డారు. చరనిఖలి గ్రామానికి చెందిన హరన్ గయెన్(40), నిషికాంత్ గయెన్(35), దిబాకర్ గయెన్(32)లు ఏటా తమిళనాడుకు వచ్చి వ్యవసాయ పనులు చేసుకుంటూ ఉంటారు. ముగ్గురూ ఇటీవలే సొంతూరుకు వచ్చి, తిరిగి కోరమండల్ ఎక్స్‌ప్రెస్ రైలులో చెన్నై వెళ్తూ ప్రమాదంలో అసువులు బాశారు. ఈ వార్తతో స్వగ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. కుటుంబసభ్యులు హతాశులయ్యారు. అన్నదమ్ముల్లో పెద్దవాడైన హరన్‌కు ఒక కొడుకు, ఇద్దరు పెళ్లయిన కూతుళ్లున్నారు. భార్య అనాజిత మానసిక సమస్యతో బాధపడుతోంది. నిషికాంత్‌కు భార్య, ఒక కొడుకు, కూతురు ఉన్నారు. ఇద్దరూ మైనర్లే. దిబాకర్‌కు భార్య, ఇద్దరు కుమారులున్నారు.

విజయవాడ డివిజన్‌లో హెల్ప్ డెస్క్‌లు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ఖరగ్‌పూర్ డివిజన్‌లోని బహనాగబజార్ స్టేషన్ సమీపంలో జరిగిన ఘోర రైలు ప్రమాదం నేపథ్యంలో విజయవాడ రైల్వే డివిజన్ వ్యాప్తంగా హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేశారు. ప్రమాదం విషయం తెలియడంతో శుక్రవారం రాత్రి నుంచే ప్రయాణికుల బంధువులు, కుటుంబ సభ్యులు ఆందోళనతో రైల్వే స్టేషన్‌కు చేరుకుని తమ వారి యోగక్షేమాల గురించి తెలుసుకుంటున్నారు. విజయవాడ రైల్వే స్టేషన్‌తో పాటు డివిజన్‌లోని పది ప్రధాన స్టేషన్లలో ప్రయాణికుల జాబితాలతో హెల్ప్‌డెస్కులు ఏర్పాటు చేసి, వారి గురించి సమాచారం అందిస్తున్నారు. ప్రమాదానికి గురైన కోరమాండల్ ఎక్స్‌ప్రెస్‌లో విజయవాడ డివిజన్ నుంచి 68 మంది ప్రయాణికులు బయలుదేరి వెళ్లినట్లు తెలిపారు. రిజర్వేషన్ చార్ట్‌లో లభించిన ఫోన్ నంబర్ల ద్వారా ప్రయాణికులను సంప్రదించగా... చిన్న చిన్న గాయాలతో తాము సురక్షితంగా ఉన్నట్లు 57 మంది ప్రయాణికులు తెలిపారు. మిగిలిన వారు ఫోన్‌కు స్పందించలేదని, వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నామని అధికారులు తెలిపారు.

హెల్ప్‌లైన్ నంబర్లు

విజయవాడ:0866–2576924; రాజమండ్రి: 0883–2420541; నెల్లూరు: 0861–2342028 సామర్లకోట:7780741268; ఒంగోలు: 7815909489; బాపట్ల: 08643–222178; తెనాలి: 08644–227600; తాడేపల్లిగూడెం: 08818–226162; గూడూరు: 08624250795; ఏలూరు రైల్వే స్టేషన్: 08812–232267.

విశాఖ కేంద్రంగా ఆన్‌లైన్ బెట్టింగ్

19 మంది అరెస్ట్.. పరారీలో ముగ్గురు కీలక నిందితులు

- ‘మహదేవ్ బుక్’ ప్లాట్‌ఫామ్ పేరిట దుబాయ్ నుంచి ఆపరేషన్స్
- రూ.50 కోట్లు వరకు లావాదేవీలు జరిగినట్టు గుర్తింపు
- బ్యాంక్ అకౌంట్లలోని రూ.5.54 కోట్లు సీజ్
- అనేక బెట్టింగ్ యాప్‌లకు ప్లాట్‌ఫామ్‌గా ‘మహదేవ్ బుక్’


మీడియాతో మాట్లాడుతున్న విశాఖ పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్‌వర్మ

దొండపర్తి (విశాఖ దక్షిణ): విశాఖ కేంద్రంగా ఆన్‌లైన్ బెట్టింగ్ కార్యకలాపాలు సాగిస్తున్న 19 మందితో కూడిన గ్యాంగ్‌ను విశాఖ పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. వీరంతా దుబాయ్ కేంద్రంగా సాగే మహదేవ్ బుక్ ప్లాట్‌ఫామ్ నుంచి ఫ్రాంచైజ్ తీసుకుని.. ఆన్‌లైన్ గేమ్స్ ద్వారా రూ.కోట్లు కాజేస్తున్నట్టు నిర్ధారించారు. 14 బ్యాంకులకు చెందిన 71 ఫేక్ ఖాతాల ద్వారా రూ.50 కోట్ల వరకు లావాదేవీలు జరిగినట్టు గుర్తించి.. ఆయా బ్యాంక్ అకౌంట్లలో ఉన్న రూ.5.54 కోట్లను సీజ్ చేశారు. 19 మంది నిందితుల నుంచి 53 మొబైల్స్, 7 ల్యాప్‌టాప్స్ స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్టు నగర పోలీస్ కమిషనర్ సీఎం త్రివిక్రమ్‌వర్మ మీడియాకు శనివారం వెల్లడించారు. వివరాల్లోకి వెళితే..

బెట్టింగ్ యాప్‌లకు ప్లాట్‌ఫాంగా ‘మహదేవ్ బుక్’

విదేశాల నుంచి నడిచే మహదేవ్ బుక్ వివిధ బెట్టింగ్ యాప్‌లకు ప్లాట్‌ఫామ్‌గా వ్యవహరిస్తోంది. ఈ గేమింగ్ అప్లికేషన్‌లో 50కి పైగా వెబ్‌సైట్లు ఉన్నాయి. దీనిని భారత ప్రభుత్వం ఇప్పటికే నిషేధించింది. అయితే.. ఇతర దేశాల్లో మాత్రం చలామణిలో ఉంది. ఈ ప్లాట్‌ఫామ్ ద్వారా ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల నిర్వహణకు ఫ్రాంచైజ్‌లను ఇస్తుంటుంది. ఇలా ఫ్రాంచైజ్ తీసుకున్న వారిని ఎక్స్ఛేంజ్ అంటారు. ఈ లైసెన్స్ కోసం రూ.20 లక్షలు మహదేవ్ బుక్‌కు డిపాజిట్ చేస్తే.. బ్రాంచ్ ఐడీని కేటాయిస్తారు. దాంతో ఆ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్ గేమ్స్ కార్యకలాపాలు సాగించే అవకాశం ఉంటుంది. ఇలా ప్రపంచంలో 650కి పైగా.. మన దేశంలో 60కి పైగా ఎక్స్ఛేంజ్‌లు ఉన్నట్టు పోలీసుల దర్యాప్తులో గుర్తించారు.

విశాఖ కేంద్రంగా కార్యకలాపాలు

సౌరబ్‌చంద్రా అనే వ్యక్తి రూ.20 లక్షలు చెల్లించగా.. బ్రాంచ్ ఐడీ–257 నంబర్‌తో విశాఖ కేంద్రంగా అతడికి ఎక్స్ఛేంజ్ కేటాయించారు. అజిత్‌కుమార్, ప్రతీక్ మిశ్రా అనే వ్యక్తులు బాధ్యతలు చేపట్టి బిహార్, ఉత్తర్‌ప్రదేశ్, గుజరాత్, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాల నుంచి 19 మంది యువకులను నియమించుకుని ఆన్‌లైన్ బెట్టింగ్, గేమ్స్ కార్యకలాపాలను సాగిస్తున్నారు. ఈ వ్యవహారంపై సమాచారం అందడంతో టాస్క్‌ఫోర్స్ ఏసీపీ త్రినాథరావు ఆధ్వర్యంలో దాడులు చేశారు. డీసీపీ–1 విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు కేసును సైబర్ పోలీసులకు అప్పగించారు. సైబర్ క్రైం సీఐ భవాని ప్రసాద్ నిందితులను అదుపులోకి తీసుకుని 53 మొబైల్ ఫోన్లు, 7 ల్యాప్‌టాప్‌లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుల మొబైల్స్, ల్యాప్‌టాప్స్‌లో ఉన్న సమాచారాన్ని విశ్లేషించిన పోలీసులు విస్తుపోయారు. ఈ ముఠా 14 బ్యాంకుల నుంచి 71 అకౌంట్ల ద్వారా రూ.50 కోట్ల మేర లావాదేవీలు జరిపినట్టు నిర్ధారణకు వచ్చారు. ఆ అకౌంట్లు కూడా మహారాష్ట్ర, ఇతర రాష్ట్రాలకు చెందిన రైతులు, పేదలకు సంబంధించినవిగా తెలుసుకున్నారు. ఆయా ఖాతాల్లో ఇంకా రూ.5.54 కోట్లు ఉన్నట్లు గుర్తించి సీజ్ చేశారు.

పరారీలో ముగ్గురు సూత్రధారులు

పోలీసులు 19 మందిని అరెస్ట్ చేయగా.. వీరిలో గోలు సోని (22, ఉత్తర్‌ప్రదేశ్), వినయ్ నిర్మల్‌కర్ (20, ఛత్తీస్‌గఢ్), దుర్గేష్‌కుమార్ (24, బిహార్), రోషమ్‌కుమార్ యాదవ్ (30, ఛత్తీస్‌గఢ్), నీరజ్‌కుమార్ శర్మ (28, బిహార్), కల్యాణ్‌సాహు (32, ఛత్తీస్‌గఢ్), రామ్‌కర్ష్ (24, ఛత్తీస్‌గఢ్), అమిత్‌కుమార్ (20, బిహార్), అమిత్‌కుమార్ విశ్వకర్మ (29, ఛత్తీస్‌గఢ్), ఉదయ్‌కుమార్ యాదవ్(26, జార్ఖండ్), సుమిత్‌సింగ్ (22, ఛత్తీస్‌గఢ్), ముఖేష్‌కుమార్ యాదవ్ (27, బిహార్), మనీష్‌కుమార్ యాదవ్ (29, బిహార్), ఉగ్రేష్‌కుమార్ యాదవ్ (27, బిహార్), మన్నుకుమార్ శర్మ (20, బిహార్), సుమన్ కుమార్ సింగ్ (22, బిహార్), అజయ్ (23, గుజరాత్), ప్రవీణ్ కుమార్ యాదవ్(22), మైనర్ (17) ఉన్నారు. అసలు సూత్రధారులు సౌరబ్‌చంద్ర, అజిత్‌కుమార్, ప్రతీక్ మిశ్రా పరారీలో ఉన్నారు.

అమిత్‌షాతో చంద్రబాబు భేటీ

భేటీకి బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా హాజరు

- సుమారు 45 నిమిషాలపాటు సమావేశం
- ఏపీలో పొత్తుల విషయం ప్రస్తావించిన బాబు

సాక్షి, న్యూఢిల్లీ: టీడీపీ అధినేత చంద్రబాబు శనివారం రాత్రి కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో భేటీ అయ్యారు. రాత్రి 7.30 గంటలకు ఢిల్లీ చేరుకున్న చంద్రబాబు రాత్రి 9 గంటలకు హోంమంత్రి అమిత్ షా నివాసానికి చేరుకున్నారు. ముందుగా 8 గంటలకే సమావేశం అనుకున్నప్పటికీ అమిత్ షా ఇతర కార్యక్రమాల్లో బిజీగా ఉండడంతో సమావేశం గంట ఆలస్యంగా ప్రారంభమైంది. తర్వాత కొద్ది సేపటికి బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా కూడా సమావేశంలో పాల్గొన్నారు. సుమారు 45 నిమిషాల పాటు ఈ భేటీ సాగింది. తెలుగు రాష్ట్రాల్లో పొత్తులు, ఇతరత్రా అంశాలపై బీజేపీ పెద్దలతో చంద్రబాబు చర్చించినట్లు తెలిసింది. ప్రధానంగా డిసెంబరులో ఎన్నికలు జరగనున్న తెలంగాణలో బీజేపీకి అందించే సహకారంపై చర్చ సాగినట్లు సమాచారం. తెలంగాణ ఎన్నికలకు సంపూర్ణ సహకారం అందిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చినట్లు తెలిపింది. టీడీపీ ఓటు బ్యాంకు బదిలీ, క్యాడర్ సహకారం, ఎల్లో మీడియా మద్దతు ఇస్తామని.. దీనివల్ల బీజేపీకి లాభిస్తుందని చంద్రబాబు హామీ ఇచ్చినట్లు తెలిసింది. ఇదే సమయంలో ఏపీలో సైతం పొత్తులు కొనసాగించాలని బాబు కోరినట్లు సమాచారం. ఈ విషయమై అమిత్‌షా, నడ్డా ఏం చెప్పారన్నది బయటకు వెల్లడికాలేదు. చంద్రబాబు అక్కడి నుంచి వెళ్లిపోయాక, ఏపీలో పొత్తుల అంశంపై ఏం చేయాలనే దానిపై అమిత్ షా, నడ్డా చర్చించినట్లు తెలిసింది. సమావేశం అనంతరం చంద్రబాబు మీడియాతో మాట్లాడకుండానే ఎంపీ గల్లా జయదేవ్ అధికారిక నివాసానికి వెళ్లిపోయారు.

సంజాయిషీ ఇచ్చుకొని.. సహకారం కోరిన బాబు

2018 తర్వాత అమిత్‌షాతో చంద్రబాబు సమావేశం కావడం ఇదే తొలిసారి. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రధాని మోదీపై చేసిన తీవ్ర వ్యాఖ్యలకు సంజాయిషీ ఇచ్చుకున్నట్లు సమాచారం. రాష్ట్రంలో గత (తన) ప్రభుత్వ హయాంలో అవినీతి, అక్రమాలపై జరుగుతున్న దర్యాప్తుపై జోక్యం చేసుకొని తనకు సహకరించాలని కూడా అమిత్‌షాను చంద్రబాబు కోరినట్లు తెలిసింది. ఢిల్లీ చేరుకున్న చంద్రబాబుకు విమనాశ్రయంలో ఎంపీలు కనకమేడల రవీంద్రకుమార్, కేశినేని నాని, రామ్మోహన్‌నాయుడు, రఘురామకృష్ణరాజు పార్లమెంటరీ పార్టీ కార్యాలయ కార్యదర్శి నాపడ సత్యనారాయణ స్వాగతం పలికారు. చంద్రబాబు వెంట సీనియర్ నేత కంభంపాటి రామ్మోహన్ రావు వచ్చారు.

క్షేమంగా.. సురక్షితంగా..!

- స్వస్థలాలకు చేరిన వారిని చూసి ఉద్వేగానికి గురైన కుటుంబీకులు
- ప్రత్యేక రైలులో విజయవాడ చేరిన ఏడుగురు ప్రయాణికులు

సాక్షి నెట్‌వర్క్: ఒడిశాలోని బాలాసోర్‌లో జరిగిన రైలు ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడిన ఏపీ వాసులు క్షేమంగా స్వస్థలాలకు చేరుకున్నారు. శనివారం రాత్రి ఏడుగురు ప్రయాణికులు ప్రత్యేక రైలులో ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. పెడనకు చెందిన న్యూటన్ బిశ్వాస్ తన భార్య లక్ష్మీబిశ్వాస్, కుమార్తెలు అంకిత బిశ్వాస్, సుస్మిత బిశ్వాస్ కోరమండల్ ఎక్స్‌ప్రెస్‌లో విజయవాడ వస్తుండగా.. ప్రమాదం జరిగింది. కుమార్తెలు అంకిత, సుస్మితకు చిన్నపాటి గాయాలయ్యాయి. తన భార్య, పిల్లలు క్షేమంగా ఉన్నారని, వారు ప్రత్యేక రైలులో విజయవాడ వస్తున్నారని తెలుసుకుని న్యూటన్ బిశ్వాస్ విజయవాడ రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. భార్య, పిల్లలను చూసి ఉద్వేగానికి గురై కన్నీరు పెట్టుకున్నారు. ప్రమాదం నుంచి బయటపడిన మరికొందరు మాట్లాడుతూ ఏమన్నారంటే..

అసలేం అర్థం కాలేదు



పశ్చిమ బెంగాల్ నుంచి విజయవాడ బయలుదేరా. శుక్రవారం రాత్రి ప్రమాదం జరిగింది. 10 నిమిషాల పాటు ఏం జరిగిందో అర్థం కాలేదు.సెల్‌ఫోన్ వెలుగులో చూసేసరికి అంతా చిందర వందర కనిపించింది. భయంతో బయటకు వచ్చి చూస్తే ఒక్కసారిగా భయం వేసింది.

– అబు ఖాసీం లస్కర్, విజయవాడ

ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది రక్షించారు

గత నెల 22న కోల్‌కతాలో జరిగిన అమ్మవారి పండుగలకు భార్య మిన్నీ, తల్లి అక్కమ్మ, ఇద్దరు పిల్లలతో కలిసి వెళ్లా. ఈ నెల 2న ఎస్–5 బోగీలో ఎక్కాం. రైలు ప్రమాదంలో మిన్నీ తలకు గాయాలయ్యాయి. నా కాలిపై స్వల్ప గాయాలయ్యాయి. ఎన్డీఆర్ఎఫ్ బృందాలు మమ్మల్ని రక్షించాయి. ప్రత్యేక రైలులో విశాఖ చేరుకున్నాం. ఇంత భారీ ప్రమాదం ఎప్పుడూ చూడలేదు.

–లోకేశ్, పనుకువలస, పార్వతీపురం జిల్లా

స్థానికులే కాపాడారు



షాలిమార్ నుంచి విజయవాడకు వస్తున్నాం. కోరమాండల్ ప్రమాదం జరిగిన సమయంలో ఏం జరిగిందో కూడా అర్థం కాలేదు. కొంతసేపటికి తేరుకుని భార్య మందిరాదాస్, కుమారుడు మణీంద్రదాస్‌ను తీసుకుని బయట పడ్డా. స్థానికులు అక్కడకు చేరుకుని మాకు అండగా నిలిచారు. ప్రమాదంలో చిక్కుకున్న వారిని కాపాడే ప్రయత్నం చేశారు. చీకటి కావడంతో అక్కడ ఏం జరిగిందో. పూర్తిగా తెలుసుకోవడానికి చాలా సమయం పట్టింది. ఏది ఏమైనా ఆ ఊరి ప్రజలు వచ్చి సాయం చేయకపోతే ఇంకా చాలా మంది ప్రమాదంలో ప్రాణాలను కోల్పోయేవారు

– సుశాంత్‌కుమార్ దాస్, విజయవాడ కండ్రిక

సాధారణ కోచ్‌లైతే మరణాల సంఖ్య మరింత పెరిగేది



కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రమాదం ఘోరమైనది. కోరమాండల్ ఎక్స్‌ప్రెస్, యశ్వంత్‌పూర్–హౌరా రైళ్లు ఒకే సమయంలో ప్రయాణించడం వల్ల ప్రమాద తీవ్రత అధికంగా ఉంది. ఈ రైళ్లు ఎల్‌హెచ్‌బీ కోచ్‌లతో నడుస్తున్నందున మృతుల సంఖ్య భారీగా తగ్గింది. అవే మామూలు కోచ్‌లైతే మృతుల సంఖ్య అధికంగా ఉండేది. సీఎం వైఎస్ జగన్ వెంటనే స్పందించి సహాయక చర్యలకు ఆదేశాలిచ్చారు. అనుభవజ్ఞులైన ఉన్నతాధికారుల బృందాన్ని ఘటనాస్థలికి పంపించడంతోపాటు అవసరమైన సహాయం అందించేందుకు జిల్లా కార్యాలయాల్లో అత్యవసర హెల్ప్‌లైన్ సెంటర్లు ఏర్పాటు చేశాం. వాల్తేర్ డివిజన్ కూడా అవసరమైన సిబ్బందిని, మెషినరీని, అధికారులను పంపించింది. ఏపీకి చెందిన 178 మంది కోరమాండల్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తున్నట్టు ప్రాథమిక సమాచారం ఉంది.

– అనూప్‌కుమార్ సత్పతి, డివిజనల్ రైల్వే మేనేజర్, వాల్తేరు

విధుల్లో మద్యం తాగిన గేట్‌మ్యాన్.. రైలు ఆలస్యం

- నాగర్‌కోయిల్–ముంబై ఎక్స్‌ప్రెస్‌కు గంట అంతరాయం
- కుటాగుళ్ల రైల్వే గేట్‌మ్యాన్ సస్పెన్షన్

కదిరి: శ్రీసత్యసాయి జిల్లా కదిరి మునిసిపాలిటీ పరిధిలోని కుటాగుళ్ల వద్ద ఉన్న రైల్వే గేట్‌మ్యాన్ నరసింహులు నిర్లక్ష్యం కారణంగా శుక్రవారం రాత్రి నాగర్‌కోయిల్–ముంబై ఎక్స్‌ప్రెస్ రైలు ప్రయాణానికి గంటపాటు అంతరాయం కలిగింది. కదిరి స్టేషన్ మాస్టర్ పాళ్యం కృష్ణమూర్తి తెలిపిన మేరకు.. నాగర్‌కోయిల్–ముంబై ఎక్స్‌ప్రెస్ రైలు శుక్రవారం అర్ధరాత్రి 12 గంటల ప్రాంతంలో కదిరి రైల్వేస్టేషన్‌కు చేరుకుంది. రైలు స్టేషన్‌కు చేరగానే స్టేషన్ మాస్టర్ కుటాగుళ్ల రైల్వే గేట్‌మ్యాన్‌కు సమాచారం చేరవేస్తుంటారు. శుక్రవారం రాత్రి రైలు వచ్చిన విషయాన్ని చెప్పేందుకు స్టేషన్ మాస్టర్ కృష్ణమూర్తి ప్రయత్నించినా గేట్‌మ్యాన్ స్పందించలేదు. దీంతో స్టేషన్ మాస్టర్ ఈ విషయాన్ని స్టేషన్‌లో ఆగి ఉన్న రైలు లోకో పైలట్‌కు, ట్రైన్ మాస్టరుకు తెలిపారు. గేటుకు కొంతదూరంలోనే రైలు ఆపి విషయం తమకు చెప్పాలని సూచించారు. దీంతో లోకో పైలట్ రైలును మెల్లగా తీసుకెళ్లి కిలోమీటరు దూరంలోని కుటాగుళ్ల గేటుకు కొంతదూరంలో ఆపారు. లోకో పైలట్ దిగి గేట్‌మ్యాన్ అక్కడ లేని విషయాన్ని గమనించి తానే గేటు మూశారు. తర్వాత ఈ విషయాన్ని స్టేషన్ మాస్టరుకు తెలిపారు. దీంతో సిబ్బంది వెళ్లి రైలు అక్కడి నుంచి వెళ్లగానే గేటు తెరిచారు. ఈ రైలుకు గంటపాటు అంతరాయం కలిగింది. గేట్‌మ్యాన్ నరసింహులు శుక్రవారం రాత్రి విధుల్లో ఉండి మిత్రుడితో కలిసి మద్యం తాగినట్లు రైల్వే అధికారుల విచారణలో వెల్లడైంది. గేటు సమీపంలోని బహిరంగ ప్రదేశంలో మద్యం తాగి తిరిగి ద్విచక్ర వాహనం మీద గేట్ వద్దకు వస్తూ ప్రమాదవశాత్తు కిందపడి తీవ్రంగా గాయపడిన నరసింహులు వెంటనే కదిరి ప్రభుత్వాస్పత్రిలో చేరినట్లు తేలింది. ఈ మేరకు స్టేషన్ అధికారులు నివేదిక పంపడంతో ఉన్నతాధికారులు.. విధుల్లో నిర్లక్ష్యం వహించిన గేట్‌మ్యాన్ నరసింహులును సస్పెండ్ చేశారు. ఈ మేరకు శనివారం గుంతకల్లు ఏడీఆర్ఎం సత్యనారాయణ ఉత్తర్వులు జారీచేశారు. తనపై గుర్తుతెలియని వ్యక్తులు కట్టెలతో దాడిచేయడంతో గాయపడి, చికిత్స నిమిత్తం కదిరి ప్రభుత్వాస్పత్రికి వెళ్లినట్లు గేట్‌మ్యాన్ చెబుతున్నారు.

సాక్షి ఫ్యామిలీ
బెంగళూరు
ఆదివారం ॥ 4-6-2023

• యానిమల్ రైట్స్ డే

జంతువులను ప్రేమిద్దాం..

మన కాలనీలో ఓ కుక్క కాలు విరిగి ఈడ్చుకుంటూ వెళుతుంటుంది... చూసి, పట్టనట్టు వెళ్లిపోతుంటాం. ఓ చిన్న సందులో పిల్లి ఇరుక్కుని గిలగిల్లాడుతుంటుంది ... దానిని కాపాడటం మన పని కాదులే అని తప్పుకుంటాం. వాటికి ఆకలేసినా, ప్రమాదాలు జరిగినా మనసున్న మనుషులుగా మనమెంతవరకు పట్టించుకుంటున్నాం? మనతో పాటు మూగజీవాలకూ బతికే హక్కు ఉందని, వాటిని కాపాడుకోవాల్సిన అవసరం మనందరిది అని అంటున్నారు హైదరాబాద్‌లో ఉంటున్న జంతుప్రేమికులు సాయిశ్రీ, పంచ్, శారద, డాక్టర్ కృష్ణప్రియ. ప్రజలలో మూగ జీవాల పట్ల అవగాహన కలిగించేందుకు, సురక్షితంగా ఉంచేందుకు నార్డ్ గ్లోబల్ ఆర్గనైజేషన్‌తో కలిసి అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. నేషనల్ యానిమల్ రైట్స్ డే సందర్భంగా జంతు ప్రేమికులు చెబుతున్న విషయాలు.

స్కూల్, కాలేజీలకు వెళ్లి..

జంతువులకు కూడా జీవించే హక్కు ఉంది అని చెప్పడానికి నార్డ్ అనే సంస్థ అంతర్జాతీయంగా వర్క్ చేస్తుంది.



కొన్ని ఆర్గనైజేషన్స్‌తో కలిసి వర్క్ చేస్తాం. ప్రజల్లో అవగాహన కల్పించడమే ఉద్దేశంగా ఈ కార్యక్రమాలు ఉంటాయి. మూడేళ్లుగా యానిమల్ సేవలో పాల్గొంటున్నాను. మనిషి కారణంగా ఏ జంతువూ బాధపడకూడదు. ఎవరూ వాటిని హింసించకూడదు. నేను ఒక స్ట్రీట్ డాగ్‌ను దత్తత తీసుకున్నా. అప్పటి నుంచి నాకు ఈ సేవ పట్ల ఆసక్తి పెరిగింది. స్కూల్, కాలేజీలకు వెళ్లి కూడా అవగాహన కార్యక్రమాలు చేస్తుంటాం. జంతు ఆధారిత ఉత్పత్తులను ఏవీ ఉపయోగించం.

– పంచ్, యానిమల్ యాక్టివిస్ట్, సైనిక్‌పురి

పూర్తి సమయం కేటాయింపు..



మన వీధిలో ఒక కుక్క ఉందంటే అది ఆ కాలనీవారందరి బాధ్యతగా ఉండాలి. దానికి ఏదైనా దెబ్బ తగిలినా, తిండి లేకుండా పడి ఉన్నా ఎవరూ పట్టించుకోరు. అలాంటి కుక్కలు, పిల్లలు, గోవులు... వీధుల్లో తిరిగేవాటిని తీసుకొచ్చి, సేవ చేస్తాం. వీధుల్లో ఉండే కుక్కలకు బర్త్ కంట్రోల్ ఆపరేషన్స్ చేయిస్తాం. ఐదేళ్లయ్యింది ఈ వర్క్ చేయబట్టి. ఎనిమిదేళ్ల క్రితం మా ఫ్రెండ్ అక్కవాళ్ల దగ్గర నుంచి ఒక కుక్కను తీసుకున్నాను. స్ట్రీట్ డాగ్స్‌కు దెబ్బలు తగిలినప్పుడు ట్రీట్‌మెంట్ చేసేదాన్ని, చేయించేదాన్ని. ఆ తర్వాత షెల్టర్ స్టార్ట్ చేశాను. దీనికి మరొక ఫౌండర్ జత కలవడంతో ఇప్పుడు ఇక్కడ రెండు వందల వరకు యానిమల్స్ ఉన్నాయి. గోవులు ఆరున్నాయి. ఇప్పటి వరకు నాలుగు వేల స్ట్రీట్ యానిమల్స్‌కి సేవలందించాను. నేషనల్ బాక్సర్‌గా ఉన్న నేను ఈ వైపుగా ఆసక్తి పెరగడంతో పూర్తి సమయాన్ని జంతువుల సేవకే కేటాయిస్తున్నాను. వీగన్ పదార్థాల తయారీ, ప్రొడక్ట్స్ బిజినెస్ కూడా చేస్తుంటాను. వీటి వల్ల వచ్చే ఆదాయంలో 15 శాతం జంతు సేవలకే ఉపయోగిస్తుంటాను.

– సాయి శ్రీ, బోరంపేట్, దుండిగల్

బ్లడ్ అవసరమైతే..



నేను డెంటిస్ట్‌గా వర్క్ చేస్తున్నాను. అలాగే, అవసరమైన డాగ్స్‌కి బ్లడ్ అందేలా చూస్తుంటాను. నాకు కుక్కలు అంటే చాలా ఇష్టం. ఒక సారి మా ఫ్రెండ్ వాళ్ల కుక్కకు ప్రమాదం జరిగి, బ్లడ్ అవసరమైంది. ఆ సమయంలో మరో కుక్క నుంచి బ్లడ్ తీసి, మ్యాచ్ చేసి ప్రమాదం నుంచి గట్టెక్కించారు. అప్పటి నుంచి కుక్కలకు కూడా బ్లడ్ అవసరం అని భావించి, రికార్డ్ చేస్తున్నాను. ఇందుకు సంబంధించి వెటర్నరీ డాక్టర్స్‌ని, వారి ద్వారా అవసరమైన కుక్కలకు మరో పెట్ పేరెంట్ ద్వారా బ్లడ్ అందేలా చూస్తుంటాను.

– డాక్టర్ కృష్ణప్రియ, మలక్‌పేట

పోలీస్ స్టేషన్ వరకు వెళ్లాల్సి వచ్చింది..



మా అపార్ట్‌మెంట్ దగ్గర 20 కుక్కలను సేవ్ చేసి, వాటికి షెల్టర్ ఏర్పాటు చేశాను. ఇందుకు చాలా మందితో సమస్యలు ఎదుర్కోవాల్సి వచ్చింది. కుక్కలకు ఆహారం పెడుతుంటే, పై నుంచి బాటిల్స్ వేసినవారున్నారు. అవే కుక్కల మీద పడితే, వాటికి ఎంత ప్రమాదం జరిగేదో అస్సలు ఆలోచించరు. న్యూసెన్స్ అవుతుందని కంప్లైంట్ చేస్తే పోలీస్ స్టేషన్ దాకా వెళ్లాల్సి వచ్చింది. యానిమల్ రైట్స్ గురించి చెప్పినప్పుడు, అందరూ తగ్గారు. మొదట్లో స్ట్రీట్ డాగ్‌ని దత్తత తీసుకొని, పెంచేదాన్ని. ఆ తర్వాత ఆ కాలనీలో తిరుగుతున్నవాటిని రెస్క్యూ చేయడం మొదలుపెట్టాను. అక్కడి నుంచి మా ఫ్రెండ్ షెల్టర్‌కి పంపిస్తుంటాను.

– శారద, యానిమల్ యాక్టివిస్ట్, ప్రగతినగర్

– నిర్మలారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

వైరల్

హమ్మయ్యా.. అమ్మ కల నెరవేరింది




ఇంటిపట్టున ఉండి పిల్లాడి ఆలనాపాలన చూడాలనేది ఆమె కల. అయితే ఆమెది రెక్కాడితేగానీ డొక్కాడని జీవితం. పొద్దున పని కోసం బయటికి వెళితే ఏ రాత్రో ఇంటికి వచ్చేది. సెలవంటూ లేని పని. పరీక్ష ఫీజు కట్టలేని సందర్భంలో పిల్లాడిని పట్టుకొని ఏడ్చిన సందర్భాలు ఉన్నాయి. ఎన్నో కష్టాలు పడి పిల్లాడిని చదివించింది. పంజాబ్‌లోని లుధియానాకు చెందిన ఆ అబ్బాయి అయూష్ గోయల్ ఎకౌంటెంట్ అయ్యాడు. ఆ తరువాత ట్విట్టర్ కాపీరైటర్‌గా మంచి ఆదాయన్ని ఆర్జిస్తున్నాడు. అమ్మను పని మానిపించాడు. తాము ఉండే ఇరుకు గది నుంచి 2-బెడ్‌రూమ్ అపార్ట్‌మెంట్‌కు మారాడు.

'ఇప్పుడు మా అమ్మ ఫుల్-టైమ్ మదర్' అని తల్లి ఫోటోలను జత చేస్తూ ఆయూష్ గోయల్ ట్విట్టర్‌లో చేసిన పోస్ట్ వైరల్ అయింది. ఎంతోమందిని కదిలించింది.

ఆ రహస్యం... అందరూ తెలుసుకోవాల్సిందే!



అమితాబ్, జయబచ్చన్‌ల 50వ వివాహ వార్షికోత్సవం సందర్భంగా వారి కూతురు శ్వేతా బచ్చన్ నందా ఒక అరుదైన బ్లాక్ అండ్ వైట్ ఫొటో ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేస్తే అది వైరల్‌గా మారింది.

తల్లిదండ్రుల వివాహబంధం గోల్డెన్ జూబ్లీలోకి ప్రవేశించిన నేపథ్యంలో శుభాకాంక్షలు తెలియజేసింది శ్వేత.

'సుదీర్ఘకాల అన్యోన్య దాంపత్యం వెనుక రహస్యం ఏమిటి?' అని తల్లిని అడిగింది.

జయ బచ్చన్ చెప్పిన జవాబు... 'లవ్'!

'ఏ విభేదాన్ని అయినా పక్కన పెట్టే, ఏ కష్టాన్ని అయినా తట్టుకునే శక్తి ప్రేమకు ఉంటుంది' అని నెటిజనులు కామెంట్ చేశారు. ఈ బ్లాక్ అండ్ వైట్ ఫొటో నేపథ్యంలో నెల వ్యవధిలోనే విడాకులు తీసుకుంటున్న నవదంపతుల నుంచి భార్యాభర్తల మధ్య ఉండాల్సిన అనురాగాలూ, ఆప్యాయతల వరకు ఎన్నో అంశాలపై నెటిజనులు లోతుగా చర్చించుకుంటున్నారు.

ఓ కైకే పాన్ దోశ వాలా!

'ఎన్ని రకాల పాన్‌లు ఉన్నాయి?' అని అడిగితే హైదరాబాద్ నుంచి అలహాబాద్ వరకు ఎన్ని రకాలు ఉన్నాయో చెప్పవచ్చు. అలాగే దోశలలో కూడా మైసూర్ దోశ నుంచి రవ్వ దోశ వరకు




ఎన్నో రకాల దోశలు ఉన్నాయి. దోశ ప్లస్ పాన్ కాంబినేషన్ అనేది ఊహకు అందదు. అయితే ముంబైవాలా ఒకరు దోశకు పాన్ జత చేస్తూ తయారుచేసిన 'పాన్ దోశ'ను చూసి నెటిజనులు 'ఔరారా' అంటున్నారు.

వేడి వేడి దోశలో పాన్‌తో పాటు అంజీర్, డ్రై ఫ్రూట్స్... మొదలైనవి చేర్చాడు.

రెండు రోజుల వ్యవధిలోనే ఈ వీడియో 1.5 లక్షల వ్యూస్‌ను సొంతం చేసుకుంది.

ఉడుత సాయం కాదు... ఉడుతకే సాయం!

'ఉడుత సాయం' అంటారు కానీ ఇక్కడ ఒక ఉడత మాత్రం సాయం కోసం మనిషి దగ్గరకు పరుగెత్తుకుంటూ వచ్చింది. తనకు దాహం వేస్తోందని ఆ వ్యక్తికి సైగలు చేస్తూ చూపించింది.



సదరు దయగల వ్యక్తి ఉడుతకు వాటర్ బాటిల్‌తో నీళ్లు తాగించాడు. ఈ వీడియో పాతదే అయినప్పటికీ ఎవరో 'రెడ్డిట్'లో రీ-షేర్ చేశారు.

పాతదా, కొత్తదా అనే విషయం పక్కన పెడితే ఈ వీడియో ఎంతోమందిని భావోద్వేగానికి గురిచేసింది.

కాపాడే టీ-షర్ట్‌లు



ఫ్రెంచ్ కంపెనీ 'ఫ్లోటీ' పద్దెనిమిది నెలల నుంచి ఆరు సంవత్సరాల మధ్య ఉన్న పిల్లల కోసం యాంటీ-డ్రౌనింగ్ టీ-షర్ట్‌లను రూపొందించింది. పిల్లలు ప్రమాదవశాత్తు నీటిలో పడితే మునిగిపోకుండా ఈ టీ-షర్ట్‌లు కాపాడుతాయి. టీ-షర్ట్‌లో అమర్చిన విజిల్ పెద్దగా సౌండ్ చేస్తూ చుట్టుపక్కల వారిని అప్రమత్తం చేస్తుంది. స్టైలీష్‌గా, సౌకర్యవంతంగా ఉండే ఈ టీ-షర్ట్ ఎలా పనిచేస్తుంది...అనేదానిపై రూపొందించిన డెమో వీడియోను పారిశ్రామిక వేత్త ఆనంద్ మహీంద్రా ట్విట్టర్‌లో పోస్ట్ చేశాడు.

'ఇది నోబెల్ బహుమతి పొందిన ఆవిష్కరణ కంటే గొప్పది. ఒక తాతగా పిల్లల భద్రత అనేది నాకు అత్యంత ముఖ్యమైనది' అని ట్వీట్ చేశాడు.

హెల్త్

మెడి టిప్

• స్లీప్ ఆప్నియా నివారణ

గురక వస్తుంటే..?



నిద్రలో అన్ని కండరాలతో పాటు గొంతు కండరాలూ రిలాక్స్ అవుతాయి. దాంతో అవి హాయిగా వేలాడబడినట్లుగా (ఫ్లాపీ) అయిపోతాయి. ఇలా వేలాడబడినట్లు కావడంతో గాలి తీసే సిన ట్యూబ్‌లా కుంచించుకుపోయి, మూసుకుపోయినట్లుగా అవుతుంది. దాంతో ఈ శ్వాసనాళం నుంచి గాలి ప్రయాణం చేసేటప్పుడు నోరు, అంగిలితో పాటు అది కూడా గాలి తాలూకు ప్రకంపనలకు లోనవుతుంది. ఫలితంగా గొంతు నుంచి శబ్దం వస్తుంది. దాన్నే గురకగా చెబుతుంటాం. అయితే ఇలా గురక రావడం ఒక్కోసారి ఊపిరి అందనివ్వకుండా ప్రమాదకరమైన పరిస్థితికి నెట్టవచ్చు. గుండెకూ మంచిది కాదు. అందుకే గురక వచ్చేవారు దాన్ని నివారించడం కోసం కొన్ని జాగ్రత్తలు పాటించాలి. అవి...

➡ స్థూలకాయం ఉన్నవారు తమ ఎత్తుకు తగినట్లుగా బరువు తగ్గాలి. (ఇది గురకతో పాటు ఎన్నో వ్యాధులను నివారిస్తుంది). ➡ ఆహారం తీసుకోగానే నిద్రకు ఉపక్రమించకూడదు. ➡ పొగతాగే అలవాటు మానేయాలి. ➡ నిద్రకు ముందు నాలుగు నుంచి ఆరు గంటల ముందు ఆల్కహాల్ తీసుకోకూడదు. పూర్తిగా మానేయడం మరీ మంచిది. ➡ నిద్రమాత్రలు అస్సలు తీసుకోకూడదు. ➡ ఎడమ పక్కగా ఒరిగి పడుకోవడం వంటి జాగ్రత్తలతో ఆప్నియాను చాలావరకు తగ్గించవచ్చు. అప్పటికీ తగ్గకపోతే ఈఎన్‌టీ లేదా పల్మునాలజిస్ట్ అండ్ స్లీప్ స్పెషలిస్టులను సంప్రదించాలి.

రెస్పిరేటరీ సిన్సీషియల్ వైరస్!



ఊపిరితిత్తులకు వచ్చే సాధారణ ఇన్ఫెక్షన్‌లలో రెస్పిరేటరీ సిన్సీషియల్ వైరస్ (ఆర్ఎస్‌వీ) ఒకటి. మరీ చిన్నపిల్లల్లోనూ, అలాగే కాస్త వయసు పైబడిన... అంటే 65, 70 ఏళ్ల పెద్దవాళ్లలో ఇది చాలా సాధారణంగా కనిపించే వ్యాధి. మామూలు ప్రజలకు ఇది ఫలానా అంటూ పెద్దగా తెలియకపోయినా మన దేశవాసుల్లో అందునా ప్రధానంగా నెలల వయసు నుంచి రెండేళ్ల చిన్నారుల్లో చాలా విస్తృతంగా కనిపించే సమస్య. పిల్లల్లో చెవి నొప్పి అంటే చిన్నపిల్లల డాక్టర్లు మొదట అనుమానించే వ్యాధి ఇదే. పిల్లలు ఆ లక్షణాన్ని చెప్పారంటే వాళ్లలో కనీసం 25 శాతం మందికి ఆర్ఎస్‌వీ సోకిందేమోనని డాక్టర్లు భావిస్తుంటారు. ఒక అంచనా ప్రకారం మన దేశంలో ప్రతి 1000 మంది పిల్లల్లో 53 మందిలో (5.3% మందికి) కనిపించేటంతటి సాధారణ వ్యాధి ఇది. అంతేకాదు రాబోయే చినుకు రాలే కాలం దీని వ్యాప్తికి అనువైన కాలం కావడంతో 'ఆర్ఎస్‌వీపై అవగాహన కోసం ఈ కథనం.

చిన్నపిల్లల్లో... అందునా నెలలు నిండకముందే పుట్టిన పిల్లల్లో ఊపిరితిత్తులు అంతగా పూర్తిగా అభివృద్ధి చెందవు. ఇలాంటి ప్రీ-మెచ్యూర్ బార్న్ పిల్లల్లో ఊపిరితిత్తులు పెద్దగా అభివృద్ధి చెందకపోవడాన్ని బ్రాంకో పల్మునరీ డిస్‌ప్లేసియా (బీడీపీ) అంటారు. ఇలాంటి వాళ్లలో రెస్పిరేటరీ సిన్సీషియల్ వైరస్ (ఆర్ఎస్‌వీ) చాలా హాని చేస్తుంది. అలాగే 65 - 70 ఏళ్ల దాటిన పెద్దవయసు వారిలో గుండెజబ్బులు, ఊపిరితిత్తుల సమస్యలున్నవారిలో, అలాగే వ్యాధి నిరోధక వ్యవస్థ బలహీనంగా ఉన్నవారిలో ఇది బాగా ప్రమాదకరంగా పరిణమిస్తుంది. అందుకే దీన్ని గురించి తెలుసుకుని ఉండటం అవసరం.

లక్షణాలు : • జ్వరం (సాధారణంగా వైరల్ జ్వరాలు చాలా ఎక్కువ తీవ్రతతో ఉంటాయి. కానీ దీనిలో జ్వర తీవ్రత చాలా తక్కువ (మైల్డ్) మొదలుకొని, ఓ మోస్తరు (మోడరేట్)గా ఉంటుంది. • ఊపిరితిత్తులకు సంబంధించిన ఇన్ఫెక్షన్ కావడంతో పిల్లకూతలు (వీజింగ్) కనిపిస్తుంటుంది. ఇది కాస్త ఎక్కువగానే ఉంటుంది. ఇక పెద్దల్లోనైతే అప్పటికే ఆస్తమా, బ్రాంకైటిస్, ఎంఫసిమా వంటి వ్యాధులతో బాధపడేవారిలో వీజింగ్ మరీ ఎక్కువ. • దగ్గు, కొందరిలో ముక్కు కారడం వంటి లక్షణాలూ కనిపిస్తాయి. • చెవి నొప్పి, జ్వరంతో వచ్చే పిల్లల్లో చిన్న పిల్లల్లో... డాక్టర్లు చెవి ఇన్ఫెక్షన్ కంటే ముందుగా 'ఆర్ఎస్‌వీ'నే అనుమానిస్తారు. • పరిస్థితి తీవ్రంగా ఉన్న కొందరిలో ఊపిరి అందకపోవడం వల్ల చిన్నారులు నీలంగా మారే (సైనోసిస్) అవకాశం కూడా ఉంటుంది.

కోవిడ్-19తో పోలికలూ... కొన్ని ఆసక్తికరమైన ఆవిష్కరణలు!

ఆర్ఎస్‌వీ లాగే కోవిడ్-19 కూడా ప్రధానంగా ఊపిరితిత్తులకు వచ్చే వ్యాధి. లక్షణాల్లో దీనికీ కోవిడ్‌కూ చాలా పోలికలు ఉండటంతో పాటు... ఇటీవల కోవిడ్-19 వ్యాక్సిన్ కోసం చేసే పరిశోధనల్లో ఆర్ఎస్‌వీకి కూడా వ్యాక్సిన్లు అందుబాటులోకి వచ్చాయి. అంతకు మునుపు ఈ వ్యాధికి గత 25 ఏళ్లుగా 'పాలివిజుమ్యాబ్' అనే యాంటీబాడీతో చికిత్స చేసేవారు. అయితే పెద్దవయసు వారికి ఇచ్చేందుకు రూపొందించిన వ్యాక్సిన్స్‌ను ఇటీవలే... (గత మే నెలలో) ఎఫ్‌డీఏ ఆమోదించడం విశేషం.

వ్యాప్తి ఇలా...

కోవిడ్-19 వ్యాపించినట్టే ఆర్ఎస్‌వీ కూడా తుమ్మడం, దగ్గడం చేసినప్పుడు, షేక్‌హ్యాండ్ ఇచ్చినప్పుడు, ఒకరి వస్తువులు మరొకరు తాకినప్పుడు... నోటి తుంపర్లు గాలిలో వ్యాపించి, ఒకరి నుంచి మరొకరికి అంటే... ఆరోగ్యకరమైన వ్యక్తికి సోకుతుంది.

ఈ కాంప్లికేషన్లు ఉన్నవారిలో మరింత ప్రమాదకరం...

• నెలలు నిండకముందే పుట్టిన పిల్లలు, దీర్ఘకాలిక (క్రానిక్) ఊపిరితిత్తుల జబ్బులు ఉన్నవారిలో, గుండెజబ్బులున్న చిన్నారుల్లో, బలహీనమైన వ్యాధినిరోధకత ఉన్నపిల్లల్లో ఇది ప్రమాదకరంగా మారుతుంది. • బ్రాంకైటిస్, ఆస్తమా, ఎంఫసిమా వంటి లంగ్స్‌కు సంబంధించిన వ్యాధులు ఉన్నవారిలో ఇది మరీ ప్రమాదకరం. • మామూలుగానైతే ఇది చాలా బలహీనమైన వైరస్. అయితే వైరస్ లేదా సెకండరీ ఇన్ఫెక్షన్లకు కారణమయ్యే బ్యాక్టీరియా కారణంగా ఇది సోకాక కలిగే నిమోనియా లేదా ఇతర సెకండరీ ఇన్ఫెక్షన్లతోనూ, వ్యాధినిరోధక వ్యవస్థ (ఇమ్యూన్ సిస్టమ్) బాగా బలహీనంగా ఉన్నవారిలోనూ చాలా ప్రమాదకరం. • మాటిమాటికీ ఇన్ఫెక్షన్లు వచ్చేవారిలోనూ.. అలాగే వైరస్, బ్యాక్టీరియాలు చెవి (ఇయర్ డ్రమ్) వెనక మధ్య చెవి (ఒటైటిస్ మీడియా)లో చేరిన పిల్లల్లో ఇది ప్రమాదకరంగా మారేందుకు అవకాశం ఎక్కువ.

వ్యాధి నిర్ధారణ : ఫిల్మ్ యార్రే అనే వైద్య పరీక్ష ద్వారా దీన్ని గుర్తించడం సాధ్యం. కేవలం ఆర్ఎస్‌వీనే కాకుండా ఎడినో వైరస్ లాంటి ఇతర ఇన్ఫెక్షన్లనూ గుర్తించగలిగే ఇది చాలా ఖరీదైన వైద్య పరీక్ష. అందుకే అనుభవజ్ఞులైన డాక్టర్లు దీన్ని వైద్యపరీక్షలతోనే కాకుండా కేవలం తమ అనుభవంతోనే ఎక్కువగా గుర్తిస్తారు.

నివారణ : ఆర్ఎస్‌వీ నివారణ కూడా దాదాపుగా పూర్తిగా కోవిడ్-19నే పోలి ఉంటుంది. • జబ్బు తీవ్రత చాలా ఎక్కువగా ఉన్నవారు తమ నుంచి ఇతరులకు సోకకుండా మాస్క్ ధరించాలి. • సబ్బుతో చేతులు శుభ్రంగా కడుక్కుంటూ ఉండటం లేదా శానిటైజర్‌తో శుభ్రపరచుకుంటూ ఉండాలి. • భౌతికంగా దూరం పాటిస్తూ ఉండాలి. • మంచి ఆరోగ్యకరమైన ఆహారంతో పాటు అన్ని పోషకాలు అందేలా సమతులాహారం తీసుకుంటూ, పెద్దలు తగినంత వ్యాయామం చేస్తూ, ఆరోగ్యకరమైన జీవన శైలి (లైఫ్‌స్టైల్)తో చురుగ్గా ఉంటూ, బరువు పెరగకుండా చూసుకోవడం, ఒత్తిడి లేకుండా గడపడం వల్ల దీన్ని చాలావరకు నివారించవచ్చు.



డాక్టర్ విజయ్ వి. ఎల్దండి
సీనియర్ ఇన్‌ఫెక్షియస్ డిసీజెస్ స్పెషలిస్ట్

చికిత్స : తొలుత దీన్ని కొన్ని రకాల కోతిజాతుల్లో అంటే చింపాంజీల వంటి వాటిల్లోనే వచ్చే వ్యాధిగా భావించారు. అటు తర్వాత మనుషుల్లోనూ ఇది వస్తుందని గుర్తించి, దీనికి మందు కనుగొనే ప్రయత్నం చేశారు. తొలినాళ్లలో పాలివిజుమ్యాబ్ అనే మందు గత 25 ఏళ్లుగా ఇస్తూ వచ్చారు. దీంతోపాటు కొన్ని పీల్చే మందులు (ఏరోసాల్స్) కూడా ఇస్తారు. అయితే అమెరికాలో జీఎస్‌కే అనే కంపెనీ రూపొందించిన ఓ సరికొత్త వ్యాక్సిన్‌ను ఎఫ్‌డీఏ ఆమోదించడంతో గత మే నెలలోనే అదక్కడ అందుబాటులోకి వచ్చింది. ఇదే కాకుండా ఫైజర్ వ్యాక్సిన్ కూడా అక్కడ అందుబాటులోకి వచ్చింది. భారత్‌తో కూడా పరిశోధనలు విస్తృతంగా కొనసాగుతున్నాయి. ఇక్కడ కూడా త్వరలోనే వ్యాక్సిన్ అందుబాటులోకి వస్తే... అనేక మంది వయసుపైబడిన వృద్ధులకు ప్రయోజనకారిగా ఉండగలదు.

• జీరోస్టోమియా

మాటిమాటికీ నోరు తడారిపోతోందా?



నోటిలో ఊరుతూ ఉండే లాలాజలం (సలైవా) వల్ల నోరు ఎప్పుడూ తడిగా ఉంటుంది. సాధారణంగా ఈ లాలాజలం నోటిలో ఉండే ఆహారపదార్థాలను ఎప్పటికప్పుడు కడిగేస్తూ ఉంటుంది. కానీ కొందరిలో నోరు ఎప్పుడూ పొడిబారిపోతూ ఉంటుంది. చాలా వరకు ఈ లక్షణం డయాబెటిస్ రోగుల్లోనే ఎక్కువ. మరికొందరిలో మాత్రం డయాబెటిస్ వంటి జబ్బులు లేకపోయినప్పటికీ నోరు పొడిబారిపోతూ ఉంటుంది. ఇలా జరగడాన్ని వైద్యపరిభాషలో 'జీరోస్టోమియా' అంటారు.

నోటిలో తగినంత లాలాజలం లేకపోవడం వల్ల నోటిలోని ఓరల్, ఓరోఫ్యారింజియల్ అనే బ్యాక్టీరియా విపరీతంగా పెరిగిపోతాయి.ఇలా పెరగడాన్ని బ్యాక్టీరియల్ కొలొనైజేషన్ అంటారు.

ఎవరెవరిలో... నోరు తడారిపోవడం అనే కండిషన్ మధుమేహం (డయాబెటిస్) రోగులతో పాటు... సాధారణంగా హెడ్ అండ్ నెక్ క్యాన్సర్ కారణంగా రేడియేషన్ చికిత్స తీసుకున్నవారిలో ఎక్కువగా కనిపిస్తుంది. నోరు పొడిబారిపోవడమన్న ఈ ప్రక్రియ చాలాకాలం పాటు కొనసాగితే నోటిలోని మృదుకణజాలం (సాఫ్ట్ టిష్యూస్) దెబ్బతినడం జరగవచ్చు. ఫలితంగా దంతాలు దెబ్బతినడం (టూత్ డికే), చిగుర్ల వ్యాధులు వచ్చేందుకు అవకాశాలూ పెరుగుతాయి. ఇలాంటి పరిస్థితుల్లో వెంటనే దంతవైద్యులను తప్పక కలవాలి.

జాగ్రత్తలు, సూచనలు... • తరచూ కొద్దికొద్దిగా నోట్లోకి నీళ్లు తీసుకుని చిన్న చిన్న గుటకలు వేస్తూ ఉండటం • కరిగే ఐస్‌ను చప్పరించడం • చక్కెర లేని గమ్స్, చక్కెర లేని మింట్ వంటివి నోటిలో లాలాజలం ఊరేలా చేస్తాయి.

వీటికి దూరంగా ఉండటం మేలు... • నోరు పొడిబారేవాళ్లకు కెఫిన్‌లు ఎక్కువ మోతాదులో ఉండే కాఫీ లేదా సాఫ్ట్‌డ్రింక్స్‌కు దూరంగా ఉండాలి లేదంటే చాలా పరిమితంగా తీసుకోవాలి. • పొగతాగే అలవాటు పూర్తిగా మానేయాలి. • ఆల్కహాల్‌ను పూర్తిగా మానేయడం వల్ల మంచి ప్రయోజనం కలుగుతుంది.

చికిత్స... నోటిలో తగినంత లాలాజలం ఊరని రోగులకు ప్రత్యామ్నాయంగా కొన్ని చికిత్సలు సూచిస్తారు. అలాగే కొన్ని పుక్కిలించే ద్రావణాలు, పైపూతగా వాడదగ్గ ఫ్లోరైడ్ ద్రావణాలనూ సూచిస్తారు. తరచూ నోరు పొడారిపోతుంటే... ఇలాంటివారు తొలుత ఫాస్టింగ్ బ్లడ్ షుగర్, పోస్ట్ లంచ్ షుగర్ పరీక్షలు చేయించి ఒకసారి ఫిజీషియన్‌తో పాటు దంతవైద్యుడినీ కలవాలి.



డా॥ నరేంద్రనాథ్ రెడ్డి
సీనియర్ డెంటల్ స్పెషలిస్ట్



వెర్‌స్టాపెన్‌కు పోల్ పొజిషన్

మాంట్‌మెలో (స్పెయిన్): ఫార్ములా వన్ స్పానిష్ గ్రాండ్‌ప్రి ప్రధాన రేసును రెడ్‌బుల్ డ్రైవర్ మ్యాక్స్ వెర్‌స్టాపెన్ మొదటి స్థానంతో మొదలు పెడతాడు. శనివారం జరిగిన క్వాలిఫయింగ్ రేసులో డిఫెండింగ్ చాంపియన్ వెర్‌స్టాపెన్ పోల్ పొజిషన్ సాధించాడు. ల్యాప్‌ను అతను అత్యుత్తమంగా 1 నిమిషం 12.272 సెకన్లలో పూర్తి చేశాడు. ఈ సీజన్‌లో ఏడు రేస్‌లలో నాలుగో సారి వెర్‌స్టాపెన్‌కు పోల్ పొజిషన్ లభించింది. కార్లోస్ సెయింజ్ (ఫెరారీ), ల్యాండో నోరిస్ (మెక్‌లారెన్) రెండో, మూడో స్థానాల్లో నిలిచారు. మెర్సిడెజ్‌కు చెందిన లూయిస్ హామిల్టన్‌కు ఐదో స్థానం దక్కింది. ఈ సీజన్‌లో రెండు రేస్‌లు నెగ్గిన వెర్‌స్టాపెన్ రెడ్‌బుల్ సహచరుడు సెర్గియో పెరెజ్ 11వ స్థానంనుంచి ప్రధాన రేస్‌ను ప్రారంభిస్తాడు.

ప్రిక్వార్టర్స్‌లో స్వియాటెక్

- రూడ్, గాఫ్ కూడా...
- ఫిట్‌నెస్ సమస్యలతో రిబాకినా అవుట్
- ఫ్రెంచ్ ఓపెన్


స్వియాటెక్


హదాద్ మైయా

పారిస్: డిఫెండింగ్ చాంపియన్, టాప్ సీడ్ ఇగా స్వియాటెక్ ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నమెంట్‌లో ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. వింబుల్డన్ చాంపియన్, నాలుగో సీడ్ ఎలీనా రిబాకినా ఫిట్‌నెస్ సమస్యలతో వైదొలగగా, ఆరోసీడ్ కోకో గాఫ్, 14వ సీడ్ హదాద్ మైయాతో పాటు పురుషుల ఈవెంట్‌లో సీడెడ్లు కాస్పెర్ రూడ్, హోల్గెర్ రూన్ (డెన్మార్క్) ప్రిక్వార్టర్ ఫైనల్ చేరారు. జపనీస్ స్టార్ నిషిఒకా చెమటోడ్చి ముందంజ వేయగా, 15వ సీడ్ బొర్నా కొరిచ్ మూడో రౌండ్లో నిష్క్రమించాడు.

ఏకపక్షంగా...

మహిళల సింగిల్స్‌లో రెండుసార్లు (2020, 2022) ఇక్కడ క్లే కోర్ట్ చాంపియన్‌గా నిలిచిన ప్రపంచ నంబర్‌వన్ స్వియాటెక్‌కు మూడో రౌండ్లో చైనీస్ ప్రత్యర్థి నుంచి కనీస పోటీనే లేకపోయింది. దీంతో పోలండ్ స్టార్ 6-0, 6-0తో జిన్యూ వాంగ్‌ను అతి సునాయాసంగా ఓడించింది. కేవలం 51 నిమిషాల్లోనే మ్యాచ్‌ను ఏకపక్షంగా ముగించింది. వింబుల్డన్ చాంపియన్, నాలుగో సీడ్ ఎలీనా రిబాకినా మ్యాచ్ బరిలోకి దిగకుండా టోర్నీ నుంచి తప్పుకుంది. అనారోగ్య కారణాలతో మూడో రౌండ్ బరిలోకి దిగలేనని 23 ఏళ్ల కజకిస్తాన్ ప్లేయర్ వెల్లడించింది. దీంతో ప్రత్యర్థి సార సొరిబెస్ టొర్మో (స్పెయిన్) వాకోవర్‌తో ప్రిక్వార్టర్స్ చేరింది. మిగతా మ్యాచ్‌ల్లో ఆరో సీడ్ కోకో గాఫ్ (అమెరికా) 6-7 (5/7), 6-1, 6-1తో మిర అంద్రీవా (రష్యా)పై గెలుపొందగా, 14వ సీడ్ హదాద్ మైయా 5-7, 6-4, 7-5తో అలెగ్జాండ్రొవా (రష్యా)ను ఓడించింది.

పోరాడి ఓడిన సెబొత్

బ్రెజిలియన్ క్వాలిఫయర్ తియాగో సెబొత్ వైల్డ్ అంటే ఇకపై ప్రత్యర్థులు హడలెత్తిపోవాల్సిందే. ఎందుకంటే ఇదివరకే అతను తొలి రౌండ్లోనే యూఎస్ ఓపెన్ మాజీ చాంపియన్ (2021), రెండో సీడ్ మెద్వెదెవ్ (రష్యా)పై సంచలన విజయం సాధించాడు. తాజాగా అతని దూకుడుకు జపాన్ నంబర్‌వన్ ఆటగాడు యొషిహితో నిషిఒకా బ్రేకులేసినప్పటికీ సెబొత్ తన పోరాటంతో ఆకట్టుకున్నాడు. 27వ సీడ్ నిషిఒకా 3-6, 7-6 (10/8), 2-6, 6-4, 6-0తో సెబొత్ వైల్డ్‌పై శ్రమించి గెలిచాడు. ఫ్రెంచ్ ఓపెన్ నిరుటి రన్నరప్, నాలుగో సీడ్ కాస్పెర్ రూడ్ (నార్వే) 4-6, 6-4, 6-1, 6-4తో చైనాకు చెందిన జాంగ్ జిజెన్‌పై గెలుపొందాడు. నార్వే స్టార్‌కు తొలిసెట్లో ప్రతిఘటన ఎదురైనా... తర్వాత సెట్లలో సులువుగానే గెలిచాడు. గతేడాది క్వార్టర్ ఫైనల్ చేరిన ఆరోసీడ్ డెన్మార్క్ స్టార్ రూన్ ఇప్పుడు మెరుగైన ప్రదర్శన కనబరచాలనే పట్టుదలతో ఆడుతున్నాడు. మూడో రౌండ్లో తనకెదురైన ప్రత్యర్థి ఒలీవియెరి (అర్జెంటీనా)ను 6-4, 6-1, 6-3తో ఓడించాడు. కేవలం రెండు గంటల్లోనే (గంటా 58 నిమిషాలు) మ్యాచ్‌ను ముగించాడు. బొర్న కొరిచ్ (క్రొయేషియా) 3-6, 6-7(5/7), 2-6తో మార్టిన్ ఎచెవెరి (అర్జెంటీనా) చేతిలో పరాజయం చవిచూశాడు.

భారత్ 'షూటౌట్' విజయం



లండన్: ఎఫ్ఐహెచ్ ప్రొ లీగ్‌లో భాగంగా శనివారం జరిగిన మ్యాచ్‌లో భారత్ 4-2 (షూటౌట్)లో ఇంగ్లండ్‌ను ఓడించింది. నిర్ణీత సమయంలో ఇరు జట్లు 4-4 గోల్స్‌తో సమంగా నిలవగా...ఆ తర్వాత భారత్ ఆధిపత్యం ప్రదర్శించింది. భారత్ తరఫున హర్మన్‌ప్రీత్ సింగ్ (6వ నిమిషం), మన్‌దీప్ సింగ్ (18వ, సుఖ్‌జీత్ సింగ్ (27వ), అభిషేక్ (49వ) ఒక్కో గోల్ సాధించగా, ఇంగ్లండ్ తరఫున వార్డ్ స్యామ్ ఒక్కడే 4 గోల్స్ (7వ, 39వ, 46వ, 52వ నిమిషాల్లో) చేయడం విశేషం. అనంతరం షూటౌట్‌లో భారత్‌నుంచి మన్‌ప్రీత్ సింగ్, హర్మన్‌ప్రీత్ సింగ్, లలిత్ ఉపాధ్యాయ్, అభిషేక్ సఫలం కాగా, ఇంగ్లండ్‌నుంచి కాల్నాన్ విల్, వాలస్ జాచరీ మాత్రమే గోల్ చేయగలిగారు. సొంతగడ్డపై ఆరంభంలో ఇంగ్లండ్ వరుసగా దాడులు చేయగా, భారత గోల్ కీపర్ కృష్ణన్ పాఠక్ వాటిని సమర్థంగా అడ్డుకోగా, భారత్‌కు లభించిన తొలి పెనాల్టీ కార్నర్‌ను కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ గోల్‌గా మలచగలిగాడు. 25 సెకన్ల లోపే వార్డ్ గోల్‌తో ఇంగ్లండ్ స్కోరు సమం చేయగా...మన్‌దీప్, సుఖ్‌జీత్‌లో ఫీల్డ్ గోల్స్‌తో తొలి అర్ధ భాగం ముగిసే సరికి భారత్ ఆధిక్యంలో నిలిచింది. మూడో క్వార్టర్‌లో, ఆపై నాలుగో క్వార్టర్ ఆరంభంలో కూడా ఒక్కో గోల్ సాధించి వార్డ్ 'హ్యాట్రిక్' పూర్తి చేయడంతో స్కోరు 3-3తో సమమైంది. ఐదు నిమిషాల తర్వాత మరో గోల్‌తో భారత్ ముందంజలో నిలిచినా, వార్డ్ తన నాలుగో గోల్‌తో మళ్లీ ఇంగ్లండ్‌ను ఆదుకున్నాడు. అయితే షూటౌట్‌లో చివరకు భారత్‌దే పైచేయి అయింది.



సంయమ్‌కు స్వర్ణం

సుల్ (జర్మనీ): జూనియర్ షూటింగ్ ప్రపంచకప్‌లో భారత అమ్మాయి సంయమ్ పసిడితో మెరిసింది. శనివారం జరిగిన 10 మీటర్ల ఎయిర్‌పిస్టల్ ఈవెంట్‌లో సంయమ్ స్వర్ణపతకం గెలుచుకుంది. ఫైనల్లో సంయమ్ 238 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. కిమి మిన్‌సియో (కొరియా - 236) రజతం సాధించగా, ల్యూ హెంగ్ యూ (చైనీస్ తైపీ - 216.9)కి కాంస్యం దక్కింది. ఫైనల్లో పోటీ పడిన మరో భారత షూటర్ సురుచి ఇందర్ సింగ్ 154.1 పాయింట్లు సాధించి ఆరో స్థానానికే పరిమితమైంది.

భారత్ 22, ఉజ్బెకిస్తాన్ 0

మహిళల హాకీ
జూనియర్ ఆసియా కప్


అన్ను

కకమిగర (జపాన్): మహిళల హాకీ జూనియర్ ఆసియా కప్‌లో భారత జట్టు అద్భుత విజయంతో శుభారంభం చేసింది. శనివారం జరిగిన తొలి పోరులో భారత్ 22-0తో ఉజ్బెకిస్తాన్‌ను చిత్తుగా ఓడించింది. భారత ప్లేయర్ అన్ను ఏకంగా ఆరు గోల్స్‌తో చెలరేగడం విశేషం. మ్యాచ్ 13వ నిమిషం, 29వ, 30వ, 38వ, 43వ, 51వ నిమిషాల్లో అన్ను గోల్స్ నమోదు చేసింది. ఇతర ఆటగాళ్లలో ముంతాజ్ ఖాన్ 4 గోల్స్ (6వ, 44వ, 47వ, 60వ), దీపిక 4 గోల్స్ (32వ, 44వ, 46వ, 57వ), వైష్ణవి 2 గోల్స్ (3వ, 56వ), సునెలితా టోపో 2 గోల్స్ (17వ, 17వ), దీపిక సొరెంగ్ 2 గోల్స్ (18వ, 25వ) సాధించగా...మంజు చోర్సియా (26వ), నీలమ్ (47వ) ఒక్కో గోల్ చేశారు.

పోరాడి ఓడిన లక్ష్యసేన్


థాయ్‌లాండ్ ఓపెన్

బ్యాంకాక్: థాయ్‌లాండ్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-500 టోర్నమెంట్‌లో భారత పోరాటం ముగిసింది. ఏకైక ఆశాకిరణం లక్ష్యసేన్ కూడా సెమీ ఫైనల్లో ఓడిపోయాడు. శనివారం జరిగిన పురుషుల సింగిల్స్ సెమీస్‌లో భారత షట్లర్ లక్ష్యసేన్ 21-13, 17-21, 13-21తో థాయ్‌లాండ్‌కు చెందిన రెండో సీడ్ కున్లావుత్ వితిద్సర్న్ చేతిలో పోరాడి ఓడాడు. గంటా 15 నిమిషాల పాటు జరిగిన ఈ పోరులో 21 ఏళ్ల భారత ఆటగాడు తొలి గేమ్‌లో సీడెడ్ ప్రత్యర్థిపై ఆధిపత్యం కనబరిచాడు. ఆరంభంలో 11-6 స్కోరు వద్ద పైచేయి సాధించాడు. కానీ థాయ్ ఆటగాడు వరుసగా నాలుగు పాయింట్లు చేశాడు. అయితే దీటుగా ఆడిన లక్ష్యసేన్ వరుసగా ఐదు పాయింట్లు సాధించాడు. అక్కడినుంచి గేమ్ తన నియంత్రణలోనే ముగిసింది. రెండో గేమ్ అయితే నువ్వానేనా అన్నట్లు సాగింది. కున్లావుత్ క్రాస్‌కోర్ట్ స్మాష్‌లతో పదును పెంచగా... దీటుగా ఎదుర్కొన్న భారత ఆటగాడు సుదీర్ఘ ర్యాలీలతో సత్తా చాటుకున్నాడు. స్థానిక షట్లర్ 12-10 వద్ద ఉన్నప్పుడు వరుసగా నాలుగు పాయింట్లు సాధించి జోరు పెంచినా చివరకు గేమ్ ప్రత్యర్థికే దక్కింది. నిర్ణాయక మూడో గేమ్‌లో లక్ష్యసేన్ పోరాడినా... కున్లావుత్ జోరు ముందు సేన్ ఆట ఫలితమివ్వలేదు.



భారత క్రికెటర్, ఐపీఎల్‌లో చెన్నై జట్టు సభ్యుడైన రుతురాజ్ గైక్వాడ్ ఇంటివాడయ్యాడు. శనివారం తన చిరకాల స్నేహితురాలు, మహారాష్ట్ర మాజీ క్రికెటర్ ఉత్కర్ష పవార్‌ను అతను పెళ్లాడాడు.

అదే దూకుడు కొనసాగిస్తా



పోర్ట్స్‌మౌత్: ఇటీవల ఐపీఎల్‌లో కొనసాగించిన దూకుడునే ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్లోనూ కనబరుస్తానని సీనియర్ బ్యాటర్ అజింక్య రహానే అన్నాడు. కొన్నాళ్ల విరామం తర్వాత జట్టులోకి రావడం ఆనందంగా ఉందన్నాడు. ప్రాక్టీస్ సెషన్‌లో తలమునకలైన అతను మాట్లాడుతూ '18, 19 నెలల అనంతరం మళ్లీ జట్టులోకి వచ్చాను. గతంలో ఏం జరిగింది. ఇప్పుడేం జరిగిందని అదే పనిగా ఆలోచిస్తూ కూర్చోను. టీమిండియా తరఫున తాజాగా ఆటను ఆరంభిస్తా. మైదానంలో నేనేం చేయగలనో అదే చేస్తాను' అని రహానే తెలిపాడు. చెన్నై సూపర్‌కింగ్స్‌కు ఆడటాన్ని చాలా బాగా ఆస్వాదించానన్నాడు. ఈ ఐపీఎల్ సీజన్‌లో చక్కగా బ్యాటింగ్ చేశానని, అంతకు ముందు కూడా దేశవాళీ క్రికెట్‌లోనూ రాణించానని చెప్పుకొచ్చాడు. 'ఇప్పుడు కూడా అదే మైండ్‌సెట్‌తో ఆడతాను. ఇది టెస్టా... టి20 మ్యాచా అన్నది ఆలోచించను. నా సహజశైలిలో నేను బ్యాటింగ్ చేస్తాను' అని రహానే అన్నాడు. ప్రస్తుతం రోహిత్ శర్మ సారథ్యంలో టీమిండియా పటిష్టంగా ఉందన్నాడు.

ఇంగ్లండ్ ఘన విజయం


టంగ్

లండన్: ఐర్లాండ్ జట్టు పోరాటంతో ఇంగ్లండ్‌కు రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ చేయాల్సి రాగా... తుది ఫలితం మాత్రం ఊహించిన విధంగానే వచ్చింది. లార్డ్స్ మైదానంలో ఐర్లాండ్‌తో శనివారం ముగిసిన ఏకైక టెస్టులో ఇంగ్లండ్ 10 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఓవర్‌నైట్ స్కోరు 97/3తో ఆట కొనసాగించిన ఐర్లాండ్ తమ రెండో ఇన్నింగ్స్‌లో 363 పరుగులకు ఆలౌటైంది. మార్క్ ఎడైర్ (88) ఆండీ మెక్‌బ్రైన్ (86 నాటౌట్) జట్టు స్కోరులో కీలకపాత్ర పోషించారు. ఇంగ్లండ్ బౌలర్లలో తొలి టెస్టు ఆడిన జోష్ టంగ్ (5/66) ఐదు వికెట్లతో చెలరేగాడు. అనంతరం 11 పరుగుల విజయలక్ష్యాన్ని ఇంగ్లండ్ తొలి 4 బంతుల్లోనే 3 ఫోర్లతో అందుకుంది.

'సిడ్నీ'లో ఆఖరి టెస్టు ఆడతా!


వార్నర్

బెకన్‌హామ్ (ఇంగ్లండ్): ఆస్ట్రేలియా ఓపెనర్ డేవిడ్ వార్నర్ తన టెస్టు క్రికెట్ రిటైర్మెంట్ గురించి కీలక ప్రకటన చేశాడు. వచ్చే ఏడాది ఆరంభంలో సొంత మైదానం సిడ్నీలో తన ఆఖరి టెస్టు ఆడి రిటైర్ కావాలనుకుంటున్నట్లు తన కోరికను వెల్లడించాడు. జనవరి 3-7 మధ్య జరిగే ఈ మ్యాచ్‌లో పాకిస్తాన్‌తో ఆసీస్ తలపడుతుంది. 2024లో జరిగే టి20 ప్రపంచకప్‌తో అతను అంతర్జాతీయ క్రికెట్‌కు పూర్తిగా గుడ్‌బై చెప్పే అవకాశాలు ఉన్నాయి. అయితే సిడ్నీలో ఆఖరి టెస్టు ఆడాలంటే అప్పటి వరకు వార్నర్ టెస్టుల్లో మెరుగైన ప్రదర్శన ఇవ్వాల్సి ఉంటుంది. గత కొంత కాలంగా అతని టెస్టు స్థానం సందేహంలో పడింది. 2022నుంచి ఆరంభం నుంచి చూస్తే గత 24 టెస్టుల్లో అతను కేవలం 26 సగటు నమోదు చేశాడు. ఇందులో ఒకే ఒక సెంచరీ ఉంది.

సినిమా

ఓ కీ ఇచ్చి కథను కీలక మలుపు తిప్పే కీలక పాత్రలు ఉంటాయి. అలాంటి 'కీ' రోల్స్ నిడివి తక్కువైనా గుర్తింపు ఎక్కువ ఉంటుంది కాబట్టి హీరో.. హీరోయిన్లు అప్పుడప్పుడూ 'కీ' రోల్స్ ఒప్పుకుంటుంటారు. ఇప్పుడు కథకు 'కీ' ఇచ్చే పాత్రలు చేస్తున్న కొందరు కథానాయికలు చేస్తున్న చిత్రాల గురించి తెలుసుకుందాం.

కథకు కీ ఇస్తారు!


• శ్రుతీహాసన్
• కీర్తీ సురేష్

సిస్టర్ ఆఫ్ శంకర్

కమర్షియల్ మూవీస్‌లో హీరోయిన్‌గా, ఉమెన్ సెంట్రిక్ ఫిల్మ్స్‌లో లీడ్ రోల్ చేయడం మాత్రమే కాదు... వీలైనప్పుడల్లా అతిథిగా, కీలక పాత్రధారిగా కూడా నటిస్తుంటారు హీరోయిన్ కీర్తి సురేష్. 'సీమరాజా', 'మన్మథుడు 2', 'జాతి రత్నాలు' వంటి సినిమాల్లో గెస్ట్ రోల్ చేశారు కీర్తి. ఇక మోహన్‌లాల్ 'మరక్కార్: అరభికడలింటే సింహమ్', రజనీకాంత్ 'అన్నాత్తే'(తెలుగులో 'పెద్దన్న') చిత్రాల్లో కీర్తి సురేష్ కథలో కీలక పాత్రలు పోషించారు. ఇప్పుడు 'భోళా శంకర్' చిత్రంలో కీ రోల్ చేస్తున్నారు. చిరంజీవి హీరోగా నటిస్తున్న ఈ మూవీలో తమన్నా హీరోయిన్‌గా నటిస్తుండగా, చిరంజీవి చెల్లెలుగా కీర్తి సురేష్ నటిస్తున్నారు. మెహర్ రమేష్ దర్శకత్వంలో అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్న ఈ చిత్రం ఆగస్టు 11న విడుదల కానుంది.

తొలి అడుగు

ప్రత్యేక పాత్రల పరంగా తొలి అడుగు వేశారు హీరోయిన్ శ్రుతీహాసన్. నాని హీరోగా శౌర్యవ్ దర్శకుడిగా పరిచయం అవుతూ 'హాయ్ నాన్న' (ప్రచారంలో ఉన్న టైటిల్) అనే చిత్రం రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఇందులో 'సీతారామం' ఫేమ్ మృణాల్ ఠాకూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, కథలో కీలకమైన ఓ ప్రత్యేక పాత్రలో హీరోయిన్ శ్రుతీహాసన్ నటిస్తున్నారు. ఆమె ప్రత్యేక పాత్రలో నటించడం ఇదే తొలిసారి. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ కూనూర్‌లో జరుగుతోంది. చెరుకూరి మోహన్, విజయేందర్ రెడ్డి నిర్మిస్తున్న ఈ సినిమా డిసెంబరు 21న విడుదల కానుంది.

డాటర్ ఆఫ్ భగవత్

అరడజనుకుపైగా సినిమాల్లో హీరోయిన్‌గా నటిస్తూ, టాలీవుడ్‌లో మోస్ట్ బిజీ హీరోయిన్‌గా ఉంటున్న శ్రీలీల 'భగవత్ కేసరి' (ప్రచారంలో ఉన్న టైటిల్)లో కీలక పాత్ర చేస్తున్నారు. కాజల్ అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాకు అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తుండగా, బాలకృష్ణ హీరోగా టైటిల్ రోల్ చేస్తున్నారు. సాహు గారపాటి, హరీష్ పెద్ది నిర్మిస్తున్న ఈ చిత్రం అక్టోబరులో రిలీజ్ కానుంది. ఇక శ్రీలీల ఓ కథానాయికగా నటిస్తున్న చిత్రాల్లో 'గుంటూరు కారం' ఒకటి. ఇందులో పూజా హెగ్డే మెయిన్ హీరోయిన్.

కేరాఫ్ జైలర్

టాలీవుడ్‌లో 'క్రేజీ ఫెలో', 'ఉగ్రం' సినిమాల్లో నటించి హీరోయిన్‌గా తెలుగు ప్రేక్షకులకు దగ్గరయ్యారు మిర్నా మీనన్. ఈ బ్యూటీ ఇప్పుడు 'జైలర్' సినిమాలో చాలా కీలకమైన పాత్ర పోషించారు. రజనీకాంత్ హీరోగా నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వంలో రూపొందిన సినిమా ఇది. ఈ చిత్రంలో తమన్నా హీరోయిన్‌గా నటిస్తున్నట్లుగా ప్రచారం జరుగుతుండగా, రమ్యకృష్ణ, మిర్నా మీనన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రంలో రజనీకాంత్ కుమార్తెగా మిర్నా మీనన్ కనిపిస్తారట. ఈ షూటింగ్‌లో మిర్నా దాదాపు 40 రోజులు పాల్గొన్నారు. కళానిధి మారన్ నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 10న విడుదల కానుంది.

వెల్‌కమ్ టు టాలీవుడ్

వజ్రకాళేశ్వరి దేవిగా టాలీవుడ్‌కు ఎంట్రీ ఇస్తున్నారు హీరోయిన్ అపర్ణా దాస్. మలయాళంలో 'మనోహరం', తమిళంలో 'బీస్ట్' వంటి చిత్రాల్లో నటించిన అపర్ణా దాస్‌కు తెలుగులో తొలి చిత్రం 'ఆదికేశవ'. వైష్ణవ్‌తేజ్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో శ్రీలీల హీరోయిన్. ఇందులో కీలకమైన వజ్రకాళేశ్వరి దేవి పాత్రను అపర్ణా దాస్ పోషిస్తున్నారు. శ్రీకాంత్ ఎన్. రెడ్డి దర్శకత్వంలో నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్న ఈ చిత్రం జులైలో విడుదల కానుంది.

వీరే కాదు... కమల్‌హాసన్ 'ఇండియన్ 2'లో రకుల్‌ప్రీత్ సింగ్, ప్రభాస్ 'ఆదిపురుష్'లో సోనాల్ చౌహాన్, 'ప్రాజెక్ట్ కె'లో దిశా పటానీ, రాఘవా లారెన్స్ 'చంద్రముఖి 2'లో కంగనా రనౌత్.. ఇలా మరికొందరు హీరోయిన్లు ఆయా చిత్రాల కథలకు 'కీ'గా నిలుస్తున్నారు.


• మిర్నా మీనన్
• అపర్ణా దాస్
• శ్రీలీల

నేను క్యాన్సర్ బారిన పడలేదు

● ముందస్తుగా గుర్తిస్తే నివారించవచ్చని మాత్రమే అన్నాను

- చిరంజీవి



''నేనొక క్యాన్సర్ సెంటర్‌ని ప్రారంభించిన సందర్భంగా క్యాన్సర్ పట్ల అవగాహన పెరగాల్సిన అవసరం గురించి మాట్లాడాను. రెగ్యులర్‌గా మెడికల్ టెస్టులు చేయించుకుంటే క్యాన్సర్ రాకుండా నివారించవచ్చు అని చెప్పాను. నేను అలర్ట్‌గా ఉండి 'కొలొనోస్కోపీ' టెస్ట్ చేయించుకున్నాను. అందులో 'నాన్ క్యాన్సరేషియస్ పాలిప్స్'ని డిటెక్ట్ చేసి తీసేశారని చెప్పాను. 'అలా ముందుగా టెస్ట్ చేయించుకోకపోయి ఉంటే అది క్యాన్సర్ కింద మారేదేమో' అని మాత్రమే అన్నాను. అందుకే అందరూ ముందు జాగ్రత్తలు తీసుకుని మెడికల్ టెస్టులు చేయించుకోవాలి' అని మాత్రమే అన్నాను. అయితే కొన్ని మీడియా సంస్థలు దీన్ని సరిగ్గా అర్థం చేసుకోకుండా, అవగాహనా రాహిత్యంతో 'నేను క్యాన్సర్ బారిన పడ్డాను' అని, 'చికిత్స వల్ల బతికాను' అని స్క్రోలింగ్‌లు, వెబ్ ఆర్టికల్స్ మొదలుపెట్టాయి. దీనివల్ల అనవసరమైన కన్ఫ్యూజన్ ఏర్పడింది. అందుకే ఈ క్లారిఫికేషన్'' అని పేర్కొన్నారు చిరంజీవి. హైదరాబాద్‌లోని నానక్‌రామ్‌గూడలోని స్టార్ హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన క్యాన్సర్ సెంటర్‌ని శనివారం చిరంజీవి ప్రారంభించి, మాట్లాడుతూ- ''క్యాన్సర్‌ను ముందస్తుగా గుర్తిస్తే తప్పకుండా వైద్యం ద్వారా నివారించవచ్చు. స్టార్ హాస్పిటల్‌లో అధునాతనమైన క్యాన్సర్ చికిత్స కోసం ఆధునిక యంత్ర పరికరాలు, రోగ నిర్ధారణ విధానాలతో ఓ సెంటర్‌ని నెలకొల్పినందుకు అభినందనలు. పేద ప్రజలకు, చిత్రపరిశ్రమలో ఉన్న కార్మికులకు, తెలుగు రాష్ట్రాల్లోని వివిధ జిల్లాల్లో స్టార్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపులు ఏర్పాటు చేస్తే బాగుంటుంది. ఇందుకు చిరంజీవి బ్లడ్ బ్యాంక్, చారిటబుల్ ట్రస్ట్ సహకారం అందిస్తుంది'' అన్నారు.

పాటలకు వేళాయె..


● గోకుల్ కృష్ణ, కుంజుమోన్, కీరవాణి

ఆస్కార్ అవార్డు గ్రహీత, సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణి త్వరలో 'జెంటిల్‌మన్ 2' సినిమా మ్యూజిక్ కంపోజింగ్ పనులు మొదలు పెట్టనున్నారు. అర్జున్, మధుబాల జంటగా శంకర్ దర్శకత్వంలో కేటీ కుంజుమోన్ నిర్మించిన 'జెంటిల్‌మేన్ '(1993) చిత్రం సూపర్‌హిట్‌గా నిలిచింది. ఈ చిత్రానికి సీక్వెల్‌గా 'జెంటిల్‌మన్ 2'ని నిర్మించనున్నట్లు కేటీ కుంజుమోన్ ప్రకటించారు. ఈ చిత్రానికి ఎంఎం కీరవాణి సంగీతం అందించనున్న సంగతి తెలిసిందే. కాగా 'జెంటిల్‌మన్ 2' పూర్తి స్క్రిప్ట్‌ను కీరవాణికి వినిపించడానికి డైరెక్టర్ ఎ.గోకుల్ కృష్ణ హైదరాబాద్ వచ్చారు. ఈ సందర్భంగా కుంజుమోన్ మాట్లాడుతూ- ''జెంటిల్‌మన్ 2' కథ గ్రాండియర్‌కి చాలా ఇంప్రెస్ అయ్యారు కీరవాణి. జూలై నెలలోనే పాటల కంపోజ్ చేయడం ప్రారంభిస్తానని చెప్పడం సంతోషంగా ఉంది'' అన్నారు.


క్లైమాక్స్ కాదు.. క్లై'మ్యాక్స్'


● రామ్

భారీ యాక్షన్ సీక్వెన్స్‌ను హీరో రామ్ కంప్లీట్ చేశారు. హీరో రామ్, దర్శకుడు బోయపాటి శీను కాంబినేషన్‌లో ఓ యాక్షన్ సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. శ్రీ లీల హీరోయిన్. ఇటీవల మొదలైన ఈ సినిమా క్లైమాక్స్ చిత్రీకరణ పూర్తయింది. ''24 రోజుల చిత్రీకరణతో ఈ సినిమా క్లైమాక్స్ పూర్తయింది. ఇది క్లైమాక్స్ కాదు.. క్లైమ్యాక్స్'' అని ట్వీట్ చేశారు రామ్. శ్రీనివాసా చిట్టూరి నిర్మిస్తున్న ఈ సినిమా అక్టోబరు 20న విడుదల కానుంది. ఈ చిత్రానికి సంగీతం: తమన్, కెమెరా: సంతోష్ డిటాకే.

కొత్త వాళ్లను ప్రోత్సహించాలి

- బ్రహ్మానందం


● వీజే సన్నీ, బ్రహ్మానందం, సప్తగిరి

''జంధ్యాల, రేలంగి నరసింహారావు, ఈవీవీ సత్యనారాయణ, ఎస్వీ కృష్ణారెడ్డిగార్ల సినిమాల్లో తెర నిండుగా నటీనటులు ఉండటం చూశాను. మళ్లీ ఇంతమందిని (దాదాపు 50 మంది) ఒక్క దగ్గరికి చేర్చి 'అన్‌స్టాపబుల్' లాంటి మంచి వినోదాత్మక సినిమా చేయడం ఆనందంగా ఉంది. నిర్మాతలని యువ దర్శకులు, నటులు ప్రోత్సహించాలి.. అప్పుడే చిత్ర పరిశ్రమకు కొత్త ప్రతిభ వస్తుంది'' అని సీనియర్ నటుడు బ్రహ్మానందం అన్నారు. వీజే సన్నీ, సప్తగిరి హీరోలుగా, నక్షత్ర, అక్సాఖాన్ హీరోయిన్లుగా నటించిన చిత్రం 'అన్‌స్టాపబుల్'. డైమండ్ రత్నబాబు దర్శకత్వం వహించారు. రజిత్ రావు నిర్మించిన ఈ సినిమా ఈ నెల 9న విడుదల కానుంది. ఈ చిత్రం ట్రైలర్ లాంచ్ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన బ్రహ్మానందం మాట్లాడుతూ- ''అన్‌స్టాపబుల్'లో నటించిన వారందరూ ఒక బ్రహ్మానందం కావాలి'' అన్నారు. ''డైమండ్ రత్నబాబులాంటి దర్శకులు సక్సెస్ అయితే మాలాంటి వాళ్లకు మరిన్ని సినిమాలు వస్తాయి'' అన్నారు సప్తగిరి. ''ఈ మూవీతో ప్రేక్షకులను నవ్విస్తాం'' అన్నారు వీజే సన్నీ. ''అన్‌స్టాపబుల్' పై ఉన్న నమ్మకంతో రిలీజ్‌కి ముందే నాకు కారుని బహుమతిగా ఇచ్చారు నిర్మాత రజిత్ రావు'' అన్నారు డైమండ్ రత్నబాబు. ''ఫ్యామిలీతో చూసే చిత్రం ఇది'' అన్నారు రజిత్ రావు.

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

వధువు కావలెను



వైశ్య/డైరెక్ట్ కుల పట్టింపు లేదు, 32, 5'6"/ MBA/70 వేలు, 1.5Cr ఆస్తి గల వరునకు చదువుకున్న వధువు కావలెను. సంప్ర: 8639798537 [H-781698]

కుల ప్రసక్తి లేని 36 సం॥ల బిజినెస్ వరునికి రెండవ/విడో, పిల్లల ఉన్నవారు అయినా సంప్రదించండి. ఛారీ ప్రసక్తి లేదు. 7396730091 [H-781322]

SC మాల/ 30y/5'9"/ B.Tech/ MBA/Govt Job (గ్రూప్-I) AEE (ట్రాన్స్‌కో) కోట్ల ఆస్తి/ 10L P/A గల Well Settled వరునికి తగిన వధువు కావలెను. Ph: 7702195227 [H-781221]

రజక/కట్నం ప్రసక్తి లేదు/B.Tech/Govt. A.E/ఇరిగేషన్ Dept/80,000/-PM/ 5'10" ఎత్తు/28 సం॥ల వరునికి తగిన వధువు కావలెను. Ph: 7075953400, 7842467951 [HA-14655]

వడ్డెర/కట్నం ప్రసక్తి లేదు/B.Tech/C. Govt. బ్యాంక్ P.O/55000/-PM/ 5'10" ఎత్తు/29 సం॥ల వరునికి వధువు కావలెను. Ph: 7842467951, 7075953400 [HA-14655]

క్రిస్టియన్ మాల/కట్నం ప్రసక్తి లేదు/ B.Tech/C. Govt. A.E.E/ట్రాన్స్‌కో/5'9" ఎత్తు/28 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 6309258463 [HA-14655]

యాదవ/కట్నం ప్రసక్తి లేదు/M.Tech, NIT/Govt. A.E.E/ఇరిగేషన్ Dept/14 Lakhs P.A/5'8" ఎత్తు/28 సం॥ల వరునికి వధువు కావలెను. Ph: 9515755529 [HA-14655]

SC మాల & క్రిస్టియన్/M.Tech, NIT/ Govt. A.E.E/ఇరిగేషన్ Dept/85000/-PM/5'9" ఎత్తు/28 సం॥ల వరునికి తగిన వధువు కావలెను. కట్నం ప్రసక్తి లేదు. Ph: 9676995093 [HA-14655]

SC మాదిగ & క్రిస్టియన్/కట్నం ప్రసక్తి లేదు/B.Tech(సివిల్)/C.Govt.మేనేజర్/యూనియన్ బ్యాంక్/75000/-PM/5'8" ఎత్తు/28 సం॥ల వరునికి వధువు కావలెను. Ph: 9676995093. [HA-14655]

మాదిగ/ M.Tech/ Govt A.E/ జెన్‌కో/ 1 Lakh. Pm/ 5'10" ఎత్తు/ 28 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9642459724 [H-14656]

డైరెక్ట్‌కాపు/5'5"/55 Years/M.Sc. కుల పట్టింపు లేదు. నెలకు రూ.40 వేల ఆదాయం కలిగి, 60 లక్షల స్థిరాస్తి గల వ్యక్తికి మంచి మనసున్న వధువు కావలెను. పిల్లలు ఉన్నా లేకున్నా పర్వాలేదు. సంప్ర: 8341482731 [H-1215871]

రెడ్డి /40/5'10"/MBA/రెండవ పెళ్లి/ Pvt జాబ్/ 60K/Own House/2 కోట్ల ప్రాపర్టీ ఉన్న వరునికి OC 1 or 2 మ్యారేజ్ పిల్లలు లేని వధువు కావలెను (డైరెక్ట్), 9133857101. [T-1148502]

K.C. రెడ్డి మ్యారేజ్ బ్యూరో ప్రై॥ లి॥

రెడ్డి మ్యారేజ్ బ్యూరో India, Abroad Matches Fast Settlement: Deals with all regions in A.P. & Telangana (For Reddy's only) Cont: K.C. Reddy, Address: 106, A K Enclave, Phase II, 8-2-350, Road No. 3, Banjara Hills (Near Furniture Mall), Hyderabad. Ph: 9849321309 / 9347807015. PLEASE CHECK MY WHATSAPP STATUS. Email: kcreddy43@gmail.com, Facebook.com/kcreddymarriagebureau

వధువు కావలెను

Reddy/Now in Hyd/B.Tech/MS/ USA/140K/400Cr (Property) Needs India or USA Alliance. * Cont : K.C. Reddy-Hyd. Ph: 9849321309

Reddy/(Divorcee)USA Green Card Now in Hyd/No Dowry/1981/5'5"/V. Handsome Boy/10Cr. * Cont : K.C. Reddy-Hyd. Ph: 9849321309/9347807015

Reddy/Famous Business Man/ B.Tech/1997/5'11"/V.Handsome Boy/ 100Cr/ * Cont:K.C.Reddy-Mar-Bureau -Hyd.Ph: 9849321309/9347807015

Reddy/Business/Bangalore/B.Tech /Handsome Boy/1990/6'/1000Cr. *Cont: K.C. Reddy-Mar-Bureau-Hyd- Ph: 9849321309/9347807015

Reddy/Business/B.Tech/MBA/Very Handsome Boy / 1995/6' / 100Cr. * 1995/6'/50Cr. * Cont : K.C. Reddy-Hyd.Ph: 9849321309/9347807015

Reddy/B.Tech/MS/USA/Citizen * No Dowry/1994/5'9"/ 200Cr/ Needs a Beautiful Bride. * Cont : K.C. Reddy-Hyd. Ph: 9849321309

Reddy/Australia PR * B.Tech/ MS/ 1996/6'/Handsome Boy/95K/25Cr * Cont:K.C.Reddy-Mar-Bureau- Hyd. Ph: 9849321309/ 9347807015

Reddy/USA Doctor/Very Hand Some Boy/MBBS/ MD (Cardiology) 1995/5'8"/10Cr. *Cont: K.C. Reddy. Ph: 9849321309/9347807015

Reddy/ MBBS/ PG/DM. *1994/5'10"/ 75Cr. *1993/5'10"/50Cr. *1989/5'9"/30 Cr. * 1995/5'10"/400Cr. *Cont: K.C. Reddy-Hyd Ph: 9849321309/ 9347807015

Reddy/ IIT/ BITS / 1994/5'10"/35L/yr. *1992/5'9"/25L/yr. *32L/yr/1992/5'7"/USA-1992/400K. *1995/300K/5'7" *1994/5'7"/ 230K. * Cont: K.C. Reddy-Ph: 9849321309

వరుడు కావలెను

Reddy / Most Beautiful / Very Brilliant Girl/All Free Seats/MBBS (ENT) Surgeon/15Cr/ *Cont: K.C. Reddy-Hyd. Ph: 9849321309

Reddy/Most Beautiful/ BE/MS/ USA/H1/1992/5'5"/200Cr/ *Cont: K.C. Reddy -Mar-Bureau-Hyd Ph: 9849321309/9347807015

Reddy/B.Tech/M.Tech/SWE/Hyd/Most Beautiful/1993/5'4"/20Cr. *1995 /5'4"/20L/yr. *Cont: K.C. Reddy-Hyd-Ph:9849321309/ 9347807015

Reddy/ IIT/B.Tech/ MS/USA/1996/5'7" *1999/5'6" *1994/5'4" *BITS/1995/5'6" *1997/5'4"/200K *1990/5'8"/160K. * Cont: K.C. Reddy-Hyd- Ph: 9849321309

Reddy/Beautiful Rich Family *B.Tech/ 1993/5'3"/1000Cr *1996/5'9"/100Cr *1997/5'4"/150Cr * 1994/5'6"/100Cr. * Cont: K.C. Reddy-Hyd- Ph: 9849321309

Reddy/Most Beautiful/Father Diplomat/BA/MBA/1988/5'3"/200Cr her share * Cont: K.C. Reddy-Hyd- Ph: 9849321309/9347807015

Reddy/(Divorcee)/B.Tech/MS/India /Business/Most Beautiful/1985/ 5'5"/ 400Cr *Cont:K.C.Reddy-Hyd-Ph: 9849321309/9347807015

Reddy/ Divorcee/ B.Tech/Interior Designer/Most Beautiful/ 1988/ 5'6"/50Cr. * Cont: K.C. Reddy-Hyd. Ph: 9849321309/9347807015

Reddy/ B.Tech/ MS/H1/USA/Royal Family/1990/5'8"/160K/30Cr & Needs India or USA well settled. * Cont: K.C. Reddy-Hyd-Ph: 9347807015

Reddy/Most Beautiful/ V.Young/ 2001/ 5'3"/20Cr. *1998/5'4"/25Cr. *2002/ 5'7"/ 20Cr. *1998/5'7"/50Cr. *Cont: K.C. Reddy-Hyd. Ph: 9849321309/9347807015

[D-516]

SC మాల హిందు /MBA బిజినెస్ Well Settled Family వరునికి Well Settle Family వధువు కావలెను. Direct Contact: 9490495689, 7670934159. [T-1201187]

Reddy/29/5.4/B.Tech Software Employee. 18 LPA/ 1.50K PM అందమైన అమ్మాయి కావలెను. Direct. Contact 73375 86682/ 91826 43651 [L-799041]

★

అమ్మాయి కావలెను. అన్ని కులాలు 1వ కోమట్ల అబ్బాయి 35, M.Sc., M.Ed., ప్రైవేట్ లెక్చరర్, వ్యవసాయం 28 వేలు, ఆస్తి 46 లక్షలు నల్లగొండ. డైరెక్ట్ : 9121325068 [Y-772534]

★★

కులపట్టింపు లేదు. 55 సం॥లు, సెంట్రల్ గవర్నమెంట్ జాబ్, సొంత ఇల్లు గల వరుడికి ఏ బాదరబంది లేని మంచి సాంప్రదాయ వధువు కావలెను. కాంటాక్ట్: 9499947658. [N-1189704]

అవినాష్ రెడ్డి మ్యారేజెస్ (D.V. కోటి రెడ్డి)

రెడ్డిలకు మాత్రమే. D.V. కోటిరెడ్డి, 690, Road No:-3, Banjara Hills (TV-9, Opp: Colony) (IOC Petrol Bunk Side Road) Hyd. +91 9848011818 / +91 9393311818 (Tuesday Holiday) Timings : 10 am - 6 pm. www.avinashreddy.com, e-mail: avinash11818@gmail.com

వధువు కావలెను

రెడ్డి Business, MBA (Australia), 28, 5' 11", 50 Crores, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 30, 5' 11", SWE, 138 K, 10 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No. 3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 27, 6' 0", SWE, 200 K, 15 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 30, 5' 7", 150 K, 4 Crores, H1, USA, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

వరుడు కావలెను

రెడ్డి Residency Doctor, 27, 5' 4", 10 Crores, USA, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 27, 5' 7", Developer, 84 K, 7 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 27, 5' 7", Sr. SWE, 160 K, 5 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MBA (ISB), 26, 5' 4", 28 L P/A, 10 Crores, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.



రెడ్డి Business BE, MS (USA), 31, 5' 11", Hyd, Handsome, Rich. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Germany BE, MS, 28, 6' 0", Data Architect, 84 K Ponds, 15 Crores. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Residency Doctor, 31, 5' 10", 10 Crores, USA, H1, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, 35, 6' 0", SAP, 17.8 L P/A, Hyderabad, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 25, 5' 7", SWE, 129 K, 4 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Govt MBA, 27, 5' 3", 18 L P/A, 18 Crores, Hyderabad, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MS (UK), 26, 5' 5", Product Manager, 12 L P/A, 40 Cr, Hyd. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.


రెడ్డి BS, 24, 5' 5", Analyst, 75 K, 25 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

LETTER

మాల క్రిస్టియన్, వయస్సు 35 సం॥ H- 5'.10" MBBS, MD, వరుడుకి వధువు డాక్టర్, గవర్నమెంట్ ఎంప్లాయ్ కావలెను. కేస్ట్ నో బార్, నో బ్రోకర్స్. ✆ : 77949 11019 [R-1199257]

దూదేకుల (వెదిపోగు) B.Tech/ ఎత్తు 5'9" వైట్, సౌదీఅరేబియా (రియాద్) సామ్‌సాంగ్ కంపెనీలో ప్లానింగ్ మేనేజర్‌కు వధువు (B.Tech, డిగ్రీ) కావలెను. Ph: 9959215917 [H-780864]

వరుడు కావలెను



Govt ఎంప్లాయ్/డైవర్సీ/37yrs/ 3,00,000/-(PM) బాగా స్థిరపడిన అందమైన వధువుకి వరుడు కావలెను. కుల పట్టింపు (పిల్లలు ఉన్నా OK) సంప్రదించండి: 7386550413 [H-797696]

రెడ్డి/45yrs/కుల పట్టింపు లేదు/ఫెయిర్/ Govt.ఎంప్లాయ్ 1 లక్ష (PM), వెల్ సెటిల్డ్ ఫ్యామిలీ బిజినెస్ & 3 సొంత ఇల్లులు కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను (ఇల్లరికం 1st & 2nd లేట్ మ్యారేజ్ OK) సంప్ర: 8374802603 [H-797696]

2వ పెళ్ళి/40yr/Govt ఎంప్లాయ్/3,50,000/-(PM)/ బాగా స్థిరపడిన అందమైన వధువుకి వరుడు కావలెను. కులపట్టింపు లేదు (పిల్లలు ఉన్నా OK) సంప్రదించండి : 9502046384 [H-797696]

కాపు/40yrs/5'4"/కుల పట్టింపు లేదు/ ఫెయిర్/ M.A.B.Ed/Govt ఎంప్లాయ్ 80K(PM) వెల్ సెటిల్డ్ ఫ్యామిలీ & సొంత ఇల్లు కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను (ఇల్లరికం OK) సంప్ర: 8008474869 [H-797696]

గౌడ్స్/విడో/52Y/5'3"/ప్రొపర్ ఖమ్మం/Hydలో సొంత ఫర్నీచర్ షో రూం, రెంట్స్/మంచి ఆస్తి గల వధువుకి కుల, ఆస్తి ప్రసక్తి లేని వరుడు కావలెను. (అర్జెంట్) (నో బ్రోకర్స్) 7799083500, 7386660643 [H-797696]

రెడ్డి/విడో / 60Y/ 5'3"/ B.Com/Accounts Officer/80K PM/సొంత ఇల్లు/5 ఎకరాల పంట పొలం గల ఒంటరి వధువుకి కుల ప్రసక్తిలేని వరుడు కావలెను. Ph: 8688368288 [H-781496]

రెడ్డి/49/విడో/5'5"/V.Fair/Govt (HM)/ సొంత ఇల్లు/20 ఎకరాల మాగాణి, బిజినెస్ గల సాంప్రదాయమైన వెల్ సెటిల్డ్ వధువుకు వరుడు కావలెను. కుల ప్రసక్తి లేదు. Ph: 9492718486 [H-781496]

రెడ్డి/విడో/60y/5'5"/V.Fair/రిటైర్డ్ పెన్షనర్/సొంత ఇల్లు & రెంట్స్/స్థిరాస్తులు ఏబాదరబందీలేని సాంప్రదాయ కుటుంబం గల వెల్ సెటిల్డ్ ఒంటరి వధువుకు వరుడు కావలెను. Ph: 9133521622 [H-781496]

బ్రాహ్మణ్/ విడో / 58y / తెల్లనిచాయ/ Govt Employee/Own House గల పిల్లలులేని వధువుకు వరుడు కావలెను. Ph: 9121509718 [H-781496]

OC/50y/విడో/సెంట్రల్ గవర్నమెంట్ జాబ్ /Own Hotel/Gold Shop/17 Acres Land/14 Lac Income గల వధువుకు FC/BC వరుడు కావలెను. Ph: 8332853512 [H-781496]

రెండో పెళ్ళి/ 58y & 56y & 54y & 52y & 50y & 48y & 46y &45y &43y & 40y & 39y & 38y & 36y & 35y & 33y & 32y &31y & 30y & 29Y & 28y/ "మాసేవ" మ్యారేజ్ బ్యూరో. PhWA: 9291583949 [H-781698]

2వ పెళ్లి/కుల ప్రసక్తి లేదు/35yrs/M.Sc, M.Ed/ Govt. టీచర్ 1 లక్ష (PM)/20 కోట్ల ఆస్తి గల పిల్లలులేని తెల్లని అందమైన వెల్ సెటిల్డ్ వధువుకి వరుడు కావలెను (పిల్లలు ఉన్నా & ఇల్లరికం OK) సంప్ర: 7396213324 [H-781698]

కుల ప్రసక్తి లేదు/విడో/43/District Tribal Welfare Officer/1L PM/Own Villa/50ఏ "Land" కోట్ల ఆస్తులు గల ఆర్థికంగా స్థిరపడిన వెల్ సెటిల్ వధువుకు వరుడు కావలెను. Ph; 9676651402 [H-781698]

రెండవ పెళ్లి/విడో/50y/fair/వరంగల్/Govt Job/Own House (Rents) well settle ఏ బాదరబందీలేని అందమైన ఏకైక వధువుకు FC/BC వరుడు కావలెను. Ph: 7997175138 [H-781698]

రెడ్డి /విడో/కుల, మత, ఆస్తి ప్రసక్తి లేదు/ A:30/ H:5'4"/సొంత బిజినెస్‌లు కలిగిన వధువుకి వరుడు కావలెను. 1st/2nd అయినా పరవాలేదు (ఇల్లరికం OK). సంప్ర: 8143011223 [HA-14653]

FC/Divorce/58/5'4"/V.ఫెయిర్, సొంత ఇల్లు, రెంట్స్, 25 ఎకరాల పంట పొలం, సొంత బిజినెస్ గల కుల పట్టింపు లేని వధువుకు వరుడు కావలెను. 9966957895 [HA-14653]

SC మాల/25/5'5"/MBBS/MD Gynic AIIMS/ Well Settled వధువుకి తగిన వరుడు కావలెను. No brokers. Ph: 9493285326 [HA-14653]

రెడ్డి/విడో/కుల, మత, ఆస్తి ప్రసక్తి లేదు/ A:30/ Qly: డిగ్రీ/బిజినెస్ కలిగిన అందమైన వధువుకి 1st or 2nd మ్యారేజ్ వరుడు కావలెను (ఇల్లరికం OK). Ph: 9515673252 [HA-14653]

SC మాదిగ/27 సం॥/ 5'4"/ B.Tech/ MBA/ Govt Job/ (గ్రూప్-I)AE (ఇరిగేషన్) 10L P/A గల వెల్‌సెటిల్డ్ వధువుకు తగిన వరుడు కావలెను. 6281925716 [H-781221]

కమ్మ CNB/ విడో/ 43y/5'3"/MCA/ సొంత వ్యాపారము 24L P/A / కోట్ల ఆస్తి గల వధువుకు తగిన వరుడు కావలెను. 9390933661 [H-781221]

పద్మశాలి: 25y/ 5'3"/ M.Sc/ Lecturer/ 7L P/A/ సొంత Flat Well Settled Family వధువుకు తగిన వరుడు కావలెను. 8897091964 [H-781221]

క్రిస్టియన్ మాల/B.Tech/C.Govt. Asst. మేనేజర్/కెనరా బ్యాంక్/ 50,000/-PM / 5'4" ఎత్తు / 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 6309258463 [HA-14655]

యాదవ/B.Sc/Govt. A.E.O/అగ్రికల్చర్ Dept/40,000/-PM/5'4" ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 7842467951, 7075953400 [HA-14655]

విశ్వబ్రాహ్మణ/2వ పెళ్లి/ 36/ 5'3"/MBA, HR/Pvt.జాబ్ వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 9676812525 [HA-14655]

వడ్డెర/B.Tech/C.Govt. Asst. మేనేజర్/ కెనరా బ్యాంక్/60,000/-PM/5'4" ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 8341650195 [HA-14655]

రెడ్డి: విడో 40 సం॥ డిగ్రీ సొంత ఇల్లు 30 ఎకరాల పొలం పెద్ద స్థిరాస్తి కలిగి పిల్లలులేని ఒంటరి వధువుకు అర్జెంట్‌గా వరుడు కావలెను. (ఆస్తి కుల పట్టింపు లేదు) Send photos Only Whatsapp 7207516654 [H-778991]

బ్రాహ్మణ/2వ పెళ్లి/ 30/5'3"/ PVT. జాబ్/ 15000/- pm. అందమైన వధువుకు జాబ్/బిజినెస్/ పురోహితం వరుడు కావలెను. 9701743336 [H-14656]

కాపు/ 2వ పెళ్లి / 55yrs/ ఫ్యామిలీ పెన్షన్/ 60,000/- pm/ Own House & వ్యవసాయ భూమి గల వధువుకు వరుడు కావలెను. 8978651721 [H-14656]

క్రిస్టియన్: 2వ పెళ్లి/కులప్రసక్తి లేదు/ B.Tech/ C.Govt P.O/ SBI/ 55000/- pm/ 5'4" ఎత్తు/ 33 సం॥ల పిల్లలు లేని అందమైన వధువుకు వరుడు కావలెను. 9550650024 [H-14656]

బ్రాహ్మణ/25/5'3"/ ఇంటర్ "28/5'2"/ ఇంటర్ "27/5'3"/B.Sc "26/5'2"/BBM కట్నాలు ఇవ్వలేని మధ్యతరగతి వధువులకు వరులు కావలెను. 7207634758 [H-14656]

వేదికలు



వడ్డెర వధువు వివాహ సంబంధాలు కుదుర్చబడును. దేశ, విదేశ తక్షణ సంబంధాల కొరకు సంప్రదించండి : 9381553423 [HA-14653]

శుభమస్తు మ్యారేజ్ బ్యూరో TM/ Est : 1995, గౌడ, ఈడిగ, శెట్టి బలిజ, 1st/ 2nd దేశ/విదేశ సంబంధాలకై సం॥ S.రాములు గౌడ్, లింగాల కాంప్లెక్స్, DSNR, Hyd. వ్యవస్థాపకులు: స్వర్గీయ S.నారదాగౌడ్, Ph: 8790690309 [H-781497]

కులపట్టింపులేదు/అన్ని కులములవారికి/ 1వ, 2వ సంబంధములు చూడబడును. 21 సం॥ నుండి 60సం॥ వరకు సంబంధములు చూడబడును. 6281925716 [H-781221]

Brahmin పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ: Nikhil. Ph: 7032712544/Blue Trend Matrimonial (P) Ltd. [HA-14664]

Kamma-Kapu పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Nikhil. Ph: 7032712544/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-14664]

Reddy పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ: Nikhil. Ph: 7032712544/Blue Trend Matrimonial (P) Ltd. [HA-14664]

Madiga - Mala పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam. Ph: 7702272594/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-14664]

Christian పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ: Shyam. Ph: 7702272594/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-14664]

ఫ్రీ రిజిస్ట్రేషన్ అన్ని కులములవారికి Govt/సాఫ్ట్‌వేర్/గెజిటెడ్/MBBS/PG/NRI /PVT/ బిజినెస్/1వ/2వ/లేట్ AP/TS 15సం॥ Exp. Ph: 8712384555 [HA-29502]

ధృవ మ్యారేజెస్. అన్ని కులాల వారికి 1/2/విడో/డైవర్స్ తగిన సంబంధాలు చూడబడును. 22 నుండి 60 సం॥ వారికి. 9949395407 [H-793686]

మాల, మాదిగ స్పెషల్ : IAS, IPS, IFS, IRS, గ్రూప్-I, II, PG, డాక్టర్స్, బ్యాంక్ PO, Govt. ఆఫీసర్స్, USA, UK, Ph : 73969 15712 (A). [M-7892]

పెళ్లి ప్రయత్నాలు చేసి విసిగిపోయారా? మేమున్నాము!! Only సాఫ్ట్‌వేర్, డాక్టర్స్, NRI, Govt. 20years గా Fast Settlement, పూర్ణ మ్యాట్రిమోని, తిరుపతి, 7093722724. [T-1349]

15 రో॥ అన్ని కులముల వారి తగిన సంబంధములు చూపించగల అతి పెద్ద సంస్థ రోహిణి. www.rohinimarriages.com ✆ 94418 29644, 98490 58673, 94920 33897, 94407 85888 W [B-605]

★

Free Registration బ్రాహ్మణ మరియు అన్నికులాల SWE Govt, Doctors, MNC Matches, Late & 2nd Matches కై సంప్రదించండి: 9704655103, 9533608887 (Whatsapp) [HA-147]

★★

మాల (క్రైస్తవ, హిందూ) వివాహ పరిచయ వేదిక ది. 10-6-2023 సా॥ 5 గం॥ to 8 గం॥ వరకు. ప్రబుద్ధ భారత్ హాల్, ఎ.జి. ఆఫీస్ ఎదురు, హైదరాబాద్ కళ్యాణమాల ✆ 94405 45049 [B-1165173]

రజక వివాహ వేదిక (1994)/ డాక్టర్స్/ ఇంజనీర్స్/ Abroad/ USA/ UK/ B.Ed/ Govt Job సంబంధాలకై సంప్రదించండి ఫోన్: 8106303155 / 9391265304. [H-781434]

రత్నగిరిపై భక్తుల రద్దీ

స్వామివారిని దర్శించిన 50 వేల మంది



అన్నవరం: సత్యదేవుని దర్శనానికి వచ్చిన భక్తులతో శనివారం రత్నగిరిపై రద్దీ నెలకొంది. శుక్రవారం రాత్రి, శనివారం తెల్లవారుజామున రత్నగిరిపై సుమారు వంద వివాహాలు జరిగాయి. అదే విధంగా పలు ప్రాంతాలలో వివాహాలు చేసుకున్న నవదంపతులు తమ బంధుమిత్రులతో కలిసి సత్యదేవుని వ్రతాలాచరించి స్వామివారిని దర్శించారు. దీంతో అన్ని వ్రతమండపాలు, క్యూలైన్లు, స్వామివారి ఆలయం భక్తులతో నవదంపతులతో నిండిపోయాయి. సత్యదేవుని దర్శించిన అనంతరం భక్తులు సప్తగోకులంలో గోవులకు ప్రదక్షిణ చేశారు. రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించి ప్రదక్షిణ చేశారు. స్వామివారి వ్రతాలు 2,500 నిర్వహించారు. సుమారు 50 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించగా అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.50 లక్షలు ఆదాయం సమకూరింది. సుమారు ఐదు వేల మంది భక్తులకు సత్యదేవుని నిత్యాన్నదాన పథకంలో ఉచిత భోజన సౌకర్యం కలుగ చేశారు. రత్నగిరిపై 20 రోజుల క్రితం భక్తులు జారవిడుచుకున్న బంగారు ఉంగరం, మూడు వెండి పట్టీలు గురించి మైకులో ప్రచారం చేసినా ఆ వస్తువులు తమవే అని భక్తులు ఎవరూ రానందున వాటిని దేవస్థానానికి స్వాధీనం చేశారు. ఈ నెల 20న స్వామివారి హుండీ లెక్కింపు కార్యక్రమంలో ఈ వస్తు వులను అధికారికంగా దేవస్థానానికి జమ చేస్తారని అధికారులు తెలిపారు. కాగా, పది రోజుల క్రితం మ రో ఉంగరం ఆలయ ప్రాంగణంలో దొరికింది. ఆ ఉంగరం పీఆర్వో కార్యాలయం వద్ద ఉంది. భక్తులు దాని వివరాలు చెప్పి తీసుకువెళ్లవచ్చు. లేని పక్షంలో దానిని కూడా దేవస్థానానికి స్వాధీనం చేస్తారని తెలిపారు.

'ప్రతిభా'వంతులకు 'ఉపకారం'



ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు 'విద్యాదాన్ స్కాలర్‌షిప్పులు
దరఖాస్తుకు 15 వరకూ గడువు

రాయవరం: ప్రతిభావంతులకు గుర్తింపు ఎప్పుడూ ఉంటుంది. చదువులో అత్యుత్తమ ప్రతిభ చూపుతూ, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం సరోజినీ దామోదరన్ ఫౌండేషన్ (ఎస్‌డీఎఫ్) ద్వారా 'విద్యాదాన్' ఉపకార వేతనం అందిస్తోంది. కళాశాల విద్యలో సత్తా చాటే వారికి ఇది ఒక వరంలా మారనుంది. కేంద్ర ప్రభుత్వం 2016లో ప్రవేశపెట్టిన ఈ పథకం ప్రస్తుతం మన రాష్ట్రంతో పాటు తెలంగాణ, ఒడిశా, కేరళ, తమిళనాడు, కర్ణాటక, గోవాల్లో అమలవుతోంది. ఇప్పటి వరకూ ఈ పథకం కింద 6,500 మంది లబ్ధి పొందారు. ఎంపికైన వారు ఫౌండేషన్ నుంచి రెండేళ్ల పాటు స్కాలర్‌షిప్ పొందవచ్చు. విద్యార్థి ప్రతిభ ఆధారంగా, నచ్చిన రంగంలో డిగ్రీ చదవడానికి స్కాలర్‌షిప్ ద్వారా ప్రోత్సాహం లభిస్తుంది. చదువుతున్న కోర్సు, కాలపరిమితి ఆధారంగా ఏడాదికి రూ.10 వేల నుంచి రూ.60 వేల వరకూ స్కాలర్‌షిప్ అందజేస్తారు. ఈ ప్రోగ్రామ్ ద్వారా ఎంపికైన విద్యార్థుల భవిష్యత్తుకు దిశా నిర్దేశం చేస్తారు.

ఎంపిక విధానం

చదువులో చూపిన ప్రతిభ, ధ్రువపత్రంలో తెలిపిన సమాచారం ఆధారంగా ఎంపిక చేస్తారు. దరఖాస్తుదారులకు ఆన్‌లైన్ పరీక్ష నిర్వహిస్తారు. వారికి ఈ-మెయిల్ ద్వారా సమాచారం తెలియజేస్తారు. ఎంపికైన విద్యార్థులు ఈ నెల 20 నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

దరఖాస్తు చేసుకోవాలిలా..

విద్యాదాన్ ఉపకార వేతనానికి ఈ నెల 15లోగా దరఖాస్తు చేసుకోవాలి. జూలై 2న ఆన్‌లైన్ పరీక్ష ఉంటుంది. దరఖాస్తుదారులు పదో తరగతి మార్కుల జాబితా, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, ఈ ఏడాది తీసుకున్న ఆదాయ ధ్రువపత్రం, చదువుతున్న కళాశాల వివరాలు పొందుపరచాలి. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే వారు వ్యక్తిగత ఈ-మెయిల్ కలిగి ఉండాలి. నెట్ సెంటర్ లేదా ఇతరుల ఈ-మెయిల్ ఐడీలను అనుమతించరు. భవిష్యత్తులో ఎస్‌డీఎఫ్ నుంచి ఎటువంటి సమాచారమైనా ఈ-మెయిల్ లేదా ఎస్ఎంఎస్ ద్వారా తెలియజేస్తారు. వివరాలకు సోమవారం -శనివారం మధ్య ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ 'విద్యాదాన్.ఆంధ్ర ఎస్‌డీ ఫౌండేషన్‌ఇండియా.కామ్' ను సంప్రదించాలి. లేదా 83677 51309, 89858 01326 నంబర్లకు మెసేజ్ లేదా వాట్సాప్ ద్వారా సంప్రదించాలి.

- విద్యార్థులు నేరుగా ప్లే స్టోర్‌లోని 'విద్యాదాన్' యాప్ ద్వారా లేదా 'విద్యాదాన్ వెబ్‌సైట్ 'డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.విద్యాదాన్.ఓఆర్‌జీలో ఉచితంగా దరఖాస్తు చేసుకోవచ్చు.
- పదో తరగతి మార్కుల జాబితా ప్రకారం మీ పేరులో మొదటి పేరు ఎంటర్ చేయాలి. తర్వాత రెండో పేరు నమోదు చేయాలి. అనంతరం విద్యార్థి అడ్రస్ ఎంటర్ చేయాలి. తర్వాత 'అప్‌లైన్' ఆప్షన్ క్లిక్ చేస్తే అకౌంట్ యాక్టివేషన్‌కు సంబంధించిన లింక్ మీ ఈ-మెయిల్‌కు వస్తుంది. ఆ లింక్ క్లిక్ చేయగానే విద్యాదాన్ హోమ్ పేజీలో 'అకౌంట్ యాక్టికేటెడ్' అనే మెసేజ్ వస్తుంది. అనంతరం ఈ-మెయిల్ ఐడీ, విద్యాదాన్ పాస్‌వర్డ్ ద్వారా లాగిన్ అయి, స్టెప్-2లోకి వెళ్లాలి.
- లాగిన్ అయిన తర్వాత హెల్ప్‌పై క్లిక్ చేసి, సూచనలు చదివి, ఆ ప్రకారం అప్లికేషన్ పూర్తి చేసి, డాక్యుమెంట్లు అప్‌లోడ్ చేయాలి. అవసరమైతే ఎడిట్‌పై క్లిక్ చేసి, అప్లికేషన్ ఎడిట్ చేసుకోవచ్చు. వివరాలు ఎంటర్ చేసిన తర్వాత 'సబ్‌మిట్'పై క్లిక్ చేయాలి. 'సబ్‌మిషన్ సక్సెస్‌ఫుల్' అని వస్తుంది.
- డాక్యుమెంట్లు, పాస్‌పోర్టు సైజ్ ఫొటో అప్‌లోడ్ చేసిన తర్వాతే దరఖాస్తుకు ఆమోదం లభిస్తుంది.
- దరఖాస్తుదారులు ఎప్పటికప్పుడు ఈ-మెయిల్ చెక్ చేసుకోవాలి.

ఇదీ అర్హత

విద్యాదాన్ ఉపకార వేతనం పొందడానికి విద్యార్థి కుటుంబ వార్షికాదాయం రూ.2 లక్షల లోపు ఉండాలి. 2022-23 విద్యా సంవత్సరంలో పదో తరగతి ఉత్తీర్ణులై, ఇంటర్మీడియెట్ చదువుతున్న వారు అర్హులు. పదో తరగతిలో కనీసం 90 శాతం మార్కులు లేదా 9 శాతం జీపీఏ సాధించి ఉండాలి. దివ్యాంగులైతే 75 శాతం మార్కులు లేదా 7.5 శాతం జీపీఏ సాధించాలి.

చిట్టీల పేరుతో ఘరానా మోసం

- అధిక వడ్డీ ఎర చూపి రూ.1.50 కోట్లకు కుచ్చుటోపీ
- పోలీసులకు ఫిర్యాదు

కరప: ఎంతో నమ్మకంతో చిట్టీలు వేస్తూ, ఆపై అధిక వడ్డీ ఎర వేసి రూ.1.50 కోట్లకు కుచ్చుటోపీ పెట్టిన ఓ వ్యాపారి పలాయనం చిత్తగించాడు. కరప మండలం వేములవాడలో ఈ సంఘటన చోటు చేసుకుంది. బాధితులు, కాకినాడ జిల్లా కరప పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గండి కామేశ్వరరావు, అతడి కుమారుడు దుర్గరాజు చాలా కాలం నుంచి కిరాణా వ్యాపారం చేస్తున్నారు. తర్వాత చిట్టీల వ్యాపారం మొదలు పెట్టి, గ్రామస్తులకు నమ్మకం కలిగించారు. డ్వాక్రా మహిళలు, ఉపాధి కూలీలు, చిరు ఉద్యోగులు, రైతులకు అధిక వడ్డీ ఎర చూపించి, సొమ్ములు తీసుకునేవారు. చిట్టీలు పాడుకున్న వారి డబ్బులు కూడా వడ్డీ పేరుతో తన వద్దే ఉంచేసుకునేవారు. మధ్యమధ్యలో వడ్డీలు చెల్లించడంతో గ్రామస్తుల్లో బాగా నమ్మకం ఏర్పడింది. దీంతో వేములవాడతో పాటు కరప, వేళంగి, జి.వేమవరం, రామచంద్రపురం తదితర గ్రామాలకు చెందిన వారి నుంచి సుమారు రూ.1.50 కోట్లు సేకరించిన కామేశ్వరరావు కుటుంబ సభ్యులతో కలసి పలాయనం చిత్తగించాడు. కొంత కాలం నుంచి వారు కనిపించకపోవడంతో పని మీద ఊరికి వెళ్లి ఉంటారని గ్రామస్తులు భావించారు. పది రోజుల క్రితం కామేశ్వరరావు వచ్చి, గుట్టు చప్పుడు కాకుండా ఇంట్లోని సామాన్లు తీసుకుని వెళ్లిపోయాడు. మరో ఇంట్లో ఉన్న సామాన్లను అతడి కోడలు భవాని ఆటోలో తీసుకువెళ్లిపోతూంటే అనుమానం వచ్చి, గ్రామస్తులు నిలదీశారు. దీంతో అసలు విషయం బయటపడింది. ఆమెను గ్రామస్తులు కరప పోలీసులకు అప్పగించారు. తీసుకున్న సొమ్ముల్ని వాయిదాల పద్ధతితో తీరుస్తామని పెద్దల సమక్షంలో కాగితం రాసివ్వడంతో పోలీసులు వారిని వదిలేశారు. అనంతరం కామేశ్వరరావు కుటుంబ సభ్యులు గ్రామస్తుల కళ్లుగప్పి బిచాణా ఎత్తేశారు. ఈ నేపథ్యంలో తమకు న్యాయం చేయాలంటూ బాధితులు శనివారం కరప పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం కరప వచ్చిన ఎమ్మెల్యే కురసాల కన్నబాబును సర్పంచ్ కమిడి మంగాదేవి, శంకర్‌తో కలిసి, ఆశ్రయించి తమ గోడు చెప్పుకొన్నారు. మోసగాళ్లను పట్టుకుని బాధితులకు న్యాయం చేయాలని కరప ఎస్సై ఎస్.రామకృష్ణను ఎమ్మెల్యే ఆదేశించారు. కామేశ్వరరావు మాయమాటలు నమ్మి రూ.14 లక్షలు ఇచ్చానని, చిట్టీల సొమ్ము రూ.5 లక్షలు రావాలని వేములవాడకు చెందిన శ్రీపాద లక్ష్మి విలపిస్తూ తెలిపింది. ఎక్కువ వడ్డీ వస్తుందని తెలిసిన వారి నుంచి రూ.3 లక్షలు తీసుకుని కామేశ్వరరావుకు ఇచ్చానని, రూ.5 లక్షల వరకూ చిట్టీ సొమ్ము రావాలని మరో బాధితురాలు పడాల భవాని తెలిపింది.

ఆస్తి కోసం అక్కనే మట్టుబెట్టాడు

అంబాజీపేట: అక్క ఆస్తిపై కన్ను వేసిన తమ్ముడు చివరకు ఆమెను కడతేర్చాడు. ప్రమాదవశాత్తూ చనిపోయిందని నమ్మించేందుకు విఫలయత్నం చేశాడు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని వాకలగరువుకు చెందిన బొక్కా కృష్ణవేణి (47) ఒంటరి మహిళగా జీవిస్తోంది. విదేశాల్లో పని చేసి కొంత ఆస్తి సంపాదించింది. దీంతో పాటు ఆమెకు రెండంతస్తుల ఇళ్లు ఉన్నాయి. కృష్ణవేణి తమ్ముడు కాండ్రేగుల బాలయోగి అమలాపురం మండలం సాకుర్రులోని అద్దె ఇంట్లో నివసిస్తున్నాడు. కొంత కాలం నుంచి అతడు అక్క ఆస్తిపై కన్ను వేశాడు. దీనిలో భాగంగా శనివారం మధ్యాహ్నం ఒంటి గంటకు అక్క ఇంటికి వచ్చాడు. ఆస్తి కోసం కృష్ణవేణితో ఘర్షణకు దిగాడు. ఆవేశంలో విచక్షణ కోల్పోయిన బాలయోగి అక్కడున్న గునపంతో కృష్ణవేణి తల వెనుక భాగంలో బలంగా కొట్టాడు. ఆమె కేకలు వేస్తూ ఇంటి పై అంతస్తు నుంచి దిగి కొబ్బరి తోటల్లోకి పరుగు తీస్తూ స్పృహ తప్పి పడిపోయింది. రక్తం మడుగులో ఉన్న కృష్ణవేణిని గమనించిన స్థానికులు ఆమె తల్లికి సమాచారం అందించారు. అంతలోనే తనకేమీ తెలియనట్టుగా బాలయోగి ఎవ్వరూ చూడకుండా అక్కడకు చేరుకుని, కృష్ణవేణిని అంబాజీపేట పీహెచ్‌సీకి తరలించాడు. వైద్యాధికారులు పరిశీలించి, అప్పటికే కృష్ణవేణి మృతి చెందిందని ధ్రువీకరించారు. సంఘటన స్థలాన్ని సీఐ డి.ప్రశాంత్‌కుమార్, ఎస్సై ఎ.చైతన్యకుమార్ పరిశీలించారు. ఎస్సై కేసు నమోదు చేయగా, సీఐ దర్యాప్తు చేపట్టారు. నిందితుడు బాలయోగి పరారీలో ఉన్నాడు.

తండ్రిని చంపిన తనయుడు

కూలి డబ్బులు కోసం తగాదా

రామకుప్పం: కూలీ డబ్బులు కోసం తలెత్తిన ఘర్షణలో తండ్రిని చంపిన ఘటన చిత్తూరు జిల్లా రామకుప్పం మండలంలో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని చింతకుప్పం గ్రామానికి చెందిన సుబ్రమణ్యం(45) అతని ఇద్దరు కుమారులు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కూలి డబ్బుల విషయంగా తండ్రీ, పెద్ద కుమారుడు(17) మధ్య శనివారం ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో సుబ్రమణ్యం తన కుమారునిపై చేయి చేసుకున్నాడు. ఆగ్రహించిన కుమారుడు పక్కనే ఉన్న చిన్న పాటి చెక్కతో తండ్రి తలపై కొట్టాడు. దీంతో అతను అక్కడే కూలిపోయాడు. గమనించిన కుటుంబసభ్యులు సుబ్రమణ్యంను చికిత్స కోసం రామకుప్పం పీహెచ్‌సీకి తరలించారు. అయితే అప్పటికే అతడు మృతి చెందినట్లు పీహెచ్‌సీ సిబ్బంది నిర్ధారించారు. ఇదిలావుండగా సుబ్రమణ్యం కుమారుడు అప్పుడప్పుడు మతిస్థిమితం లేకుండా ప్రవర్తించేవాడని గ్రామస్తులు తెలిపారు. మృతుని భార్య సుధమ్మ ఫిర్యాదు మేరకు రామకుప్పం ఇన్‌ఛార్జ్ ఎస్ఐ లక్ష్మీకాంత్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాలుడిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

భర్త చేతిలో భార్య హతం



మలికిపురం: ఓ మహిళను ఆమె భర్తే హత్య చేసిన ఘటన మండలంలోని తూర్పుపాలెంలో శుక్రవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కొల్లు అర్జునరావు వడ్రంగి పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి పదేళ్ల క్రితం కనకదుర్గ(28)తో వివాహమైంది. ఆమె దివ్యాంగురాలు. వీరికి ఇద్దరు మగ బిడ్డలున్నారు. పిల్లలు చెబుతున్న వివరాల ప్రకారం.. భార్యాభర్తలు కొంత కాలం నుంచి గొడవలు పడుతున్నారు. శుక్రవారం అర్ధరాత్రి కూడా వీరి మధ్య గొడవ జరిగింది. ఈ నేపథ్యంలో కోపోద్రిక్తుడైన అర్జునరావు కత్తితో తన భార్య పీక కోసి పరారయ్యాడు. రక్తపు మడుగులో ఉన్న కనకదుర్గ మృతదేహాన్ని గమనించిన ఇరుగుపొరుగు వారు పోలీసులకు సమాచారం అందించారు. మలికిపురం ఎస్సై జి.సురేంద్ర, ఐఎస్సై సత్యనారాయణలు పోలీసులతో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు. హత్యకు ప్రధాన కారణాలేమిటనే అంశంపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. వివాహేతర సంబంధం నేపథ్యంలో హత్య జరిగిందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కనకదుర్గ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజోలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. నిందితుని కోసం పోలీసులు గాలిస్తున్నారు.

క్లుప్తంగా...

6 నుంచి ఏపీ పీజీసెట్



ఏయూక్యాంపస్: ఏపీ పీజీసెట్–2023 పరీక్షలను ఈ నెల 6 నుంచి 10వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు కన్వీనర్ ఆచార్య సీహెచ్‌వీవీఎస్ భాస్కరరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి 11 గంటల వరకు, మధ్యాహ్నం ఒంటిగంట నుంచి 2.30 గంటల వరకు, సాయంత్రం 4.30 నుంచి 6 గంటల వరకు మూడు సెషన్లుగా పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 36 కేంద్రాల్లో, హైదరాబాద్‌లోని ఒక కేంద్రంలో పరీక్షలు నిర్వహిస్తామని వివరించారు. విద్యార్థులు ఉన్నత విద్యామండలి వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రానికి ఒరిజినల్ హాల్ టికెట్, ప్రభుత్వం జారీచేసిన ఏదైనా గుర్తింపు కార్డు తీసుకురావాలని సూచించారు.

6న అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీ బీఈడీ ఎంట్రన్స్

సాక్షి, అమరావతి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం అందిస్తున్న బీఈడీ, బీఈడీ–స్పెషల్ ఎడ్యుకేషన్ కోర్సుల్లో 2022–23 విద్యా సంవత్సరానికి అడ్మిషన్ల కోసం ఈ నెల 6వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు వర్సిటీ అభ్యాసక సహాయ సేవా విభాగం డైరెక్టర్ డాక్టర్ ఎల్.విజయకృష్ణారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 10.30 నుంచి 12.30 గంటల వరకు బీఈడీ, మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ కోర్సులకు ప్రవేశ పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు. పరీక్షలు ముగిసిన వారం రోజుల్లో ఫలితాలను వెల్లడించి, ఈ నెలాఖరులోపు అడ్మిషన్లను పూర్తిచేస్తామని తెలిపారు. హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, విశాఖపట్నం, విజయవాడ, కర్నూలు, తిరుపతిలలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని వివరించారు. హాల్ టికెట్లను www.braouonline.in వెబ్‌సైట్‌లో ఉంచామని, హాల్ టికెట్లలో ఏమైనా ఇబ్బందులు ఉంటే info.drbraou@gmail.com ద్వారా తెలియజేస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

'గెస్ట్ ఫ్యాకల్టీని కాంట్రాక్ట్ పోస్టుల్లో నియమించాలి'

సాక్షి, అమరావతి: బీసీ గురుకులాల్లో పని చేస్తున్న 1,050 మంది గెస్ట్ ఉపాధ్యాయులు, అధ్యాపకులను కాంట్రాక్ట్ పోస్టుల్లో నియమించాలని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు ప్రభుత్వాన్ని ఒక ప్రకటనలో కోరారు. ఇదే అంశంపై బీసీ గురుకులాల్లో పని చేస్తున్న గెస్ట్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు శనివారం తాడేపల్లిలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డిని కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు, అధ్యాపకులు మాట్లాడుతూ గత దశాబ్ద కాలంగా బీసీ గురుకులాల్లో పని చేస్తున్నామని, గెస్ట్ ఫ్యాకల్టీ అయినప్పటికీ పూర్తికాలం విధులను నిర్వహిస్తున్నామని చెప్పారు. బీసీ గురుకులాలు విద్యా రంగంలో అభివృద్ధి సాధించడంలో ఎనలేని కృషి చేస్తున్నాయని తెలిపారు. ఈ ఏడాది పదో తరగతి, ఇంటర్ పరీక్ష ఫలితాల్లో రాష్ట్ర సగటు 72 శాతం ఉండగా, జ్యోతిరావు పూలే గురుకులాల్లో 90 శాతం ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు.

నేడు జేఈఈ అడ్వాన్స్‌డ్..

- హాజరుకానున్న 1.9 లక్షల మంది అభ్యర్థులు
- ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షకు నో ఎంట్రీ
- బంగారు ఆభరణాలు, షూలు, డిజిటల్ పరికరాలకు అనుమతి నిరాకరణ



సాక్షి, అమరావతి: ఐఐటీల్లో ప్రవేశానికి సంబంధించిన జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) అడ్వాన్స్‌డ్–2023 ఆదివారం (నేడు) జరగనుంది. ఈ పరీక్షకు దేశవ్యాప్తంగా 1.9 లక్షల మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. ఐఐటీ గౌహతి నిర్వహించే ఈ పరీక్షకు సంబంధించి అభ్యర్థులకు ఇప్పటికే అడ్మిట్‌కార్డులు విడుదలయ్యాయి. ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్ల కింద పేపర్–1, పేపర్–2 పరీక్షలు జరుగుతాయి. కంప్యూటర్ ఆధారితంగా నిర్వహించే ఈ పరీక్షలో అభ్యర్థులు రెండు పేపర్లను రాయాల్సి ఉంటుంది. ఉదయం సెషన్ ఉ.9 నుంచి మ.12 గంటల వరకు, మధ్యాహ్నం సెషన్ పరీక్ష మ.2.30 నుంచి 5.30 వరకు జరుగుతుంది.

ఈ ఏడాది అత్యధిక సంఖ్యలో అభ్యర్థులు..

2021లో జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు 1.6 లక్షల మంది, 2022లో 1.7 లక్షల మంది రిజిస్టర్ కాగా.. ఈసారి మరో 20వేల మందికి పైగా అభ్యర్థుల సంఖ్య పెరిగింది. ముఖ్యంగా మహిళా అభ్యర్థుల సంఖ్య 25 శాతం వరకు పెరిగినట్లు ఐఐటీ గౌహతి విడుదల చేసిన గణాంకాల ద్వారా తెలుస్తోంది. అత్యధికంగా ఏపీ, తెలంగాణల నుంచి అభ్యర్థులు ఈ పరీక్షలకు హాజరుకానున్నారు. ఈ రెండు రాష్ట్రాల నుంచే దాదాపు 50వేల మంది వరకు అభ్యర్థులు ఉండనున్నారు. హైదరాబాద్, విజయవాడ కేంద్రాలుగా అత్యధిక సంఖ్యలో దరఖాస్తులు వచ్చినట్లు సమాచారం. జేఈఈ మెయిన్‌కు గతంలో కన్నా ఈసారి అభ్యర్థుల సంఖ్య పెరగడంతో అదే స్థాయిలో అడ్వాన్స్‌డ్‌కు కూడా అభ్యర్థుల సంఖ్య పెరిగినట్లు అంచనా. మెయిన్ 2 సెషన్లలో కలిపి 11,13,325 మంది పరీక్ష రాశారు. ఇందులో కటాఫ్ మార్కులు సాధించిన వారిలో టాప్ 2.5 లక్షల మందికి అడ్వాన్స్‌డ్‌కు అర్హత కల్పించారు.

బోర్డు పరీక్షల్లో 75 శాతం మార్కులుంటేనే..

ఇక ఐఐటీల్లో ప్రవేశం పొందాలంటే జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ర్యాంకుతో పాటు అభ్యర్థులకు బోర్డు పరీక్షల్లో 75 శాతం మార్కులు తప్పనిసరిగా సాధించాలన్న నిబంధన ఉండేది. కరోనా కారణంగా ఇంటర్ పరీక్షలు సరిగా నిర్వహించని సమయంలో ఈ నిబంధన నుంచి రెండేళ్లుగా మినహాయింపునిచ్చారు. ఇప్పుడా పరిస్థితులు చక్కబడడంతో ఈసారి బోర్డు పరీక్షల్లో 75 శాతం మార్కులు సాధించడాన్ని మళ్లీ పునరుద్ధరించారు. అలాగే, జేఈఈ అడ్వాన్స్‌డ్‌ను ఆన్‌లైన్ మోడ్ (కంప్యూటర్ బేస్డ్)లో నిర్వహించనున్నారు. ఉదయం పేపర్–1, మధ్యాహ్నం పేపర్–2 పరీక్ష ఉంటుంది. అభ్యర్థులు రెండు పేపర్ల పరీక్షలూ రాయాల్సి ఉంటుంది. మరోవైపు.. జేఈఈ అడ్వాన్స్‌డ్–2023 సిలబస్‌లో పలు మార్పులు చేశారు. అభ్యర్థులపై ఒత్తిడి తగ్గించేందుకు వీలుగా బోర్డు పరీక్షల్లో ఉండే ఎన్‌సీఈఆర్టీ సిలబస్‌లోని అంశాలను ఎక్కువగా పొందుపరిచారు. జేఈఈ మెయిన్‌లోనూ ఇవే అంశాలు ఉండగా కొంత లోతైన తీరులో అడ్వాన్స్‌డ్‌లో ప్రశ్నల సరళి ఉండనుంది. ఈ విధానంవల్ల విద్యార్థులు అటు బోర్డు పరీక్షలు, ఇటు మెయిన్ పరీక్షలతో పాటు అడ్వాన్స్‌డ్ పరీక్షలకు ఒకేరకమైన సిలబస్‌ను అధ్యయనం చేయడం ద్వారా ఒత్తిడికి గురవ్వకుండా ఉండేలా ఈ సిలబస్‌లో మార్పులు చేశారు. ఇక జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఐఐటీ గౌహతి సంస్థ అడ్మిట్ కార్డులలో వివరంగా పొందుపరిచింది. మే 29న అడ్వాన్స్‌డ్ వెబ్‌సైట్లో అడ్మిట్ కార్డులను పొందుపరిచింది. ఈనెల 4వరకు వీటిని అభ్యర్థులు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.


'ఒక్క నిమిషం' నిబంధన అమలు

- అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి నిర్ణీత సమయానికి ముందుగానే చేరుకోవాలని నిర్వహణ సంస్థ సూచించింది. పరీక్ష కేంద్రంలోకి నిర్దేశించిన సమయం కన్నా ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చినా అభ్యర్థులను అనుమతించరు.
- అభ్యర్థులు తమతో పాటు అడ్మిట్ కార్డు, అధికారిక ఫొటో ఐడీ కార్డును విధిగా తీసుకురావాలి.
- అడ్మిట్‌కార్డు జిరాక్సు కాపీని ఇన్విజిలేటర్లకు అందించి ఒరిజినల్ కాపీని తమ వద్దనే భద్రపరచుకోవాలి.
- అభ్యర్థులు అడ్మిట్‌కార్డులో, అటెండెన్స్ షీటులో తమ వేలిముద్రను వేసేముందు వేలుని శుభ్రం చేసుకోవాలి.
- అభ్యర్థులకు తప్పనిసరిగా డ్రెస్‌కోడ్ కూడా అమలుచేయనున్నారు. షూలు ధరించి రాకూడదు.
- అలాగే, పెద్ద బటన్‌లతోని వస్త్రాలను, ఫుల్‌స్లీవ్ వస్త్రాలను, బంగారపు ఆభరణాలను ధరించరాదు.
- బాల్‌పాయింట్ పెన్నును వినియోగించాలి.
- పెన్సిల్, ఎరేజర్‌లను తెచ్చుకోవచ్చు. అలాగే, సాధారణమైన వాచీని ధరించవచ్చు. ఇతర డిజిటల్ వాచీలు, పరికరాలను అనుమతించబోరు.
- అడ్మిట్‌కార్డులో నమోదు చేసిన పేరు, పుట్టిన తేదీ, జెండర్ వంటివి సరిగా ఉన్నాయో లేదో సరిచూసుకోవాలి.

అడ్వాన్స్‌డ్ పరీక్షకు కేటగిరీల వారీగా అర్హత సాధించిన అభ్యర్థులు..	
జనరల్	1,01,297
ఈడబ్ల్యూఎస్	25,057
ఓబీసీ	67,613
ఎస్సీ	37,536
ఎస్టీ	18,752

ట్రిపుల్ ఐటీల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్

- దరఖాస్తులకు ఈనెల 26 వరకు గడువు



నూజివీడు: రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం(ఆర్జీయూకేటీ) పరిధిలోని నూజివీడు, ఇడుపులపాయ, శ్రీకాకుళం, ఒంగోలు ట్రిపుల్ ఐటీల్లో 2023–24 విద్యా సంవత్సరానికి గాను ఆరు సంవత్సరాల బీటెక్ సమీకృత ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు శనివారం నోటిఫికేషన్ వెలువడింది. ఒక్కో సెంటర్‌లో వెయ్యి సీట్లను భర్తీ చేయనున్నారు. ఈడబ్ల్యూఎస్ కోటా సీట్లు మరో 100 ఉన్నాయి. అర్హులైన అభ్యర్థులు ఈనెల 4 నుంచి 26వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలని వర్సిటీ సూచించింది. అభ్యర్థులు 2023లో తొలి ప్రయత్నంలోనే ఎస్ఎస్‌సీ లేదా తత్సమాన పరీక్షలో రెగ్యులర్ విద్యార్థిగా ఉత్తీర్ణులై ఉండాలి. వయసు 31–12–2023 నాటికి 18 ఏళ్లు నిండకుండా ఉండాలి. ఎస్సీ, ఎస్టీ కేటగిరీ అభ్యర్థులకైతే 21 ఏళ్లు దాటకూడదు. అభ్యర్థులు ఏపీ ఆన్‌లైన్ సెంటర్ ద్వారా ఆర్జీయూకేటీ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఓసీ, బీసీ అభ్యర్థులు దరఖాస్తు రుసుము కింద రూ.300, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.200 చెల్లించాలి. ఏపీ ఆన్‌లైన్ సెంటర్లు ఇచ్చే రసీదును భద్రపరుచుకోవాలి. పదో తరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగా మెరిట్ పద్ధతిలోనే ప్రవేశాలు కల్పిస్తారు. నాన్ రెసిడెన్షియల్ ప్రభుత్వ స్కూళ్లు, జిల్లా పరిషత్ హైస్కూళ్లు, మున్సిపల్ హైస్కూళ్లలో చదివిన విద్యార్థులకు వారి మార్కులకు 4 శాతం డిప్రెవేషన్ స్కోర్‌ను అదనంగా కలుపుతారు. దీనిని సాంఘికంగా, ఆర్థికంగా వెనుకబాటుకు గురైన విద్యార్థులకు ఇచ్చే వెయిటేజీగా పేర్కొన్నారు. 85 శాతం సీట్లను స్థానికంగాను, 15 శాతం సీట్లను మెరిట్ కోటాలో ఏపీ, తెలంగాణ విద్యార్థులకు కేటాయిస్తారు. అలాగే ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 6 శాతం, బీసీ–ఏకు 7 శాతం, బీసీ–బీకి 10 శాతం, బీసీ–సీకి 1 శాతం, బీసీ–డీకి 7 శాతం, బీసీ–ఈకి 4 శాతం చొప్పున రిజర్వేషన్ అమలు చేస్తారు. ప్రత్యేక సీట్లు కింద వికలాంగులకు 5 శాతం, సైనిక ఉద్యోగుల పిల్లలకు 2 శాతం, ఎన్‌సీసీ విద్యార్థులకు 1 శాతం, స్పోర్ట్స్ కోటా కింద 0.5 శాతం, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కోటాలో 0.5 శాతం సీట్లను భర్తీ చేస్తారు. ప్రతి కేటగిరీలోనూ 33.33 శాతం సీట్లను సమాంతరంగా బాలికలకు కేటాయిస్తారు.

గ్రేడ్ పాయింట్లు సమానమైతే ఎంపిక ఇలా..

దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల్లో సంబంధిత కేటగిరీలో ఏ ఇద్దరి విద్యార్థుల మార్కులు సమానమైనా.. గణితం, జనరల్ సైన్స్, ఇంగ్లిష్, సోషల్ సబ్జెక్టులలో ఎక్కువ గ్రేడ్ వచ్చిన వారిని ఎంపిక చేస్తారు. ఇవన్నీ కూడా సమానంగా ఉంటే ఫస్ట్ లాంగ్వేజ్‌లో ఎక్కువ గ్రేడ్ వచ్చిన వారిని ఎంపిక చేస్తారు. అలాగే పుట్టిన తేదీ ఆధారంగా కూడా ఎంపిక చేస్తారు. ఇవన్నీ సమానంగా ఉంటే హాల్‌టికెట్ నంబర్ ఆధారంగా ఎంపిక చేస్తారు. దరఖాస్తులో అడ్రస్, ఫోన్ నంబర్ తప్పనిసరిగా పేర్కొనాలి.

రీజనల్ ఆయుర్వేద రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌కు 'ఎన్‌ఏబీహెచ్' గుర్తింపు



అజిత్‌సింగ్‌నగర్ (విజయవాడ సెంట్రల్): ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని రీజనల్ ఆయుర్వేద రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌కు కేంద్రం ఇచ్చే నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఫర్ హాస్పిటల్స్(ఎన్‌ఏబీహెచ్), హెల్త్ కేర్ ప్రొవైడర్స్ గుర్తింపు లభించినట్లు ఆ సంస్థ ఇన్‌చార్జ్ రీసెర్చ్ ఆఫీసర్ డాక్టర్ సి.మురళీకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఎన్‌ఏబీహెచ్ గుర్తింపును పొందిన తొలి ప్రభుత్వ ఆయుర్వేద సంస్థగా విజయవాడలోని రీజనల్ ఆయుర్వేద రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ నిలవడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ఆయుష్ డైరెక్టర్ రబీ నారాయణ ఆచార్య, కేఎన్‌ఏబీహెచ్ కో–ఆర్డినేటర్ డాక్టర్ మిధున మోహన్, సంస్థ సిబ్బంది ఈ గుర్తింపు కోసం ఎంతో శ్రమించారని తెలిపారు. కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ పరిధిలోని ఈ ప్రాంతీయ ఆయుర్వేద పరిశోధన సంస్థను 2009లో ప్రారంభించారని, 25 ఐపీడీ బెడ్ ఆక్యుపెన్సీ ఉందని వివరించారు.

విదేశీ విద్యార్థి 'వెల్‌కమ్'

- ఉన్నత విద్యా సంస్థల్లో యూజీ, పీజీలో అంతర్జాతీయ ప్రవేశాలు
- 25 శాతం సీట్లకు సరిపడా సూపర్ న్యూమరరీ కోటా
- యూజీసీ మార్గదర్శకాలు విడుదల

సాక్షి, అమరావతి: దేశంలోని ఉన్నత విద్యా సంస్థలు అంతర్జాతీయ స్థాయిలో విద్యార్థులను ఆకర్షించేలా యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) చర్యలు చేపట్టింది. ఇప్పటికే నూతన విద్యా విధానాన్ని రూపొందించిన కేంద్ర ప్రభుత్వం అత్యున్నత ప్రమాణాలు ఉండే ఉన్నత విద్యా సంస్థలకు అత్యధిక నిధులు, ప్రోత్సాహకాలు అందిస్తోంది. ఇందులో భాగంగా దేశంలోని అన్ని ఉన్నత విద్యా సంస్థలు వాటి సీట్లలో 25 శాతం సమానమైన సంఖ్యలో సూపర్ న్యూమరరీ విధానంలో విదేశీ విద్యార్థులకు ప్రవేశాలు కల్పించాలని యూజీసీ సూచించింది. అండర్ గ్రాడ్యుయేషన్(యూజీ), పోస్టు గ్రాడ్యుయేషన్(పీజీ) కోర్సుల్లో ఈ సీట్లను విదేశీ విద్యార్థులకు అందుబాటులో ఉంచాలని నిర్దేశించింది. దీనివల్ల విదేశీ విద్యార్థులకు ప్రవేశాలను సులభతరం చేయొచ్చని, దేశ సంస్కృతి, ఉన్నత సంప్రదాయాలను అంతర్జాతీయ స్థాయిలోకి తీసుకెళ్లవచ్చని యూజీసీ పేర్కొంది. విదేశీ మారకద్రవ్యం కూడా సమకూరి, దేశ ఆర్థిక వ్యవస్థకు ఉపకరిస్తుందని అభిప్రాయపడింది.

అంతర్జాతీయ విద్యార్థులకు ప్రవేశాలు ఇలా

ఉన్నత విద్యా సంస్థల్లో యూజీ, పీజీలో విదేశీ విద్యార్థులకు సీట్ల కేటాయింపు, ప్రవేశాలకు యూజీసీ విధివిధానాలను ప్రకటించింది

- అంతర్జాతీయ విద్యార్థులకు దేశీయ విద్యార్థులకు నిర్దేశించిన అర్హతలతో సమానమైన అర్హతలు తప్పనిసరి. ప్రవేశాలను అత్యంత పారదర్శకంగా చేపట్టాలి.
- విద్యా సంస్థల్లోని సీట్లలో 25 శాతానికి సమాన సంఖ్యలో విదేశీ విద్యార్థులకు సూపర్ న్యూమరరీ సీట్లు. ఈ సీట్లకు యూజీసీ, ఇతర నియంత్రణ సంస్థల ఆమోదం పొందాలి. వాటి మార్గదర్శకాలను తప్పనిసరిగా అనుసరించాలి
- ప్రొఫెషనల్, సాంకేతిక విద్యా కోర్సుల సీట్లకు కూడా సంబంధిత నియంత్రణ సంస్థల నిబంధనలు పాటించాలి. పీహెచ్‌డీ ప్రోగ్రాముల సీట్లు యూజీసీ, నియంత్రణ సంస్థల నిబంధనలకు లోబడి ఉంటాయి.
- విదేశీ విద్యార్థులకు ప్రవేశాల్లో వీసా, విదేశీ ప్రాంతీయ రిజిస్ట్రేషన్ కార్యాలయాలు, భారత విదేశాంగ శాఖ నిబంధనలను పరిగణనలోకి తీసుకోవాలి. ఒకవేళ అంతర్జాతీయ విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉంటే ఆ విద్యాసంస్థలు తమ ఇన్‌టేక్ సీట్లకన్నా ఎక్కువ శాతంలో సీట్లను వారికి కేటాయించవచ్చు. ఈ సూపర్ న్యూమరరీ సీట్లలో ప్రవేశాలు నేరుగా నిర్వహించాలి. ఈ సూపర్ న్యూమరరీ సీట్లలో విదేశీ విద్యార్థులకు మాత్రమే ప్రవేశాలు కల్పించాలి. సీట్లు మిగిలిపోయినా ఇతరులకు ఇవ్వకూడదు.

బ్రిటన్ వీసాల్లో మనోళ్లే టాప్

విద్యార్థి వీసాల్లో 41 శాతం మంది భారతీయులే...

- 2022–23లో 1,38,532 మందికి స్పాన్సర్డ్ విద్యార్థి వీసాలు
- వృత్తి నిపుణుల వీసాల్లోనూ 33 శాతం మంది మనవాళ్లే..
- గడువు పొడిగింపులోనూ అగ్రస్థానం
- బ్రిటన్ హోం శాఖ నివేదిక వెల్లడి



సాక్షి, అమరావతి: బ్రిటన్‌లో విద్య, ఉద్యోగ అవకాశాల్లో భారతీయులే అగ్రస్థానంలో నిలుస్తున్నారు. ఆ దేశం జారీ చేస్తున్న విద్యార్థి వీసాల్లో ఏకంగా 41శాతం మంది భారతీయులే ఉండటం విశేషం. ఇక వృత్తి నిపుణుల వీసాల్లోనూ 33శాతం మంది మనవారే ఉండటం గొప్ప విషయం. కొత్తగా వీసాలు పొందడంతోపాటు గడువు పొడిగింపులోనూ భారతీయులు అగ్రస్థానంలో కొనసాగుతున్నారు. బ్రిటన్ 2022–23లో విదేశీ విద్యార్థులు, వృత్తి నిపుణులకు జారీ చేసిన వీసాల వివరాలతో ఆ దేశ హోం శాఖ ఆధ్వర్యంలోని ఆఫీస్ ఆఫ్ స్టాటిస్టిక్స్ జారీ చేసిన నివేదిక ఈ విషయాలను వెల్లడించింది.

నివేదికలోని ముఖ్య వివరాలు

- బ్రిటన్‌లోని విదేశీ విద్యార్థుల్లో భారతీయులే అతిపెద్ద గ్రూప్‌గా ఉన్నారు. 2022–23లో ఆ దేశం మొత్తం 1,38,532 మంది భారతీయులకు స్పాన్సర్డ్ విద్యార్థి వీసాలు జారీ చేసింది. 2022–22లో 85,103 వీసాలు జారీ చేయగా, 2022–23లో అంతకంటే 53,429 మందికి అధికంగా వీసాలు జారీ చేయడం విశేషం.
- బ్రిటన్‌లో విద్యార్థి వీసాల గడువు పొడిగింపులో కూడా భారతీయ విద్యార్థులే అధికంగా ఉన్నారు. 2022–23లో ఆ దేశం మొత్తం 92,951 మంది విదేశీ విద్యార్థులకు వీసాల గడువు పొడిగించింది. వాటిలో 38,110 మంది భారతదేశ విద్యార్థులు ఉన్నారు. వీసాల గడువు పొడిగింపులోనూ 41శాతం మంది భారతీయ విద్యార్థులు ఉండటం ప్రాధాన్యతను సంతరించుకుంది.
- కాగా, విదేశీ విద్యార్థులతోపాటు వారి కుటుంబ సభ్యుల తాకిడి పెరగడంతో విద్యార్థి వీసాలపై బ్రిటన్ తాజాగా ఆంక్షలు విధించింది. విద్యార్థి వీసా పొందితే ఇటీవల వరకు పిల్లలతో సహా తమ కుటుంబ సభ్యులు, వృద్ధులైన తల్లిదండ్రులను కూడా బ్రిటన్‌కు తీసుకువచ్చేందుకు అవకాశం ఉండేది. కానీ, విద్యార్థి వీసా పేరిట పెద్ద సంఖ్యలో కుటుంబ సభ్యులు తరలివస్తుండటంతో బ్రిటన్ ఆంక్షలు విధించింది. కేవలం పీహెచ్‌డీ కోసం వీసా పొందినవారి కుటుంబ సభ్యులు, వృద్ధులైన తల్లిదండ్రులను మాత్రమే అనుమతించాలని నిర్ణయించింది. అండర్ గ్రాడ్యుయేషన్, పీజీ కోర్సుల విద్యార్థులు తమ కుటుంబ సభ్యులు, వృద్ధులైన తల్లిదండ్రులను తీసుకువచ్చేందుకు అనుమతి లేదు.
- ప్రస్తుతం బ్రిటన్‌లో విద్యార్థి వీసాల మీద వచ్చిన వారి కుటుంబ సభ్యులు, తల్లిదండ్రుల్లో 66,796 మందితో నైజీరియా దేశస్తులు మొదటి స్థానంలో ఉన్నారు. భారత విద్యార్థుల కుటుంబ సభ్యులు, తల్లిదండ్రులు 42,381 మందితో రెండో స్థానంలో ఉన్నారు. 2021–22లో వీరు 22,598 మంది ఉండగా, 2022–23లో 42,381మందికి పెరగడం గమనార్హం. ఈ నేపథ్యంలో పీహెచ్‌డీ మినహా ఇతర విద్యార్థి వీసాలపై కుటుంబ సభ్యులు, వృద్ధ తల్లిదండ్రులకు అనుమతిని బ్రిటన్ రద్దు చేసింది.
- విదేశీ ఉద్యోగులకు వీసాల జారీలో కూడా భారతీయులే ఆధిపత్యం కొనసాగిస్తున్నారు. 2022–23లో బ్రిటన్ జారీ చేసిన వర్కర్ వీసాల్లో 33శాతం మంది భారతీయులే ఉన్నారు. 'వృత్తి నిపుణులు–హెల్త్ కేర్' వీసాల్లో కూడా భారతీయులకు వీసాల జారీ గత ఏడాది కంటే 63శాతం పెరగడం విశేషం. 2021–22లో 13,390 మంది భారతీయ వృత్తి నిపుణులకు వీసాలు జారీ చేయగా, 2022–23లో 21,837మందికి వీసాలు జారీ చేశారు.

కేజీబీవీ పోస్టులకు 12,093 దరఖాస్తులు

సాక్షి, అమరావతి: సమగ్ర శిక్ష ఆధ్వర్యంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న 1,358 పోస్టుల భర్తీకి ఇప్పటివరకు 17,963 మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా 12,093 మంది దరఖాస్తులు సమర్పించారు. ఈ పోస్టులకు అత్యధికంగా కర్నూలు జిల్లా నుంచి 2,142 మంది, అనంతపురం నుంచి 1,645 మంది దరఖాస్తు చేసుకున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా నుంచి అతి తక్కువగా 256 మంది దరఖాస్తు చేసుకున్నారు. కాగా, ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునేందుకు సోమవారం (5వ తేదీ) వరకు గడువు ఉంది. 20 వేలమంది వరకు దరఖాస్తు చేసుకోవచ్చని సమగ్ర శిక్షా అధికారులు అంచనా వేస్తున్నారు. అభ్యర్థుల సందేహాల నివృత్తి కోసం రాష్ట్ర కార్యాలయంలో మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేశారు. అభ్యర్థులు 73866 86501, 95730 61629, 94412 70099 నంబర్లలో సంప్రదించవచ్చని లేదా apss_kgbv@schooledu.inకు మెయిల్ చేయవచ్చని సమగ్ర శిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు తెలిపారు.

ప్రైవేటు స్కూళ్లకూ క్వాలిటీ పుస్తకాలు

- 16 ప్రింటర్స్, 620 మంది అమ్మకందార్లను ఎంపిక చేసిన పాఠశాల విద్యా శాఖ
- వెబ్‌సైట్‌లో వారి వివరాలు.. ఇప్పటికే టెక్స్ట్ బుక్స్ సిద్ధం
- ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే పుస్తకాలు అమ్మాలని ఆదేశం
- 'ప్రైవేటు'లో అధిక ధరలకు కళ్లెం వేసిన ప్రభుత్వం



సాక్షి, అమరావతి: ప్రభుత్వ విద్యలో సంస్కరణలు చేపట్టిన రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటు విద్యా రంగాన్ని కూడా గాడిన పెడుతోంది. ఒకప్పుడు విద్యార్థులు తమ వద్దే, తాము నిర్ణయించిన ధరలకే పుస్తకాలు కొనాలంటూ ప్రైవేటు స్కూళ్లు వేలాది రూపాయలు వసూలు చేసేవి. ఇలాంటి వాటికి ప్రభుత్వం కళ్లెం వేసింది. రాష్ట్రంలోని అన్ని ప్రైవేటు, అన్ ఎయిడెడ్ స్కూళ్లకు అవసరమైన టెక్స్ట్ పుస్తకాలను అందించే ప్రింటర్స్‌ను గుర్తించి పుస్తకాల ధరలను స్థిరీకరిస్తూ విద్యా శాఖ నిర్ణయం తీసుకుంది. డిమాండ్‌కు అనుగుణంగా అవసరమైనన్ని పుస్తకాలను సరఫరా చేసేందుకు ఎక్కువ మంది ప్రింటర్స్‌ను ఎంపిక చేసింది. గతంలో ప్రింటర్స్‌గా కేవలం నాలుగు సంస్థలే ఉండగా, ఈసారి రాష్ట్రంలోని నాలుగు జోన్లలోను 16 మంది ప్రింటర్స్‌ను ఎంపిక చేసింది. వీరి నుంచి 2023–24, 2024–25 విద్యా సంవత్సరాల్లో ఆయా జోన్ల పరిధిలోని ప్రైవేటు స్కూళ్లు తమకు కావాల్సిన టెక్స్ట్ పుస్తకాలను కొనుగోలు చేయాలని ఆదేశించింది. విద్యా శాఖ ఆన్‌లైన్ పోర్టల్‌లో ఆయా స్కూల్ ఐడెంటిటీ నంబర్‌తో లాగిన్ అయ్యి అవసరమైనన్ని పుస్తకాలను బుక్ చేసుకోవాలని ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలకు సూచించింది.

సిద్ధంగా 80 లక్షల టెక్స్ట్ బుక్స్

ప్రభుత్వ స్కూళ్లకు అవసరమైన పుస్తకాలను క్వాలిటీ పేపర్‌తో ముద్రిస్తున్న విధంగానే.. ప్రైవేటు స్కూళ్లకు కూడా అంతే నాణ్యత, ప్రమాణాలు పాటించి పుస్తకాలు ముద్రించాలని ప్రింటర్స్‌ను విద్యా శాఖ ఆదేశించింది. ఇప్పటికే 425 టైటిల్స్‌లో దాదాపు 80 లక్షల టెక్స్ట్ బుక్స్‌ను ఆయా ప్రింటర్స్ సిద్ధంగా ఉంచాయి. స్కూళ్ల యాజమాన్యాలు అడిగిన వెంటనే సరఫరా చేయడంతో పాటు, వారికి ఎప్పుడు ఎన్ని పుస్తకాలు కావాలన్నా అందించేలా ఏర్పాట్లు చేశాయి. గత అనుభవాల దృష్ట్యా ప్రింటర్స్‌ను నాలుగు రెట్లు పెంచడంతో పాటు టెక్స్ట్ బుక్స్ అమ్మకానికి ఉమ్మడి 13 జిల్లాల్లో 620 షాపులను కూడా అధికారులు ఎంపిక చేశారు. వారి ఫోన్ నంబర్లతో సహా వివరాలన్నీ పాఠశాల విద్యా శాఖ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. ఆయా స్కూళ్లు, అమ్మకందార్లు.. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే పుస్తకాలను అమ్మాలని, అధిక ధరలు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

రెండు సెమిస్టర్ల టెక్స్ట్ పుస్తకాల ధరలు		
తరగతి	పుస్తకాలు	ధర (రూ.ల్లో)
1	8	399
2	8	425
3	12	675
4	12	702
5	12	727
6	12	747
7	12	871
8	15	1,181
9	18	1,167
10	9	859

నిర్ణయించిన ధరకే అమ్మకం

రాష్ట్రంలో దాదాపు 16 వేల ప్రైవేటు స్కూళ్లున్నాయి. ఆ స్కూళ్ల డిమాండ్‌కు అనుగుణంగా పుస్తకాలను సరఫరా చేసేలా చర్యలు తీసుకున్నాం. ప్రతి పుస్తకానికి ధర నిర్ణయించాం. అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. గతంలో కేవలం 4 జోన్లకు నలుగురు ప్రింటర్స్ మాత్రమే ఉండేవారు. దాంతో డిమాండ్ మేరకు పుస్తకాల సరఫరా ఆలస్యమయ్యేది. ఇప్పుడు అలాంటి ఇబ్బంది లేకుండా 16 మంది ప్రింటర్స్‌ను నాలుగు జోన్లకు ఎంపిక చేశాం. దాదాపు మండలానికి ఒక దుకాణం చొప్పున 620 షాపుల్లో కూడా టెక్స్ట్ బుక్స్ ఉండేలా ఆదేశాలిచ్చాం. పేపర్ నాణ్యతలో, ప్రింటింగ్‌లో ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలు కచ్చితంగా పాటిస్తారు. ఆయా ప్రింటర్స్ వద్ద ఇప్పటికే 80 లక్షల పుస్తకాలు సిద్ధంగా ఉన్నాయి.

– కె.రవీంద్రనాథ్‌రెడ్డి,
ఏపీ విద్యాశాఖ టెక్స్ట్ బుక్స్ డైరెక్టర్

కంగారు పెట్టిస్తున్న కృత్రిమ మేధ!

- తమ ఉద్యోగాలకు ఎక్కడ ముప్పు తెస్తుందోనన్న భయం
- మైక్రోసాఫ్ట్ వర్క్ ట్రెండ్ ఇండెక్స్ 2023 నివేదికలో వెల్లడి

సాక్షి, అమరావతి: ప్రపంచ వ్యాప్తంగా కృతిమ మేధ(ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్.. ఏఐ) విప్లవం మానవ కార్మిక నైపుణ్యాల లోటును భర్తీ చేస్తోంది. పనిని సులభంగా, కచ్చితత్వంతో పాటు వేగంగా పూర్తి చేసే ఏఐ సాంకేతికత అందుబాటులోకి రావడంతో ఐటీ, పారిశ్రామిక రంగంలో ఉత్పాదక సామర్థ్యం మెరుగుపడనుంది. అయితే కృత్రిమ మేధ పురోగతి ఉద్యోగులను భయపెడుతోంది. తమ స్థానాలకు ఎక్కడ ముప్పు తెస్తుందోనని వారు ఆందోళన చెందుతున్నారు. తాజాగా మైక్రోసాఫ్ట్ వర్క్ ట్రెండ్ ఇండెక్స్ 2023 ప్రకారం.. 74 శాతం కంటే ఎక్కువ మంది భారతీయులు భవిష్యత్తులో తమ ఉద్యోగాలను ఏఐ ఎక్కడ చేజిక్కించుకుంటుందోనని ఆందోళన చెందుతున్నారు. ఏఐ వృద్ధికి ఉద్యోగులు సిద్ధంగా ఉండాలని, కృత్రిమ మేధస్సుతో పోటీపడాలని 90 శాతం కంపెనీల లీడర్లు అభిప్రాయపడ్డారు. మైక్రోసాఫ్ట్ 31 దేశాల్లో 31 వేల మందిని ఏఐకు సంబంధించి వివిధ ప్రశ్నలతో సర్వే చేసింది. ఇందులో భారత్ నుంచి వెయ్యి మంది ఉన్నారు. 83 శాతం మంది భారతీయ ఉద్యోగులు తమ పని భారాన్ని తగ్గించుకోవడానికి ఏఐని ఆహ్వానించేందుకు సిద్ధంగా ఉన్నట్టు పరిశోధనలో తేలింది. ప్రస్తుతం ప్రతి నలుగురిలో ముగ్గురు భారతీయ కంపెనీల ప్రతినిధులు కొత్త ఆవిష్కరణల కొరత గురించి ఆందోళన చెందుతున్నట్టు పేర్కొంది. 46 శాతం మంది ఉద్యోగులు సమావేశాలకు హాజరుకాకపోయినా తోటి ఉద్యోగులు గుర్తించట్లేదని.. పస లేని సమావేశాలతో సమయం వృథా కావడంతో పాటు ఉత్పాదకతపై ప్రభావం చూపుతుందని వెల్లడించారు. వీటికి ఏఐ పరిష్కార మార్గంగా ఉంటుందని నివేదిక చెబుతోంది. అంతేకాదు, ఉద్యోగులు తమ రోజువారీ జీవితంలో ప్రాంప్ట్ ఇంజినీరింగ్ వంటి కొత్త కోర్ సామర్థ్యాలు కలిగి ఉండాలని నివేదిక సూచిస్తోంది. కంపెనీలు కూడా ఏఐకి అనుగుణంగా పని చేసే నైపుణ్యం ఉద్యోగుల్లో ఉండాలని కోరుకుంటున్నాయి. ప్రస్తుతం 78 శాతం మంది తమ పనిపై నిరంతరాయంగా దృష్టి పెట్టడం లేదని, 76 శాతం మందికి తమ పనిని పూర్తి చేయడానికి తగినంత సమయం, శక్తి లేదని నివేదిక పేర్కొంది.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400 708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943